RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

Vol : 18 Issue No. 5 Monthly May 2021 ISSN No. : 2456-4702 Rs. : 15/-






మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 18 - Issue. 5 - May 2021 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# త్యాగరాజు

త్యాగరాజు అసలు పేరు కాకర్ల త్యాగబ్రహ్మం. కర్ణాటక సంగీత త్రిమూర్తులలో ఒకరు. త్యాగయ్య, త్యాగబ్రహ్మ అనే పేర్లతో కీర్తించబడ్డాడు. నాదోపాసన ద్వారా భగవంతుడ్ని చేరుకోవచ్చని నిరూపించిన వాగ్గేయకారుడు రాగ భావ రసోచితంగా కీర్తనలు రచించిన వాగ్గేయకారుడైన త్యాగయ్య దాదాపు రెండు వందలకి పైగా రాగాలు పేర్కొన్నాడట! తెలుగు భాషలోని సొగసులతో కీర్తనలు రచించి తెలుగు భాష గానానికి అనుకూలమైన భాష అని చాటిచెప్పిన నాదబ్రహ్మ త్యాగయ్య. సంగీత సాహిత్యాలు, భక్తి వేదాంతాలు సరిసమాన జీర్ణించుకున్న ధీశాలి త్యాగయ్య.

దయాసముద్రుడు, జగదేక సుందరుడు, ధర్మరక్షకుడైన శ్రీరాముడిని త్యాగయ్య సర్వస్వంగా భావించాడు. అందుకే "ఈ మేను కలిగినందుకు సీతారామ నామమే పల్కవలెనని" భావించాడు.

త్యాగయ్య మే 4 1767 సంవత్సరంలో తిరువాయురు గ్రామం తంజావూరులో జన్మించాడు. చిన్ననాటి నుండి శ్రీరామభక్తుడు. త్యాగరాజు గురువు శొంఠి వేకటరమణ దాసులు. త్యాగయ్య స్వతంత్ర వాగ్గేయకారుడు. శరభోజి మహారాష్ట్ర రాజు తన ఆస్థాన సంగీత విద్వాంసుడిగా ఉండమని ఆహ్వానం పలికాడు. త్యాగయ్య అంగీకరించలేదు. మానవాశ్రయం, మానవస్తుతి గిట్టనివాడు. త్యాగయ్య మొత్తం దాదాపుగా 24వేల కీర్తనలు రచించాడని ప్రసిద్ధి. ఆయన కీర్తనలు శ్రీరాముడిపై అతనికి గల విశేషభక్తిని, వేదాలు, ఉపనిషత్తులపై అతనికి ఉన్న జ్ఞానాన్ని తెలియజేస్తున్నాయి.

త్యాగయ్య భాగవత కథ ఆధారంగా "ప్రహ్లాదభక్తి విజయం" అనే గేయ ప్రబంధం రచించాడు. 'నౌకా విజయం' అనే యక్షగానం, 'సీతారామ విజయం' అనే నాటకాన్ని రచించాడు. కడు పేదరికం అనుభవిస్తున్నా భక్తి విషయంలో శ్రీమంతుడిగా శ్రీరామచంద్రుడ్ని కీర్తించిన గొప్ప వాగ్గేయకారుడు త్యాగయ్య.

త్యాగయ్య రచించిన కీర్తనలలో దివ్యనామ సంకీర్తనలు, ఉత్సవ సంప్రదాయ కీర్తనలు, మేలుకొలుపు, పవ్వళింపు కీర్తనలు, మంగళహారతి కీర్తనలు, నీతిని బోధించు కీర్తనలు, వేదాంత కీర్తనలు మొదలగునవి సుప్రసిద్ధాలు.

త్యాగరాజు నిధికన్నా రాముని సన్నిధి సుఖం గలదని గర్వంగ పేర్కొన్నాడు. సంగీతాన్ని భగవంతుని ప్రేమను పొందే మార్గంగా త్యాగరాజు భావించాడు. సంగీతంలోని రాగ, తాళాలను వాటిపై తన ప్రావీణ్యాన్ని చూపించుకోవడానికి కాక, భగవంతుని నామాలను పలకడానికి, భగవంతుని లీలలను పొగడడానికి ఓ సాధనంగా మాత్రమే చూశాడు.

త్యాగయ్య కృతులలో లోకజ్ఞత ప్రదర్శించాడు. మనం అనునిత్యం చూసే, అనుభవించే సంఘటనలను, అనుభూతుల్ని, స్వభావాల్ని త్యాగయ్య కీర్తనల ద్వారా పలికించి మనకి కనువిప్పు కలిగించాడు. భోగ భాగ్యాలకోసం పాట్లు పడడం అవివేకమని హెచ్చరించాడు.

"రామభక్తి సామ్రాజ్యమే మానవుల కచ్చెనో
ఆ మానవుల సందర్శన మత్యంత బ్రహ్మానందమే"

అని కీర్తిస్తూ పరవశించిపోయాడు. త్యాగయ్య కృతులలో ఆత్మాశ్రయ కవిత్వం సొగసులు దిద్దుకుంది. వైకుంఠ ఏకాదశినాడు త్యాగయ్య శ్రీరాముని సన్నిధికి చేరుకున్నాడు. త్యాగయ్య జన్మించిన రోజును అనగా మే 4న 'భారతీయ సంగీత దినోత్సవం'గా జరుపుతారు.

- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# Contents (విషయ సూచిక)

| | | | |
|---|---|---|---|
| 1. | 'ఈ' కథా సాహిత్యంలో వ్యంగ్యం | - ఆచార్య కొలకలూరి మధుజ్యోతి | 5 |
| 2. | సమకాలీన తెలుగు కథనాలు : హక్కుల చర్చ | - డా॥. వెంకటరామయ్య గంపా | 9 |
| 3. | రాయలసీమ కథ - బహుజన జీవన చిత్రణ | - బాలాంజనేయులు | 14 |
| 4. | తెలంగాణ జాతరల్లో - జానపదుల విశ్వాసాలు ఆచారాలు | - సి.హెచ్.నాగలక్ష్మి | 21 |
| 5. | జానపద వాద్యాలు | - డా॥. చింతల రాకేష్ భవాని | 27 |
| 6. | గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ అవధాన ప్రతిభ | - డా॥. బోయిన్‌పల్లి ప్రభాకర్ | 31 |
| 7. | అరిషడ్వర్గము - వేమన పద్యాలు | - డా॥. సి. నర్సింహులు | 37 |
| 8. | భారతీయేతర జానపద గాథలు - మానవజీవితం | - డా॥. శిరీష ఈడ్పుగంటి | 40 |
| 9. | కోవిడ్ కాలంలో సినిమా థియేటర్లపై ప్లాట్ఫారమ్ల ప్రభావం | - డా॥.కృష్ణశంకర్ కుసుమ, దీపికా దాకె & - ప్రణవి దాకె | 46 |
| 10. | మహిళలపై హింస నిర్మూలనకు ... చట్టాలు | - డా॥. ఎమ్. నాగేశ్వర రావు & - డా॥. ప్రవీణ్ కుమార్ | 54 |
| 11. | తెలుగు జానపద సాహిత్యంలో అద్దంకి దావీదు ఉయ్యాల పాటలు | - డా॥. మార్క్ పొలోనియాస్ | 59 |
| 12. | సీమ రైతుల వేదన వినిపించిన 'రాయలసీమ రైతు' | - డా॥. ఎన్. ఈశ్వరరెడ్డి | 63 |
| 13. | తెలుగు కథా వికాసంలో తెలంగాణ ప్రాంత కథకులు | - డా॥. పడాల జగన్నాథరావు | 71 |
| 14. | భావకవితా చంద్రుడు బసవరాజు | - డా॥. పి. విజయకుమార్ | 75 |
| 15. | మరుగునపడిన కవి మన్నెం రాములు | - పెబ్బేటి మల్లికార్జున్ | 79 |
| 16. | స్త్రీత్వ వేదనలో 'జ్వలిత కౌసల్య' | -డా॥. వి. త్రివేణి | 81 |
| 17. | కరోనా కరాళ నృత్యాన్ని ఆవిష్కరిస్తున్న కవిత్వం | -డా॥. వై. సుభాషిణి | 89 |
| 18. | తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల సంక్షేమ చట్టం | -డా॥. పి.కె.వి.యస్. రామారావు | 96 |
| 19. | తెలుగు సాహిత్య విమర్శ : రాయలసీమ దోహదం | -డా॥. పల్లా కృష్ణ | 98 |
| 20. | బాంధవ్యాలు నవలలోని - కుటుంబ సంబంధాలు | - ఏరుకొండ శ్యాంప్రసాద్ | 103 |
| 21. | చంద్రికా పరిణయం - శబ్దాలంకారాలు | - జి.వి. సుజాత | 106 |
| 22. | తెలుగు సాహిత్యంలో బహుజన కథలు - వైవిధ్యం | - జన్ను అశోక్ | 110 |
| 23. | యశోదారెడ్డి ధర్మశాల కథలు - ఇదివృత్త వైవిధ్యం | - కె. నవీనారాణి | 113 |
| 24. | వలసపాలనలో జమిందారీలు - రైతాంగ పోరాట చరిత్ర | - డా॥. కె. శ్రీదేవి & చంద్రబాబు | 119 |
| 25. | విద్యార్థుల్లో నైతిక విలువలు | - కాపర్తి స్వరాజ్యం | 123 |
| 26. | తెలుగు సినిమా చరిత్ర సామాజిక దృక్పథం | - బి. క్యాథరీన | 128 |
| 27. | ద్విపదకు కావ్య పురాణ గౌరవాన్ని కలిగించిన పాల్కురికి | - ఆర్. రమాదేవి | 134 |
| 28. | వడ్డేపల్లి సోదరుల జీవితం సాహిత్యం | - శనిగరంకిషన్ | 139 |
| 29. | జాషువా - దళిత కవి కోకిల నవయుగ కవి చక్రవర్తి | - సూరేపల్లి పద్మావతి | 142 |
| 30. | కాళోజీ కవితాత్మ | - డా॥. పి. విశ్వ ప్రసాదు | 148 |
| 31. | గురజాడ రచనలు - సామాజిక జీవిన చిత్రణ | - డా॥ బూసి వెంకటస్వామి | 153 |
| 32. | Comparative Study on the Indian and American.... | - Dr. Kotaiah Veturi | 156 |
| 33. | Analysis on Water Management in Central ... | - Dr. Battu Kiritam | 163 |

# 'ఈ' కథా సాహిత్యంలో వ్యంగ్యం

- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

'ఈ' కథా సాహిత్యం పోషించిన ఒక రసం హాస్యం. కొన్ని కథలు అమెరికా జీవితంలో ఉన్న ఆచార వ్యవహారాలతో భారతదేశం నుంచి వెళ్ళిన వారు సర్దుబాటు చేసుకోలేక పడే ఇబ్బందులు, సర్దుబాటు చేసుకొనే క్రమంలో తలెత్తే తలనొప్పులు సరదాగా హాయిగా సాగిపోతూ ఆనందాన్ని పంచాయి. మరి కొన్ని, అక్కడ ఇక్కడ ఉన్న జీవితాలలోకి తొంగి చూసి చేసే పనులలో ఉన్న ఆవకతవకలను ఎత్తి చూపుతూ చురకలు వేస్తూ రాసిన కథలు హాస్యాన్ని వ్యంగ్యాత్మకంగా అందించాయి. వెల్‌కం టు అమెరికా (గోపిబూరుగు - సుజనరంజని, జనవరి నుంచి డిసెంబరి వరకు, 2006, పన్నెండు సంచికలు), వెడ్డింగ్ బెల్స్ (ఇర్షాద్ జేమ్స్ - సుజనరంజని, డిసెంబర్ 2013), కాదేదీ బిజినడస్ కనర్హం(తాడికొంద శివకుమార శర్మ-తానాపత్రిక, 2018), మూడో జులపాల కథ, ( చిట్టెన్‌రాజు-మధరవాణి, జులై - సెప్టెంబర్,2019), సివిలైజ్‌డ్ ఇన్ అమెరికా (సాయి బ్రహ్మానందం - ఈ మాట,8.27.2019), క్రిస్మస్ బాంక్వెట్ (ఆర్. శర్మ దంతుర్తి - సిరిమల్లె, ఆగష్టు 2019) సేల్స్ మేనియా (వెంపటి హేమ- సిరిమల్లె, జూన్,2019), ఏ దేశమేగినా (వాత్సల్య గుడిమళ్ళ - మధురవాణి, జనవరి - మార్చి, 2020) వంటి కొన్ని కథలు హాస్యాన్ని పండించాయి.

హాస్యానికి వ్యంగ్యం జోడింపబడితే ఆనందం ద్విగుణీకృతమవుతుంది. మాటలలో వెటకారం ఒక అందం అయితే వ్యాజనిందతో అది మరింత పెరుగుతుంది. ఆంగ్లంలో Irony satire అనే రెండు పదాలు భిన్న అభివ్యక్తి మార్గాన్ని తెలుపుతాయి. దాని దగ్గరది sarcasm. మూడింటికి తెలుగులో వ్యంగ్యమనే అర్థం ఉన్నా, కొద్ది భేదం ఉంది. అపస్వరాల అనుబంధం, (కౌముది- ఏల్చూరి విజయరాఘవరావు, ఫిబ్రవరి 2008); చెత్తకథ (పొత్తూరి విజయలక్ష్మి - కౌముది, ఆగస్ట్ - 2008) Irony satireలకు నిదర్శనాలు.

'అపస్వరాల అనుబంధం' Ironyతో మిలితమైన హాస్యం కాగా 'చెత్త కథ' య్‌ఱతీవతో కలిసి ఉంది. రైలు ప్రయాణంలో ఒక ప్రసిద్ధ సంగీత వేత్తకు పరిచమయిన ఓ ముసలాయన సంగీత ప్రావీణ్యం అతను చేసిన భీకర ప్రయత్నం అతని పట్ల ఆసక్తిని కలిగించి ఆయన గురించి తెలుసుకొనేలా చేసిన క్రమమే 'అపస్వరాల అనుబంధం' కథ. కథంతా Ironyతో నిండి ఉంది. Irony అంటే 'the expression of one's meaning by using language that normally signifies the opposite, typically for humorous or emphatic effect అని నిఘంటువు చెప్తుంది.

రైలులో కుర్రకారు పాడుతుంటే వారి గుంపులో కలిసి, '....పక్కవాళ్ళేమనుకుంటారో అన్న ప్రశ్నే లేకుండా, తనూ కూనిరాగాలతో మొదలెట్టి అతి కర్కశమైన రైలు కూతల్లా ఆరోహణావరోహణలు సంధించుకొన్నాడు'. గుంటూరు రాగానే తమలాంటి పెద్ద మనుషుల సాంగత్యంలో ఆవేశం ఆపుకోలేక పాడే అదృష్టం తనకు దక్కిందని పరిచయం చేసుకొని తన విజిటింగ్ కార్డు చేతిలో పెట్టి దిగిపోయాడు.

ప్రసిద్ధ సంగీత వేత్తకు వినాయక చవితి హడావిడి అయ్యాక 'ఊరుపేరు లేని రైలు గాయకుణ్ణి గురించి ఆరా తీయాలని కుతూహలం కలిగింది. తాను ఎదుర్కొన్న అపస్వరాల దాడి ఈ అనుబంధానికి కారణం. ప్రత్యర్థుల తాతముత్తాతలను 'గార్ధభస్వరభూషణులనీ ఖరకంఠీరవులనీ' తూర్పారబట్టే 'చేదు గుణాలు కుటుంబమే అతనిది'. బాల్యం నుంచి చంచయ్యకు పాటల పిచ్చి. 'పొద్దున్లేస్తే నిద్రపొయ్యేదాకా వంశపారంపర్యంగా వాళ్ళ నాయనమ్మ నేర్పిన సరళీ స్వరాల దగ్గర్నుంచీ సబ్బులమ్మే పాటల్దాకా

సాధన' చేసేవాడు. అతనికి అతని పాటే ఓ ఆయుధం. కొందరు అతని బారి నుంచి తప్పించుకొంటే మరికొందరు అతని సంగీతాన్ని పొగుడుతూ తమ పని చేయించు కొనేవారు. ఓ ఇంటి యజమాని ఎంతకీ ఖాళీచేయని అద్దెకున్న వ్యక్తిని, ఖాళీ చేయించటానికి, పక్కింట్లో చంచయ్యను కూర్చొని పాడుతూ ఉండమని డబ్బిచ్చాడు. దెబ్బకు అతనే కాదు 'ఇరుగూ పొరుగునున్న ఎందరో ఇళ్ళు మారినట్లు పిటిఐ వార్త. మహామారిలాంటి మహత్తుందన్న మాట చంచయ్య పాటల్లో!'

వినాయకచవితి వెనువెంటనే ఎలక్షన్లుండటంతో పంచాయితీ బోర్డు ప్రసిడెంట్ కావాలని ఉబలాటపడే ఉమామహేశం దానిని సదవకాశంగా తీసుకొన్నాడు. "ఆయనకూ సంగీతానికి మూషిక మార్జాల సంబంధ మైనా, తన పనికోసం గాడిద కాళ్ళు పట్టుకొన్న వసు దేవుడిలా ఈసారి సంగీత ముతాల శరణం వేడుకున్నా డాయన'. పాడ్తానన్న ప్రతి ఒక్కరికి వినాయక సంబరాలలో అవకాశం ఇచ్చాడు. వారి పాటల మధ్య తన ఘనతను రికార్డు చేసి జై కొట్టించేవాడు. పాటగాడికి తృప్తి. ఉమా మహేశం ఘనత చాటే కాగితంలో పూలు అక్షింతలు ఇవ్వటం ద్వారా అతనికి విశేష ప్రచారం. ప్రజలకు పుణ్యం, ఉమామహేశానికి పురుషార్థం.

ఇక్కడ వచ్చింది చంచయ్య అవకాశం. పండుగనాడు బండి కట్టించుకొని నాలుగు మైళ్ళుగా పాడుకొంటూ వచ్చాడు. 'ఆ నాలుగుమైళ్ళు నాలుగు తరాలుగా గడిచాయి బండివాడికి, అదొక పాత శిథిల దేవాలయం, పాత వాసన. ఎలక్షన్ల అడ్డాగా కొంతకాలంగా చెలామణి అవుతూ ఉంది. ఎలక్షన్ల పాటల గందరగోళం, జై జై నినాదాలు మద్దెల దరువులలో మత్తెక్కినట్లు నిల్చొన్న చంచయ్యను పక్క గుడి వీధిలో పాడమన్నారు. అక్కడకు ఉత్సాహంగా వెళ్ళిన చంచయ్యకు ప్రేక్షకులు ముగ్గురే కనిపించారు. ఒకరు తర్వాత పాడబోయేవారు, రెండో వ్యక్తి కుర్చీలు తివాసి సరఫరా చేసిన వ్యక్తి, 'అంత మతిమరుపైతే ఎలా బాబూ! దోవపాడుగునా మా ఎడ్లు బెదురుతున్న మీరు పాడుకొంటూనే వచ్చారు. కచేరి అయ్యాక నా కూలి అడిగి తీసుకెళ్దామని వాపసు కూడా వస్తారేమోనని కూచొన్నా' అన్నాడు మూడో వ్యక్తి. ఈ సంఘటనకు సంబంధించిన మరింత సమాచారాన్ని సంపాదించటంలో పడి పోయాడు సంగీతవేత్త.

చంచయ్య భాగవతార్ తపన చుట్టూ వ్యంగ్యంగా అల్లుకొన్న కథ ఇది. ఎలక్షన్లు పండుగ కలిసి వస్తే రాజకీయవేత్తలెలా ఆ సందర్భాన్ని ఉపయోగించుకొంటారో రచయిత చంచయ్య అజ్ఞానంతో ముడిపెట్టి చెప్పాడు. 'Irony pertains to Situations (vocabulary. Com). చంచయ్య ఆనందం ఆవిరయిపోయిన ఈ సన్నివేశం కథకు హాస్యాన్ని అతని పట్ల జాలిని కలిగించక మానదు.

మరో కథ 'చెత్తకథ'. బండాడియా అనేది ఒక దేశం. మనకు తెలియని దేశాలు బోలెడన్ని ఉన్నాయి ప్రపంచ పటంలో. '....ప్రపంచపటంలో ఓ మూల చిన్న చుక్కంత ఉంది కాని ఉంది' అని రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి (చెత్తకథ, కౌముది, ఆగస్ట్-2008) అంటారు. ఏదో దేశంలో జరిగిన పర్యావరణ సదస్సులో ఆ దేశంవారు కలిశారు. మన వారిని మర్యాద పూర్వకంగా తమ దేశానికి ఆహ్వానిస్తే వెళ్ళి చూసి ఆ దేశం చెత్త రహితంగా ఉండ టాన్ని ప్రశంసించి, దానికి కారణం చెత్తను ఎరువుగా చేసే కర్మాగారమని తెలిసి, తమకూ కట్టివ్వమని కోరి నిర్మింప చేసుకొన్నారు. ఈ దేశపు పద్ధతీ పాడూ లేని చెత్త తాము నిర్మించిన కర్మాగారానికి పనికిరాదు కనుక తమ దేశపు చెత్తను ఇక్కడ ఎరువుగా మార్చి చెరి సగం పంచుకొనేలా నిర్ణయించుకొన్నారు. స్థూలంగా కథ ఇది.

ఈ కథ అంతా రాజకీయ వ్యవస్థలోని అవినీతి అసమర్థతలను ఎండగట్టడమే. Satire అంటే The use of humor, irony, exaggeration, ridicule to expose and criticise people's stupidity or vices, particularly in the context of contemporary politics and other topical issues. వ్యంగ్యంగా సాగిన కథలో ఉద్యోగస్వామ్యంపైనా చురకలున్నాయి. చెత్తని

రీ సైకిల్ చేసే కర్మాగారాలు చూడటానికి బండాడియాకు మంత్రి వెళ్ళి ఇంద్రలోకంలో ఉన్న బండాడియాను చూశాడు. 'నడిరోడ్డు మీద కూడా పాలు పోసి ఎత్తు కోవచ్చుట!' పళ్ళ పూల తోటలూ పచ్చిక బయళ్ళు అద్దంలా ఉంది ఆ దేశం. వ్యర్థాలను ఎరువుగా చేసుకొంటారు కాబట్టి చెత్త కనపడదక్కడ. తిరిగి వచ్చిన మంత్రి మన రాష్ట్రాన్నలా చేయాలనుకొన్నాడు. మరోసారి చూడ్డానికి 'అయిన వాళ్ళూ వాళ్ళకు అయినవారు గుంపులు గుంపులుగా ప్రభుత్వం ఖర్చుతో' వెళ్ళివచ్చారు. 'అటేడు తారాలు ఇటేడు తరాలు అయిపోయారు ఇంకెవరూ లేరు అనుకున్నాక అప్పుడు ఓ నలుగురు నిపుణల' ను పంపారు.

వారు చెత్త కర్మాగారాలు చూశారు. ఈ దేశంలో నిర్మించమని ఆహ్వానిస్తే వారు మన రాష్ట్రానికి వచ్చి చూసి ఎనభై లేదా ఎనభై రెండుకోట్లు ఖర్చవుతుందన్నారు. ఈలోపు ప్రభుత్వం కొందరిని పంపి బండాడియా భాష నేర్చుకోనేలా చేసింది. చెత్త తొలగింపు ప్రాధాన్యాన్ని విస్తారంగా తెలిపి కర్మాగార నిర్మాణానికి రెండు వందల ఎనభై అయిదుకోట్లు శాంక్షన్ చేయించారు. స్థలం నగరానికి దూరంగా ఏర్పర్చారు. 'ఎనభై అయిదు కోట్లు పక్కన పెట్టి మిగిలిన రెండువందల కోట్లు తలా కాస్తా పంచుకొన్నారు. పేరుకి రెండు వందల కోట్లు గానీ ఇంత మంది మీద ఏమూలకి? మరి పదవి కోసం ఖర్చు పెట్టారా? ఎన్నికలప్పుడు పంచడం పదవిలోకి వచ్చాక పంచుకోవడం! అంతా తలా కాస్తా పంచామృతాలు పంచుకున్నట్లు పంచుకున్నారు. అసంతృప్తిగా!' ఇది ఈ దేశపు నాయకుల అవినీతి. అసలుకంటే దాదాపు రెండున్నర రెట్లు అధికంగా దండుకోవడం పతనమైన వ్యవస్థకు ప్రతిబింబం. బండాడియా వాళ్ళు తక్కువ వారేమీ కాదు. ముప్పైకోట్లు పంచుకొని యాభై కోట్లతో కర్మాగారాన్ని నిర్మించారు. కర్మాగారం తయారయ్యింది. ఇది గంటకు ఇరవై లారీల చెత్తను ఎరువుగా మారుస్తుంది. శంఖుస్థాపన ఆర్భాటం లేకుండా చేసినా, ప్రారంభోత్సవం మాత్రం ఆడంబరంగా జరిగింది. ఇరు దేశాల పెద్దలూ సమావేశమయ్యారు. పాతిక పాత చెత్త లారీలను అలం కరించారు! అవి 'కళ్యాణ మండపం మీదకి నడచివెళ్ళే పెళ్ళి కూతుళ్ళలాగా కళకళలాడి పోతున్నాయి'. బండాడియా నుంచి వచ్చిన వారికి సంప్రదాయ దుస్తులలో అమ్మాయిలు నుదుట బొట్లు పెట్టి మరీ ఆహ్వానించారు. ముఖ్యఅతిథి గత ప్రభుత్వపు నిర్లక్ష్యమే చెత్త పెరగటానికి కారణం, దాన్ని మేం సరి చేస్తామన్నాడు. వేద మంత్రోచ్చారణల మధ్య చెత్త లారి, కంటెయినర్లో ఉన్న చెత్తను కుమ్మరించింది. ముఖ్య అతిథి స్విచ్ ఆన్ చేశాడు. మిషన్లు పని ప్రారంభించాయి. ఉన్నట్టుండి ఎర్రలైటు వెలిగి మిషన్లు ఒక్కసారిగా ఆగిపోయాయి. ఇరువైపుల ఇంజనీర్లు అప్రమత్తమయ్యారు. కంటైనర్లో చెత్త చూసి 'నోరావలించారు బండాడియా ఇంజనీర్లు'. 'చెత్తా?? ఇంత చెత్తగా ఉందేం?' అని విస్తుపోయారు. 'చెత్తకి మాత్రం ఓ పద్ధతీ పాడు ఉండద్దు' అని సందేహ పడ్డారు. 'చెత్త లారీలు సౌభాగ్యం కోల్పోయిన స్త్రీలవలే' దీనంగా నిలబడ్డాయి.

అత్యవసర సమావేశంలో ఉన్నతాధికారి నిలదీస్తే తమ తప్పులేదని 'డీ కంపోజ్ అయ్యే చెత్తని రీ సైకిల్ చేసి ఎరువుగా మారుస్తాం. ప్లాస్టిక్ వగైరాలని కరిగించి రిపేర్లకు వాడతాం. మరి ఇక్కడ అరటి తొక్కలు మొదలుకొని గాజు పెంకుల వరకు, ప్లాస్టిక్ కవర్లు మొదలుకొని విరగ్గొటిన కట్టడం అవశేషాల వరకు అంతా ఒక్కటిగానే ఉంది'. ఇది ముందు తెలిసుంటే మేం ఈ పనికి ఒప్పుకొనే వాళ్ళం కాదాన్నారు. ఏం చేయాలిప్పుడు అని తర్జన భర్జనలు పడ్డారు. ఆచరణ సాధ్యం కాని నిరర్థక ఆలోచనలు కొన్ని చేశారు. బండాడియా వాళ్ళు తమ దేశానికి ఫోన్ చేసి మాట్లాడి మనవాళ్ళకి ఓ సూచన చేశారు. ఇక్కడి చెత్తకు తాము కట్టిన కర్మాగారం పనికిరాదు. కర్మాగారాన్ని కదపలేరు. కనుక తమ దేశం నుండి చెత్త

దిగుమతి చేసుకొని, తయారైన ఎరువును చెరిసగం పంచుకొందాం. రావాణా ఖర్చు మీదే అన్నారు. వెళ్ళిపోయారు. విషయం పొక్కింది. ప్రతి పక్షాలు గోల చేశాయి.

బండాడియాకు విమానంలో ఇరవై గంటల ప్రయాణం. వాయుమార్గంలో చెత్త తేవటం ఖర్చుతో కుడుకొన్న విషయం కాబట్టి ఓడల్లో దగ్గరగా ఉన్న తీరానికి తెచ్చి అక్కడ నుంచి కర్మాగారానికి లారీల్లో తరలించటం, తిరిగి తయారయిన ఎరువును అలాగే పంపటం మంచిదని నిర్ణయించారు. 'ఖర్చు అవుతుంది కానీ అంత ఖర్చుపెట్టి కట్టించిన కర్మాగారం పనికి రాకుండా పాడుపెట్టారనే అపకీర్తి తప్పుతుంది' అని భావించారు. దాని మీద చర్చించటానికి బండాడియాకు ముగ్గురిని పంపటానికి నిర్ణయించారు. Satire అనేది 'making fun of people by imitatiting them in ways that expose their stupidity or flaws. ఈ కథ రాజకీయ నాయకుల అసమర్థతను తెలివితక్కువతనాన్ని ఎత్తి చూపేది. ప్రభుత్వం పనులు ముందుచూపుతో ఉండాలి. నాలుగు తరాలకు ఉపయోగపడాలి. కాని ఇంత ఖర్చుపెట్టి చేసిన కర్మాగారం ఈ దేశపు చెత్తకు, పద్ధతీ పాడులేని చెత్తకు -పనికిరాదు. అన్నీ ముందు చూపులేని నిర్ణయాలు. చెత్త కోసం చేసిన ఖర్చు వ్యర్థం కాకూడదని మరింత ఖర్చుకు ప్రభుత్వం పూనుకోవటం హాస్యాస్పదం. ప్రజల ధనాన్ని ప్రజాస్వామ్యంలో నాయకులు విచ్చలవిడిగా ఖర్చు పెట్టటం బాధ్యతా రాహిత్యం. అటువంటి అంశాన్ని రచయిత్రి వ్యంగ్యం మేళవించి చెప్పారు. అసమర్థత మీద అసమర్థతను చాటే ప్రభుత్వాల తీరును ప్రజలు అవగతం చేసుకోవాలి.

ఈ రెండు కథలు విభిన్నమైనవి. హాస్యం సన్నివేశ కల్పన ద్వారా వ్యంగ్య ధోరణిలో సాగిన కథ 'అపస్వరాల అనుబంధాలు' కాగా ప్రభుత్వాల నిర్ణయాలలో ఉన్న తెలివి తక్కువతనాన్ని చతురంగా వ్యక్తం చేసిన కథ 'చెత్త కథ'.

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# సమకాలీన తెలుగు కథనాలు : హక్కుల చర్చ

- డా॥. వెంకటరామయ్య గంపా, సహ ఆచార్యులు, భారతీయ భాషల అధ్యయన కేంద్రం, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ.

ఈ శతాబ్దంలో మానవహక్కులకు సంబంధించిన చర్చ పెద్ద ఎత్తున జరుగుతూంది. ఐక్యరాజ్య సమితి ఏర్పరిచిన విశ్వమానవ హక్కులను నైతికంగా అన్ని దేశాలు అమలు చేసేలా ఆలోచన చేసి, ప్రతి దేశము ఆయా దేశ రాజ్యాంగాల్లో మానవ హక్కుల నియమాలను పొందుపరిచారు. స్వాతంత్ర్యం తరువాత భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను పొందుపరిచారు. అయితే చట్టంలో ప్రాధమిక హక్కుల ప్రస్తావన ఉన్నప్పటికీ వాటి అమలులో చాలా లోపాలున్నాయని రాజ్యాంగ నిపుణులు పేర్కొంటున్నారు. చాలామందికి వారికి ఉన్న ప్రాధమిక హక్కులేమిటో కూడా తెలియదు. తెలిసినప్పటికీ వాటిని ఉపయోగించుకోవడానికి చాలా ఆటంకాలున్నాయి.

'సమాజానికి దర్పణం సాహిత్యం' అని సామాజిక, సాహితీవేత్తల అభిప్రాయం. సమాజంలో వచ్చే ప్రతిమార్పు కూడా సాహిత్యంలో ప్రతిబింబిస్తూ వుంటుంది. సమాజంలో వచ్చే ప్రతి చిన్న మార్పును కూడా రచయితలు సూక్ష్మ దృష్టితో పరిశీలించి వారి రచనల్లో నిక్షిప్తం చేసే ప్రయత్నం చేశారు. స్వాతంత్ర్యం తరువాత రాజ్యాంగంలో పొందుపరచబడిన పౌర హక్కులను గురించి, వాటిని అమలు పరచడంలో ఉన్న లోపాలను ఎత్తి చూపుతూ తెలుగు సాహిత్యంలో చాలా రచనలు వెలువడ్డాయి. ఒక విధంగా స్వాతంత్ర్యానంతరం తెలుగులో వెలువడిన సాహితీ ఉద్యమాలు అన్నీ కూడా హక్కుల కోసం పోరాటం జరిపిన ఉద్యమాలేనని చెప్ప వచ్చు. గిరిజన హక్కుల కోసం ప్రారంభమైన శ్రీకాకుళాంధ్రోద్యమం, భూమిపై రైతుకు ఉన్న హక్కు కోసం పోరాటం ప్రారంభించిన తెలంగాణా రైతాంగ పోరాటంలో సాహిత్యం ముఖ్యపాత్ర పోషించింది. గిరిజనుల, రైతుల హక్కులను గురించి చర్చించింది. పేదలకు, బలహీన వర్గాల వారికి స్వాతంత్ర్యం ఇచ్చిన ప్రయోజనం ఏమిలేదని చెబుతూ ప్రారంభమైన దిగంబర కవిత్వోద్యమం, సమాజంలో దళితులకు ఉన్న ప్రత్యేక హక్కుల కోసం పోరాటం ప్రారంభించిన దళిత సాహిత్య ఉద్యమం, స్త్రీ పురుష సమనత్వాన్ని కోరుతూ ప్రారంభమైన స్త్రీవాద సాహిత్యోద్యమం, ప్రపంచీకరణ వలన స్థానిక భాష, సంస్కృతులు నశించిపోతున్నాయని నిరశిస్తూ ప్రారంభమైన ప్రపంచీకరణ వ్యతిరేక సాహిత్య ఉద్యమాలన్నీ కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో హక్కుల కోసం నినదించాయి. రావిశాస్త్రి కథలు, సుంకర సత్యనారాయణ మాభూమి నాటకం, ఇల్లిందుల సరస్వతీ దేవి నీ బాంచన్ కాల్మొక్తా నవల దాశరథి రంగాచార్య చిల్లర దేవుళ్ళు నవల మొదలైన సాహిత్య రచనమానవ హక్కులకును దృష్టిలో ఉంచుకొని రాసిన రచనలుగానే పరిగణించాలి.

మాటల్లో చెప్పడానికి మాత్రం సృష్టిలో స్త్రీపురుషులిద్దరూ సమానమేనని చెబుతాం. వాస్తవానికి వచ్చేసరికి విషయంలో తేడా కనిపిస్తుంది. జనాభాలో సగభాగం ఉన్న స్త్రీలకు కొన్ని ప్రత్యేక హక్కులు ఉన్నాయన్న విషయం చాలామంది స్త్రీలకు తెలియదు. స్త్రీల హక్కులను గురించి వివరిస్తూ ఓల్గా, పి. సత్యవతి, రంగనాయకమ్మ మొదలైనవారు కథలు రాశారు. అలాగే సమాజంలో ఉన్న సాంఘిక అసమానతలు, దళితులు, గిరిజనులు మొదలైనవారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరిస్తూ చాలా కథలు వెలువడ్డాయి. శ్రామికుల హక్కులను ఉల్లంఘిస్తూ పెట్టుబడిదారులు అవలంభిస్తున్న విధానాలను వివరించే కథలూ వెలువడ్డాయి.

ఎంపిక చేసుకొన్న తెలుగు రచనల్లో మానవహక్కుల ఉల్లంఘనకు సంబంధించిన అంశాలు ఏ విధంగా ఉన్నాయో ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది.

ప్రాచీన కాలం నుంచి నేటి వరకు బలవంతులు, ధనిక వర్గం వారు ఆధిపత్యం చెలాయించడం, బలహీన వర్గం అణచివేతకు గురికావడం అన్నది ఎప్పటినుంచో వింటూనే ఉన్నాం. కానీ కొన్ని సందర్భాల్లో అణచివేత అనే పేరుతో మనిషిని మనిషిగా కాకుండా చూసే పరిస్థితి ఏర్పడింది. మనిషికి హక్కు అనే మాట తెలియని ప్రాంతాలు గతంలో ఉన్నట్లు చరిత్ర ద్వారా తెలుస్తుంది. అటువంటి పరిస్థితి తెలంగాణాలో ఏ విధంగా ఉందో వై.బి. సత్యనారాయణ రచించిన మా నాయన బాలయ్య రచనలో కనిపిస్తుంది. దొరల దోపిడికి గురైన కుటుంబాల్లో బాలయ్య ముత్తాత కూడా ఒకరు. బాలయ్య ముత్తాత నర్సయ్య పనితనాన్ని మెచ్చిన నవాబు యాభై ఎకరాల పొలాన్ని ఇనాంగా ఇచ్చాడు. కానీ ఆ ఊరిలో ఉన్న దొరకు తనతో సమానంగా ఒక దళితుడు భూస్వామిగా మారటం ఇష్టం లేదు. దీనితో నర్సయ్యను పిలిచి రెండు ఎకరాల భూమినిచ్చి తక్కిన భూమిని దొర తీసుకున్నాడు. చివరికి చిన్న నర్సయ్య కూడా దొరతో సమస్యలను ఎదుర్కొన్నాడు. ''ఈ కొత్త దొరకి మహా పొగరు. ఆయనంటే అందరికీ హడలు. అంటరాని వాళ్లకయితే అతని కనుచూపుమేరకు వెళ్ళడానికే భయం. ఈ కొత్త దొర నర్సయ్యను పిలిచి ఆ రెండెకరాల పొలం కూడా తన స్వాధీనం చెయ్యమన్నాడు. నర్సయ్య చెయ్యకపోవడంతో అతని మీద కోపం చూపిస్తున్నాడు. దొర దగ్గర పని చేస్తూ తన పొలంలో కూడా పని చేసుకునే వాడు చిన్న నర్సయ్య. అయతే దొర అనుచరులు అతన్ని వేధించేవారు. అతని పొలానికి నీళ్ళురాకుండా చేశారు. అతను సేద్యానికి పూర్తిగా వర్షాల మీద ఆధారపడవలసి వచ్చింది. అందుకని వరి పండించడం మానేసి వర్షాధారపు పంటలే వేస్తున్నాడు. తమ పొలంలో పని చేసుకుంటున్న చిన్న నర్సయ్య భార్య అబ్బమ్మను కూడా దొర అనుచరులు ఏడిపించేవాళ్ళు. అమెని దొర పొలంలో పని చెయ్యమని వేధించే వాళ్ళు.'' (సత్యనారాయణ, వై.బి. మానాయన బాలయ్య. పుట-24). నర్సయ్య మరణం తరువాత అతని కొడుకు చిన్న నర్సయ్య దగ్గర ఆ రెండు ఎకరాల పొలం కూడా దొర తీసుకున్నాడు. చివరికి దొరల పాలనతో విసుగుచెందిన నర్సయ్య ఊరు వదలివెళ్ళిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సమాజంలో వివిధ వృత్తులు ఎప్పటినుంచో కొనసాగుతున్నప్పటికీ అన్నివృత్తులవారికి సమాన గౌరవం లేదు. కొన్ని కులాలవారు వారి వృత్తి ద్వారా గౌరవాన్ని పొంది, గొప్పవారిగా కీర్తించబడుతుంటే మరికొన్ని కులాలవారు వారి కులవృత్తులవల్ల అవమానాలు, చీత్కారాలు ఎదుర్కొంటున్నారు. కొందరి వృత్తులు తక్కువగా చూడటం ఇప్పటికీ కొనసాగుతుంది. మరి కొందరి వృత్తి దినదిన గండంగా కూడా ఉంది. కొన్నివృత్తులవారు దొరికింది తింటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఇదే జీవనం విధానం కొనసాగించాలా? చేసిన పనికి, చేస్తున్న వృత్తికి తగిన ప్రతిఫలం కూడా లభించక బాధలు అనుభవించాలా? లేక ఇటువంటి వృత్తిని వదిలిపెట్టి గౌరవంగా బతకడం మంచిదా? అనే ప్రశ్నలు దాదాపు శతాబ్దంకంటే పూర్వమే ప్రారంభమయ్యాయి. మనం చేసే పనికి గౌరవం ఉండటం చాలా అవసరం. గౌరవంగా బ్రతికే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. కానీ మానాయన బాలయ్య జీవిత చరిత్రలో బాలయ్య వృత్తి ధర్మం కొనసాగినప్పటికీ గౌరవంతో పాటు అనేక అవమానాలకు గురైనట్లు తెలుస్తుంది. బాలయ్య గౌరవ సూచకంగా పొందిన భూమిని అక్కడ ఉన్న భూస్వాములు తీసుకోవడం తాను హక్కుగా భావించిన భూమి తన కళ్ళ ముందే ఎదుటి వాళ్లు తీసుకుని తనని బాధిస్తున్న అక్కడ నుంచి వెళ్లిపోవడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి. హక్కుల ఉల్లంఘన స్పష్టంగా ఇందులో కనిపిస్తుంది.

తరువాత ''1946-47 సంవత్సరాల కాలంలో రజాకార్లకు భయపడి ఊళ్ళకు ఊళ్ళే ఖాళీ చేసిపోయారు. రజాకార్లు హిందువుల ఇళ్ళల్లో చొరబడి స్త్రీలను నగ్నంగా

నృత్యం చెయ్యమనడం, తమకి వినోదం కలిగించమనడం అత్యాచారాలకు పాల్పడడం మామూలైంది" (పుట-70) బాలయ్య కుటుంబం కూడా ఆ సమయంలో రజాకార్ల దురాగతాలకు ఇబ్బంది పడ్డారు. బాలయ్య భార్య నర్సమ్మ గర్భవతిగా ఉండి కాన్పుకు తన చెల్లెలు ఇంటికి వెళుతూ మధ్యలో రజాకార్లకు భయపడి చెట్లల్లో దాక్కుని చివరకి ఏదో ఒక విధంగా ఆ బాధలనుంచి బయట పడ్డారు.

చదువు అనేది ఇప్పటికీ, ఎప్పటికీ ముఖ్యమైన అంశమే. నాటి వేదకాలం నుంచీ ఈనాటి ప్రపంచీకరణ యుగం దాకా చదవుకు ఒకే స్థానం ఉంది. ఆ స్థానంలో మార్పు లేదు. ప్రాచీన కాలంలో చదువనేది పరిమిత జనులకు ఒక ప్రత్యేక ప్రదేశంలో గురుకులాలో కొనసాగింది. తరువాత కాలంలో పాశ్చాత్య ప్రభావంతో చదువు పాఠశాల రూపంలో అందరికీ చేరువయ్యింది. కాకపోతే అక్కడ విద్యార్థులు కూర్చునే స్థానాలు తేడాగా ఉండేవి. ఒక వర్గం వారు పాఠశాల లోపల కూర్చుంటే మరొక వర్గం వారు అదే పాఠశాల వెలుపల కూర్చునే వారు. క్రమంగా అక్కడ విద్యా బోధకుల వర్గం మారింది. దీనితో అన్ని వర్గాల వారు పాఠశాల లోపల కూర్చొనే సమయానికి ఒక వర్గం వారు ప్రాశ్చ విద్యా విధానాన్ని మానేసి ఆంగ్ల విద్య కోసం ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో చేరారు. నిమ్న వర్గాల వారు కూడా ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో చేరే సమయానికి ఉన్నత కులాలవారు అంతర్జాతీయ పాఠశాలల్లో చేరారు. ఏ విధంగా చూసినా కొన్ని కులాలవారు ఉన్నత కులాలవారు చదువుతున్న స్థాయిని అందుకోలేకపోతున్నారు. ఉన్నత కులాలవారు తమకు ఉన్న వనరుల సాయంతో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని విద్య అనే ఆయుధాన్ని ధరించి ముందుకు దూసుకుపోతున్నారు. నిమ్న వర్గాల వారి దగ్గరున్న విద్య ఉన్నత కులాలవారితో సరితూగే స్థాయిలో లేదు. అందుకు పలు కారణాలున్నాయి.

బాలయ్య విద్య గొప్పతనాన్ని గుర్తించి తన వారసులను విద్యావంతులను చేయడమే తన లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తి. ఆ విషయంలో సఫలీకృతుడయ్యాడు. ఈ రచన బాలయ్య తాత పెద్ద నర్సయ్యతో ప్రారంభ మవుతుంది. ఇతని కొడుకు పేరు కూడా నర్సయ్యే. నర్సయ్యకు చిన్నవయసులోనే వివాహం జరగడం, ఒక బిడ్డకు జన్మనిచ్చిన తరువాత ఆమె గత్తరతో మరణించడం జరిగిపోయాయి. అగ్రకులస్థుల నిరంతర వేధింపులు భరించలేక తనకొడుకును గ్రామంలో వెట్టిచాకరినుంచీ రక్షించాలనుకున్నాడు. నర్సయ్య తన కొడుకు రామ స్వామిని తీసుకుని తన మేనమామ ఇంటికి వెళ్లి, అక్కడ వారి సహాయంతో రైల్వేలో 'పాయింట్స్‌మన్' గా చేరాడు. ఆధునికత, విద్య అనేటువంటిది బాలయ్యకు ఒక వరం లాగా కనిపించాయి వాటి ద్వారానే తన బిడ్డలకు విద్య నేర్పించి ఉన్నత స్థానాల్లో ఉండేలా కృషి చేశాడు.

బాలాయ్యతో పాటు అతని కుటుంబం కూడా కుల వివక్షతను ఎదుర్కొన్నారు. అయితే గ్రామాల్లో ఉన్న ఇతర దళితులతో పోల్చి చూసినప్పుడు మాత్రం బాలయ్య కుటుంబం ఎదుర్కొన్న కులవివక్షత తక్కువనే చెప్పాలి. బాలయ్య తనకు లభించిన రైల్వే ఉద్యోగం వలన చాలా వరకు గ్రామీణ జీవితానికి దూరంగా ఉన్నారు. దీనితో పలు ప్రాంతాలలో నివసించ వలసి వచ్చింది. దీనికితోడు రైల్వే విభాగానికి సొంత గృహాలు ఉండటం వలన అందు లోనే జీవించారు. అక్కడ కూడా ఒకరిద్దరు అగ్రవర్ణాల వారు కొంత కులాధిక్యత ప్రదర్శించినప్పటికీ అది తాత్కాలికమే. కానీ అతని కుమారులు మాత్రం విద్యార్థులుగా ఉన్నప్పుడు కులవివక్షతను చవిచూశారు. ఏ కులానికి చెందిన విద్యార్థులు ఆ కుల విద్యార్థులతో సహవాసం చేయడం, అణగారిన కులాలవారిని తక్కువగా చూడటం ఉండేదని రచయిత పేర్కొన్నారు. రచయిత కూడా తన ఉద్యోగంలో ఉన్నప్పుడు కొందరు తన కులం గురించి ఇతరుల దగ్గర చులకనగా మాట్లాడేవారని పేర్కొన్నారు. కానీ తరువాత కాలంలో ప్రభుత్వ ఉద్యో గాలు ముఖ్యంగా విద్య వారిని అణచివేతలనుంచి

విముక్తి కల్పించింది. విద్యా హక్కును సరైన పద్ధతిలో వినియోగించుకొని సఫలీకృతులైన వారు బాలయ్య పిల్లలు.

పారిశ్రామికీకరణ ఫలితంగా అనేక కొత్త చట్టాలు వెలువడ్డాయి. వాటి ఫలితంగా కార్మికులకు కొన్ని హక్కులు ఉన్నాయి కానీ యజమానులు వాటిని పరోక్షంగా అంగీకరించరు. అడుగడుగున కార్మికుల హక్కుల కు సంబంధించిన విషయం అనేక చర్చలు నడుస్తున్నాయి. కార్మికులు తమ హక్కులను వినియోగించుకోలేని స్థితిలో ఉన్నారు. శ్రామికుల హక్కుల విషయంలో శ్రామిక యజమానుల మధ్య ఏర్పడిన విభేదాలను వివరించే కథ కొండవీటి సత్యవతి రచించిన 'వైరస్'

'కోస్తా ప్రాంతంలో రొయ్యల చెరువులు ఎక్కువ కావడంతో వాటి ద్వారా ఐస్‌ఫ్యాక్టరీలు, లారీలు, బస్సులు ఏర్పడ్డంతో అక్కడ వారికి జీవనోపాధి లభించింది. కానీ రొయ్యల చెరువుల యజమానుల నిర్లక్షం, అమానవీయత కారణంగా రొయ్యల చెరువులు మూసివేయడంతో అక్కడ శ్రామికులు, రొయ్యలచెరువు ద్వారా నడుస్తున్న ఐస్ ఫ్యాక్టరీలు, డ్రైవర్లు మొదలైనవారు జీవనోపాధి కోల్పోవడం' ఇందులోని కథా వస్తువు.

రొయ్యల ఫ్యాక్టరీలో సీత, వరలక్ష్మి అనే మహిళలు పనిచేస్తుంటారు. సంక్షేమ కార్యక్రమాల ఖర్చు తగ్గించటానికై ఫ్యాక్టరీ యాజమాన్యం ఉప్పునీటి రొయ్యలు వలిచే మనుషుల చేతులకు ఇవ్వవలసిన 'గ్లౌస్'లు కూడా ఇవ్వకపోవడంతో సీత, వరలక్ష్మి చేతులకు పుళ్ళు పడతాయి. పుళ్ళ బాధ పడలేక సీత, వరలక్ష్మిలు యాజమాన్యాన్ని 'గ్లౌస్' అడగ్గా 'మీరేమన్న పర్మనెంట్ పనివారా? మీరు మానేస్తే వేరే పనివారిని పెట్టుకుంటామని' తొడుగులు ఇవ్వడానికి నిరాకరిస్తాడు యజమాని. ఆ పుళ్ళ చేతులతో వారు పనిచేస్తున్న సమయంలో రొయ్యల ఎగుమతికి టెండర్ వేయాలనుకుని అక్కడకు అమెరికా నుంచి ఒక వ్యక్తి వస్తాడు. వీరి చేతిపుళ్ళు చూసి డర్టీగా ఉన్నారంటాడు. వీరి చేతి పుళ్ళను చూసి అమెరికన్ వ్యక్తి తన ఆర్డర్ రద్దు చేసుకోవడంతో రొయ్యల ఫ్యాక్టరీ మూత పడుతుంది. స్థానిక పత్రికలు రొయ్యలకు 'వైరస్' సోకిందని పేర్కొనడంతో రొయ్యల ఫ్యాక్టరీలన్నీ మూతపడతాయి. ఫ్యాక్టరీల మీద ఆధారపడ్డ ఐస్ ఫాక్టరీ కూడా మూత పడుతుంది. ఇందులో శ్రామికులకు ఉద్యోగ భద్రత లేకపోవడం, ఎప్పుడైనా శ్రామికులను మార్చుకునే వీలు యజమానులకు ఉండటంతో యజమానులు శ్రామికులను కనీసం సాటి మనుషులుగా కూడా చూడటం లేదు. కార్మిక చట్టాలు ఏ రకంగాను ఉపయోగపడటం లేదు.

కొండపల్లి కోటేశ్వరమ్మ రచించిన నిర్జనవారధి రచనలో హక్కులకు సంబంధించిన అంశాలు చాలా ఉన్నాయి. కొండపల్లి కోటేశ్వరమ్మ తన చిన్నతనం నుంచి ఒక దశ వరకు పూర్తిగా తన జీవితాన్ని తన కోసం కాకుండా కుటుంబం కోసం, భర్త కోసం జీవించింది. ఒక దశలో తన జీవితం మొత్తాన్ని భర్తకోసం త్యాగం చేసింది. భర్త చెప్పినట్లే నడుచుకుంది. భర్త పార్టీ కార్యక్రమాలలో భాగంగా భర్తతో పాటు ఊరూరా తిరిగింది. పార్టీ కోసం, పార్టీ మనుషుల కోసం తన సొంత నిర్ణయాలు, జీవితం అంటూ లేకుండా గడిపింది. భర్తతో పాటు అజ్ఞాతవాస జీవితం అనుభవించింది. చివరికి తన భర్త కోరిక మేరకు, పార్టీ కోసం అబార్షను చేయించుకుంది. భర్త ఉద్యమాల్లో ఉండటంతో తనకు తెలియకుండానే భర్తతో కలిసి వాటిలో పనిచేసింది. తెలిసీతెలియని వయసులో భర్తే సర్వస్వం అనుకొని భర్తతోనే ఎన్నో కష్టాలను చవి చూసింది. ప్రతి స్త్రీకి మాతృత్వం అనేది ఎంతో ముఖ్యమైనది అని తెలిసినా చివరికి, భర్త కోరిక మేరకు పార్టీ అవసరం కోసం తన శరీరం, మనస్సు తనది కాదనట్లు ఉండిపోయారు. చివరకు ఒక దశలో ప్రాణం మీదకు తెచ్చుకున్నారు కోటేశ్వరమ్మ. తనకు కూడా వ్యక్తిగత జీవితం ఉందనీ తనకు నచ్చినట్లు బ్రతికే హక్కు ఉందని కోటేశ్వరమ్మ గుర్తించలేదు.

స్త్రీవాదులు కోరుకుంటున్నది సమాజంలో స్త్రీపురుష

సమానత్వం. కానీ పార్టీల్లో కానీ, ఉద్యమాల్లో కానీ అటువంటి సమానత్వం ఉన్నట్లు కనిపించదు. ఉద్యమాల్లో, పార్టీల్లో వ్యక్తి స్వేచ్ఛకంటే సమూహం యొక్క అవసరాలు, ప్రయోజనం ముఖ్యం. పార్టీ, ఉద్యమం కోసం వ్యక్తి స్వేచ్ఛను, హక్కులను త్యాగం చేయాలి. స్వేచ్ఛను, హక్కులను త్యాగం చేయటమనేది పార్టీలో పనిచేసే స్త్రీ పురుషులు ఇరువురికీ వర్తిస్తుంది. పురుషులు మాత్రం ఆధిపత్య ధోరణిలో ఉండి, స్త్రీలు మాత్రం వారికి సేవకులుగా ఉండాలనే దృక్పథం పార్టీలో పనిచేసే పురుషుల్లో ఉన్నట్లు రచనలో కనిపిస్తుంది. పార్టీలో కోటేశ్వరమ్మగారితో పాటు తక్కిన మహిళల స్థానం కూడా చెప్పుగోదగిన విధంగా లేదు. రచనలో కనిపించే మహిళలు పురుషులకు సహాయకులుగా కనిపిస్తారు.

పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ అణచివేత ఇంటినుంచే ప్రారంభమవుతుందని స్త్రీవాదులు చెప్పేమాట. ప్రారంభంలో కుటుంబం మొత్తం కోటేశ్వరమ్మ పురోభి వృద్ధికి పాటుపడ్డారు. సమాజంలో ఉన్న కట్టుబాట్ల వల్ల కొంత ఇబ్బంది పడ్డప్పటికీ తండ్రి, భర్త అందరి సహకారంతో మిగిలిన సామాన్య స్త్రీలకంటే కొంతవరకు మంచి స్థానాన్ని చూశారు. అయితే భర్త ఒక చిన్న కారణంతో తనను పూర్తిగా వదిలేయడంతో తను ఊహించని అగాధంలోకి నెట్టివేయబడింది. తనను ప్రారంభంలో ఎంతగానో ప్రేమించిన భర్త కొంతకాలం తరువాత మరొక స్త్రీతో సన్నిహితంగా మెలగడం ప్రారంభించి ప్రమాణ పూర్వకంగా పెళ్ళాడిన కోటేశ్వరమ్మను వదిలేశాడు. పిల్లల ఆలనాపాలన విషయంలో కోటేశ్వరమ్మకు అసంతృప్తే మిగిలింది. ఉద్యమకాలంలో పిల్లలు ఎక్కువకాలం ఆమెకు దూరంగానే ఉన్నారు. తరువాత చదువులపేరుతో దూరంగా ఉన్నారు. కోటేశ్వరమ్మ హక్కుల విషయంలో పురుషులకు ద్వంద్వ విధానం పద్ధతిని అవలంభించినట్లు తెలుస్తుంది. స్త్రీలకు ఒక నియమం, పురుషులకు ఒక రకమైన నియమం ఉన్నట్లుగా కనిపిస్తుంది. పురుషులకు ఉన్న హక్కులు స్త్రీలకు లేవు. పురుషులు సొంతంగా నిర్ణయం తీసుకున్నట్లు స్త్రీలకు సొంతంగా నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం లేదు. ఈ విషయాలు నిర్జనవారధి రచనలో చాలా చోట్ల కనిపిస్తాయి. పార్టీ కోసం ఎంతో సేవ చేసిన కోటేశ్వరమ్మకు ఒక దశ తరువాత పార్టీ ఇవ్వవలసినంత ప్రాధాన్యత ఇవ్వలేదు. కానీ కోటేశ్వరమ్మకు మాత్రం పార్టీ మీద గౌరవం మాత్రం తగ్గలేదు. పార్టీ భావజాలాన్ని చివరి వరకు విడలేదు. మరొక పార్టీ మహిళ పట్ల పార్టీ వ్యవహరించిన తీరు పట్ల కోటేశ్వరమ్మ విచారం వ్యక్తం చేస్తుంది. బెజవాడలో డా. అచ్చమాంబ పార్టీ వారికి ఎంతో సేవచేశారు. వారి ఇల్లు పార్టీ ఆఫీసులాగా ఉపయోగించారు. కానీ పార్టీవారికి అచ్చమాంబతో వచ్చిన విభేదం కారణంగా చివరికి ఆమెతో మాట్లాడొద్దని పార్టీవారు నిర్ణయించారు.

స్త్రీలు తమ హక్కులను త్యాగాల పేరుతో ఏ విధంగా కోల్పోతున్నారో వివరిస్తుంది కొండపల్లి కోటేశ్వరమ్మ గారి స్వీయ చరిత్ర.

**ఉపయోగించుకున్న పుస్తకాలు :**

1. కోటేశ్వరమ్మ, కొండపల్లి. 2012. నిర్జనవారధి. హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
2. నవీన్, వాసిరెడ్డి. శివశంకర్, పాపినేని. (సంపా.) 2004. కథ 2003. కథాసాహితీ ప్రచురణ. సికింద్రాబాదు.
3. సత్యనారాయణ, వై.బి., (2013) మా నాయన బాలయ్య. సత్యవతి, పి. (అనువాదం) హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

# రాయలసీమ కథ – బహుజన జీవన చిత్రణ

- **బాలాంజనేయులు,** పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

1984లో ఏప్రిల్ 14న భారతదేశంలో బహుజన సమాజ్ పార్టీ ఏర్పడిన తర్వాత సామాజిక రంగంలో బహుజనులు అనే భావన బాగా వ్యాప్తిలోకి వచ్చింది. మనువాద వ్యవస్థ వల్ల కష్టనష్టాలకు గురైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులను, మైనార్టీలను అందరిని కలిపి బహుజనులవుతారని బహుజన సమాజ్ పార్టీ ప్రకటించింది. అయితే నేడు వారందరిని అలా పిలవడం లేదు. ఒక్కొక్క అస్తిత్వ వాదంగా అవి విచ్ఛిన్నమయ్యాయి.

ప్రారంభదశలో చూస్తే యస్.సి.యస్.టి.బి.సి.లు తమ గురించి తమ కష్టాల గురించి చిక్కనవుతున్న పాట, పదునెక్కిన పాట, చిత్తరువు వంటి దళిత సంకలనాలను వెలువరించారు. అంతవరకు దళిత కవులు, బి.సి. కవులు, దళితులపట్ల జరుగుతున్న అణిచివేతను రాశారు. కారంచేడు, చుండూరు, పందిరికుప్పం, వేంపెంట మొదలయిన చోట్ల దళితులపై జరిగిన ఊచకోతలు దళితుల అస్తిత్వాన్ని ప్రశ్నించాయి. ఈ నేపథ్యంలో దళితుల అస్తిత్వం గురించి, ఆత్మగౌరవం గురించి రాయడం మొదలుపెట్టారు. అలా దళితవాదం ఒక ప్రత్యేక ఉద్యమంగా ఏర్పడింది. ఈ విషయాన్ని ప్రస్తావించడానికి కారణం ఏమిటంటే, తెలుగు దళిత సాహిత్య ఆవిర్భావం కాలంలో ఒక విశాల ప్రాతిపదికగా సంఘటితమైన యస్.సి. యస్.టి బి.సి.లు, మైనార్టీ కవులు నిర్దిష్టతల వైపు విడిపోయి చైతన్యాల వైపు, సొంత అస్తిత్వాల వైపు మళ్ళాయి. అంతవరకూ యస్.సి.ల సమస్యను తమ గొంతుకతో పలికించిన బి.సి.లు యస్.సిలకే కాదు, తమకు సమస్యలు ఉన్నాయని వాటి గురించి తాము కూడా గానం చెయ్యాల్సిన అవసరాన్ని బి.సి.లు గుర్తించారు. ఈ అంశంపై సతీష్ చందర్ "బి.సి.లు ఆకలితో చనిపోతే, యస్.సి.లు అవమానాలతో చనిపోయారని" తమ అనుభవాల్ని రాయవల్సిన అవసరాన్ని బి.సి.లని పునరాలోచింపజేశాయి. ఈ నేపథ్యంలో సమాజంలో సగభాగమైన బి.సి.లు తమ అస్తిత్వం గురించి బహుజనవాదం లేదా బి.సి. వాదంగా రచనలు చేయడం ప్రారంభమైంది.

ప్రస్తుతం ఈ వ్యాసం కులాన్నీ కులవృత్తిని స్పష్టంగా సూచించే రాయలసీమ బహుజనకథలకు మాత్రమే పరిమితమైంది. రాయలసీమలో బహుజనుల జీవన చిత్రాన్ని సృజించినవారిలో బండినారాయణస్వామి, రాసానివెంకటరామయ్య, తుమ్మల రామక్రిష్ణ, వేంపల్లి గంగాధర్, సుంకోజు దేవేంద్రాచారి. జి. వెంకటకృష్ణ, నాగమ్మపూలె, రాప్తాడు గోపాలక్రిష్ణ, మధురాంతకం నరేంద్ర, శాంతి నారాయణ వంటి రచయితలు ఉన్నారు. బహుజనుల జీవితాల గురించి ప్రత్యేకంగా కథలు రాశారు. కులం కారణంగా, కులవృత్తి కారణంగా సంభవించే ఆర్థిక సామాజిక, రాజకీయ సాంస్కృతిక పార్శ్వాలు వీరి కథల్లో ప్రతిబింబిస్తాయి. మొదటగా ప్రపంచీకరణ ప్రభావాన్ని చూస్తే 20 వ శతాబ్దం చివరి భాగంలో ప్రపంచ వ్యాప్తంగా జరిగిన పరిణామాలలో ప్రపంచీకరణ ఒకటి. ప్రపంచదేశాల మధ్య వస్తువులు, సేవలు, మూలధనం, సాంకేతిక పరిజ్ఞానం, శ్రమ, మానవ మూలధనం మొదలైనవి ఎలాంటి అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా ప్రవహిస్తుంది. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సంఘటితం చేసే ప్రక్రియ. దీని ప్రధాన లక్షణం స్వేచ్ఛా మార్కెట్ ఈ ప్రపంచీకరణ ప్రభావం అన్ని రంగాలపై ప్రభావం చూపింది. అలా ప్రభావం చూపబడినవాటిలో కులవృత్తులు ఒకటి. ఈ కులవృత్తులు అభివృద్ధి పేరిట విధ్వంసం చెందాయి. పారిశ్రామికీకరణ యాంత్రిక నాగరికత ప్రభావంతో వ్యవసాయ ఆధారిత వృత్తుల విధ్వంసం జరిగిన విధానాన్ని సుంకోజి దేవేంద్రాచారి

'అన్నంగుడ్డ' కథలో కనబడుతుంది. రాసాని 'నాలుగో నాటకం' కథలోనూ, వెంకటకృష్ణ దృశ్యాదృశ్యం కథలో కులవృత్తుల విధ్వంసం జరిగిన తీరును వివరించారు.

'అన్నంగుడ్డ' కథలో 'వానకు రైతులందరూ దుక్కి చేయడం మొదలు పెట్టారు. ఐదు సంవత్సరాల ముందయితే ఆచారి మాత్రం వానకు చాలా సంతోషించే వాడు. ఇప్పుడు ఆ వానతో తనకు ఎలాంటి సంబంధం లేనట్లుగా నిర్లిప్తంగా ఉన్నాడు. "ట్రాక్టర్లొంచి మన కడుపులు కొట్టినె" అన్నాడు ఆచారి. "మూడు ట్రాక్టర్లు పల్లెకు మూడు పక్కలా దున్నుతున్నాయి. రైతులంతా బెల్లం చుట్టూ మూగిన ఈగల మాదిర్తో ఉండారు. రాత్రి పగలు తేడా లేకుండా వాటి వెంట తిరిగి తమతమ పొలాలు దున్నించుకుంటూ ఉండారు. ట్రాక్టరును చూస్తుంటే ఈ మధ్య ఆచారికి విపరీతమయిన కోపం వస్తాంది. దాని మూలంగా తమకు రైతులకు ఉండే ఒకే ఒక సంబంధం మడకలు చెక్కడం పూర్తిగా లేకుండా పోయింది తమకు బతుకుదెరువూ లేకుండా పోయింది".

వ్యవసాయ రంగం ఆధారంగా ఉన్న వండ్రంగుల జీవితంలో యంత్రం సృష్టించిన సంక్షోభం ట్రాక్టర్ రావడంతో వారికి పని లేకుండా పోయిన విధానాన్ని చూడవచ్చు. ట్రాక్టర్లొచ్చి వడ్రంగం వాళ్ళ జీవనోపాధిని దెబ్బతీశాయన్నది రచయిత భావన. వ్యవసాయ రంగంలో కీలకమైన పని వడ్రంగం. వ్యవసాయంలో భూమిని సాగుభూమిగా చేయటానికి ప్రధానమైన పనిముట్టు నాగలి ఇదేగాక పార, కోల, గుంటుక, కొర్రు. తదితర పనిముట్లన్ని వడ్రంగం వాళ్లే తయారుచేస్తారు. అయితే ట్రాక్టర్లతో దున్నిస్తే అటు సమయము, ఇటు కష్టము తగ్గుతుందని రైతులు నాగళ్ళను పక్కన పెట్టారు. ఒకప్పుడు వడ్రంగం పనిచేస్తున్న కుటుంబం నాలుగైదు ఊర్లకు ఒక్కడే ఉండేవాడు. వర్షాలు పడగానే ఒకరి మీద ఒకరు పోటీపడి మడకల్ని చేయించుకునేవారు. మడకకు పదిశేర్లు ఇచ్చేవాళ్ళు ఈ సందర్భంలో వడ్రంగి ఆరు నెలలు తిండి గింజలు సంపాదించేవాడు. కాని నేడు వీరి జీవనం కష్టంగా ఉంది. ఈ వృత్తి తన తరంతోనే అంతమయి తన కొడుకు సురేంద్రకు అందకుండా చేసిన యాంత్రీ కరణ వల్ల ఆచారి మానసిక వేదనను 'అన్నం గుడ్డ' కథలో చూడవచ్చు. పారిశ్రామీకరణ వచ్చిన తర్వాత పరిశ్రమలలో కులవృత్తులను భాగస్వామ్యం చేయక పోవడం వలన వృత్తిదారులు వృత్తిని కోలోప్పవల్సి వచ్చింది.

'దృశ్యాదృశ్యం' కథలో శ్రీశైలం డ్యాం, ముంపు తరువాత బతుకుదెరువులో ఎవరిదారి వారు చూసు కుంటారు. అయితే ఆనంద్ కూడ పట్నం వచ్చి సంప్ర దాయంగా వస్తున్న క్షురకవృత్తిని ఆచరిస్తాడు. ఈ వృత్తిలోకి పెట్టుబడిదారులు హైటెక్ సెలూన్ల రూపంలో ప్రవేశిస్తారు. ఒక వైపు ఊరిముంపు, మరొకవైపు పెట్టుబడిదారులు కులవృత్తుల్లోకి ప్రవేశించడంతో వారి జీవితాలు అదృశ్య మైన విధానాన్ని రచయిత వెంకటకృష్ణ ఈ కథలో చిత్రించాడు. బహుజన వృత్తికులాల్లో పెట్టుబడి ప్రవేశించి హైటెక్ షేవింగ్ సెలూన్‌గానూ, మసాజ్ సెంటర్లగానూ ఒక వినూత్న రీతిలో అవతరించి వృత్తికులాలవారి జీవితం అదృశ్యం అవుతూ కనిపించే దృశ్యం మనకు కనిపిస్తుంది.

సంప్రదాయంగా సాగిన క్షురకవృత్తిలోకి మొదట బీదరూపంలో పెట్టుబడి ప్రవేశించింది. అది లాభసాటి వ్యాపారం కావడంతో పెట్టుబడిదారులు ఈ వృత్తిలోకి ప్రవేశించారు. తద్వారా ఈ వృత్తి వ్యాపారంగా మారింది. వృత్తి దారుల వద్ద అంత పెట్టుబడి లేక షాపులు పెట్టడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో వీరి వృత్తికి ఉనికి లేకుండా పోయింది. గత్యంతరం లేకుండా ఆ హైటెక్ సెలూన్ షాపులో కూలీలుగా చేరడమో లేక వృత్తిని వదులుకోలేని ఆనంద్ లాంటివారు నగరానికి చివర్లో పెట్టుకుంటూ దారుణమైన పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు.

ప్రపంచీకరణ పర్యవసానాలను ఆవిష్కరించిన రాసాని కథలలో 'నాలుగో నాటకం' ఒకటి. అపురూపమైన కళా ప్రదర్శనలను చేస్తూ పొట్టనింపుకునే బిక్షకవృత్తుల వారు తెలుగు సమాజంలో చాలామంది ఉన్నారు. ఒకనాటి

సమాజంలో పండుగలు, పబ్బాలు వంటి కొన్ని ప్రత్యేక సందర్భాల్లో పల్లె పల్లెకు వినోదం పంచిన అద్భుత కళాకారులు ఈ బిక్షక వృత్తులవారు. ప్రపంచీకరణ కారణంగా ఈ కళలు, కళాకారులు జీవితాలు ఒక్కసారిగా విధ్వంసానికి గురవుతున్నాయి. రాసాని ఈ అంశాన్నే 'నాలుగో నాటకం' కథలో చిత్రించాడు. ఈ కథలో ప్రధాన పాత్రలు మూడు ఒకడు ఎలుగొడ్డోడు రెండోవాడు ముడ్డి గంటోడు, మూడోవాడు గురవయ్య. కథలో మొత్తం ఈ ముగ్గురికి సంబంధించిన మూడు నాటకాలు కనిపిస్తాయి. రంగస్థలంపై కన్పించకుండా కథను నడిపిస్తున్న ప్రపంచీకరణ నాలుగో నాటకం. నాలుగో నాటకం మన ఉనికిలోకి వచ్చేసరికి ముందున్న మూడు నాటకాలకు శాశ్వతంగా తెరపడటం ఈ కథలోని వాస్తవిక విషాదం. అటవీ ప్రాంతాల్లో బతుకుతున్న బడుగుల గూడేలలో మందు పాతరలకు నాట్లకు బండలు పేలడంతో ఇందులో వీరి ముగ్గురు చనిపోవడం జరుగుతుంది. ప్రపంచీకరణ దెబ్బకు బడుగుల జీవితాలు ఎంత నిర్ధాక్షిణ్యంగా విధ్వంసం అవుతున్నాయో రాసాని ఈ కథలో గొప్పగా చిత్రించాడు.

బి.సి.లలో సంచార జాతుల గురించి కూడా రాయల సీమ రచయితలు కథల రూపంలో వారి జీవితాన్ని అక్షరీకరించారు. జీవనోపాధి కొరకు వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ, స్థిరనివాసం లేకుండా తమ ఇంటిని, కుటుంబాన్ని మోసుకుంటూ ఊరూరు తిరిగే వారిని సంచార జీతులు అంటారు. బాలసంతు, బుడబుక్కల, దాసరి, దొమ్మరి, గంగిరెద్దుల జంగం, జోగి, మొండివారు, పంబల, గాజుల, పూసల, మొదలైన సంచార కులాలు ఉన్నాయి. వీరిలో కొన్ని కులాల గురించి జీవన స్థితి గతులను చిత్తూరు నుండి రాసాని కర్నూలు నుండి వెంకటకృష్ణ వారి కథలలో యథార్థ జీవిత వ్యధలను చిత్రీకరించారు.

'చావుకూడు' కథలో మనిషి మరణించిన తర్వాత శవం ముందు శంఖం ఊదుతూ కర్మకాండలు జరిపించే దాసర్లలో శ్రీ వైష్ణవ నామదార్ల జీవనాన్ని రాసాని ఈ కథలో చిత్రించాడు. మనిషి కులవృత్తికి అతని ఆర్థిక స్థాయికి మధ్య ఉండే సంబంధాన్ని ఈ కథ అద్దంపడుతుంది. మునిదాసప్ప శవయాత్రలో ఒక చేతితో గంట, ఒక చేతిలో శంఖం ఊదుతూ ముందుకు సాగుతాడు. అతని కొడుకు శివదాసప్ప. శవం మీద చల్లుతున్న కాసుల్ని ఏరు కుంటాడు. దింపుడు కల్లం దగ్గర తండ్రి కొబ్బరికాయ కొడితే ఆ రెండు చిప్పల్ని శివదానప్ప సంచిలో వేసు కుంటాడు. శవం పైన అక్షింతల మాదిరి చల్లగా మిగిలిన బియ్యాన్ని కొడుకు చేతి సంచిలోకి పోసుకుంటాడు. ఇంటికి వచ్చిన తర్వాత ఒక చొక్కా కోసం అతని ముగ్గురు పిల్లలు పోట్లాడుకుంటారు. ఎవరికో పెట్టిన పిండాన్ని తన పిల్లలకు తినిపిస్తాడు ఈ పరిస్థితుల్ని చూస్తే అతని ఆర్థిక స్థాయికి అతి తక్కువ ఆదాయవనరుగా ఉన్న కులవృత్తితో జీవనం సాగించే కడుపేద. వైష్ణవదాసరిని మన కళ్ళు ముందు రచయిత చిత్రించాడు.

గ్రామీణ వ్యవస్థలో ఆశ్రిత కులం మొండోళ్ళది. వీరిని మొండివారు, మొండి బండ అంటారు. మొండి కేసుకొని రైతుల ఇంటి ముందర నానా ఆగితం చేసి బిక్షను పెట్టించుకునే దాక వెళ్ళని మొండితనం వీరిది. వీరు గ్రామాల్లో ఎవరైనా చనిపోతే శవాన్ని కోస్తారు. వీరు బెలూన్లు దారాలు తీసుకొని ఊరురు తిరుగుతూ అమ్ముకుంటారు. వీరు ఇప్పుడు ఎక్కడున్నారో, ఏమి చేస్తున్నారో వీరిజీవితం ప్రశ్నార్థకంగా మారింది. తినడానికి తిండిలేక అన్నంను దొంగిలించే మొండివారి క్షుద్బాధను రాసాని 'ఆకలి' కథలో మరియు కీడు కథలో చిత్రించాడు.

సంక్రాంతి మొదలైన పర్వదినాలలో దొమ్మరాటల వారు వస్తు ఉంటారు. జీవనాధారం కోసం ప్రదర్శనలిచ్చి వచ్చిన డబ్బుతో కడుపు నింపుకుంటూ ఒక ఊరి నుండి మరో ఊరికి పోతూ ఉంటారు. నేడు టి.వి సినిమాల రాకతో వీరి విద్యలకు ఆదరణ లేక కడుపు చేతబట్టుకొని పస్తులు గడుపుతూ తమ కళలను కోల్పోయే క్రమాన్ని 'అదృశ్యవిధ్వంసం' కథ చెబుతుంది. ఇలాంటి మరొకకథ

నాగమ్మపూలే రచించిన 'గడెఎల్లమ్మ' అగ్రకులస్తుడైన భూస్వామి, దొమ్మరాటలతో జీవనం సాగించే బలహీన వర్గానికి చెందిన ఎల్లమ్మను బలవంతంగా లోబరుచు కుంటాడు. దొర ఎల్లమ్మను గడె వేయడాన్ని మాన్పించి ఆమెను ఉంచుకుంటాడు. దొర మరణానంతరం దొర తమ్ముడు ఎల్లమ్మ దగ్గరికొచ్చాడు ఎల్లమ్మ కుమిలి కుమిలి ఏడ్చింది. చివరికి ఎల్లమ్మ ఆకలితో అలమటించి మరణిస్తుంది.

దొమ్మరి కులంలోని స్త్రీ జీవితాలు భూస్వాముల చేతిలో నలిగిగిపోతున్నాయి. దొమ్మరి కులంలో స్త్రీ కళాకారులు బలవంతంగా పడుపు వృత్తిలోకి నెట్టివేయ బడుతున్నారు. దళిత స్త్రీలు ఎదుర్కొనే అనేక రకాల శారీరక హింసలను వీళ్ళు కూడ అనుభవిస్తున్నట్లు ఈ కథ ద్వారా వ్యక్తమవుతుంది. ఈ కథకు నాగమ్మ పూలె గూడె ఎల్లమ్మ అని పేరు పెట్టడంలో చారిత్రక అస్తిత్వ చైతన్యం వ్యక్తమవుతుంది. కులవృత్తులు చేస్తున్న స్త్రీల అస్తిత్వ అనుభవాలు అమానవీయతకు గురైనవాళ్ళ అవమానాలకు అతీతంగా ఎదగాల్సిన వ్యక్తిత్వాన్ని గడె ఎల్లమ్మ పేరు ప్రతిఫలిస్తుంది.

గరుడస్తంభం కథలో ఇంటింటికి తిరుగుతూ తిరు మంత్రం వల్లిస్తూ బిక్షాటన చేసేదాసరి, అతని కొడుకు నారాయణ కుల వృత్తిని వదిలి వ్యవసాయం వైపు మొగ్గుచూపుతాడు ఆ ఊరి భూస్వామి సొసైటీ సెక్రటరీల మోసాలకు గురై చివరికి తండ్రి చేసే వృత్తిలోకి వచ్చిన విధానాన్ని రచయిత వెంకటకృష్ణ ఈ కథలో చిత్రించాడు. గరుడస్తంభం పట్టుకొని బిక్షాటన చేసే దాసరి కొడుకు నారాయణ తండ్రి చేసే కులవృత్తి నచ్చక ప్రత్యా మ్నాయంగా వ్యవసాయం వైపు అడుగు వేయడం అనేది రాయలసీమ లాంటి కరువు ప్రాంతాలలో వ్యవసాయం చేయడం ఒక సవాల్‌తో కూడిన పని. అటువంటి పరిస్థితులను గమనించక వ్యవసాయంలో అడుగుపెట్టిన బలహీన కులాలను సైతం అగ్రవర్ణాలవారు ఎదగనీయ కుండా చేసిన వైనానికి ఈ కథ సాక్ష్యం.

సంచార జాతుల కుటుంబాలపై పడే అవమానాలు, నిందలు అవి పిల్లలపై ప్రభావం చూపి వారు ఇల్లు వదిలి వెళ్ళిపోతున్న మూలాన తమ జీవిత మూలాల్నే కోల్పోతున్న క్రమాన్ని రచయిత వెంకటకృష్ణ 'హృదయస్పర్శ' కథలో చిత్రించాడు. నాగరాజు తల్లిదండ్రులు గాజుల మలారం మోసుకుంటూ ఊరూరు తిరిగి అమ్ము కుంటారు. వారికి భూమి లేకపోవడంతో పక్క ఊర్లో రాజకీయాల్లో తిరిగే మల్లేశం గౌడ్ దగ్గర తిరిగి తిరిగి ఆయన సాయంతో ఐదెకరాల శివాయసాగు భూమి పట్టా చేయించుకున్నారు. " యిట్లా వొగాడది మొగునికి ఏమి లేని ఆడది శరీరం మాత్రమే ఉన్నాడది. గాడిదలాగా తిరుగుతూ మలారం బరువు మోస్తూ కష్టపడితే మాత్రం లోకం చూస్తూ వూరికే ఉంటుందా?... ఆ యింట్లో యెదిగే పిల్లల మీద విషం చిమ్మకుండా వుంటుందా?... ఊర్లో పిల్లలూ పెద్దలు గేలి చేస్తావుంటే ఆ సుడిగుండంలో చిక్కి విలవిలలాడే పక్షే... నాగరాజు గాడు దీంతో అవమానం భరించలేక తల్లి దండ్రులకు చెప్పలేక సోషియల్ వెల్ఫేర్ హాస్టల్ నుండి ఎక్కడికో వెళ్ళిపోతాడు ఇప్పటికి నాగరాజు వెళ్ళి 15 ఏళ్ళు అవుతుంది.

సంచారకులాల జీవితం ఏ విధమైన వాతావరణంలో ఉందో ఎలాంటి అవమానాలకు గురికావల్సి వస్తోందో పై విషయం తెలియజేస్తుంది. వావి వరసలకు అతీతంగా ఏర్పడే సత్సంబంధాలలోనూ ఓర్వలేని వ్యవస్థ తల్లి దండ్రుల్ని ఏమి చేయలేక పిల్లల్ని నిందించడం జరుగు తుంది. సమాజం చేసే ఈసడింపులకు, ఛీత్కారాలకు సమాధానం చెప్పలేని నాగరాజు మానసిక వేదనను భరించలేక కుటుంబాన్ని వదిలి శ్వాశ్వతంగా వెళ్ళిపోతాడు. ఇది ఆర్థికంగా వెసులు బాటు లేని వెనుకబడిన కులాల వారి కుటుంబంలో అయితే కోలుకోలేకుండా చేస్తుంది. బాల్యం ఒక అద్భుతమైన దశ. ఇది వ్యక్తి జీవితంలో చెరగని ముద్ర చేస్తుంది. బాల్యం పై కుటుంబం, సమాజం బాధ్యతారాహిత్యం వహిస్తే ఏం జరుగుతుందో ఈ కథ ద్వారా మనకు అర్థమవుతుంది. బహుజన కులాల

జీవితాల్ని చిత్రీకరించడంలో రచయిత ఒక్కొసారి ఆ కుటుంబ వాతావరణాన్ని చెప్పేటప్పుడు కొన్ని సార్లు ఆత్మన్యూనత భావానికి లోనయ్యే అవకాశం ఉంది. అలాంటి సందర్భంలో ఎలాంటి జంకు బొంకు లేకుండా వారి జీవిత వ్యధల్ని చిత్రించడం రచయిత చూపించిన చొరవ వలన సమాజంలో బహుజనుల జీవితాలు ఏ పరిస్థితులలో ఉన్నాయి. తెలుసుకునే వీలు కలుగుతుంది.

అలాగే ప్రతి వ్యక్తి రాజకీయంగా అధికారం చేపట్ట డానికి రాజ్యాంగం చక్కటి అవకాశం కల్పించింది. బి.సి.లకు సరియైన నాయకత్వం లేని కారణంగా రాజకీయంగా అభివృద్ధి చెందలేకపోయారు రాజకీయన్యాయం అనేది బి.సి.లకు వాగ్దానం గానే ఉండిపోయింది. ఇటువంటి పరిస్థితులు రాయలసీమ ప్రాంతంలో బి.సి. కులాలు తమ హక్కుల్ని సాధించుకునే నేపథ్యంలో అగ్రకులాల వారు బి.సి.లకు రాజకీయ అవకాశాలు దక్కకుండా వారిని అణచివేసే విషయాన్ని రచయిత వెంకటకృష్ణ ''వేప కాయంత నిజం'' కథలో చిత్రించాడు.

గొల్ల మద్దయ్య మోటర్ రీవైండింగ్ మెకానిజం; ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్చుకున్నాడు. అందరికి సహాయపడే వ్యక్తి మద్దయ్య తన మామ వలన బీ.సి. సంఘాల వెంట తిరగడం మొదలుపెట్టాడు. కర్నూల్‌లో జరిగే బి.సి. మీటింగ్‌లకు ధర్నాలకు వెళ్ళాడు. ఆ సమయంలోనే తనను తాను మద్దయ్య యాదవ్‌గా మార్చుకున్నాడు. ''ఇంతకాలం ఊర్లో చూస్తుండిన, వింటుండిన రెడ్ల అగ్రవర్ణాల అధికారం ఆధిపత్యం కుక్కిన పేన్లలా తమ లాంటి కింది కులాలు పడి ఉండిన దృశ్యాలు కళ్ళ ముందు మెదిలి తెలుసుకోవాల్సిన విషయాన్నే తెలుసు కున్నానని, రావల్సిన లోకంలోనే అనుకోకుండా అయినా వచ్చేసానని సంబరపడ్డాడు. తాను వింటున్న మాటల్లోని వాస్తవం కింది కులాలే గ్రామాల్లో ఎక్కువగా ఉండటం అందరూ కలిస్తే నిజంగా అధికారం అందుకోవడం ఎంత సులభమో కదా అన్న సత్యము అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసేసింది. తమ ఊర్లో అయితే గొల్ల, కురవ, బోయ, కులాలు సంఖ్యా రీత్యా ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాత మాల మాదిగలు తమందరితో పోల్చుకుంటే రెడ్లు ఎన్ని కుటుంబాలు? ఉఫ్‌మని ఊదేయదగినన్ని మరి ఇన్నేండ్లుగా వాళ్ళ అధికారంలో ఎలా ఉంటున్నారబ్బా? అని తెగ మధనపడ్డాడు'' కొన్ని రోజులకి సర్పంచ్ పోస్ట్ బి.సి. మహిళకి రిజర్వ్ అయింది. అయితే కేశవరెడ్డి తనింట్లో పనిమనిషిగా పనిచేసే బోయమంగమ్మని సర్పంచ్‌గా చేసి పెత్తనమంతా కేశవరెడ్డి చూసుకుంటాడు కొన్నాళ్ళకు ఎంపిటీసి యస్.సిలకు రిజర్వయితే పుల్లారెడ్డి ఇంటి జీతగాడు ఎన్నికయ్యాడు. అతని తరపున పుల్లారెడ్డే దండేపిచ్చుకొని ఊరంతా ఊరేగాడు. ఇవన్నీ చూసి మద్దయ్యకు అర్థమయ్యేదికాదు మద్దయ్య బి.సి. రాజ్యాధి కార సభలలో పాల్గొంటుంటే కేశవరెడ్డికి అది నచ్చక మద్దయ్య తండ్రి సోమన్న మీద చిరుతపులి చంపిన కేసు అన్యాయంగా బనాయిస్తాడు. చివరికి ఎస్పైతో తన తండ్రి ఏ తప్పు చేయలేదని నేనొక బి.సి. ననే నిజం కనుక్కో వడమే నేను చేసిన తప్పా అని తండ్రిని తీసుకెళ్తాడు.

రాజ్యాంగం ప్రతి వ్యక్తికి రాజకీయ అధికారం ఇచ్చింది. ఆ విధంగా అందరికి అవకాశాలు లేవు. కింది కులాలవారి అవకాశాలను అగ్రకులస్తులు చేజిక్కించుకొని వారే అధి కారం చెలాయిస్తున్నారు. రాజకీయాల్లో తమ ఆధిపత్యం తరతరాలుగా తమ వంశహక్కు అన్నట్లుగా ఎలా ప్రయత్నం చేస్తున్నారో రచయిత ఈ కథలో మనకు అవగతమయ్యే విధంగా చిత్రించాడు. అగ్ర కులాలు తమ అధికారాన్ని శాశ్వతం చేసుకోవడానికి మెజార్టీ ఉన్న కింది కులాలను విభజించు పాలించు సూత్రం ఆధారంగా అనైక్యత సృష్టించి ఆధిపత్యం వహిస్తున్నారు. ఈ కథలో సర్పంచ్ పదవికి పోటీ చేసే బి.సి.ల మధ్య అనైక్యత సృష్టించి కేశవరెడ్డి, పుల్లారెడ్డివారింట్లో పనిచేసే బి.సి.లను నిలబెట్టి అధికారం వారే చెలాయించడం ఇందుకు నిదర్శనం. అలాగే మద్దయ్య యాదవ్ రాజకీయంగా ఎదుగుతుండడం చూసి నచ్చక అతని తండ్రిపై అన్యాయంగా కేసు పెట్టినప్పుడు మద్దయ్య ద్వారా

రచయిత ఒక ప్రశ్నను లేవనెత్తాడు 'నేనొక బి.సి. నని నిజం కనుక్కోవడమే నేను చేసిన తప్పా! న్యాయం సామాజిక న్యాయం కూడ ఆలోచించండి' అంటాడు. ఈ ప్రశ్న పోలీసులకు మాత్రమే కాదు ఎన్నో యేండ్లగా రాజకీయంగా ఆధిపత్యం వహిస్తూ, అధికారం చలా యిస్తూ వస్తున్న వర్గాలకి, కులాలకి వేసిన ప్రశ్నగా చెప్పవచ్చు. అలాగే గొల్లమద్దయ్య, మద్దయ్య యాదవ్‌గా మార్చుకోవడం వెనుక ఉద్దేశం అగ్రకులస్తులు తమ పేరు చివరన కులసూచకం వాడుతూ గౌరవవాచకంగా పిలుచు కుంటున్నారో అదే విధంగా కింది కులాలవారు తాము కింది కులాలు అనే భావనను ఆత్మన్యూనతను వదిలి తమ పేర్ల చివర కుల సూచకం వాడుతున్నారు. ఈ కథకు 'వేసకాయంత నిజం' అనే పేరును చూస్తే గొల్లలకు వేపకాయంత వెర్రి అనే సామెతను తలకిందులుగా చేస్తూ వారిలో కలిగిన రాజకీయ చైతన్యాన్ని 'వేపకాయంత నిజం' కథ ద్వారా రచయిత వెంకటకృష్ణ ప్రతిభావంతంగా చిత్రించాడు.

'రాజకీయ దేవుడు' కథలో బీ.సీ.లకు, రెడ్లకు మధ్య జరిగే సంఘర్షణలో బీ.సి.లు అగ్రకులాలకు పావులుగా మారిపోయి ఎస్సీలను సాంస్కృతికంగా అణచివేసే విధానాన్ని చిత్రించాడు.

అలాగే నారాయణస్వామి బహుజనుల జీవితాలను గురించి ఎవరి వేరు ఎక్కడ, నడక కథల్లో చిత్రించాడు. భూమి గురించి బ్రాహ్మణులు, బీ.సి.లు ఆలోచించే తీరుకు అనుబంధాల తీరుకు మధ్య ఎంత అంతరం ఉంటుందో తులనాత్మకంగా ఎవరివేరు ఎక్కడ కథలో చిత్రించాడు. నడక కథలో బోయ కులాల గురించి వారిని అనుచరులుగా పెట్టుకొని రాయలసీమ అగ్రకులాల రాజకీయ ఆధిపత్యంలో భాగంగా బోయ కులాల వారి జీవితాలు ఏ విధంగా నష్టపోతున్నారో చక్కగా విశ్లేషించాడు.

రాయలసీమలో మంగలి వృత్తికి సంబంధించి తుమ్మల రామక్రిష్ణ అడపం, మహావిద్వాంసుడు కథలను రాశాడు.

అడపం కథలో మొగిలప్ప సంప్రదాయకంగా వచ్చిన మంగలి వృత్తిని చేస్తూ మరొకవైపు తను పెళ్ళి చేసుకున్నాక కట్నంగా వచ్చిన చిన్నపాటి భూమిలో వ్యవసాయం చేయాలనుకుంటాడు. మొగిలప్ప వ్యవసాయం చేస్తున్న సందర్భంలో నరస్యయ మొగిలప్పను గడ్డం చేయాలని ఇంటికి పిలిపిస్తాడు. ఆ సమయంలో భూస్వామి నరసయ్య పక్క ఊరి నుండి మంగలి నారాయణను తీసుకొచ్చి గడ్డం చేయించుకుంటాడు. మొగిలప్ప నేనుండగా అతనెలా చేస్తాడని అడిగితే, నరసయ్య దురుసుగా తిడుతూ మాట్లాడతాడు మొగిలప్పకు తాను వ్యవసాయం చేయడం నరసయ్యకు ఇష్టం లేదనే విషయం గ్రహిస్తాడు. "యా నారాముణ్ణి గాకుంటే వాని నాయిణ్ణి పిల్చుకొచ్చి పెట్టుకో... నాలుగు చినుకులు పడితే నీకు తెగిన మడక నాకు తెగుతుంధి" అని అడపంను సత్తువ కొద్ది కాలువలోకి విసిరేస్తాడు.

గడచిన దశాబ్ధాల కాలంలో బహుజనుల జీవితాలలో మార్పులేమి లేకపోయినా స్థూలంగా చూస్తే కొంత మార్పు కనిపిస్తుంది. ఈ మార్పు వారి ఆత్మ గౌరవ ప్రకటనలకు కారణమైంది. ఈ కథలో మొగిలప్ప పాత్ర ఆత్మగౌరవ ప్రకటనను చేస్తాడు. భూస్వామ్య వ్యవస్థకు ప్రతీక అయిన నరసయ్యను ధిక్కరించి తాను ఏమి తక్కువ కాదని తన అస్తిత్వాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేసాడు. దీని వెనుక సామాజిక ఉద్యమాల ప్రేరణ వలన వచ్చిన కుల చైతన్యంగా రచయిత స్పష్టంగా చిత్రించాడు.

అలాగే మహా విద్వాంసుడు కథలో కన్నదాసు మంగలి వృత్తిలోని అవమానాలను ఏళ్ళతరబడి జీవితాన్ని కొనసాగించి ఆ క్రమంలో కన్నదాసు సంగీతం వైపు తన ప్రయాణాన్ని కొనసాగిస్తాడు. కాని సంగీతానికి కూడ కులం ఉందని గ్రహించిన తర్వాత అతని అస్తిత్వం అతలా కుతలం అయిన విధానాన్ని అతడు కులవివక్షకు గుర యిన విధానాన్ని రచయిత తుమ్మల రామక్రిష్ణ ఈ కథను చక్కగా చిత్రించాడు.

వేంపల్లి గంగాధర్ రచించిన 'కొయ్యబొమ్మలు' కథలో

శిల్పులు యొక్క వృత్తి సమస్యలను చిత్రించాడు వారికి దక్కాల్సిన ఆటవీ వనరులను, రాజకీయ రాబంధులు దోచుకుంటారు. పైగా అటవీ కట్టె కొట్టారని ఈ వృత్తి వారిపై ఫారెస్ట్ అధికారులు చేసే దౌర్జన్యాలకు తట్టుకోలేక వృత్తికి దూరమయ్యే విధానాన్ని ఈ కథ వివరిస్తుంది.

శాంతినారాయణ పల్లేరుముల్లు, నమ్ముకున్న రాజ్యం అనే రెండు కథా సంపుటాలను ప్రచురించారు. వీరు రాసిన కథల్లో దళిత బహుజన సన్నకారు రైతుల కరువులు, బాధలు కులవివక్ష కోణంలో రాశారు. జిల్లెళ్ళ బాలాజీ మంగళ వృత్తి గురించి, మంగళి వాయిద్యాల గురించి అనేక కథలు రాశారు. చిలుకూరి దేవపుత్ర దళిత బహుజన జీవితాలను, వారు వలస కూలీలుగా మారుతున్న క్రమాన్ని మారుతున్న మనిషి వంటి పలు కథల్లో చిత్రించాడు. ఈ విధంగా రాయలసీమ ప్రాంతంలో బహుజన జీవితం గురించి కులవృత్తుల్లోని పని విధానాన్ని పరిచయం చేయడం, అందులోని సంఘర్షణలను వారి అస్తిత్వాలను తమ పరిధిలో బహుజన జీవితాలను చిత్రించారు. సామాజిక మార్పు కోసం దళిత, బహుజన, మైనార్టీ ఉ ద్యమాలు ఏకమవ్వాల్సిన అవసరాన్ని రాయల సీమ బహుజన కథ గుర్తించింది.

# తెలంగాణ జాతరల్లో – జానపదుల విశ్వాసాలు ఆచారాలు

- సి.హెచ్.నాగలక్ష్మి, తెలుగు అధ్యాపకురాలు, బద్రూకా కళాశాల, కాచిగూడ.

తెలంగాణ విఖ్యాతికి దోహద పడున్న శక్తి జాతర్లను, ఆయా శక్తి దేవతల పురాణ గాధను, శక్తి ఆకృతిని, జాతరాంశాలను పరిశీలనాత్మకంగా అన్ని కోణాల్లో విశదం చేశాను. ఈ పరిశోధనాత్మక అధ్యయనంలో సాహిత్యం , లభ్యమైన ఆధారాలు, వ్యక్తుల ద్వార సేకరించిన పాటలు, విశేషాలతో పాటు సాంకేతిక పరంగా వస్తున్న ఆధారాలను పరిగణనలోనికి తీసుకున్నాను. అంతేకాక మతసామ రస్యానికి ప్రతీకగా భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్తూ మెదక్ జిల్లాలో సహజీవనం సాగిస్తున్న అనేక మతాల వారు వారి జీవన సంస్కృతిలో భాగమైన ఉత్సవాలు, జాతర్లను అధ్యయనం చేయడం జరిగింది. ప్రతిజాతికి, దేశానికి ఆద్యమై అవ్యాహతంగా సాగివచ్చు ప్రత్యేక ఆచారాలు, సంప్రదాయాలు కొన్ని కలవు. ఆయా ప్రజల మానసిక దృక్పథం, వారి వారి జీవిత పరిధుల ననుసరించి ఆచారాలు రూపొందును. అవి ఒక్కొక్క దేశానికి, జాతికి విభిన్నములై ఆయా దేశాల మరియు జాతుల ప్రత్యే కతలను యెత్తి చూపును. తెలుగువారిలోనే జానపదుల కొన్ని ఆచారాలు నాగరికుల ఆచారాలకంటే భిన్నమై తమ ప్రత్యేకతను ఆది నుండి నిలబెట్టుకొన్నవి. శైవ, వైష్ణవ మతాలతో బాటు జానపదుల గ్రామదేవతారాధన పల్లెల్లోను, పట్టణాల్లోను ప్రక్కప్రక్కనే సమాంతర రేఖలవలె వేటికవే స్వతంత్ర ప్రతిపత్తితో ప్రాచీనకాలం నుండి మనుడగ సాగిస్తున్నవి. అగ్రవర్ణాలవారు గ్రామదేవతలు, క్షుద్ర దేవతలుగా పరిగణించినా, ఆపదలు కలిగినపుడు, అంటువ్యాధులు వ్యాపించినపుడు వారు కూడా గ్రామ దేవతలకు మ్రొక్కుదురు. ఆ మ్రొక్కులను తీర్చెదరు. గ్రామదేవతలకు మొక్కులు మ్రొక్కుదురు. ఆ ఋక్కు లను తీర్చెదరు. గ్రామదేవతలకు మ్రొక్కులు మొక్కు దురు. ఆ ఋక్కులను తీర్చెదరు. గ్రామదేవతల పండుగలు, ఉత్సవాలు, జాతరలలో అగ్రవర్ణాలవారు అగ్రస్థానం వహించకపోయినా, ధన ధాన్య సహాయాన్ని జేయుదురు. ఉత్సాహంతో వార ఉత్సవాలలో పాల్గొం దురు. శైవ, వైష్ణవ మత ప్రభావం గ్రామదేవతారాధన పైనను, గ్రామదేవతారాధన ప్రభావం శైవ వైష్ణవ మతారాధనలపైనను కొంతవరకు ప్రసరించినవి. మన దేశం అనేక విదేశీయుల విజాతీయుల దాడికి గురైనను, అనేక మతాలు, మత ప్రవక్తకులు పుట్టి గిట్టినను, మనుగడను సాగిస్తున్నను అనేక వేల సంవత్సరముల నాటి గ్రామ దేవతలకు వారి ఆరాధనకు క్షతి సంభవించ లేదు.

జానపదుల జాతర్లలో మంత్రకంటే తంత్రానికి ఎక్కువ ప్రాధాన్యత వుంటుంది. గ్రామ దేవతలను అలంకరించి గుగ్గిలం, సాంబ్రాణి ధూపం వేస్తారు. భక్తులు వారి వారి ఇష్టం మేరకు అమ్మవారికి ఆరగింపులు తెస్తారు. జాతర రోజు అమ్మవారి మందిరాన్ని వేప, మామిడి ఆకులతో అలంకరిస్తారు. భక్తులు జాతరకు దూర ప్రాంతాలనుండి బండ్లు కట్టుకొని వస్తారు. మొక్కులున్న వాళ్ళ బోనం సమర్పిస్తారు. కోడిని, వేటను బలిగా సమర్పించే సంప్రదాయం నడుస్తోంది. జాతర రోజులలో భక్తులు గొర్రెలతో బండ్లు లాగిస్తూ ఆ బండ్లపై అమ్మవారి ప్రతిమవుంచి సాంబ్రాణి ధూపంతో అమ్మవారి గుడి చుట్టూ తిప్పుతారు. జాతరరోజు సాయంత్రం అమ్మవారి రథోత్సవం జరుగుతుంది. అదేరోజు రాత్రి అన్నంవండి అమ్మవారి ఎదుటపోసి దానిపై కుంకుమచల్లి ఆరగింప చేసి ఆ అన్నాన్ని గ్రామ సరిహద్దులలో చల్లుతారు.

జాతర రెండవరోజు రంగం అనే కర్యక్రమం జరుగు తోంది. ఈ కార్యక్రమంలో పెళ్ళికాని అమ్మాయి పచ్చి కుండపై నిలిచి భవిష్యద్వాణి చెప్తుంది. ఈ భవిష్యద్వాణి చెప్పె అమ్మాయికి వివాహబంధం వుండదు. ఆమెకు

గుడివాళ్ళ ఏడాది, ఏడాది గ్రాసం కొలుస్తారు. లేదా డబ్బు యిస్తారు. జాతరలలో చివరి కార్యక్రమం 'గావు' ఈ కార్యక్రమంలో పూర్వకాలంలో అయితే జంతువు కొరికి పోతురాజు తలను మొండేన్ని వ్యతిరేక దిశలో గుడి ముందు విసిరేస్తాడు. అక్కడితో జాతర కార్యక్రమం విజయవంతంగా ముగుస్తుంది. అయితే ఈనాడు ఆనపకాయను కొరికి పారవేయడం గమనించవచ్చు.

ఆశ్వయుజ దశమినాడు విజయదశమి పండుగను, ఆశ్వయుజ బహుళ చతుర్ధశినాడు నరకచతుర్దశి పండుగను, మాఘ బహుళ చతుర్దశినాడు మహాశివరాత్రిని సంవత్సరానికొక మారు నిర్ణీత దినాలలో జరుపు కుంటాము. కాని సాధారణంగా గ్రామదేవతల పండుగలకు నిర్ణీత దినం నిర్ణయించలేదు. గ్రామదేవతల పండుగలను సంవత్సరానికొకమారైనను 2,3,5,7 సంవత్సరముల కొకమారైనను జరుపుతారు. సామాన్యంగా పంటలు పండిన తర్వాత విశ్రాంతి సమయాలలో జరుపుతారు. అంటువ్యాధులు, పశురోగాలు ప్రబలినపుడు, కరువు కాటకా లేర్పడినపుడు, గ్రామ దేవతల కాగ్రహం కలిగి నదని భీతిచెందినపుడు జానపదులు దేవతలకు బలులనిచ్చి పండుగలను చేస్తారు. జాతర, ఉత్సవం, సంబరం, తిరునాళ్ళు, పండుగ ఇత్యాదివన్నియు సమానార్థకాలే. వీని ప్రస్తావన ప్రాచీన గ్రంధాఘాలందు కూడ గోచరించున జాతర ప్రస్తావన పాండురంగ మహాత్మ్యం మహాభారతంలందు కన్పడును.

'అత్తటి దన్నగరీపతి
జాతర చాటించె బశువిసరమని తరసా
ధ్యాతత పాతా మయని
ర్వతాహతి దూలగాలి గంగల కెల్లన్

జాతర సేయుగా వలయు సర్వజనంబులు నంబురాశికిన్. మహాభారతంన సంబరం గురించి కూడా ప్రస్తావన కలదు. 'గోవింద సంబరం సంభావింపు 'జాతరనే 'పరస' అని కూడా అందురు. ఈ 'పరస' పదాన్ని పాల్కూరికి సోమన, శ్రీశైల యాత్రోత్సవం పరంగా ప్రయోగించెను. ఈదెమ్మ కథలో 'పరస' పదం అమ్మవారి జాతరకు పర్యాయంగా వాడెను.

ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క గ్రామదేవత ప్రాముఖ్యం వహించునట్లుగా వివిధ ప్రాంతాలలో వివిధ ఆచారాలు ఆచరిస్తారు. ఈ ఆచారాలలో సాధారణ అంశంగా కన్పడు విషయం బలి, బలి జంతువుగా దున్నోతునుగాని, గొట్టెనుగాని, మేకనుగాని, కోడిని గాని దేవతక సమర్పిస్తారు. జంతు బలులు నిషేదించడం వల్ల జంతువులకు మారుగ గుమ్మడికాయలను పగుల గొట్టుదురు. నలభై, యాభై సంవత్సరాలకు పూర్వం దున్నపోతులను బలిగానిచ్చెడి ఆచారం ప్రచురంగా నుండెను. నేడది అరుదుగా కన్పింస్తుంది. జానపదులు జంతువులలో సామన్యంగా దున్నపోతును, మేకను బలినొసంగుటలో ప్రాచీన కాలం నుండి వారికి ప్రాముఖ్యం కలదని విదితమగును. కాళికాదేవి మహిషా సుర మర్ధిని, గ్రామదేవతలకు మహిషంనే బలినిచ్చుట గమనించదగిన అంశం. ప్రపంచ పర్యాప్తంగా వ్యాపించిన బలినిచ్చే ఆచారం ఎప్పుడెచ్చుట ఎందుకు ఏర్పడినదను అంశము నేటికీ వివాదస్పదమే. బలినిచ్చే ఆచారంలోని మొదటి దశ నరబలి. ఈ నరబలి మన భారతదేశంలో ఆర్యుల ఆగమనానికి పూర్వమే సింధు నాగరికతయందే ప్రచారంలో నుండెనని హరప్పా, మొహంజోదారో అవశేషాల వల్ల నిరూపితమైంది. శిధిలాల్లో లభించిన ఒక ఫలకం పైన పురుషుడు కత్తిని చేతిలో ధరించి యుండగా, స్త్రీ వంగి తన చేతులను పైకి లేపినట్టున్న చిత్రం బలిని సూచిస్తుంది.

శతపథ బ్రాహ్మణంలో, సంస్కృత పురాణములందు నరబలి ప్రసక్తి కనబడుతున్నది. భాగవతమందు శునశ్శేపుడు హరిశ్చంద్రునికి యాగపశువుగా తండ్రి చేత అమ్మబడెను. యాగపశువుగా యూప స్తంభమునకు కట్టి వేయబడిన శునశ్శేపుడు బ్రహ్మాది దేవతల వినుతి సేయుచు మెప్పించి, పితృదేవతలచే విముక్తుడయ్యెను.

రామాణమందు కూడా శునశ్శేపుడు విశ్వామిత్రుడు పదేశించిన మంత్ర ప్రభావంచే విముక్తుడయ్యెను. పురాణకాలమందు రాజులు తమ కోరికలు నెరవేరుటకు, దేవతల అనుగ్రహాన్ని పొందుటకు యాగఫలమునకు నరబలుల నొసంగు సంప్రదాయ ముండెడిదని ఈ కథల ద్వారా స్పష్టమగుచున్నది. వివిధ మేధాలలో జానపదుల కథల యందు కూడా నరబలి తరచుగా కనపడును.

నిర్జీవాలైన నదులు, నిధులు, కోటలు, భవనాలు, తటాకాలు, నూతులు నరబలులను కోరును.

జానపద కథలలోని నరబలులకు సంబంధించిన కథలలో ఎక్కువగా గర్భిణీ స్త్రీలను కోరుటలో సఫలతా ప్రాధాన్యం గోచరిస్తుంది. జపాన్, ఆఫ్రికా, గ్రీకు, పాలినేషియా, ఫిజి దేవాలలో పూర్వం నరబలులు, జంతుబలులుండేవి. ఖురాన్లో కూడా నరబలి ప్రసక్తి కలదు. కెల్టిక్ జాతివారు భగవంతుని రిక్తహస్తాలతో పూజించిన అతనికి ఆగ్రహం కలుగునని భయబడతారు. ప్రళయం, కరువుకాటకాలు, ఆపదలు, భగవంతుని నిర్లక్ష్యం కావించుట వల్ల సంభవించునని భావించి, భగవదనుగ్రహం కొరకు బలులనిస్తారు. ఒక ప్రాణము నకు మారుగ మరియొక ప్రాణమునిచ్చినప్పుడే భగ వంతుడు తృప్తి జెందునని వారి విశ్వాసం. మన పల్లె ప్రజలు అంటువ్యాధులు వ్యాపించినపుడు దేవతల కాగ్రహం కలిగిందను భ్రమతో బలులనిచ్చిన విధంగా, కెల్టిక్ జాతి వారు ప్లేగు మొదలగు వ్యాధులను నిర్మూలించుటకు బలి నిచ్చేవారు.

ఆత్మనివేదన వలన భగవంతుని అనుగ్రహాన్ని పొందెదమను విశ్వాసం ప్రాచీనులలో ప్రబలెను. నవవిధ భక్తి మార్గాలలో ఆత్మ నివేదనయందు ప్రాణి భగవంతుని శరణ్యమనే భావన మన హిందూ మతమందు కలదు. కాలక్రమేణ తనను తాను భగవంతునికి అర్పించు కొనుటకు మారుగ మరియొక ప్రాణిని బలిగానిచ్చిన కోరికలు ఈడేరునని భావన ప్రాచీన మానవుని మనస్సులో జనించి వుండవచ్చును. ఈ భావనయే నరబలికి మారుగా జంతుబలిగా రూపొందింది. ఈ భావనకు ఉపబలకంగా శతపథ బ్రాహ్మణంలో 'తొలుత దేవతలకు మనుష్యుని బలిగా నొసంగిరి. వాడు బలిగా నొసంగినపుడు యజ్ఞ తత్త్వము వారి నుండి వెడలి ఎద్దుయందు ప్రవేశించెను. అప్పుడు వారు ఎద్దను బలినిచ్చిరి. దానినుండి యజతత్త్వము గొట్టెలోనికి, గొట్టెనుండి పుడమిని జేరి అచ్చట నుండి వరి, యవలలో ప్రవేశించను. అని బలులలో వచ్చిన పరిణామాలను పేర్కొనిరి. ఒకదానికి బదులుగా మరొక దానిని సమర్పించే సంప్రదాయం ముఖ్యంగా క్రైస్తవ మతంలోను. యూదుమతంలోను మనకు ప్రస్తుటంగా కనపడును. ఈ సంప్రదాయమునకు అంకురార్పణ బాబిలోనియాలో దేవతలకు గొర్రెలను బలి నిచ్చినప్పుడు పఠించు మంత్రంలో కనబడును. ఆ మంత్రార్థం 'మానవునికి బదులుగా ఈ గొర్రెను మీకు నివేదనగా సమర్పిస్తున్నాము. తన ప్రాణమునకు బదులుగా గొర్రెప్రాణమును నీకు సమర్పిస్తున్నాను అని కలదు. జానపద సాహిత్యమందు కూడా నరబలి నిషేధించిన తర్వాత జంతుబలి ప్రచారంలోనికి వచ్చినదను అంశం స్పష్టం చేయుకథ ఒకటి కలదు. పురాణ కాలంలో కలరా నగరమంతటా వ్యాపించి యువకులను, వృద్ధులను మృత్యుదేవత గొని పోతుండెను. ఆ రాజ్యపు ప్రభువు అమ్మవారికి బలినివ్వగూడదని నిషేదించెను. అమ్మవారాగ్రహంతో, రాజు స్వప్నంలో కన్పించి, 'నాకొక నరబలినిచ్చి, వరమును తీసుకొనుము. లేనిచో నిన్ను చంపివేయుదును' అని ఆదేశించెను. రాజు పూజారిని, నీవు దేవతకు బలికావలెనని ఆజ్ఞపించెను. అతను రేపు రాత్రికి వస్తానని మాట యిచ్చెను. పూజారి దేవతను 'నేనిన్ని రోజులు తప్పింపలేమని ప్రత్యుత్తరమిచ్చెను. పూజారి చేసేది లేక మాటప్రకారము రాజు కడకు వెళ్ళెను. రాజు పూజారిని దేవతకు బలినివ్వగానే, ఆమె సంతసించి, ఏదైన వరమును కోరుకొమ్మనెను. రాజు పూజారిని పునర్జీవితును చేయమని వేడెను. దేవత పూజారిని బ్రతికించెను. కాని భక్తులు జంతుబలిని ఒసంగిని

అభ్యంతరం జెప్పకూడదని శాసించెను. నాటి నుండియే నరబలికి మారుగ జంతుబలి ప్రచారంలోనికి వచ్చెను. జైన, బౌద్ధ మత ప్రచార ప్రభావములచేత హిందు మతంలో జంతుబలి అణచివేయబడింది. జంతుబలి స్థానములో కొబ్బరికాయలు, గుమ్మడికాయలు ప్రవేశించినవి. మానవుని ఆలోచనా సరణిని అనుసరించి ఆచారంలో కూడా మార్పు సంభవించునని ద్యోతకమగును.

బలి పుట్టుకను గూర్చి పలువురు పలుధాలైన అభిప్రాయాలను వెల్లడించిరి. సెన్సర్ ప్రాఙ్మానపుడు చనిపోయిన వారి సమాధుల ముందు నీరు, ఆహారమును పెట్టెడి ఆచారవే దేవతలకు బలినివ్వడమను ఆచారముగా రూపొందినదని భావించెను. వైట్ హెడ్ ప్రాచీన మానవుడు బలికి ఇచ్చుటలోని ముఖ్యోద్దేశం భగవంతునితో సంబంధం పెట్టుకోవాలనియే. కాని భగవంతునికి కానుక నిచ్చుట కాదని వివరించెను. రాబర్ట్ స్మిత్ 'భగవంతుని విగ్రహము కడ నివేదించిన మాంసం లేదా ఫలమును ఆరగించుట వలన, భగవంతునితో సంబంధము పెట్టుకొనినానని ఆదిమ మానవుడు భావించెడివాడు. అని తన అభిప్రాయాన్ని ప్రకటించెను. మానవశక్తికి అతీత శక్తికి మధ్య సంబంధం కల్పించునది బలి అను తలంపు ప్రాఙ్మానవుల కుండెడిదని పలు మానవశాస్త్రవేత్తలు భావించిరి. ప్రాచీనుల ఆలోచనా విధానం మనకు స్పష్టం కాకపోయినను, నేటి జానపదులు మాత్రం భగవంతుడు తమ కోరికలను తీర్చినచో బలులనిచ్చెదమని మ్రొక్కుకొని మొక్కులు తీరుస్తారు.

బలులు గణవ్యవస్థ కాలములో జన్మించినవని వైట్ హెడ్ వివరించెను. ప్రాఙ్మానవుని జీవితములోని జంతు ప్రాధాన్యం, గణసంకేతాలుగా జంతువుల నేర్పరచుకొనుట మూలకారణమైంది. కొంతకాలం గడిచిన తర్వాత గణ సంకేతంగా గుర్తింపబడిన జంతువు గణదేవతా ప్రతీకయైనది. గణదేవతా ప్రతీకతో సంబంధాన్ని కల్పించుకొనుటకే ప్రాచీనులు బలినిచ్చెడి వారని వైట్ హెడ్ ప్రతిపాదించెను. బలికి ముందు జంతువును పసుపు కుంకుమలతో అలంకరించుట, ఊరేగించుట, ఊరేగించునపుడు ప్రతి ఇంటి ముందు దాని కాళ్ళపైన నీరు పోయుట మొదలగు ఆచారాలు పూజా విధానాలకి ఉపబలకంగానున్నవి. కనుక ప్రాచీన కాలములో బలిగా ఇవ్వబడె జంతువు, గణదేవతా ప్రతీకగానే ఎంచబడెదను అంశము ఉపపాదకంగా ఉన్నది. జంతువును బలినిచ్చు విధానాన్ని గూర్చి జానపదులలో ఒక కథ కలదు. పూర్వకాలంలో పంచమ జాతీయుడొకడు వేదపఠనము గావించు ఒక గ్రామమునకు పోయెను. అతను బ్రాహ్మణుడు, పండితుడని ఆ గ్రామ పెద్దలు భ్రమించి, గ్రామకరణము కూతురినిచ్చి పెళ్ళి చేసిరి. ఆ దంపతులకు సంతానము కూడా కలిగెను. కొన్ని సంవత్సరాలు గడచిన తర్వాత పంచమ యువకుని మోసమును తెలుసుకొని బ్రాహ్మణ యువతి సజీవదహనమయ్యెను. మరణమునకు పూర్వము బ్రాహ్మణయువతి, గ్రామస్థులను తన భర్త తలను ఖండించి, అతని నోటిలో మోకాలును పెట్టవలయుననియు, తలపైన దీపమును వెలగించవలయుననియు ఆదేశించెను. మరణానంతరము ఆ విప్ర యువతి దేవతయై వెలసెను. గ్రామ పెద్దలు బలినొసంగిన పంచమ యువకుడు, మరు జన్మలో దున్నపోతుగా జన్మించెను. నాటినుండియు దున్నపోతును దేవతకు బలినిచ్చుట, దాని కుడి మోకాలిని నరికి, శిరస్సు ఖండించి నోటియందు మోకాలిని పెట్టుట ఆచారముగా మారింది. కన్నడ దేశమందు కూడా ఈ ఆచారము కనబడుచున్నది. అచ్చట ప్రచారంలో నున్న కథ తెలుగుదేశమందు వ్యాప్తిలో వున్న కథను పోలివుంది. ఒక చండాల జాతివాడు బ్రాహ్మణుడుగా వ్యవహరించి, శాస్త్రముల నభ్యసించి, బ్రాహ్మణ కన్యను పరిణయమాడెను. కొన్ని సంవత్సరములకు గడిచిన అనంతం ఒకనాడు చండాల జాతివాడు తెగి పోయిన పాత చెప్పును కుట్టుకొనుట అతని కుమారుడు జూచి తల్లికి తెలిపెను. తల్లి తన తపశ్శక్తి చేత జరిగిన మోసమును గ్రహించి, తాను 'మారి' దేవతగా వెలుస్తానని

తెలిపి, తన భర్త దున్నపోతుగ ననుసరించి ఆనాటి నుండియే మారిదేవత ఉత్సవములందు, దున్నపోతును బలియిచ్చి దాని కుడి మోకాలును నోటియందు పెట్టుదురు.

మోకాలును ఖండించి నోటిలో పెట్టు ఆచారములోని అంతరార్థమును గూర్చి మహారాజా వి.యస్. రంగారావు ఒక అభిప్రాయయాన్ని వెలిబుచ్చిరి. హీనజాతివారు గ్రామ పెద్దను క్షమార్పణలు కోరుటకు వెళ్ళునపుడు గడ్డిపరకను అడ్డముగా నోటిమీద పెట్టుకొందురు. పశువుల వలె చేసిన తప్పును, ఈ చర్య సూచించును. గడ్డిపరక లభించనిచో కుడిచేతి చూపుడు వ్రేలును నోటిమీద అడ్డముగా పెట్టుకొందురు. భగవంతుని ముందు తప్పులను క్షమించ మని తమ వ్రేలిని నోటిమీద పెట్టుకొనుటకు మారుగ జంతువు కుడి మోకాలును నోటియందు పెట్టదరని రాజాగారు తెలిపినట్లుగా వైట్ హెడ్ పేర్కొనెను, ఎల్మోర్ పండితుడు ఈ ఆచారము జయింపబడిన శత్రవును క్రూరముగా శిక్షించు విధానమును సూచించుచున్నదని భావించెను. దున్నపోతు మెడలో హారమును వేసి ఊరేగించుట 'శత్రువును చంపుటకు ముందు విజయాన్ని ప్రదర్శించుట ను సూచిస్తుందని అతడు ఉల్లేఖించెను. ఈ జంతుబలి కార్యక్రమము సూచిస్తున్నదని ఎల్మోర్ పండితుడు ప్రవచించెను. కాని ఆర్యులు భారతదేశం లోనికి అడుగిడుక మునుపే అనార్యులలో బలినిచ్చు ఆచారం ఉండడిదని హరప్పా మొహెంజదారో శిథిలా శేషముల వలన విదితమగుచున్నది. కనుక ఎల్మోర్ పండితుని అభిప్రాయం అసమంజసమను వచ్చును.

విద్వాంసులనేకులు జంతుబలిని సఫలతా కర్మ కాండలకు ప్రతిగా భావించిరి. బలిగా ఇవ్వబడు జంతువు సస్య ప్రతీక దానిని భూమికే అర్పితము గావించిన ఆమె సఫలతాశక్తి అధికమగునని ప్రాజ్ఞానవుని భావన కావచ్చును. ఈ ఆచారము ప్రి హిలినిక్ డైనమిషన్ పండుగలను తలపిస్తుంది.

జంతువును బలిగా దేవతకు సమర్పించు సమయాన రక్తమును నైవేద్యపు టన్నములోనికి పట్టి దానిలో వేపాకు, పసుపు కలిపి ఆ మిశ్రమాన్ని ఇళ్ళ పైనను, పొలాల్లో చల్లుతారు. బీరప్ప పండుగకు గొల్లవారు తమ సంపద యైన గొఱ్ఱెలమందపైనను రక్తమును చల్లుతారు. రక్తమును జల్లు సమయమున నోటిలో బలియైన జంతువు కాలేయమును నిమ్మకాయ దోషహారిణియని జానపదుల నమ్మకము.

గుండె, మెదడు, కాలేయము మొదలగు వానిలో నాత్మయుండునన్న భావనయే బలిపశువు చంపినపు డాయా యంగములే ప్రత్యేకముగా దేవతల కాహార భూతములగుటకు కారణమని డా. కృష్ణకుమారి గారి ప్రవచించిరి.

17 వ శతాబ్దంలో ఒక పర్షియా వేదాంతి శరీర నిర్మాణ ప్రథమ భాగములు - ఆత్మకాధారాలైన, మేధస్సు, కాలేయము, హృదయము అని తెలిపెను. సిలోన్ లోని వెడ్డా తెగవారు, ఇండో చైనాలోని వివిధ తెగలు, ఆఫ్రికాలోని బకోంగో, ఉత్తర అమెరికాలోని మిక్ మ్యాక్ ఇండియన్స్ వధింపబడిన తమ శత్రువుల కాలేయాన్ని తిన్నచో వారి ధైర్యం బలం, తమకు సంక్రమించునని విశ్వసిస్తారు. ఎస్కిమోలు ప్రతీకారవాంఛ తగ్గునను నమ్మకము కలదు. ప్రాచీన ఆరాధనా విధానాలలో లివర్ డివినేషన్ కూడా ఒకటి. మట్టితో, రాతితో చేసిన కాలేయములు పురాతత్త్వ శాస్త్రజ్ఞులచేత కనుగొనబడినవి. ఈ ప్రాచీన విశ్వాసాలు ఆచారాల వలన ప్రాజ్ఞానవ మతం నుండి కలదని స్పష్టమగుచున్నది. వైట్ హెడ్ పండితుడు ప్రతిపాదించిన సిద్ధాంతం ననుసరించి గణదేవతా ప్రతీకగా భావింపబడుచున్న జంతువు శక్తి కాలేయము ద్వార సంక్రమించునను ప్రతీకగా భావింప బడుచున్న జంతువు శక్తి కాలేయము ద్వార సంక్రమించు నను నమ్మకం నాధారం జేసుకొనియే ఈ ఆచారం ఏర్పడవచ్చును. బీరప్ప పండుగ సందర్భంలో బలిగా నిచ్చిన గొఱ్ఱెల యొక్క కాలేయాన్ని నూనెలో వేయించి ఆ ముక్కలను ప్రసాదంగా ఇస్తారు.

బలి జంతువు యొక్క రక్తముతో మిశ్రమమైన అన్నాన్ని బలి అన్నమని అందురు. దీనిని ఇళ్ళపైన, పొలాలపైన జల్లినచో దేవత వానిని రక్షించునని గ్రామస్థుల విశ్వాసం, వైట్ హెడ్ రక్తాన్ని జల్లుట ప్రేగులను మెడలో వేసు కొనుట, కాలేయాన్ని నోటిలో పెట్టుకొనుట, ఈ చర్య లన్నియు గణదేవతతో సంబంధం పెట్టుకున్నాననని ప్రాచీన విశ్వాసాన్ని ప్రకటిస్తుందని ప్రవచించెను. ఈ భావనకు ఉపపాదకంగా ఆఫ్రికాయందుగల అనేక ఆటవిక తెగలలోని ఆచారాలని వివరించెను. ఆఫ్రికాలోని మమ్బెట్టర్ తెగవారు పరస్పరంగా గాయాలు చేసుకొని గాయాల నుండి స్రవించు రక్తాన్ని పీలుస్తారు. యున్యోరల కౌన్లీ లోని ప్రజలు రెండు కాఫీ బెర్రీలను రక్తంలో ముంచి తింటారు. సందేహ్ తెగవారు ఒకకరు గాయంలోని రక్తాన్ని మరొకరి గాయంలోనికి ప్రసరింపజేస్తారు. రక్తసంబంధం చేత విభిన్న తెగల మధ్యన సంబంధం, బంధుత్వ మేర్పడునను విశ్వాసం పైన పేర్కొనిన తెగ ప్రజలలో కలదు. అదే విధంగా గణదేవతయైన జంతువు రక్తంను త్రాగుట వలన, ఇళ్ళపైన, పశువులపైన, పొలాలపైన జల్లుట వలన, దేవతకు వానికి మధ్యన సంబంధ మేర్పడునను విశ్వాసం ప్రాచీన మానవులకుండెడిదని స్పష్టమగుచున్నది. ప్రేగులు జంతువుల ప్రాణాలకు ముఖ్యమైనవి గనుక వానిని ధరించుట. గణదేవతతో సంబంధము పెట్టుకొనుటేనని ప్రాచీనుల విశ్వాసమై ఉండవచ్చు. రక్తం ప్రాణంనకు ప్రతీకగా పురాణకాలం నుండి పరిగణిస్తున్నారు. పురాణాలలో రక్త బీజుని కథలో అతని రక్త బిందువులు ధరణిపై పడగానే వానినుండి రాక్షసులుద్భవించిరి. దేవి నాలుకను భూమిపై పరచి రక్తమునంతయు త్రాగెను. జానపద సాహిత్యంలోని గ్రామదేవతల కథలలో, పౌరాణిక గాథలలో రక్తపు బిందువుల నుండి రాక్షసులు, వీరులు జనించినట్లుగా వర్ణితం. రక్తం సఫలతకు చిహ్నమను రక్తం ప్రవహించుట, దానిని అన్నంత, మట్టితో కలుపుట సఫలత కొరకు జరిపే ప్రార్థనలని, ఈ ఆచారమంతయు వ్యవసాయ ప్రధాన మైనదని జానపదుల నమ్మకం.

# జానపద వాద్యాలు

– డా॥. చింతల రాకేష్ భవాని, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్ నగర్, రంగారెడ్డి జిల్లా.

## వాద్యం పుట్టుక :

ఆదిమ మానవుడు ప్రకృతికి పులకరించి నాట్యం చేస్తున్నప్పుడు అతని శరీర అవయవాల కదలికలకు అనుగుణంగా ఆనందంతో కొన్ని రకాల శబ్దాలను పలికే వాడు. ఈ శబ్దాలు అంతగా అర్థం కాకపోయినా అక్కడక్కడా వాద్యాలను పోలిన శబ్దాలుగా అనిపించేవి. దీనిని బట్టి జానపద వాద్యాలను వాడడం మానవుడు ప్రకృతి నుండే నేర్చుకున్నాడని చెప్పవచ్చు. జానపద వాద్యాలు ప్రకృతిలోని శబ్దాలను అనుకరించే సరళ స్వభావం కలవి. మనిషిలో ఆవేశాన్ని కల్గించేవి.

జానపద కళలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి 1) సంగీతం, 2) నృత్యం, 3) రూపకం. సంగీతంలో వాద్య సంగీతం, గాత్ర సంగీతం, సాహిత్యం . ఇలా తిరిగి మూడు ప్రధాన విభాగాలు కన్పిస్తాయి. వాద్య సంగీతం 64 కళల్లో ఒకటి. వాద్య సంగీతం ప్రత్యేకంగా ఉండవచ్చు లేదా గాత్ర సంగీతానికి తోడుగా వుండవచ్చు.

భారతదేశంలో 500 కంటే ఎక్కువగానే సంగీత వాద్యాలున్నాయి. 'శబ్దార్థ దీపిక' భారతదేశంలోని సంగీత వాద్యాలను నాలుగు రకాలుగా వర్గీకరించింది. అవి 1) తతము, 2) ఆనద్ధం/ఆవనద్ధం, 3) సుషిరం, 4) ఘనం.

'తతం' అనగా తంత్రులతో కూడిన వాద్యం . తీగలతో మీటునది. ఉదా:- సితార, వయోలిన్, శారద, ఏకతార, తాంబూర, వీణ, గిటార, వయోలిన్, బుల్ బుల్.

'ఆనద్ధం' అనగా చర్మంచే మూయబడే వాద్యం. ఉదా:- పంబ, ఒగ్గు, రుంజ డప్పు, వీరణము, మృదంగం, తబలా, మద్దెల, డమరుకం, కంజెర.

'సుషిరం' అనగా రంధ్రాలు చేయబడి ఊదటం వల్ల ధ్వనులు వచ్చే వాద్యం. ఉదా: - పిల్లన గ్రోవి, పాములను ఆడించే నాదస్వరం, కొమ్ము, తిత్తి, హార్మోనీ.

'ఘనం' అనగా కంచు లోహంతో తయారు చేసిన వాద్యం. ఉదా: - పిచ్చుకుంట్లు మోగించే గంట, దాసరులు కొట్టు తాళాలు, గుడిలోని గంటలు, చెంచువారి జేగంట.

జానపద వాద్యాలలో పైన పేర్కొన్న అన్ని రకాల వాద్యాలు కలవు. కానీ తంత్రీ వాద్యాలు అంత ఎక్కువగా జానపదుల వాడుకలో లేవు. సంగీత వాద్యాలను మేళవాద్యాలు, దేవాలయ వాద్యాలు, రణ వాద్యాలు, జానపద వాద్యాలుగా కూడా వర్గీకరించవచ్చు.

జానపద వాద్యాలను స్థూలంగా వీరణములు, గుమ్మెట, ఒగ్గు డోలు, కోలలు, శంఖము, శారద, అందెలు, కటివాద్యము, డప్పు, తప్పెట, తాళాలు, తాంబూర, జమిడికలు, చిఋతలు, నాగస్వరము, గజ్జెలు, ఢక్కి పిల్లనగ్రోవి, కొమ్ము, బుర్రలు, రుంజ మొదలైనవిగా వర్గీకరించవచ్చు.

## ప్రాచీన కాలంలోని వాద్యాలు :

ప్రాచీన కాలంలోని వాద్యాలను గూర్చి 'పల్నాటి వీర చరిత్ర'లో ప్రస్తావించబడింది. ఈ వాద్యాలను సైన్యములు కవాతు చేసేటప్పుడు వారి ముందు వాయించేవారు. వీటిని వర్గీకరిస్తే ఇవి వరుసగా ముందు డమాయీలు, మురజ సంఘంబు, బూరలు, భేరీలు, పోటుధారలు, కాహళ, ఫంకిణి, కాలికొమ్ములు, శంఖ సమూహం, సన్నాయిజోళ్లు, మురళి చయంబు, ముఖ వీణవితతి, నగరలు, తప్పెటల్, నయనమైన డోళ్, తమ్మటమ్ములు, నెంచదగు వీరణములు, ఘనమైన రుంజలు, కనక తప్పెటలు, చేగంటలు మొదలగునవి.

తెలుగు జానపద సంగీతానికి వందల సంవత్స రాలుగా ప్రాణభిక్ష కల్పించినవారు భిక్షుక గాయకులు.

నన్నెచోడుడు, పాల్కుర్కి సోమనాథుడు మొదలగువారు జానపద వృత్తి గాయకుల గూర్చి వివిధ సందర్భాలలో తమ గ్రంథాలలో పేర్కొన్నారు. జానపద వృత్తి గాయకులు సంగీతాన్ని గాత్రం, సంగీతం ఇలా రెండు రకాలుగా కాపాడుకుంటూ వస్తున్నారు. నేను నా యీ పరిశోధనా పత్రం ద్వారా జానపద వృత్తి గాయకులు వారు ఉప యోగించే వాద్యాలను ముందుగా పేర్కొని వాటిలో ముఖ్యమైన వాద్యాలను స్థూలంగా వివరించే ప్రయత్నం చేస్తాను.

**బవనీలు :**

'జమిడిక'; బుడిగెజంగాలు : 'బుడిగె'; రుంజవారు : 'రుంజ'; కొర్రాజులు : 'కిన్నెర', 'కీకిరి', 'కుజ్జు', 'డక్కీ', 'డోలు', 'కాలికొమ్ము', 'ప్రేపేరే' (సన్నాయి); పంబల వారు : 'పంపజుడు'; వీరవిద్యావంతులు/పల్నాటి వారు : 'వీరజోడు', 'తిత్తి', 'కత్తి', 'డాలు', 'తాళం'; కొమ్ముల వారు : 'వీరణాలు', 'కొమ్ములు', 'శంఖాలు'; బీరన్నల/ఒగ్గు వారు : 'ఒగ్గు'; పిచ్చుక కుంట్ల వారు : 'గంట', 'తిత్తి)/తంబుర', 'గుమ్మెట'; డక్కలివారు, మాస్టీలు : 'మెట్ల కిన్నెర'బీ వీరముష్టివారు : 'జేగంట' తప్పెట'; బుడబుక్కలవారు : 'బుడబుక్క; దాసరులు: 'చిఱుతలు', 'కిన్నెర'; మిత్తిరి దాసరులు : తంబూరాలా వుండే 3, 4 తీగల వాద్యం. ఇలా జానపద వృత్తి గాయకులు, వారి ప్రధాన వాద్యాలను వర్గీకరించవచ్చు. వీటిలో ముఖ్యంగా :

**ఒగ్గు :**

బీరన్నలు లేదా ఒగ్గువారి ప్రధాన వాద్యం ఇది. ఒగ్గువారు కురుమలను ఆశ్రయించి జీవిస్తారు. ఒగ్గు అనగ శివుని చేతిలో డమరుకం. బీరన్నలు తప్ప ఈ వాద్యాన్ని ఇతరులెవ్వరూ వాయించరు. ఒగ్గు కథలో ఉపయోగించే డప్పును 'కనుప డప్పు' అందురు. ఒగ్గుడోలు ఒక మీటరు పొడువుగా, గుండ్రంగా వుండి ఇత్తడితో చేయబడును. పూర్వం చెక్కతో చేసేవారు. దీనికి రెండు వైపులా మేక చర్మాన్ని అంటించి తాళ్ళతో బిగిస్తారు. ప్రదర్శన సమయాల్లో ఈ తాళ్ళను గట్టిగా లాగి కడతారు. దీని వల్ల ఇంపైన ధ్వని వస్తుంది. జిల్లేడు లేదా సీతాఫలం కర్రముక్కలను ఈ డోలును వాయించడానికి వాడతాడు. ఈ ఒగ్గువాద్యంతో ప్రధానంగా మల్లికార్జుని కథ, సాంబుని కథ, వీరభద్రుని కథలను గానం చేస్తూ ప్రజలకు చారిత్రక విషయాలను భావాలకు అనుగుణంగా చెబుతారు. అంతే గాకుండా కురుమల వివాహ సమయాల్లో, నాగవల్లి పటం ఎక్కేటప్పుడు దీనిని ఉపయోగిస్తారు. ఈ ఒగ్గు డోలు "ఢిళ్ళం-భళ్ళం, ధిళ్ళం-భళ్ళం, ధిళ్ళం-భళ్ళం' అనే విచిత్రమైన ధ్వనినిస్తూ జానపదులను ఉల్లాస పరుస్తుంది. జానపద సంస్కృతిని పరిరక్షిస్తూ ప్రత్యేకంగా కురుమల వివాహాల్లో ఈ వాద్యం నేటికి తన ప్రత్యేకతను చాటుకుంటోంది.

**బుడిగె, తాంబూర :**

ఈ వాద్యాన్ని జంగాలు ఉపయోగిస్తారు. 'బుడిగె' అనే వాద్యాన్ని ఉపయోగించడం వల్ల వీరికి 'బుడిగె జంగాల'ని పేరు వచ్చింది. వీరు శైవులు. వీరు జంగం కథలు, రామాయణ, మహాభారత కథలు చెబుతూ జీవిస్తారు. 'బుడిగె' అంటే కూజా లాంటి మట్టి బుడ్డికి ఒక వైపు చర్మం వుంటుంది. దీనినే 'డింకీ' లేదా 'గుమ్మెట' అని కూడా పిలుస్తారు. జంగం కథలను చెప్పేటప్పుడు వీరు బుడిగెతో పాటు రెండు రకాల తాంబూరాలను ఉప యోగిస్తారు. అవి 1) బుడిగె తాంబుర, 2) పడిగె తాంబూర. బుడిగె తాంబూర కింది భాగాన గల గుమ్మి అర్థ వృత్తాకారంలో కొంచెం చిన్నదిగా ఉంటుంది. పడిగె తాంబూర గుమ్మి అర్థ వృత్తాకారంలో కొంచెం పెద్దదిగా ఉంటుంది. దీనిలో తీగెలు సవరించే మెట్ల వైపు నాగుపాము పడగలా వుంటుంది. జంగం కథలో ఒక ప్రధాన కథకుడు, ఇద్దరు వంతలు ఉంటారు. కుడి చేతితో తంబూర మీటుతూ, ఎడమ చేతితో అందెలు వాయిస్తూ గంతులు వేస్తూ మహెూద్రేకంతో వీరు రామాయణ, భారత కథలు చెబుతారు. ఇతనికి ఇరు ప్రక్కలా ఉండే వంతలు గుమ్మెటలతో 'ధణధణ' మోగిస్తూ ఉంటారు. ఇలా ఈ బుడిగె, తాంబూరలతో

రామాయణ, మహాభారత కథలను కళ్ళకు కట్టినట్లు చెబుతూ ఇతిహాసాలను జానపదులకు గుర్తుచేస్తూ వీరు జానపద సాహిత్య పరిరక్షణలో తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారు.

**ఉరుములు :**

దీనిని వాయించేవారు 'ఉరమలోల్లు'. వీరు మాల కులంలో ఒక తెగవారు. దీనిని అనంతపురం జిల్లాల్లో గ్రామ దేవతల మేలు కొల్పుల సమయంలో వాయిస్తారు. శైవ సాంప్రదాయాల్లో శివస్థుతికి పుట్టినదే ఈ వాద్యం. దీనికి కంచు లేదా ఇత్తడితో గుండ్రంగా ఒకటిన్నర అడుగుల వ్యాసార్ధంతో రెండున్న అడుగుల పొడవుగాను తయారు చేసిన మద్దెల లాంటి గొట్టానికి రెండు వైపులా మేక చర్మంతో మూత వేస్తారు. ఎడమ ప్రక్క చర్మానికి మధ్యభాగంలో ఉండేలా నల్లరంగు పూస్తారు. ఈ నల్లచార రెండు అంచుల వరకూ ఉంటుంది. రెండు వైపుల చర్మాలను బిగించేటప్పుడు రెండు ఇనుప కడియాలు వేస్తారు. ఈ రెంటిని తాళ్ళతో ఉరుము పైభాగాన బిగిస్తారు. ఈ తాళ్ళ బిగింపు వల్ల చర్మాలకు మంచి బిగింపు వస్తుంది. ఎడమ చర్మం పై ఎడమ చేతిలోని పుల్లతో కిందికి పైకి రాస్తారు. అదే సమయంలో కుడిచేతిలోని పుల్లతో లయకు అనుగుణంగా కొడతారు. ఈ పుల్లలు రెండు కుదురు పుల్లలు. ఎదురు చేతిలోని పుల్లకు గుడ్డ పేలికలు గాని, పల్చని వత్తిలాంటితోగాని కడతారు. కుడిచేతి పుల్ల మామూలుగానే ఉంటుంది. ఎడమ వైపున చర్మంపై 'బూర్, బూర్, బూర్' మనే శబ్దాన్ని విరామం లేకుండా చేస్తుంది. కుడిచేతి పుల్లతో లయకు అనుగుణంగా కొట్టడం వలన 'డుబ్, డుబ్, డుబ్' అనే శబ్దం వస్తుంది. మేలుకొలుపులు పూజారి పాడుతుండగా ఉరుములు వాయిస్తారు. మేలుకొల్పుల పరాకాష్టకు ఉరుముల శబ్దమే మూలం. అంటే ఉరుముల ధ్వనిలో ఎన్నో భేదాలు సృష్టిస్తూ, కేకలు వేస్తూ 'ఏయ్, ఓ, ఓహో, ఆహా, పరాకు, పరాకు' లాంటి శబ్దాలతో వీరావేశం చేస్తూ పూజారికి పూనకం తెప్పిస్తూ అక్కడ ఉన్నవాళ్ళని మంత్రముగ్ధుల్ని చేస్తారు. ఇలా ఈ ఉరుము వాద్యం విలక్షణ ధ్వనులతో గ్రామ దేవతల మేలు కొలుపుల సమయంలో కీలక పాత్ర పోషిస్తూ గ్రామ ప్రజలను ఆనందపరుస్తోంది.

**జమిడిక :**

తెలంగాణాలో వృత్తిగాయకులుగా పేరుగాంచిన 'బవనీల' ప్రధాన వాద్యం . జానపద గేయ ప్రచారకులలో బవనీలకు విశిష్ట స్థానం ఉంది. వీరు కథలను చెప్పడంలో నేర్పరులు. ఈ జమిడికను ఎల్లమ్మ, అంకమ్మ మొదలగు గ్రామ దేవతల కథలు చెప్పేటప్పుడు, పెండ్లిండ్లు చేసేటప్పుడు, గ్రామ దేవతల కొల్పులు కొలిచేటప్పుడు వాడతారు. మాత పురాణం 'సాటైన జమిడికలు సంకన నిడుకొని కూర్మి వాయించగా కుంభినియదర' అని జమిడికను గూర్చి పేర్కొంది. చర్మ వాద్యాలైన రుంజ, మృదంగం, తబలా, డోలు, మద్దెల, ఢమరుకం, ఇలా వీటన్నిటికంటే కూడా ప్రత్యేకమైందీ వాద్యం . ఒక తంత్రి, ఒక చర్మం రెండు కలిసి వున్న వాద్యం జమిడిక. దీనిలో రెండు రకాల ధ్వనులు వెలువడుచున్నవి. అవి 1) ఒకటి చర్మం మీద ధ్వని, 2) తంత్రి మీది ధ్వని. ఇలా ప్రత్యేక లక్షణాలతో భారతీయ వాద్యాలలోని ఈ వాద్యం విలక్షణతను సంతరించుకుంది. జమిడిక ఆకారం గురించి చెప్పాలంటే ఒక చిన్న డ్రమ్ములా బకెట్టును పోలి వుంటుంది. రెండు వైపులా రంధ్రాలు వుంటాయి. ఒకవైపు మూయబడి, ఒకవైపు తెరుబడి వుంటుంది. దీనిని కంచుతోగాని, వెుగిలి కర్రతోగాని, టేకు, మద్ది కర్రలతోగాని తయారుచేస్తారు. కాని వాడుకలో ఎక్కువగా కంచువే వాడతారు. మూయబడిన వెలుపలి భాగానికి మధ్యలో ఒక చిన్న రంధ్రం చేసి ఒక గుండ్రని ఆకారం గల చిన్న బొడ్డును ఆ రంధ్రం పెట్టిన దగ్గర అంటు పెట్టి ఆ బొడ్డులో నుండి నరముగాని, మెలివేసిన దారంగాని ఒక అడుగు పొడవు కర్రకు కట్టి జమిడిక లోపలి భాగములోని కర్రను ఎడమ చేతితో పట్టుకొని ఆడిస్తూ, కుడిచేతి చూపుడు వేలు, కుడిచేతి ముద్రవేలు ఈ రెండు వేళ్లతో కలిపి మీటుతారు. వెంటనే గంభీర,

ఆవేశ ప్రేరకాలైన ధ్వనులు వినిపిస్తాయి. జమిడికను మీటినప్పుడు 'జుంకు జుం...జుం...జుం...' లాంటి శబ్దం వస్తుంది. ఇలా ఈ జమిడిక నేడు ఆకాశవాణి కేంద్రాలలో కథల రూపంలో, గ్రామ దేవతల జాతరలలో, సినిమా పాటలలో అందరినీ ఆనందపరుస్తూ జానపద సాంస్కృతిక ధ్వనులలో తన ప్రత్యేకతను నేటికీ చాటుకుంటోంది.

**డప్పు :**

ఇది 'హరిజనుల' సాంప్రదాయ వాద్యం. ఈ డప్పుతో 32 కళల్ని పలికించవచ్చు. డప్పుకు గుండ్రాకారంగా కుదురును తయారుచేసి దూడ చర్మంతో ఒక ప్రక్క మూసివేస్తారు. ఈ కుదురును మాష్టివాళ్ళు తయారు చేస్తారు. పాలిక, రేలకట్టెలతో ఈ కుదురు తయారగును. డప్పు వాయించడానికి చిర్రా, చిటికెనపుల్ల అవసరం. చిర్రాను కుడి చేతితో, చిటికెన పుల్లను ఎడమ చేతితో పట్టుకొని, ఎడమ చేతిని కదపకుండా డప్పుకు ఆనించి, చిర్రాతో డప్పును తాడిస్తే దరువు వేస్తుంది. అంటే చిర్రా, చిటికెన పుల్ల కలిస్తేనే దరువు వచ్చును. బ్యాండు మేళాలు వచ్చి డప్పు వినియోగం తగ్గిపోయినా నేటికీ ఈ డప్పు పల్లెటూళ్లల్లో గ్రామ కార్యక్రమాలు తెలపడానికి, ప్రభుత్వ ఉత్తర్వులు తెలియజేయడానికి, గ్రామాలలోనికి కూరగాయలుగాని, ఇతర వస్తువులుగాని అమ్మే వర్తకులు ఈ డప్పు ద్వారానే దండోరా వేస్తున్నారు. సినిమా పాటల్లో జానపద బాణీలకు, పెళ్ళిళ్లు, గ్రామదేవతల జాతరలు, కొలుపులు ఇలా శుభ, అశుభ కార్యాలలో నేటికీ ఈ డప్పు అందరినీ ఆనందపరుస్తూనే ఉంది.

**రుంజ :**

'రుంజ' అనే జాతివారు ఈ వాద్యాన్ని వాయిస్తారు. వీరు విశ్వబ్రాహ్మణులను ఆశ్రయించి జీవిస్తారు. 'రుంజ' అనే వాద్యానికి 'రౌంజ' అనే పేరు కూడా కలదు. సుమారు 12 అంగుళాల నిలువుటెత్తు కలది. ఇత్తడితో తయారుచేయబడినది. దీనిని కర్ర పుల్లలతో వాయించెదరు. కొంచెం ఏటవాలుగా ముందుకు వంచి పడిపోకుండా కాలితో అదిమిపట్టి మోకాలిని ఆనించి, పట్టు కుదరగానే మొదట చేతులతో శృతి చేసి, తాళములను వేస్తారు. రుంజ వాద్యంతో వీరు మూల స్థంభం, పంచముఖ ఆవిర్భావం, పార్వతీ కళ్యాణం లాంటి కథలను చెబుతూ జానపదులను ఉత్తేజ పరుస్తున్నారు.

**పంపజోడు :**

దీనిని 'పంబల వారు వాడతారు. వీరు అయ్యగారి దర్శనానికి చెందిన హరిజనులు. వీరు ఎక్కువగా అంకమ్మ కథలను చెబుతారు. వంతలు పంపజోడును వాయినస్తూ తిత్తి వడుతూ ఉంటే కథకుడు రాజకుమారునిలాగా వేషాన్ని ధరించి కుడి చేతితో పెద్ద కత్తి, ఎడమ చేతితో 'జమజాల' అనే చిన్న కత్తిని పట్టుకొని వీరావేశంతో చిందులు తొక్కుతూ అంకమ్మ గుణకీర్తనం చేస్తూ గ్రామ దేవతల సేవలో నిమగ్నమవుతున్నారు.

ఇలా ఈ జానపద వాద్యాలు జానపదులకు శుభ, అశుభ కార్యాలలో వీనులవిందును కల్గిస్తూ సాంస్కృతిక ధ్వనుల రూపంలో జానపద సాహిత్యాన్ని పరిరక్షిస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు :**

1. Folk Performing Arts - M. Nagabhushana Sharma.
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్వీ.యస్. సుందరం.
3.. జానపద విజ్ఞానంలో 'బవనీలు' - ఒక పరిశీలన - చింతల యాదయ్య.

# గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ అవధాన ప్రతిభ

– డా॥. బోయినేపల్లి ప్రభాకర్, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (స్వ), నిజామాబాద్, తెలంగాణ.

గతించి ఏళ్ళు గడుస్తున్నా ఎవరి జ్ఞాపక పరిమళాలు తమ పద్య సమీరాలతో పదిలంగా వాఙ్మయ మిత్రులందరినీ సుతి మెత్తగా స్పృశిస్తున్నాయంటే ఆ వ్యక్తి హృదయం అమృతతుల్యమై ఉంటుందనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

"జయన్తితే సుకృతినో రససిద్ధా: కవీశ్వరా : ।
నాస్తి తేషాం యశ: కాయే జరామరణజం భయమ్॥"

అని భర్తృహరి సుభాషితం అచ్చంగా సరిపోయే కవి పండితాగ్రేసరులు, నిరంతర అక్షరోపాసకులు, ఆధ్యాత్మిక చింతనాపరులు, ఆదర్శ ఉపాధ్యాయులు - అవధాన శశాంక, ఆశు కవితా కేసరి బిరుదాంకితులు కీర్తి శేషులు బ్రహ్మశ్రీ గుమ్మన్న గారి లక్ష్మీనర్సింహశర్మ.

"అద్భుతమైన ధార, పరమాద్భుత ధారణ, ప్రౌఢ భావ సం
పద్భవ పద్యపూరణ, స్వభావ మనోహరమైన శైలి, వి
ద్వద్భిషగాత్మ తృప్తి బహుదా కయిసేయు సమాసధాటి, దీ
వ్యద్భవనమ్ము కట్టితివి వాణికి, గుమ్మన్న శర్మ సత్కవీ"

అని గరికపాటి నరసింహారావు గారిచే కావించబడిన గుమ్మన్నగారి అవధాన హృదయావిష్కరణం ప్రత్యక్షర సత్యం. గుమ్మన్న గారి శర్మ నిరంతరం పరిమళించే పద్యపారిజాతం. "ప్రతిభావంతుడైన కవి" అని సి. నారాయణరెడ్డి గారిచే; 'విశిష్ట వ్యక్తిగా ప్రస్తావించబడి ఆధ్యాత్మిక, సాహిత్య సేవలో గుమ్మన్న గారు ఆదర్శప్రాయులని' డా॥ శివానందమూర్తి గారిచే; 'గుమ్మన్న గారి అవధానాలు నాదబ్రహ్మోపాసనతో సాటి అని పేర్కొంటూ వారి కావ్యాలు శబ్ద బ్రహ్మలుగా, చేతలు సుకృతులుగా, మొత్తం మీద వారు అజరామరులు' అని శ్రీ గురుమదనానంద సరస్వతీ పీఠం వారిచే; 'ఎందరో ప్రఖ్యాతులైన అవధానుల అవధాన కార్యక్రమాలు చూచినాను. ఎవరి గొప్ప వారిదే. నన్ను బాగా రంజింపజేసిన అవధానం మాత్రం గుమ్మన్న గారు చేసినదే' అని డా॥ సామల సదాశివ గారిచే - ప్రశంసలను పొందిన మహామనీషి గుమ్మన్న గారి లక్ష్మీ నరసింహ శర్మ.

1934 సంవత్సరంలో మెదక్ జిల్లా దుబ్బాక మండలం పోతారెడ్డిపేట గ్రామంలో అన్నపూర్ణ, రాధాకృష్ణయ్య పుణ్య దంపతులకు గుమ్మన్నగారి లక్ష్మీ నరసింహ శర్మ జన్మించారు. వారిది పౌరోహిత్య - యాజ్ఞిక వృత్తుల్లో బాగా పేరు తెచ్చుకున్న కుటుంబం. వారి తండ్రి మెదక్ జిల్లా మొత్తంలో ఉత్తమ యాజ్ఞికుల్లో ఒకరుగా గుర్తింపు పొందారు.

సమకాలీన తెలంగాణ సంస్కృతిలో భాగమైన ఖానిగీ పాఠశాలల్లోని కంచయ్య పంతులు వీధి బడిలో తొలుత ఉర్దూను, కొన్ని శతకాలను నేర్చుకున్నారు. ఆ తర్వాత పోతారెడ్డిపేట, భిక్కనూరు, బీబీపేట, సిద్ధిపేట ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. రామాయంపేటలో ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేశారు. గుమ్మన్న గారికి పాఠశాల దశలోనే పైడిమర్రి లక్ష్మీ నారాయణ శాస్త్రి శిక్షణలో తెలుగు, సంస్కృత భాషా సాహిత్యాల్లో మంచి పునాది ఏర్పడింది. అక్కడి ఉపాధ్యాయుల ప్రేరణతోనే గుమ్మన్న గారిలో కవిత్వ బీజాలు పడ్డాయని చెప్పవచ్చు. హెచ్‌యస్‌సి పూర్తి అయిన వెంటనే గుమ్మన్న గారికి వివాహం జరిగింది. ఆ సమయంలో కొంతకాలం పాటు ఊళ్ళో పౌరోహిత్యం మరియు వ్యవసాయం చేశారు. గుమ్మన్న గారు చాదర్ ఘాట్ కళాశాలలో ఇంటర్మీడియట్ (ఎఫ్.ఏ) చదివారు. కాని కుటుంబ సమస్యల కారణంగా దాన్ని పూర్తిచేయలేక పోయారు. ఆ కళాశాలలో తెలుగు అధ్యాపకులు పల్లా దుర్గయ్య, వేటూరి ఆనందమూర్తి, ఇరివెంటి కృష్ణమూర్తి గార్ల బోధనలతో గుమ్మన్న గారికి

తెలుగు భాషా సాహిత్యాలపై మంచిపట్టు కుదిరింది. పల్లా దుర్గయ్య నిర్వహించే సాహిత్య కార్యక్రమాల్లో హాజరైన దాశరథి కృష్ణమాచార్యులు, వట్టికోట ఆళ్వారు స్వామి, బిరుదరాజు రామరాజు, బూర్గుల రంగనాధరావు లాంటి సాహితీవేత్తల సమక్షంలో గుమ్మన్న గారికి పద్యాలు చదివే అవకాశం లభించడం - దాన్ని సద్వినియోగ పరుచుకోవడం రాబోయే కాలంలో గుమ్మన్న గారి రస హృదయావిష్కరణ - అవధాన నిర్వహణకు నేపథ్యంగా చెప్పుకోవచ్చు.

1965 సంవత్సరంలో డి.ఓ.ఎల్ పూర్తిచేసిన తర్వాత గుమ్మన్న గారు ఉస్మానియా యూనివర్సిటీ నుండి బి.ఓ.యల్ పట్టా పొందారు. డిగ్రీ పాసైన వెంటనే పండిట్ ట్రైనింగ్ కోసం వరంగల్ చేరిన గుమ్మన్న గారికి అక్కడ మంచి కవిత్వ వాతావరణం లభించింది. అక్కడే తనకు కవిత్వజ్ఞానాభివృద్ధి కలిగిందని కూడా చెప్పేవారు. ఆ శిక్షణ కాలంలోనే గుమ్మన్న గారు తనలోని కవిని - తన తొలి కావ్యమైన 'కవితా కళ్యాణి'ని ఆవిష్కరించుకున్నారు. ఆ తర్వాత కాలంలో అవధాన సరస్వతి, వాగీశ్వర స్తుతి, ఆద్యమాతృక, పద్యోద్యానం మొత్తం ఐదు కావ్యాలను వెలువరించారు. అక్కడ జరిగిన కవి సమ్మేళనాల్లో పరిచయమైన కాళోజీ నారాయణరావు, పేర్వారం జగన్నాథం లాంటి కవుల సమక్షంలో గుమ్మన్నగారి పద్య రాగాలాపన గంధర్వ గానమే అయ్యింది.

1960వ దశకంలో గుమ్మన్నగారు దుబ్బాక ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయ ఉద్యోగ జీవితాన్ని ఆరంభించి మిరుదొడ్డి, చిన్నకోడూరు, గజ్వేల్, రామాయంపేట, బూరుగుపల్లి, దొంగల ధర్మారం, నిజాంపేట పాఠశాలల్లో పనిచేసి చివరగా పోతారెడ్డిపేటలో 1994లో పదవి విరమణ చేశారు. నిజాంపేట పాఠశాలలో పని చేస్తున్న కాలంలో 1985లో జిల్లా స్థాయిలో, 1986లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవ్వడం వారి విలువలతో కూడిన బోధన వృత్తికి లభించిన జీవన సాఫల్య పురస్కారాలుగా గుర్తించవచ్చు.

గౌరీభట్ల రామకృష్ణశాస్త్రి గుమ్మన్నగారికి అవధాన గురువు. వారు గొప్ప కవి పండితులు. 'ఏకవీర కుమారీయం' కావ్యకర్త కూడా. వారిని గుమ్మన్నగారు పితృ సమానులుగా గౌరవించేవారు. 1956లో గుర్వాజ్ఞతో వెంకట్రావుపేటలో వేణుగోపాలస్వామి ఆలయంలో గుమ్మన్నగారు తన మొట్టమొదటి అవధాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

పరాశరం గోపాలకృష్ణమూర్తి పండితుడు గుమ్మన్న గారికి రెండవ అవధాన గురువు. వీరితో గుమ్మన్న గారికి యాభై ఏళ్ళ ఆత్మీయ అనుబంధం ఉంది. వీరి సాహచర్యం వల్ల గుమ్మన్న గారికి ప్రాచీన సాహిత్యాన్ని లోనారసి చూసే అవకాశమేర్పడింది. అలాగే ప్రారంభదశలో ఉన్న వారి అవధాన విద్య వికాసదశకు చేరుకునేలా తోడ్పడింది. అవధాని గారి సాహిత్య జీవితంపై వీరి ప్రభావం ఎంతో ఉంది. వీరిని భగవంతుని ప్రసాదంగా లభించిన గురువుగా భావించేవారు.

దోర్బల విశ్వనాథ శర్మ గుమ్మన్న గారికి మూడవ అవధాన గురువు. సాత్వికత, దైవభక్తి, కవిత్వ శక్తి మొదలైన లక్షణాలతో కూడిన వ్యక్తిత్వం ఈ గురు శిష్యులిద్దరినీ దగ్గరకు చేర్చింది. అవధానాలు చేయాలనే గుమ్మన్న గారి సంకల్పాన్ని గ్రహించిన దోర్బల గారు 1956 వేసవి సెలవుల్లో రామాయంపేటలోని నగరేశ్వర దేవాలయంలో తన అధ్యక్షతన శిష్యునిచేత చతురావధానాన్ని (నిషిద్ధాక్షరి, దత్తపది, సమస్యా పూరణం, వ్యస్తాక్షరి) చేయించారు. ఆ తర్వాత గుమ్మన్న గారు ఇక వెనుదిరిగి చూడలేదు సరికదా సుమారు 350 అవధానాలను దిగ్విజయంగా నిర్వహించారు.

"చదువన్ లేదొక కావ్యమైనను మదుత్సాహమ్మెయొ; గాన స
న్మద వెలుందింపగ నేర్తునో? ఇచట లేనో? ఏది యెట్లైనా న
య్యది శ్రీశ్రీ పరమేశ్వరీ కృపయె ఔనంచున్ మనమ్మందు నిం
చెదనో సర్వసదస్సులారా! విజయశ్రీ యౌత్! ఎల్లప్పుడున్"

అనేది గుమ్మన్నగారి ప్రారంభ అవధానంలో ఎంతో వినమ్రంగా తనను గురించి వ్యక్తీకరించుకున్న పద్యం. ఆ తర్వాత విజయవంతంగా 350కి పైగా అవధానాలను నిర్వహించి సాధించిన కీర్తి కూడా పురాకృత సుకృతంగా వచ్చిందేనని అంతే వినమ్రంగా చెప్పగలిగారు.

తెలుగు కవి పండితులు తెలుగు సారస్వతాన్ని సుసంపన్నం చేయడానికి కవిత్వాన్ని ఛందస్సుతో సమ్మేళనం చేసి పద్యాన్ని ఆవిష్కరించుకున్నారు. అలాగే ఏకాగ్ర దృఢ చిత్తానికి తార్కాణంగా తెలుగు సారస్వతో పాసకులు పద్యాన్ని, ఆశుధారను కలిపి అవధానాన్ని ఆవిష్కరించుకున్నారు. అవధానం తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట ప్రక్రియ. తెలుగు, సంస్కృతం కాకుండా వేరే ఏ భాషలోనూ ఈ ప్రక్రియ ఉన్నట్లుగా కనిపించదు. క్లిష్టమైన సాహితీ సమస్యలను అలవోకగా పరిష్కరిస్తూ, చమత్కార పూరణలను అవలీలగా పూరిస్తూ, అసంబద్ధ అసందర్భ ప్రశ్నలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ ఆశువుగా పద్యాలు చెప్తూ - వీటన్నిటినీ ఏకకాలంలో అవధాని చేసే సాహితీ విన్యాసమే 'అవధానం'.

**వస్తుత :**

కవి అయిన గుమ్మన్నగారి అవధానాలు నిరంతరం గుబాళించడానికి ప్రధాన కారణం - వారి అనితర పద్య సాధనేయని చెప్పుకోవాల్సి ఉంటుంది. వారి అవధానాల్లో ప్రారంభంలో వాగీశ్వరీ స్తుతి ఒక ప్రత్యేకాంశంగా భాసిల్లుతుంది. సిద్దిపేటలో స్వభాను సంవత్సరములో నిర్వహించిన అవధానంలో ...

'శ్రీమద్వాఙ్మయ సంప్రదాయక జయశ్రీరాజదష్టావధా
నామోదార్హసభ 'స్వభాను' సుషమా ప్రాంచద్ద్యుతిన్ సిద్ధిపూ
స్సామర్థంబు వెలుంగ 'వేంకటగిరీశ' స్వచ్ఛ పాదార్చనా
ప్రామాణ్యంబున నిల్తునన్ననుమతింపన్ రమ్ము వాగీశ్వరీ'

అని చేసిన స్తుతిలో స్థలకాలాదులను తెలియజేస్తూ, హాజరైన సహృదయులను అవధాన సరస్వతీ సేవకు సంసిద్ధుల్ని చేయడం కనిపిస్తుంది.

'పరమానంద కరంపు, టక్కర జగద్వ్యాపార మహాసము
త్కర సౌందర్య రమా సమావృత, ప్రబంధ ప్రస్ఫురత్ సత్ సుధా
కరమై, సభ్యజన ప్రభాకరము కాగా పృచ్ఛకుల్ మెచ్చ పం
డరనాథా ధృతి నిల్తు, నీ పలుకుటానన్ బూని వాగీశ్వరీ'

అనే స్తుతిలో అవధాని... సరస్వతీదేవి పలుకులను ఆజ్ఞగా శిరసావహించి, పండరినాథున్ని తలచుకొని... పరమానందకరమైన అక్షరవిన్యాసమనే అవధాన అర్చనను చల్లని చంద్రుని వెన్నెల పరచుకున్నట్లుగా, రసవంతమైన కాంతివంతమైన పద్యాలతో... సహృదయ పృచ్ఛకులు మెచ్చుకొనే రీతిలో సభ ప్రకాశించేలా నిర్వహించడానికి శక్తిని, ధైర్యాన్నివ్వమనడం కనిపిస్తుంది. ఇక్కడ గుమ్మన్న గారి అవధాన కార్యక్రమాన్ని ఆత్మీయ సహృదయ సమ్మేళనంగా భావించవచ్చు. ఆయన రసగుళికల్లాంటి పద్యాల ద్వారా చల్లని చంద్రికను పరచి తద్వారా అవధాన సభను ప్రకాశింపజేస్తారు.

అవధానంలో ప్రేక్షక శ్రోతల్ని ఆశ్చర్యచకితుల్ని చేసే విభాగం 'సమస్యాపూరణం'. పృచ్ఛకుడు లోకవిరుద్ధంగా ఉన్న విషయాన్ని సమస్యగా చేసి ఒక పద్యపాదాన్ని ఇస్తాడు. అవధాని తనకిచ్చిన పద్యపాదంలోని లోక విరుద్ధభావాల్ని పదగతంగానో, అర్థగతంగానో విరిచి చమత్కారయుక్తంగా, మహెూత్తరంగా లోకామోదమైన భావంతో పాదాన్ని పూరించాల్సి ఉంటుంది.

9 జూలై 1994 సంవత్సరంలో గంభీరావుపేటలో జరిగిన అవధానంలో గుమ్మన్న గారికి జి.కృష్ణమూర్తి గారు 'కపిని వివాహమాడినది గౌరి జగజ్జనమెల్ల మెచ్చగన్' అని సమస్య ఇచ్చారు. దాన్ని అవధాని ఎంత సద్య: స్ఫూర్తితో పూర్తి చేశారో చూడండి.

'అవరిమితానురక్తి వరమార్థము నెన్న శివాద్వయంబగున్,

సుపరిచిత శృతి స్మృతి విశుద్ధము - పంచముఖ ప్రసిద్ధతా
నుపమిత రీతి లోతుగ గనుంగొన, భావ్యతార మూర్తుమత్
కపిని; వివాహమాడినది గౌరి జగజ్జనమెల్ల మెచ్చగన్'

ఆంజనేయుడు రుద్రాంశసంభూతుడనడాన్ని బట్టి శివున్ని 'భావ్యతార మూర్తిమత్ కపి'గా వర్ణించి చమత్కార ఉక్తితో పూరించి గుమ్మన్నగారు సదస్యులను ఆశ్చర్యచకితుల్ని గావించారు.

31 జనవరి 1960వ సంవత్సరంలో సిద్దిపేటలో జరిగిన అవధానంలో గుమ్మన్న గారికి 'చీరను పురుషుడు దాల్చె నీ గ్గామనుచున్' అని సమస్య ఇచ్చారు. దాన్ని అవధాని...

'పారాసౌర విచక్షణ
లేరంజుగాను భరతనృత్యమునన్ శ్రీ
నారద వేషము వేయగ
చీరను పురుషుడు దాల్చె నీగ్గామనుచున్'

అని శాస్త్రీయ నృత్యంలో పురుషులైనా పట్టు పీతాంబరాలను ధరించేటువంటి ఆహార్య సంప్రదాయాన్ని సద్య: స్ఫురణతో చాకచక్యంగా పూరించి సభాసదులందరినీ ఆనంద కడలిలో ముంచెత్తారు. అలాగే లలితకళలపట్ల అవధాని సునిశిత దృష్టి ఇక్కడ సుస్పష్టం.

'ముండ ముఖాన కుంకుమయు, పూలు శిరమ్మున పెట్టిరయ్యెడన్' అనే మరో సమస్యను కేవలం ఒక అక్షరాన్ని జోడించడం ద్వారా ఎంత యుక్తితో పరిష్కరించారో చూద్దాం...

'పండితవర్య! మోదమొదవన్ వినుమోయి! ఒక పూట దేవతా
మండలి గుంపు గుంపులుగా మంజు శరన్నవరాత్రి వేళ బ్ర
హ్మాండము సుస్థితిన్ గనుటకై చని పూజలు సల్పి సల్పి చా
ముండ ముఖాన కుంకుమయు పూలు శిరమ్మున పెట్టి రయ్యెడన్'

'ముండ' అనే పదానికి 'చా' జోడించడంతో 'చాముండ' అనే దేవతా రూపాన్ని సంతరించుకొని ప్రకాశించింది. ఇది గుమ్మన్నగారి పాండిత్య ప్రతిభకు తార్కాణం.

'రాముడు పార్వతీ సతిని రంజిల్లజేసెను కౌగిలింతలన్' అనే సమస్యను రసబద్ధంగా ఎంత సద్య: స్ఫూర్తితో పూరించారో చూడండి.

'స్వామి! ఇదేమి? పాములు వెసన్ బుసకొట్ట విసంపు కంపురా
దా? మెయి బూది బూయ సరదా? అను శైలజకున్ శివుండు నే
సోముడ నౌట నోటువడసూ! అని నవ్విన చంద్రమ: కళా
రాముడు పార్వతీ సతిని రంజిలజేసెను కౌగిలింతలన్'

స్వామీ! ఈ పాముల విషాన్ని, బూడిదను ఎలా భరిస్తున్నారు అని హిమవంతుని కుమార్తె పార్వతి అడగగా... నేను సోమున్ని కాబట్టి భరించగలుగుతున్నానని శివుడు సమాధానం చెప్పాడట! సోముడు అంటే చంద్రుడు స్ఫురిస్తాడు. కాని ఇక్కడ 'స+ఉమ' - ఉమా సహితుడు - శివుడు అనే అర్థంలో గుమ్మన్నగారు వాడి, పార్వతి వంటి భార్య తోడుగా ఉంటే ఎలాంటి విషమైనా, బూడిదైనా భరించవచ్చని శివుడన్నాడని అంతరార్థం. రామున్ని - 'చంద్రమ: కళా రాముని'గా మార్చి గుమ్మన్న గారు ఎంతో సరసంగా సమస్యా పూరణం కావించారు.

'సీతను బెండ్లాడి శివుడు శిశువున్ గనియెన్' అనే మరొక సమస్యను కేవలం రెండక్షరాలు జోడించి కంద పద్యంలో ఎంత యుక్తితో పరిష్కరించారో చూద్దాం.

'చైతన్యానంద సుధా
స్రోతస్విని జాలువారు చొప్పున సుమన:
ప్రీతిగ హిమవత్సుత, నత
సీతను బెండ్లాడె శివుడు శిశువున్ గనియెన్'

'సీతను' పదానికి 'అత' జోడించడంతో 'అతసీతనువు' అయింది. అంటే అతసీ పుష్పం వలె కోమలకాంతి కల్గిన శరీరం కల్గినదని అర్థం. ఇదీ గుమ్మన్నగారి పాండిత్య ప్రతిభ. సమస్యా పూరణాల్లోనే కాక 'దత్తపది' పూరణాల్లో కూడా గుమ్మన్నగారిది ప్రత్యేక ప్రశంసార్హ ప్రతిభ.

గణ, గుణ, రణ, ఋణ అనే పదాలతో రామాయణ పరంగా వర్ణించమని 25 జనవరి 1987వ సంవత్సరంలో నిజామాబాద్‌లో జరిగిన అవధాన కార్యక్రమంలో నారాయణాచార్యులు గుమ్మన్నగారిని కోరగా..

"గణ గణ మోయు గంటయనగా వినిపించెడు రామగాథ, భూ
గుణవతి జాత సీత కథ, క్రొవ్విరి బాటల పీట దీర్చం, ప్రే
రణమున సౌఖ్య కష్టముల రాశి జనమ్ముకౌనటంచనన్
ఋణముల నీగి రాకసి నరేశులు రావణు సంహరించుటన్"

అని వృత్యనుప్రాన అలంకారంలో ఎంతో చమత్కారంగా వర్ణించారు.

నల్లవాగు గురుకుల పాఠశాలలో జరిగిన అవధానంలో ఒక పృచ్ఛకుడు రండ, బండ, ముండ, కొండ అనే పదాలతో శ్రీరామ కళ్యాణాన్ని వర్ణించమనగా గుమ్మన్న గారు...

"రండఖిలార్ష సంస్కృతి పరంపరులార! కనంగ పున్నె పుం
బండవు రాము పెండ్లిగనవచ్చును, సీతకు దగ్గవాడు రా
ముండనవచ్చు, సీత వలపున్ తలపున్ తెలియంగ వచ్చు మే
ల్కొండనవచ్చు అచ్చపు వెలుంగు నిలంగన వచ్చు నిచ్చయిన్"

అని అశ్లీలత ధ్వనించే పదాలను మంచి అర్థంలోకి వచ్చే విధంగా సరసంగా విరిచి మార్చి మంగళకరంగా ముగించారు. 'రండ' పదాన్ని రండు + అఖిలార్ష అని, 'బండ' పదాన్ని పున్నెపున్ + పండు + అవు అని, 'ముండ' పదాన్ని రాముండు + అనవచ్చు అని, 'కొండ' పదాన్ని మేల్కొండు + అనవచ్చు అని పదాలను విరుస్తూ రసవంతమైన వర్ణన చేసిన గుమ్మన్నగారు ప్రతిభావంతులైన కవి.

అవధానంలో 'నిషిద్ధాక్షరి' పాండిత్య పరీక్షా విభాగం. పృచ్ఛకుడు కూడా అవధానితో సమానంగా ఉంటే తప్ప కార్యక్రమం రంజిల్లదు.

మహాదేవ శ్రీనివాసరావు అనే పృచ్ఛకుడు యోగీశ్వరుడైన శ్రీకృష్ణున్ని నిషిద్ధాక్షరిలో బంధించమనగా గుమ్మన్నగారు..

'గీతా గుంజత్ ధీకున్
శ్రీ తత్త్వున్ గొల్తు యుగ్గరిష్ఠున్ గురునిన్
భీతి మదర్జును నేలగ
శ్రీ తరువటు నిల్చినట్టి కృష్ణుని నెపుడున్'

అని గమ్మత్తుగా బంధించారు. రెండు పాదాలు నిషేధించిన ఈ పద్యంలో యుగ్గరిష్టుడు అనే పదం అద్భుత ప్రయోగం. వాహనాలు నడపడం, పగ్గాలు పట్టడంలో సాటి అని అర్థం.

'ఛందోభాషణం' అనే ప్రత్యేక అంశంలో పద్యాల్లో మాట్లాడడమనేది గుమ్మన్నగారి అవధానాల్లో విశిష్ట స్థానాన్ని ఆక్రమించింది. 1960లో భువనగిరిలో జరిగిన అవధానంతో ప్రారంభమైన ఛందోభాషణ తర్వాత నిర్వహించిన అన్ని అవధానాల్లో ఘంటా గణనానికి బదులుగా ఆశువుగా పద్యాల్లో మాట్లాడుతూ చేపట్టిన కొత్త ఒరవడి అవధానాలకే కాకుండా సహృదయులకు రసరమ్య అనుభూతులను ప్రసాదించింది.

1961లో లచ్చపేటలో జరిగిన అవధానంలో ఛందోభాషణలో ఒక పృచ్ఛకుడు వేసిన ప్రశ్నకు గుమ్మన్నగారు ఎంతో రసవంతంగా సమాధానమిచ్చారు.

ప్రశ్న : ఆకులు మేకలు మేయున్
ప్రాకటముగ నరు.. తములపాకులు మేయున్
మేకలో? నరులో మీరలు?

సమాధానం : 'శ్రీకంఠుని గొలుచు పుణ్య జీవుడనౌదున్'
అని చెప్పి ఆశువుగా మరొక పద్య రస గుళిక అందించారు.

"అలదేవాదులు వాడి నారిది అటంచార్యా మహా పూజన
స్థల సచ్చేముషి చెప్పుచుండును; కవీశానుల్ రసాస్వాద చి

త్తులునై, తమ్ములపున్ రసమ్ము గొనుచున్, తోడ్తో రసానంద మం
జుల కావ్యమ్ముల పల్కుచుందురిక నిచ్చోవింటివా?.. మిత్రమా!''

అని తనకిష్టమైన తాంబూల సేవనంపై అలవోకగా పద్యం చెప్పి సభలో హర్షాతిరేకాన్ని కల్గించిన అజ రామరులు గుమ్మన్నగారు.

1978 జనవరిలో మెదక్ జిల్లా గజ్వేల్‌కు సమీపంలో ఉన్న అహ్మదీపురంలో గుమ్మన్నగారి అవధాన కార్యక్రమం జరిగింది. ఎంతోమంది అక్షరాస్యులతో సహా మరెంతో మంది నిరక్షరాస్యులు కూడా హాజరైన సందర్భంలో - గుమ్మన్నగారి అవధాన ప్రారంభ ఆశుపద్య రాగాలాపనతో సభ ఆసాంతం పులకించింది. ధారాళంగా కొనసాగుతున్న అవధానాన్ని వర్షధారలు అంతరాయాన్ని కల్గించగా, అరగంటసేపు ఆగిన తర్వాత తిరిగి ప్రారంభమైనప్పటికీ గుమ్మన్నగారు ఆ అంతరాయంలో కూడా ధాటిగా ధారణను నిల్పుకొని ఎలాంటి బెరుకు, జంకు లేకుండా ముందటికంటే వేగంగా ధారణను పూర్తిచేసి సభికులందరి చేత ఎన్నో ప్రశంసలు పొందారు. ఇది గుమ్మన్నగారి ధారణశక్తికి ఒక అద్భుత ఉదాహరణగా సహృదయులు చెప్పుకుంటారు.

అవధాన నిర్వహణలో సీమాంధ్ర ప్రాంతంలో సి.వి.సుబ్బన్నశైలి అని ప్రత్యేకంగా చెప్పుకుంటున్నట్లుగా, తెలంగాణా ప్రాంతంలో గుమ్మన్నగారి శైలిని ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. 'ఆశుధార, అద్భుతమైన గాత్రం, సద్యః స్ఫూర్తితో కూడిన వైదుష్యం, ధారణ, నిర్లిప్తత, రాజీలేని వైఖరి, ఛందో భాషణం అనే ప్రత్యేక అంశంలో పద్యాల్లో మాట్లాడడం' అనే విశిష్ట అంశాల సమాహారం - గుమ్మన్న గారి లక్ష్మీ నరసింహ శర్మ అవధానం. రెండు పదులు కూడా దాటని పిన్నవయస్సులో అష్టావధానాన్ని ప్రారంభించి ఏడు పదులు దాటిన తర్వాత కూడా అవధానాన్ని నిర్వహించిన మహోన్నత శిఖరం శ్రీ గుమ్మన్నగారు. వెంకట్రావుపేటలో ప్రారంభించిన అవధాన కార్యక్రమం తెలుగునేల నలుచెరగులా నిర్వహించి ప్రక్రియావ్యాప్తికి ఎనలేని కృషి చేసి ప్రాంతాలకతీతంగా కవిపండితుల ప్రశంసలు, ఎన్నో సన్మానాలు పొందిన ధన్యజీవి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ''న భూతో న భవిష్యత్'' అని అందరూ అనుకునే విధంగా 2017 డిసెంబర్ 15 నుండి 19 వరకు నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలలో అవధాన కళా వేదికకు శ్రీ గుమ్మన్నగారి లక్ష్మీ నరసింహ శర్మ గారి పేరును పెట్టి వారికి అలాగే అవధాన ప్రక్రియకూ సముచిత గౌరవాన్ని కలిగించింది.

అవసాన కాలంలో గుమ్మన్నగారు ఎంతో ఆత్మ విశ్వాసంతో మరెంతో సంతుష్ట జీవికయై పరమేశ్వరునితో పలికిన చివరి పలుకులతో ఈ వ్యాసానికి ముగింపు పలకడం సముచితం.

''అంతట నిండి యుండిన మహా పరమేశ్వర! నీ యొసంగిన
ట్లింతయ చాల్ కృతజ్ఞుడను. ఈ భవగాంగ ఝరీ తరంగ సం
క్రాంతి మహత్త్వమున్ కనుటకై అవకాశమొసంగి, నీ దయా
వంతుడటన్న మేల్ బిరుదు వాస్తవమన్న వచః ప్రశస్తకా''

# అరిషడ్వర్గము – వేమన పద్యాలు

– డా॥. సి. నర్సింహులు, సహాయ ఆచార్యులు, యం.వి.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), మహబూబునగరు.

"అరిషడ్వర్గము" అనునది సంస్కృత పదము. అరి అంటే శత్రువు లేదా పగోడు. షట్ + వర్గము అనగా ఆరుగురి గుంపు యని, అరిషడ్వర్గమనగా ఆరుగురి శత్రువుల గుంపు యని యర్థము. మనిషికి పగరు బయటలేరు మనసులోనే ఆరుగురున్నారు. అవి, కామ (అత్యాశ), క్రోధ (కోపమ), లోభ (పిసినారి), మోహ (ప్రేమ), మద (గర్వం), మాత్సర్యము (అసూయ) లు. ఇవి ఎవరికి శత్రువులో, యెందుకు శత్రువులో ఎవరు చెప్పలేదు. అంటే మనిషిగా పుట్టిన ప్రతివానికి శత్రువులన్నమాట. అందుకే ముందుగా వీటిని ఎదిరిస్తే మనిషి శాంతంగా మనుంటాడు. లేదా అశాంతితో మరణిస్తాడు. ఈ ఆరుగురి శత్రువుల నెదిరించి పురుషుడు పురుషార్థములను ఆచరించాలి. అవి "ధర్మార్థకామ మోక్షములు". ఇందులో మోక్షము ఇహపరములో పరమునకు సంబంధించినది. మిగతా ధర్మార్థకామములు ఇహమునకు సంబంధించినవి. అరిషడ్వర్గములో మొదటిది కామము. ఇందులో కామము నిషేధము. పురుషార్థములలో ఉన్న కామము నిత్యము. ఎందుకంటే ధర్మాన్ననుసరించి కామముంటుంది. అరిషడ్వర్గములో కామాన్ననుసరించి క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు వస్తాయి. కాబట్టి వీటిని వదలి పెట్టాలి.

కామము కన్న క్రోధము భయంకరమైనది. ప్రస్తుత కాలములో మనిషికి వచ్చె కష్టాలన్ని ఈ క్రోధము వలననే సుమతీ శతకంలోని బద్దెన...

తనకోపమే తన శత్రువు
తన శాంతమే తనకు రక్ష దయ చుట్టంబౌ
తన సంతోషమే స్వర్గము
తన దు:ఖమే నరకమండ్రు తథ్యము సుమతీ!

కోపమెంత భయంకరమైన శత్రువో ఇక్కడ కవి తెలియజేశాడు. ప్రస్తుతము వేమన చెప్పిన పద్యాలలో అరిషడ్వర్గానికి చెందిన పద్యాలను పరిశీలిద్దాం.

భారతీయ ఋషులు, యోగులు, సాధకులు మానవజీవిత గమ్యం "మోక్షం" అని నమ్ముతారు. ఈ మోక్షం అరిషడ్వర్గాన్ని తొలగించుకొని పురుషార్థాలను నిరంతర సాధన వల్ల సాధించాలంటారు. అలాంటి మోక్ష సాధన కర్తలలో వేమన ఒకరు. యవ్వనారంభంలో అరిషడ్వర్గాన్ని అదుపు చేసుకోలేక విచ్చలవిడిగా ప్రవర్తించి జీవితంలో ఎదురు దెబ్బలు తిన్నతరువాత జీవితం పై విరక్తి చెంది తన జీతానుభవాలను అలవోకగా విసిరిన పద్యాలలో కనిపించే అరిషడ్వర్గాన్ని తెలిపే ప్రయత్నం చేస్తాను.

అభవు ననుభవమున నార్గురరులు నీల్గ
సంశయంబు లేదు సాధకులకు
చెంత దీప మిడక చీకటి పోవునా!
విశదాభిరామ! వినుర వేమా!

ఈశ్వరానుభవం కలిగిన సాధకునికైన సాధనలేనిది కామక్రోధాది గుణాలు సమసిపోవు అనడంలో ఏ మాత్రం సందేహం లేదంటాడు.

ఆరు వేషములను నరయంగ గడు వింత
ఆత్మయందు ధ్యానమమర దెందు
భీకరంబు గాని బిరుదు లేదు విరక్తి
విశదాభిరామ! వినుర వేమా!

ఆరు ఇంద్రియాల ఆర్భాటం ఎక్కువ. అవి లొంగితేనే గాని, మనసులో ధ్యానం కుదరదు. అది వైరాగ్యంతోనే సాధ్యమంటాడు.

కామ చింతజిక్కి కనుగోన నేరవు
నియమ నిష్ఠ కలిగి నియతి మీరి

తామసంబు నడచి తన్మయ మందరా !
విశదాభిరామ! వినుర వేమా!

మానవులంతా కామం పై గల వ్యామోహంతో కన్నూ మిన్నూ కనిపించక ఆ పరబ్రహ్మాన్ని తెలుసుకోలేక పోతున్నారని తామసాన్ని వదిలి నియమ నిష్ఠలతో ఆ పరబ్రహ్మాన్ని తన్మయత్వంలో అందుకోమంటున్నాడు.

కరగ కరగ బుట్టు, కనకంబునకు వన్నె
పెనగ పెనగ బుట్టు, ప్రేమ సతికి
ముదియ ముదియ బుట్టు మోహంబు లోభంబు
విశదాభిరామ! వినుర వేమా!

కరిగిన కొద్దీ బంగారంలోని మాలిన్యం అంతరించి వన్నె తేలుతుంది. కౌగిట్లో బంధించి పెనవేసుకుంటూ, తరచుగా ఆమె కోరిక తీరుస్తూ వుంటే పెళ్ళానికి భర్త మీద ప్రేమ పెరుగుతుంది. వయస్సు జారే కొద్దీ లోభమోహాలు అధికం అవుతాయి.

ఈగ తేనె రుచికి నింపుగా చచ్చును
ఓగు కామరుచికి నొదిగిచచ్చు!
త్యాగి కానివాని ధర్మమడ్గిన జచ్చు!
విశదాభిరామ! వినుర వేమా!

తేనెపై వ్యామోహం చేత వచ్చే తేనెటీగ, తాను తయారు చేసే తేనెను బాగా తాగి తాగి మరణిస్తుంది. అవివేకంతో మనిషి కామానికి లొంగి మరణిస్తాడు. అలాగే మహాలోభిని దానం అడగడం వల్ల, అతడికి పై ప్రాణాలు పైనే పోయినంత బాధ కలుగుతుంది.

లోభివాని జంప లోకంబు లోపల
మందు వేరు వలదు, మతమె కలదు
పైక మడుగనతడు భగ్గురు మని చచ్చు!
విశదాభిరామ! వినుర వేమా!

ఈ లోకంలో లోభి వాళ్లని చంపడానికి వేరే మందు అక్కరలేదు. పిసినారి వాడి దగ్గరికి వెళ్ళి డబ్బు అడిగినా చాలు! నెత్తీ నోరు బాదుకుంటూ చస్తాడంటాడు.

కండకావరమున కానడు మరణంబు
మదము చేత తత్త్వమహిమ గనడు
భోగ కాంక్ష చేత పురహరు గానడు
విశదాభిరామ! వినుర వేమా!

ఈ మానవులు కేవలం గర్వం చేతనే మరణమును, మదం చేతనే తత్త్వచింతనను, సుఖం చేతనే భగవత్ స్వరూపాన్ని గ్రహింపజాలకున్నారు.

మదము వలన గలుగు మాటలు మరి పల్కి
ముచ్చు సుద్దుల నొగి మోస పుచ్చి
కాసు రాబెనగెడు కష్టుండు గురుడౌనే !
విశదాభిరామ! వినుర వేమా!

మదం కొద్దీ లేని పోని అవాకులు చెవాకులు వాగి, ఇతరుల్ని మాయమాటలతో మోసగించి కేవలం ధన సంపాదనే ధ్యేయంగా గలవారే గురువుల ముసుగులో తిరుగుతున్నారని అలాంటి వారిని జాగ్రత్తగా గమనించాలంటాడు.

డెందమందు దలచు దెప్పర మెప్పుడు
నోర్వలేని హీనుదొరుని కట్టె
తనకు మూడుసుమ్ము, తప్ప దెప్పటికైన
విశదాభిరామ! వినుర వేమా!

ఈర్ష్యాసూయలు నిండి ఎంతసేపూ ఇతరులకు హాని తలపెట్టే దుర్మార్గుడికి ఏనాటికైనా చేటుకాలం దాపురిస్తుందంటాడు.

పరుల మేలు చూచి పలుగాకి వలెనెప్డు
వట్టి మాటలాడు వాడధముడు
అట్టి వాడు బ్రతుకుటది ఏల మంటికా?
విశదాభిరామ! వినుర వేమా!

ఇతరులకు మేలు కలుగుతుంటే, చూచి ఓర్చు కోలేని వాడు దుర్జనుడు. ఓర్చుకోక పోవుట మాత్రమే కాక, పొసగని మాటలు చెపుతుంటాడు. అట్టి దుర్మార్గుడి బ్రతుకు నిష్ప్రయోజనమేనంటాడు.

వేమన ప్రేమమూర్తి మరియు శాంతమూర్తి. కాబట్టి నా ఈ పరిశీలనలో అరిషడ్వర్గములోని క్రోధము వేమన

పద్యాలలో లభించలేదు. "కామానుసారిణే క్రోధాధి కంబులు" అని చెప్పవచ్చు.

అరిషడ్వర్గాన్ని అదుపులో వుంచితేనే మనుషులు మనీషులౌతారు. అప్పుడు దివ్యజ్ఞానం ప్రాప్తించి సత్యాన్ని తెలుసుకుంటారు. అరిషడ్వర్గ షట్గుణాలు సమస్తం మనిషి నుండి మాయమౌతాయి. మానవ మస్తిష్కంలో పురుషార్థాలు వచ్చి చేరుతాయి. అప్పుడు మానవుడే మాధవుడౌతాడు.

**ఆధార గ్రంథాలు :**

1. సుమతీ శతకం - బద్దెన
2. వేమన శతకం - వేమన
3. వేమన పద్య రత్నాకరం - భాగవతుల సుబ్రహ్మణ్యం.

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# భారతీయేతర జానపద గాథలు – మానవజీవితం

– డా॥. శిరీష ఈడ్పుగంటి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, శ్రీవేంకటేశ్వర కళాశాల, ఢిల్లీ.

సాహిత్యం జీవితం రెండూ ఒకదానికొకటి ముడిపడి ఉంటాయి. సాహిత్యం సమాజం నుండి పుడుతుంది. సమాజంలోని వ్యక్తులు, వారి స్వభావాలు, వారివారి జీవితాలు, సుఖదు:ఖాలు మొదలైన అంశాలన్నింటి గూర్చి రచయితలు సాహిత్య రచనలరూపంలో పాఠకులకు తెలియజేస్తారు. మనిషి వాటిని చదివి మానసిక ఆనందాన్ని పొందుతున్నాడు. సాహిత్యం మనిషి జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అంతేగాకుండా మనిషి జీవితానికి, సామాజిక స్థితికి అత్యంత చేరువలో ఉంటుంది.

సాహిత్యం అనేది రచనలు చేసే కళ. సాహిత్యం అనే పదానికి అర్థం 'అక్షరాలతో సాన్నిహిత్యం'. ఇది ఒక ప్రక్రియ. ఒక సాహిత్య ప్రక్రియను పాఠకునికి ఒక నిర్దిష్ట ప్రభావాన్ని అందించడానికి ఉపయోగిస్తారు. మనిషి జీవితాన్ని తీసుకుని ఒక స్వచ్ఛమైన కళారూపంగా మార్చి చూపేది సాహిత్య ప్రక్రియ. ఒక జీవనయానాన్ని ఆ ప్రయాణంలో నమోదైన సంఘటనలను పునర్నిర్మిస్తుంది. వాస్తవబద్ధమైన మానవజీవితాన్ని ప్రదర్శిస్తుంది. మానవజీవితాన్ని, మనిషి వ్యక్తిత్వాన్ని విశ్లేషిస్తుంది. ఈ సాహిత్యప్రక్రియ మనకు రెండురకాలుగా కనబడుతుంది. లిఖితరూపం, మౌఖికరూపం. లిఖితరూప సాహిత్య ప్రక్రియ అనేది రచనల రూపంలో కనిపిస్తుంది. నవల, నాటకం, పద్యం, గద్యం, శతకం, కథ ... మొదలైన ప్రక్రియల రూపంలో సాహిత్యం లిఖితరూపంలో ఉంటుంది. మౌఖిక సాహిత్యప్రక్రియ మౌఖిక సంప్రదాయాలను సూచిస్తుంది. వీటిలో ఇతిహాసం, కవిత్వం, నాటక, జానపదగాథ, జానపదగేయగాథ వంటివి పలురకాలున్నాయి. ఈ మౌఖిక సాహిత్యంలోని జానపదగాథా ప్రక్రియను గూర్చి ఈ వ్యాసంలో ప్రస్తావిస్తున్నాను.

## జానపదగాథా ప్రక్రియ :

జానపదగాథలు అనేకం కనిపిస్తాయి. బొబ్బిలికథ మన తెలుగు ప్రాంతంలో ఒక వీరోచిత జానపదగాథ. తెలుగేతర ప్రాంతాలలో కూడా జానపదగాథలున్నాయి. మల్లెలయువరాజు తమిళంలోని జానపదగాథ. హిందూ మతంలోనే కాక బౌద్ధ, జైన మతాలలో కూడా జానపద గాథలున్నాయి. గౌతమబుద్ధుడు ఒక తెల్ల ఏనుగు రూపంలో భూలోకంలో అవతరించినట్లు గాథ ఉంది. ఈవిధంగా మనదేశంలో తెలుగు ప్రాంతంలోను, తెలుగేతర ప్రాంతాలలోనూ, వివిధమతాలలోనూ జానపదగాథలున్నట్లే భారతీయేతర ప్రాంతాలలో కూడా జానపదగాథలున్నాయి.

## భారతీయేతర జానపద గాథలు :

ప్రపంచ సాహిత్యం మాదిరిగానే భారతీయ సాహిత్యం వివిధ ప్రక్రియల రూపంలో ఉంది. వాటిల్లో ఒక ప్రక్రియ జానపదగాథ. భారతదేశంలో వివిధ ప్రాంతాలలో పలురకాల జానపదగాథలున్నాయి. అలాగే ప్రపంచంలో వివిధ దేశాలలో (భారతీయేతర ప్రాంతాలలో) అనేక జానపదగాథలు కనిపిస్తాయి. ఈ జానపదగాథలలో ఐదింటిని (ఐదు ప్రాంతాలకు చెందిన) ప్రస్తుత వ్యాసంలో చర్చిస్తున్నాను. ఈ ఐదు జానపదగాథలను వివరిస్తూ, వాటిలో మానవ జీవితం ఏవిధంగా ఉన్నది తెలుపుతున్నాను. ఈ గాథలలోని మానవుని ఆలోచన, బుద్ధి, స్వభావం, ప్రవర్తన, మనిషిజీవితం మొదలైన అంశాలను ప్రస్తావిస్తున్నాను. జానపదగాథా సాహిత్యంలోని మానవ జీవితాన్ని విశ్లేషిస్తున్నాను.

## తూర్పు ఐరోపా జానపదగాథ :

ఒక ముసలి జాలరి సముద్రంలో చేపలు పట్టలేక నదిలో చేపలు పట్టి వాటిని అమ్మి జీవనం సాగించేవాడు.

మండువేసవిలో చేపలు పట్టలేక తన దుస్థితికి తనే బాధపడతాడు. అప్పుడు వెండిలా తళతళ మెరిసే ఈకలున్న ఒక పెద్దపక్షి చూస్తుంది. దానిపేరు కహ్, దేవతాపక్షి. ఆ పక్షి ముసలిజాలరి పై జాలిపడి ఇలా అంటుంది. తాతా! రోజూ నేను నీకు ఒక పెద్ద చేపను ఇస్తాను. నువ్వు దాన్ని అమ్మి జీవనం సాగించు అని ఎగిరి పోతుంది. ఆ ప్రకారమే పక్షి రోజూ ఒక పెద్ద చేపను ముసలిజాలరి ఇంటిముందు వేస్తూ ఉంటుంది. దాన్ని అమ్మి ఆహారం తెచ్చుకునేవాడు ముసలిజాలరి. ఆరోజులలో పెద్దచేపలకు గిరాకీ ఎక్కువ ఉండటంతో ముసలిజాలరి డబ్బులు బాగా కూడబెట్టాడు. వాటితో సముద్రతీరంలోనే ఒక ఇల్లు, వంటమనిషిని ఏర్పాటు చేసుకోగలిగాడు. కొద్ది రోజులక్రితమే అతని భార్య చనిపోవడంతో మళ్ళీ పెళ్ళి చేసుకోవడానికి తగిన వధువు కోసం వెతుకుతున్నాడు. ఒకరోజు రాజభటుడు వేసిన దండోరా వింటాడు. అది 'రాజుగారికి కహ్ అనే దివ్యపక్షి కావాలి. దానిగూర్చి తెలిసినవారెవరైనా ఉంటే, దాన్ని పట్టుకోవడంలో సహాయం చేస్తే తగిన బహుమతి ఇస్తాం అని'. కోశాగారంలో ఉన్న బంగారంలో సగం, అర్ధరాజ్యాన్ని ఇస్తాం అని ప్రకటన. ఆ ప్రకటన విని ముసలిజాలరి అర్ధరాజ్యముంటే తను కూడా రాజేనని మురిసిపోతూ ఆ పక్షి ఎందుకు? అని రాజభటుల్ని అడుగుతాడు. రాజుగారికి కంటిచూపు పోయింది. కహ్ పక్షి నెత్తురుతో కళ్ళను శుభ్రం చేస్తే చూపు వస్తుందని వైద్యులు చెప్పారు. ఆ పక్షి గూర్చి నీకేమైనా తెలుసా అని అడుగుతారు భటులు. అప్పుడు ఆ ముసలిజాలరి దురాశకు పోయి ఆ పక్షిని పట్టుకోవడంలో సహాయం చేస్తానంటాడు. రాజభటులను తన ఇంటికి తీసుకుని వెళతాడు. ఎప్పటిలాగే కహ్ పక్షి మాత్రం జాలరి ఇంటిముందు ఒక పెద్దచేపను వదిలి వెళ్ళిపోతుంటే ఆ ముసలిజాలరి పక్షితో ఇలా అంటాడు. 'నువ్వు రోజూ చేపను వేసి వెళ్ళిపోతావు కనీసం నన్ను కృతజ్ఞత అయినా చెప్పు కోనివ్వవు' అని పదేపదే వేడుకోవడంతో ఆ పక్షి నేల మీదకి దిగుతుంది. మరుక్షణమే దాని కాలు గట్టిగా పట్టుకుని భటుల్ని పిలుస్తాడు. ఇంటివెనక దాగిఉన్న భటులు పక్షిని పట్టుకోవడానికి పరిగెత్తుకుని వస్తారు. వాళ్ళు వచ్చేలోపే ఆ పక్షి జరగబోయే విషయాన్ని గ్రహించి ఆ ముసలిజాలరితో సహా పైకి ఎగిరిపోతుంది. ఆ తర్వాత ఎన్నడూ ఎవరికీ కహ్ పక్షి గాని ఆ ముసలిజాలరి గాని కనిపించలేదు.

**విశ్లేషణ :**

జాలరి ముసలితనాన్ని గమనించి అతని అవస్థకు పక్షి జాలిపడుతుంది. సహాయం చేస్తుంది. కాని ముసలి జాలరి అది గుర్తించకుండా దాని ప్రాణాలకే హాని కలిగించేవిధంగా ప్రవర్తిస్తాడు. చివరికి ప్రాణం పొగొట్టు కుంటాడు. చేసిన సహాయం మరిచి పక్షికే అపకారం తలపెడతాడు. డబ్బు, అర్ధరాజ్యం కోసం ఆశపడతాడు. పక్షి చేసిన సహాయంతో తృప్తిచెందడు. కృతజ్ఞత చూపక, దురాశకు పోతాడు. చేసిన మేలు మరిచి పక్షికే కీడు తలపెడతాడు. కనుక ఎవరైనా సరే సహాయాన్ని పొంది కృతజ్ఞత చూపగ పోగా కీడు తలపెట్టకూడదు. దురాశ దు:ఖానికి చేటు.

ఉపకారికి నుపకారము
విపరీతము కాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడె నేర్పరి సుమతీ.

ఉపకారం చేసిన వారికి ప్రత్యుపకారం చేయడం గొప్పేమీ కాదు. అపకారికి వాడి తప్పులు మన్నించి ఉపకారం చేసేవాడే నేర్పరి అవుతాడు. ఈ కథలో జాలరి పక్షిచేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చేయకపోగా అపకారం తలపెట్టి ప్రాణాలు పొగొట్టుకుంటాడు.

**పఠాన్ గర్వం (ఆఫ్ఘన్ జానపదగాథ) :**

అలామత్ అనే వ్యక్తికి భార్యాపిల్లలు కుటుంబం ఉన్నాయి. కట్టెలు కొట్టి వాటిని అమ్మి కుటుంబాన్ని పోషించేవాడు. ఈద్ పండుగకు తనకు, పిల్లలకు కొత్త

బట్టలు కావాలని భార్య అడుగుతుంది. అతడి దగ్గరేమో చిల్లిగవ్వ లేదు. డబ్బు కోసం ఆలోచిస్తుండగా అతనికి ఒక వర్తకుడు కనిపిస్తాడు. ఆ వర్తకుడు గాడిద మీద బట్టల మూటలు పెట్టుకుని అమ్ముతున్నాడు. అతణ్ని చూడగానే అలామత్ కు తన సమస్యకు పరిష్కారం దొరికిందని అనుకుంటాడు. వెంటనే మూడు రాళ్ళు తీసుకుని ఆ వర్తకుని మీదకు ఒక రాయిని విసురుతాడు. ఆ రాయి వర్తకుని భుజానికి తగులుతుంది నన్నెందుకు కొడుతున్నావు అని వర్తకుడు అలామత్ ని అడుగుతాడు. 'నేను దోపిడి దొంగను, నాకు నీ బట్టలమూటలు కావాలి అంటాడు అలామత్ . వర్తకుడు 'నాకు నిన్ను ఎదురించే ధైర్యం లేదు.' కావున ఈ బట్టల మూటలు తీసుకో అంటాడు. అలామత్ వెంటనే రెండవ రాయి విసురు తాడు. దాంతో వర్తకుడు భయపడి బట్టల మూటలు తీసుకోమన్నాను కదా ఇంకా ఎందుకు రాళ్ళు విసురు తున్నావు అని అడుగుతాడు. 'దోపిడి అనేది ఎప్పుడూ మోసంతో ఉంటుంది. అలాకాకుంటే అడుక్కునేవాడికీ, నాకూ తేడా ఏముంటుంది? అని మూడవ రాయిని విసురుతాడు అలామత్. వెంటనే వర్తకుడు గాడిదను, బట్టల మూటలను వదిలిపెట్టి పరుగుతీస్తాడు. అలామత్ వాటిని తీసుకుని వెళ్ళి భార్యకు ఇస్తాడు. పిల్లలకు, తమ బంధువులకు అందరికీ బట్టలు కుట్టించుకోమని ఇస్తాడు. ఈద్ పండుగను ఎంతో ఆనందంతో జరుపుకుంటారు.

కొన్నాళ్ళ తరువాత అలామత్ సంతలో చిక్కుడు గాయలు కొంటుంటే అతని భుజం పై ఒక చేయి బలంగా పడుతుంది. వెనక్కి తిరిగి చూస్తే ఆ మధ్య తాను దోపిడి చేసిన వర్తకుడు. 'ఏం కొంటున్నావ్ భాయ్ అని అడుగుతాడు.' చిక్కుడుగాయలు అని తడబడుతూ చెబుతాడు అలామత్. అప్పుడు వర్తకుడు తనకు చిక్కుడుగాయల పంట ఉన్నదని ఎన్ని కావలిస్తే అన్ని ఉచితంగా ఇస్తానని అంటాడు. వర్తకునికి ఇరువైపులా ఇద్దరు వస్తాదులున్నారు. వారిని చూసి అలామత్ వర్తకుని మాటలకు తల ఊపక తప్పలేదు. వర్తకుడు అలామత్ ను ఇంటికి తీసుకుని వెళ్ళి అతిథి మర్యాదలు చేస్తాడు. కాని అలామత్ మాత్రం తనకు ఏం శిక్ష విధిస్తాడో అని భయపడుతూనే ఉంటాడు. ఈ గండం గడిస్తే ఇంకెప్పుడూ తప్పులు చేయనని మనసులోనే అనుకుంటాడు. చివరికి వర్తకునితో ఇలా అంటాడు. 'అయ్యా చిక్కుడుగాయలు ఇస్తే వాటి ఖరీదు చెల్లించి వెళ్ళిపోతానని'. వెంటనే ఒక బస్తా చిక్కుడుగాయలు తెప్పించి, అలామత్ వచ్చిన గాడిద మీద పెట్టించి ఇక నువ్వు వెళ్ళు అంటాడు వర్తకుడు. తనకు అన్ని కాయలు అవసరం లేదని, తన దగ్గర అన్ని డబ్బులు లేవని అంటాడు అలామత్. ఉచితంగా తీసుకోమని వర్తకుడు అంటాడు. వెంటనే అలామత్ 'ఉచితంగానా? నేనేమన్నా బిచ్చగాణ్ణా? అని భయంతో అంటాడు. అప్పుడే అతని వీపు పై తుపాకీ గొట్టం తగులుతుంది. 'మర్యాదగా నీ గాడిదపై కెక్కి కూర్చొని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపో. లేకుంటే నీ తలకాయ ఎగిరిపోతుంది' అని వర్తకుడు గర్జిస్తాడు. ఒక బిచ్చగాడికి దానం చేసినట్లు తనకు ఉచి తంగా చిక్కుడుగాయలు ఇవ్వడాన్ని అవమానంగా భావిస్తాడు అలామత్. అవమాన భారాన్ని మోస్తూ గాడిద మీద ఇంటికి వెళతాడు. అప్పటినుంచి అలామత్ ప్రతివారం ఒక కట్టెలమోపు చొప్పున ఆ వర్తకుడి ఇంటి ముందు వేస్తాడు. ఈవిధంగా క్రమం తప్పకుండా పది సంవత్సరాల పాటు వేస్తాడు. ఒక రోజున ఆ వర్తకుడు 'ఇక చాలు నా బట్టలకు, చిక్కుడుగాయలకు తగిన మూల్యం లభించింది' అంటాడు. అపుడు అలామత్ వర్తకునికి నమస్కరించి, సగర్వంగా తలెత్తుకుని గాడిద మీద ఇంటికి వెళతాడు. ఇక తనను బిచ్చగాడని ఎవరు అనలేరని లోలోపల ఎంతగానో అనందపడతాడు.

**విశ్లేషణ :**

అలామత్ ఎవరి దగ్గర ఏది ఉచితంగా తీసుకోడు. అలా తీసుకుంటే తాను బిచ్చగాణ్ణే అవుతాననే అభిప్రాయం కలవాడు. డబ్బు లేక వర్తకుని వద్ద బట్టలు మోసంతో తీసుకోవాలనుకుంటాడు. కాని వర్తకుడు

ఉచితంగా బట్టలు ఇస్తానన్నా తీసుకోడు. వర్తకుడు భయంతో పారిపోవడంతో అలామత్ బట్టల మూటలు ఇంటికి తీసుకుని వెళతాడు. ఈ సంఘటనతో వర్తకుడు ఇద్దరు వస్తాదులను తన కూడా పెట్టుకుంటాడు. తుపాకీ ఇంటిలో ఉంచుకుంటాడు. తనలోని భయాన్ని పారద్రోలి ధైర్యంగా వ్యాపారం చేయడం మొదలుపెడతాడు. వర్తకునికి అనుకోకుండా ఒకరోజున అలామత్ కనిపిస్తాడు. ఇంటికి తీసుకుని వెళ్ళి అతిధిమర్యాదలు చేస్తాడు వర్తకుడు. కాని అలామత్ కు లోలోపల తాను చేసిన పనికి వర్తకుడు ఏం శిక్ష విధిస్తాడో అనే భయం ఉం టుంది. వర్తకుడు అలామత్ ను బెదిరించి ఉచితంగా ఇచ్చిన బస్తా చిక్కుడుగాయలకు, ముందు తీసుకున్న బట్టలకు అన్నింటికి కలిపి డబ్బులు కట్టెల రూపంలో అలామత్ వర్తకునికి పదిసంవత్సరాలలో ఇవ్వడం జరుగుతుంది. తదనంతరం తాను బిచ్చగాణ్ణికాదు అని అలామత్ కు పట్టరాని సంతోషం కలుగుతుంది.

అలామత్ భార్య కుటుంబ పరిస్థితి తెలిసి కూడా పండుగకు కొత్తబట్టలు కావాలనుకుంటుంది. అలామత్‌కు ఏది ఉచితంగా తీసుకోవడం ఇష్టంలేక ఒకసారి వ్యాపారిని బెదిరించి, రెండవసారి తాను భయపడి ఉచితంగా తీసు కుంటాడు. వాటి విలువను మరల చెల్లించి ఎంతో ఆనందపడతాడు. వర్తకుడు మొట్టమొదట అలామత్ ను ఎదిరించే ధైర్యం లేక గాడిదను, బట్టలమూటలను వదులుకుంటాడు. రెండవసారి తోడుగా ఇద్దరు వస్తాదులు, చేతిలో తుపాకీ ఉండడంతో భయపెట్టే స్థితిలో ఉంటాడు. బలమున్న వాడిదే రాజ్యం అనే సామెత రుజువవుతుంది.

నయమున బాలును ద్రావరు
భయమున విషమ్మునైన భక్షింతురుగా
నయమెంత దోషకరియో
భయమే చూపంగ వలయు బాగుగ సుమతీ!

ఈ లోకంలో మెత్తని మాటలతో, మంచితనంతో చెపితే ఎవరూ పాలు కూడా తాగరు. భయపెడితే విషాన్నైనా తాగుతారు. కనుక ఏదైనా పని అవ్వాలంటే మంచితనం కన్నా భయపెడితేనే అవుతుంది. అదే పని వర్తకుడు చేశాడు.

**మూర్ఖపు ప్రశ్నలు (నేపాలీ జానపదగాథ) :**

భూపేంద్రప్రసాద్ అనే వ్యక్తి తన ఒక్కగానొక్క కొడుకు పెళ్ళి అంగ రంగ వైభవంగా జరిపిస్తాడు. తన కొత్త కోడలి తెలివితేటలను పరీక్షించాలనుకుంటాడు. ఆమె దగ్గరకు వెళ్ళి ఇలా అడుగుతాడు. 'మీ పెళ్ళికి నేనెంత ఖర్చు చేశానో ఊహించగలవా?' దానికి కోడలు 'ఒక ధాన్యం బస్తా ఖర్చయి ఉంటుంది' అని సమాధానం చెబుతుంది. అది వినిన భూపేంద్రప్రసాద్ తన కొడుకు పెళ్ళాం ఎంత తెలివి తక్కువది అనుకుంటాడు. కొడుకు పై మనసులోనే జాలిపడతాడు. అలా కొన్ని రోజులు గడుస్తాయి. ఒకరోజు భూపేంద్రప్రసాద్ కొడుకు కోడలితో కలిసి బంధువుల పెళ్ళికి వెళతాడు. మార్గమధ్యంలో కొంతమంది వ్యక్తులు ఒక శవాన్ని తీసుకుని వెళ్ళడం చూస్తాడు. వారిని ఆపి 'చని పోయింది ఎవరు? అని అడుగుతాడు అంతలో కోడలు 'చనిపోయింది ఒకరా? వందమందా?' అని ప్రశ్నిస్తుంది. దాంతో భూపేంద్ర ప్రసాద్‌కు కోడలి ప్రశ్నకు తలకొట్టేసినట్టయింది. ఎదుటి వ్యక్తి సమాధానం వినకుండానే వెళ్ళిపోతాడు. మరికొంచెం దూరం వెళ్ళాక పంట చేలలో కూలీలను పలకరిస్తాడు భూపేంద్రప్రసాద్. 'ఈ సంవత్సరం పంట బాగా పండి నట్టుంది' అంటాడు. అపుడు కోడలు 'ఈ సంవత్సరం పంటేనా?'' అని అడుగుతుంది. ఈవిధంగా అడగడంతో కోడలు ఒట్టి మూర్ఖురాలు అని తెలివి తక్కువదని అంచనా వేస్తాడు భూపేంద్రప్రసాద్. కొడుకు దగ్గరికి వెళ్ళి 'నీ భార్య ఎంత చెత్త ప్రశ్నలు వేస్తుందో' అని అంటాడు. దాంతో కొడుకు చెత్తా? అని ఆశ్చర్యపోయి ఇలా అంటాడు. అవి పైకి కనబడేంత చెత్త ప్రశ్నలేమి కావు. వాటి అర్థమేమిటో ఆమెనే అడగమని అంటాడు. కొడుకు చెప్పిన దానిప్రకారం భూపేంద్రప్రసాద్ కోడలు దగ్గరికి వెళ్ళి ఇలా అంటాడు. 'ఆ చావు ఊరేగింపు వాళ్ళను ఒక్క

శవాన్ని తీసుకుని వెళుతున్నారా? వంద శవాలనా?' అని అడిగావు నీ ఉద్దేశ్యం ఏమిటి? అని అడుగుతాడు. దానికి కోడలు సమాధానం ఇలా చెబుతుంది. 'కొంతమంది మీద ఆధారపడేవాళ్ళు చాలామంది ఉండవచ్చు. అలాంటి వ్యక్తి మరణించినపుడు వాళ్ళందరి జీవితాలు చిందరవందర అవుతాయి. ఒకరకంగా చెప్పాలంటే అతనితోపాటు వాళ్ళంతా చచ్చిన వాళ్ళ కిందే లెక్క'. అందుకే నేను అలా అడిగాను, అని వివరించి చెప్పింది కోడలు. మరి వ్యవసాయ కూలీలను 'ఈ సంవత్సరం పంటేనా? గత సంవత్సరం పంటా? అని అడిగావు దాని అర్థమేమిటి? అంటాడు భూపేంద్రప్రసాద్. సాధారణంగా రైతుకూలీలు అప్పుల్లో ఉంటారు. వాళ్ళు తీసుకున్న అప్పు గత సంవత్సరానిదా, ఈ సంవత్సరానిదా అని అడిగాను అంది కోడలు. కోడలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు వివరంగా చెప్పిన తరువాత భూపేంద్రప్రసాద్ తాను మొట్టమొదట కోడల్ని అడిగిన ప్రశ్నకు సమాధానం వివరంగా తెలుసుకోవాలనుకుంటాడు. వెంటనే మీ పెళ్ళికి నేను చాలా డబ్బు ఖర్చు చేసి ఎంతో వైభవంగా పెళ్ళి జరిపించాను. కాని నువ్వు పెళ్ళి ఖర్చు కేవలం 'ఒక ధాన్యం బస్తా ఖరీదు' మాత్రమే అని చెప్పావు అలా ఎందుకన్నావు? అని అడుగుతాడు. 'మీరు పెళ్ళికి ఉపయోగపడే ఖర్చు చేసిన దానివిలువ అంతే అవుతుంది. మిగతా ఖర్చంతా మీ పరువు, ఆడంబరాల కోసం ఖర్చు చేసిందే' అంటుంది కోడలు. ఈ సమాధానాలతో భూపేంద్రప్రసాద్ తన కోడలు మూర్ఖురాలు కాదని చాలా తెలివైనదని తెలుసుకుంటాడు.

**విశ్లేషణ :**

భూపేంద్రప్రసాద్ కొడుకు పెళ్ళికి పరువు ప్రతిష్ఠల కోసం చాలా డబ్బు ఖర్చుపెడతాడు. కొత్త కోడలు తెలివైనదా కాదా తెలుసుకోవాలనుకుంటాడు. ఆమెను ఒక ప్రశ్న వేస్తాడు. దానికి ఆమె చెప్పిన సమాధానం విని కోడలు తెలివితక్కువదని నిర్ధారణకు వస్తాడు. అంటే కోడలు తెలివైనదా కాదా ఆమెను గూర్చి తెలుసుకోవాలనే కుతూహలం ఉంది. కాని ఆమె చెప్పిన సమాధానం తాలుకా వివరణ గ్రహించలేక తనలో తానే కోడలకు తెలివిలేదని అనుకుంటాడు. కోడలు సమాధానం అలా ఎందుకు చెప్పిందో గ్రహించలేక పోవడం భూపేంద్రప్రసాద్ తెలివి తక్కువతనం. పైగా కొడుకుపై మనసులోనే జాలిపడతాడు. అంతేగాకుండా కోడలు ఇతరుల్ని అడిగిన ప్రశ్నలు విని మూర్ఖురాలు అనుకుంటాడు. ఆ ప్రశ్నలలోని ఆంతర్యాన్ని అర్థం చేసుకోలేక పోతాడు. కొడుకు దగ్గర కోడలు చెత్త ప్రశ్నలు వేస్తుందని అంటాడు. దానికి కొడుకు ఆశ్చర్యపోయి ఆ ప్రశ్నలలోని అర్థాన్ని కోడల్ని అడిగి తెలుసుకోమంటాడు. చివరకు కొడుకు సలహా పాటిస్తాడు. వాటిని గూర్చి కోడలు దగ్గర వివరంగా తెలుసుకుంటాడు. అనంతరం కోడలు మూర్ఖురాలు కాదని చాలా తెలివైనదని గ్రహిస్తాడు.

**టక్కరిబాలుడు - తెలివితక్కువ దయ్యం (మెక్సికో జానపదగాథ) :**

ఒకసారి ఒక దయ్యం ఒక సహాయం కోసం మానవ రూపం ధరించి ఒక ఊళ్ళోకి వెళుతుంది. దాని దృష్టి ఎదురుగా వస్తున్న బాలుని పై పడుతుంది. ఏయ్ అబ్బాయ్ నీకు ఉద్యోగం కావాలా అంది. కావాలి అన్నాడు బాలుడు. నీకు చదవడం వచ్చా అని అడిగింది దయ్యం. వచ్చు అంటాడు బాలుడు అయితే ఉద్యోగం నీకు ఇవ్వలేను అంటుంది. చదువు రానివాడు కావాలి అంటుంది. వెంటనే ఆ బాలుడు ఇలా అంటాడు. వెనకాల నా సోదరుడు వస్తున్నాడు అతనికి చదువురాదు అని చెప్పి వెళ్ళిపోతాడు. దయ్యం కొంచెం ముందుకు వెళ్ళగానే ఆ పిల్లవాడు మరొక డొంకదారి గుండా, దానికన్నా ముందే ఊళ్ళోకి వెళ్ళి ఆ దయ్యానికి ఎదురుగా వస్తాడు. ఎదురుగా వచ్చిన బాలుణ్ని చూసి ఆ దయ్యం ఇలా అడుగుతుంది. 'ఇందాక నాకు కనిపించిన అబ్బాయి సోదరుడివి నువ్వేనా? నీకు చదువురాదని, ఉద్యోగం కోసం వెతుకుతున్నావని అతడు చెప్పాడు అంటుంది దయ్యం. ఆ అబ్బాయి అవును అన్నట్లుగా తల

ఊపుతాడు. అపుడు దయ్యం ఆ అబ్బాయిని ఒక గ్రంథాలయంలోకి తీసుకుని వెళుతుంది. ఆ అబ్బాయి చేయవలసిన పని దయ్యం చదివిన పుస్తకాలను దుమ్ము దులిపి ఎప్పటికప్పుడు యథాస్థానంలో పెట్టడం. దయ్యం బయటకు వెళ్ళినపుడు ఆ అబ్బాయి ఏమి తోచక ఒక్కొక్క పుస్తకం చదవసాగాడు. అవి మాయలు-మర్మాలు, మంత్ర తంత్రాలు, ఇంద్రజాలం, కనికట్టు, గారడీ విద్యల గూర్చి ఎంతో ఆసక్తికరంగా ఉండేవి. ఒక రోజున ఆ అబ్బాయి పుస్తకం చదువుతుండగా దయ్యం చూస్తుంది. ఆ బాలుడు చదువురాదని చెప్పి తనను మోసం చేశాడని గ్రహిస్తుంది. వెంటనే తన నిజ స్వరూపాన్ని ధరించి ఆ బాలుణ్ని భయపెడుతుంది. అయితే ఆ బాలుడు కూడా అప్పటికే చాలా విద్యలు పుస్తకాలలో చదివి నేర్చుకున్నాడు. కాబట్టి వెంటనే కుందేలుగా మారి బయటకు పరుగుతీస్తాడు. ఆ దయ్యం తోడేలుగా మారి కుందేలును తరుము తుంది. అపుడు కుందేలు పావురంగా మారి ఆకాశంలో ఎగిరిపోతుంది. ఆ వెనువెంటనే తోడేలు గద్దలా మారి పావురాన్ని తరుముతుంది. పావురాన్ని పట్టుకునే లోపు అది గులకరాయిగా మారి భూమిమీద పడుతుంది. అపుడు గద్దరూపంలో ఉన్న ఆ దయ్యం వడ్లగింజగా మారి భూమి మీద పడబోతుంది. గులకరాయిగా మారిన ఆ బాలుడు భూమిమీద పడిపడగానే కోడిపుంజుగా మారతాడు. సరిగ్గా అదే సమయానికి వడ్లగింజగా మారిన దయ్యం భూమి మీద పడుతుంది. కిందపడి పడగానే వడ్లగింజను కోడిపుంజు మింగేస్తుంది.

**విశ్లేషణ :**

విద్య లేనివాడు వింతపశువు అంటారు. చదువు అనేది ఆ బాలుడి ప్రాణాలు కాపాడింది. దయ్యం బయటకు వెళ్ళిన సమయంలో ఆ బాలుడు పుస్తకాలను చదవబట్టి అందులోని మంత్ర తంత్రాలు ... వగైరా విద్యలు నేర్చుకోగలిగాడు. తద్వారా దయ్యం బారినుండి తప్పించుకోగలిగాడు. దయ్యం దగ్గర తెలివిగా ఉద్యోగం సంపాదించడమే కాకుండా తనను తాను రక్షించు కోగలిగాడు.

విద్య నిగూఢగుప్త మగు విత్తము రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశ బంధువున్
విద్య విశిష్ట దైవతము విద్యకు సాటి ధనంబు లే దిలన్
విద్య నృపాల పూజితము విద్య నెరుంగనివాడు మర్త్యుండే

మనుషులకు విద్య నిగూఢంగా దాచి పెట్టబడిన ధనం. విద్య కీర్తిని, భోగాలను ఇస్తుంది. విద్యగురువు, విదేశంలో బంధువు, విశిష్టదైవం. విద్యకు సాటిరాగలధనం ఈ లోకంలో లేదు. ప్రభువులచే పూజింపబడేది విద్య. విద్య తెలియనివాడు మనిషి కాదు. పశువుతో సమానం.

**చైనా జానపదగాథ :**

చైనాలో ఒక రాజు నివాసం అడవికి దగ్గరగా ఉండేది. ఒకరోజు రాజుగారు రాత్రివేళ పుస్తకం చదువుతుండగా ఒక కోయిల పాట వినిపిస్తుంది. అది ఎంతో మధురంగా ఉంటుంది. ఆ పాట వినిన రాజుగారు వెంటనే భటుల్ని పిలిపించి అడవిలోని ఆ కోయిలను తెమ్మని పంపుతాడు. భటులు ఆ కోయిలను కనుక్కుని రాజుగారి దగ్గరకు రమ్మని అంటారు. కాని కోయిలకి అడవిని విడిచి వెళ్ళటం ఇష్టం లేదు. కాని రాజుగారి సంతోషం కొరకు వెళుతుంది. రాజుగారికి మందిరంలో రకరకాల పాటలు వినిపిస్తుంది కోయిల. రాజుగారు ఆనందంతో కోయిలకు బంగారు పంజరం చేయించి తన దగ్గరే ఉంచుకుంటాడు. ప్రతిరోజు ఆ కోయిల పాటలతో ఆనందపరవశు డవుతాడు. ఒకనాడు పర్షియా చక్రవర్తి చైనా రాజుకు ఒక కానుక పంపిస్తాడు. అది ఒక బొమ్మ కోయిల. దానినిండా వజ్ర వైఢూర్యాలు పొదిగారు. దానికి ఒక మీట ఉంది. అది తిప్పితే ఆ బొమ్మ కోయిల ఆగకుండా ఐదు నిమిషాల వరకూ పాడుతుంది. దాంతో రాజుగారు చాలా ఆనందంతో బొమ్మ కోయిల పాటలు వింటూ, పంజరంలో ఉన్న నిజమైన కోయిలను మరచిపోతారు. ఒకరోజు రాజభటుడు పంజరం మూత తీయగా కోయిల రివ్వున అడవిలోకి ఎగిరిపోతుంది. రాజుగారు మాత్రం బొమ్మకోయిలను ఎప్పుడూ తనవెంటే ఉంచుకుని

పాటలు వింటుండేవారు. కొంతకాలం తర్వాత బొమ్మ కోయిల లోపల ఏదో విరిగి పాడకుండా ఆగిపోతుంది. దాన్ని రిపేరు చేయడానికి ఎంతోమంది వస్తారు. కాని అది పనిచేయదు. చివరకు గడియారాలు బాగుచేసే అతను దాన్ని రిపేరు చేసి అది నెలకో, సంవత్సరానికో ఒకసారి పనిచేస్తుందని చెబుతాడు. అదేవిధంగా అది అప్పుడప్పుడు మాత్రమే పనిచేస్తుంది. దాంతో రాజుగారు ఎంతో బాధపడతాడు. అదే ఆలోచనతో ఉండటం వలన రాజుగారికి తీవ్రంగా జబ్బు చేస్తుంది. ఒక రోజున రాజ వైద్యులు రాజుగారిని పరీక్షించి మరణించారు అని ప్రకటిస్తారు. ఆ స్థితిలో రాజుగారి దగ్గరికి అడవిలోకి ఎగిరిపోయిన నిజమైన కోయిల వచ్చి మధురంగా పాడుతుంది. దానిపాట విని రాజు నెమ్మదిగా కళ్ళు తెరుస్తాడు. నా మిత్రుడు మళ్ళీ వచ్చాడు అని రాజు ఆనందిస్తాడు. ఆ రాత్రంతా కోయిల పాటలు వింటూనే ఉంటాడు.

**విశ్లేషణ :**

రాజుగారికి పుస్తకాలు, సంగీతం ప్రాణంతో సమానం. అడవిలోని కోయిల పాట విని దాన్ని తెప్పించుకుని బంగారు పంజరం చేయిస్తాడు. నిరంతరం తనతోనే రాజ మందిరంలో కోయిలను ఉంచుకుని పాటలు వినేవాడు. పాటలు వినడమనేది నిత్యకృత్యంగా చేసుకుంటాడు. కొంతకాలం తర్వాత తనకు కానుకగా వచ్చిన బొమ్మ కోయిల నిరంతరం పాడటంతో దానిపై రాజుగారి దృష్టి మరలుతుంది. బొమ్మకోయిల మీట నొక్కితే రకరకాల పాటలు వస్తుండేవి. దాని వ్యామోహంలో పడి రాజుగారు నిజమైన కోయిలను విస్మరిస్తారు. నిజమైన కోయిలకు అడవిని విడిచి రావడం ఇష్టం లేకపోయినా రాజుగారి ఆనందం కోసం వస్తుంది. అట్లాంటి కోయిలను రాజుగారు మరచిపోయేసరికి కోయిలకు బాధ కలుగుతుంది. తిరిగి అడవిలోకి వెళ్ళిపోతుంది. రాజుగారి బొమ్మకోయిల మీట కొంతకాలం పనిచేసి తర్వాత పనిచేయడం మానేస్తుంది. ఎంతమంది ఎన్ని రిపేర్లు చేసినా బాగవ్వదు.

ఎలుకతోలు తెచ్చి యెన్నాళ్ళు నుదికిన
నలుపు నలుపే కాని తెలుపు కాదు!
కొయ్యబొమ్మ దెచ్చి కొట్టిన పలుకునా?
విశ్వదాభిరామ వినురవేమ!!

నల్లగా ఉండే ఎలుక చర్మాన్ని తీసుకుని వచ్చి ఎన్ని రోజుల పాటు ఉతికినా దాని నలుపు పోయి తెల్లగా మారదు. ప్రాణం లేని కొయ్య బొమ్మను ఎంతకొట్టినా దానిచేత పలికించడం సాధ్యంకాదు.

ఈ కథలో బొమ్మకోయిల పనిచేయడం మానేసిన తర్వాత రాజుగారికి నిజమైన కోయిలకి, బొమ్మకోయిలకి ఉన్న తేడా అర్థమవుతుంది. ప్రాణమున్న కోయిల ఎప్పుడంటే అప్పుడు పాటలు పాడేది. ఇప్పటికీ పాడు తుంది. అదే ప్రాణమున్న కోయిలకి, ప్రాణములేని కోయిలకి తేడా. అది గ్రహించిన రాజుగారు బొమ్మ కోయిలను చూసుకుని నిజమైన కోయిలను నిర్లక్ష్యం చేసినందుకు బాధపడతాడు. పాటలు వినకపోవడంతో జబ్బుపడతాడు. చివరకు మరణావస్థలో ఉండగా అడవినుండి నిజమైన కోయిల వచ్చి రాజుగారిని బతికి స్తుంది. రాజుగారు తప్పు తెలుసుకుని నిజమైన కోయిలకు తగిన గౌరవం ఇవ్వడంతో అది ఎంతో ఆనందిస్తుంది. రాజుగారికి నిరంతరం పాటలు వినిపిస్తూ ఆనందింప జేస్తుంది. రాజు సజీవంగా ఉన్న కోయిలను పక్కన పెట్టి నిర్జీవమైన బొమ్మకోయిల వ్యామోహంలో పడి జబ్బుపడతాడు. చివరకు తాను నిర్లక్ష్యం చేసిన కోయిలే ఆయన ప్రాణాలు కాపాడుతుంది.

తనుజులనుం గురువృద్ధుల
జననీ జనకులను సాధుజనుల నెవడు దా
ఘనుడయ్యు బ్రోవడొయా
జనుడే జీవన్మృతుండు జగతి కుమారా!

తన కుమారులను, గురువులను, పెద్దవారిని, తల్లి దండ్రులను, సజ్జనులైన వారిని, ఎవడు తనకు చేతనైనను తగిన సమయమున రక్షింపడో అతడు బతికి ఉన్నను చచ్చినవాడితో సమానమే. ఈ కథలో కోయిల సరైన

సమయంలో అడవి నుంచి వచ్చి రాజుగారి ప్రాణాలు కాపాడుతుంది.

**ముగింపు :**

ఈ ఐదు జానపదగాథలలో మనిషి స్వభావం స్పష్టంగా అవగతమవుతుంది. మూర్ఖపు ప్రశ్నలు కథలో భూపేంద్ర సింగ్ ఎదుటివారి తెలివితేటలు తెలుసుకోవాలనే కూతూహలం, పఠాన్ గర్వం కథలో అలామత్ ఏదీ ఉచితంగా తీసుకోకపోవడం అలా తీసుకుంటే తాను బిచ్చగాడిని అయిపోతాననుకోవడం ముసలిజాలరి కథలో పక్షి చేసిన సహాయాన్ని మరచి సొమ్ము కోసం దానికే కీడు తలపెట్టడం, టక్కరిబాలుడు కథలో బాలుడు చదువుకోవడం వలన దయ్యం బారినుండి ప్రాణాలు కాపాడుకోగలగడం, చైనాకథలో రాజు ప్రాణమున్న కోయిలను మరచి ప్రాణంలేని కోయిలను నమ్ముకోవడం మొదలైన అంశాలు మనిషి బుద్ధిని తెలియజేస్తున్నాయి. జానపదగాథల్లో మానవీయ విలువలు ప్రతిబింబిస్తూ ఉంటాయి. మానవీయ విలువలకు ప్రాధాన్యమిచ్చి సంస్కృతీ, సంప్రదాయాలు రూపొందాయి. నానాటికీ మనిషిలో స్వార్థం పెరిగిపోతూంది. నాడున్న మానవీయ విలువలు నేడు మసకబారుతున్నాయి.

# కోవిడ్ కాలంలో సినిమా థియేటర్లపై ప్లాట్ఫారమ్ల ప్రభావం : తెలుగు చిత్ర సీమ భవిష్యత్తు

- డా॥. కృష్ణ శంకర్ కుసుమ
సోసియేట్ ప్రొఫెసర్, జామియా మిల్లియా ఇస్లామీయ, న్యూ ఢిల్లీ.

- దీపికా దొకె
యూనివర్సిటీ అఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

- ప్రణవి దొకె
ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కడప.

## థియేటర్లో సినిమా చూడటం :

సినిమా తోలుబొమ్మల ప్రదర్శనలు మరియు వీధి నాటకాల రూపంలో చాలా కాలం క్రితం ప్రారంభమైంది. తరువాత పెరుగుతున్న టెక్నాలజీతో సినిమా ఉద్భ వించింది. స్టీరియో సౌండ్, ఈస్ట్మన్ కలర్, బ్లాక్ అండ్ వైట్ మూవీస్, 70 ఎంఎం స్క్రీన్ మూవీస్ ప్రతిదీ కళ్ళు మరియు చెవులకు ఎంతో ఆనందాన్ని కలిగించేవి. తరువాతి సంవత్సరాల్లో సినిమా ఆడే గంభీరమైన థియేటర్ వచ్చింది, అది ధర చెల్లించే ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటుంది. పాత రోజుల్లో ప్రజలు తమ కుటుంబంతో గడపడానికి మరియు వారాంతంలో పని అలసట నుండి బయటపడటానికి థియేటర్కు వచ్చే వారు. సినిమా చూసిన తరవాత చాలా రోజులు సినిమా సమీక్షను ఒకరితో ఒకరు పంచుకునేవారు. ప్రేక్షకులు తమ చింతలను, అలసటను మరచిపోయేవారు మరియు రెండున్నర గంటలు సినిమా కథలో విపరీతంగా నిమగ్నులైవుండేవారు. గూగుల్ మరియు యూట్యూబ్లో యాదృచ్ఛిక వ్యక్తులు అందించే సినిమా సమీక్షలపై ఇప్పుడు ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. కానీ ఈ రోజుల్లో సినిమాల ద్వారా అంత ప్రమేయం లేదా ఆనందం పొందడానికి కథ మరియు కదమ్సం లేదు. థియేటర్లో సినిమా చూడటం అనేది ఒక భిన్నమైన అనుభవం మరియు అనుభూతి, ఇది ఒక సమూహాన్ని ఒకే చోటికి తీసుకువస్తుంది. ఇక్కడ కులం, మతం అనే బేధాలు లేకుండా అందరూ వచ్చి ఆనందిస్తారు. భారతీయ ప్రజలు అందులోను తెలుగు ప్రజలు చాలా మంది తమ కుటుంబాలతో కలిసి పండుగ సమయంలో సినిమాలకు వెళ్ళి ఆనందిస్తారు. సినిమా అనేది కుటుంబ సభ్యులను ఒకే చోటికి తీసుకువచ్చే గొప్పవేదిక. సినిమాను పండుగగా జరుపుకుంటారు మరియు నటులను పూజిస్తారు. కానీ థియేటర్ ద్వారా వచ్చే అనుభవాన్ని దేనితోను పోల్చలేనిది. ప్రస్తుత రోజుల్లో ఓపికగా ఒకే చోట మూడు గంటలు సినిమా చూడడం అసాధ్యంగా మారింది. భారతదేశంలో, ప్రజలు రెండు విషయాలకు ప్రాముఖ్యత ఇస్తారు, ఒకటి క్రికెట్ మరొకటి సినిమా. ఇక్కడ చాలా మంది భారతీయ ప్రజలు 3 గంటలు ఎయిర్ కండీషనర్ అనుభవించడానికి కూడా థియేటర్కు వెళతారు. పాత రోజుల్లో ప్రజలకు థియేటర్ అనేది వ్యక్తిగత కుషన్ సీట్లు మరియు ఎసి లేదా ఫ్యాన్ ఆస్వాదించడానికి ఒక అధునాతన ప్రదేశం. సౌండ్ సిస్టం, నేలపై ఉన్న మాట్స్, ప్రతిదీ చాలా కొత్తది మరియు అద్భుతమైనది, చాలా మంది పేద మరియు మధ్యతరగతి ప్రజలు ఈ విషయాలను ఎప్పుడూ అనుభవించలేదు. పెద్ద-స్క్రీన్ కలిగిన సౌండ్ప్రూఫ్ టెక్నాలజీ, ప్రజలు తమను తాము చాలా సుఖంగా మరియు థియేటర్ ద్వారా లగ్జరీని అనుభవించగలుగుతారు. 3డి ఎఫెక్ట్ సినిమాలను థియేటర్ల ద్వారా ప్రవేశపెట్టారు. నిద్ర భంగిమ స్థితిలో సినిమాలు చూడగల సామర్థ్యం ఉన్న మడత కుర్చీలు అలానే సీటు యొక్క హ్యాండిల్కు పానీయం మరియు

పాప్కార్న్ హోల్డర్ జత చేశారు. ప్రతిదీ ప్రశంసనీయమైన మరియు క్రొత్త విషయం. ఆర్డర్ చేసిన ఆహారాన్ని థియేటర్లోని మన సీటుకు తీసుకువస్తారు మరియు సేవలు అద్భుతంగా ఉంటాయి. సినిమా థియేటర్లో కాకుండా మనల్ని ఎక్కడ ఇలా చూస్తారు? థియేటర్ అనుభవాన్ని OTT భర్తీ చెయ్యలేదు, అభివృద్ధి చెందుతున్న సమాజంలో ఇద్దరికీ స్థానం ఉంది. ఇంట్లో చిన్న స్క్రీన్ ఎప్పుడూ థియేటర్ యొక్క పెద్ద స్క్రీన్ను భర్తీ చేయదు.

ఎం. స్. స్. పాండియన్ గారు తమిళ్ సినిమా గురించి మాట్లాడుతూ, సినిమా హాల్స్, మరియు సినిమా చూడటం వంటివి సమాజం లో తక్కువ స్థాయి లో వున్నా వారి కోసం అన్నట్టుగా మొదట్లో ఉండేవి. సినిమా హాల్ లోపల టికెట్ కొనుగోలు శక్తిని బట్టి ఆయా స్థాయిలుగ (నెల, బెంచ్, బాల్కనీ) విభజించ బడినవి. ఎస్.వి.శ్రీనివాస్ (2000) అభిమానులు సినిమా థియేటర్లను ముఖ్యమైన సామాజిక-రాజకీయ కార్యకలాపాలకు కేంద్రాలుగా చేశారు.

## తెలుగు ప్రేక్షకులు - సినిమా థియేటర్ :

సినిమా థియేటర్ ముందుగా ఒక స్థిరమైన ప్రాంతంలో కాకుండా ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి ప్రయాణిస్తూ ప్రదర్శనలు ఇస్తూ ఉండేది. అందుకే అప్పట్లో సినిమా ని టాకీస్ గా పిలిచే వారు. ఆ తరువాత టెంట్ థియేటర్లు వచ్చాయి. (బాస్కరన్, 1981). దక్షిణ భారత సినిమా చరిత్రలో నే మొదటగా 'గైయిటీ థియేటర్' ని ఒక టెంట్ లో రఘుపతి వెంకయ్య గారు ప్రారంభించారు. ఇది చెన్నై లో ఎస్ప్లనడె అనే ప్రాంతంలో ఉండేది. ఆ తరువాత గైట్స్, క్రౌన్స్ మరియు గ్లోబ్ సినిమా థియేటరుల నిర్మాణం జరిగి సినిమా ప్రదర్శన రంగంలో కొత్త అధ్యాయానికి తెర తీశాయి. (గై, రాండర్. (1997)

ఈ సమయంలో, కరోనా వైరస్ ఒక ప్రముఖ ముప్పుగా ఉన్నంతవరకు థియేటర్లు ఎదుర్కొంటున్న ఈ అనిశ్చితి కొనసాగుతుందని కాదనలేనిది. భయంకరమైన వ్యాధి బారిన పడే ప్రమాదం ఉన్నందున, సాధారణ పౌరులు జాగ్రత్తగా ఉన్నారు మరియు OTT సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా వచ్చే సినిమాలు చూడటానికి ఇష్టపడుతున్నారు. కానీ ఖచ్చితంగా, ఇది థియేటర్లకు ముగింపు కాదు.అగ్రశ్రేణి పరిశ్రమల నేపథ్యంలో సాంప్రదాయిక మోషన్ పిక్చర్ థియేటర్లు మనుగడ సాగిస్తాయా అనే సంభాషణను మనలో ఎవరు ఖండించలేని విషయం. పెద్ద థియేటర్ అనుభవంతో వచ్చే ఆనందం, కనులు ముందు జరుగు తున్నట్టు ఉండే అనుభూతి గతంలో మనల్ని థియేటర్ వైపు పరుగులు తీసేలా ఆకర్షితుల్ని చేసింది. నా అభిప్రాయం ప్రకారం, ప్రేక్షకులు తమ బాల్యం నుండి ప్రారంభమైన థియేటర్లు మరియు సినిమా యొక్క మొత్తం అనుభవానికి భావోద్వేగ అనుబంధం కలిగి ఉన్నారు. వైద్యపరంగా సురక్షితం అని ప్రకటించిన వెంటనే థియేటర్లకు మరియు సినిమాకు తిరిగి వెళతారు. యాభై శాతం తెలుగు ప్రజలు ఇప్పటికే సినిమా థియేటర్ లో సినిమా చూసే అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉన్నారు అని కొన్ని సర్వేలు ద్వారా తెలుస్తుంది. కోవిద్ వలన దిగ్బంధం మరియు స్వీయ-ఒంటరితనం ఫలితంగా OTT వినియోగం పెరుగుతుంది. క్రమంగా ఈ OTTలో సినిమా చూసే అలవాటు సినిమా పరిశ్రమకి ముప్పుగా అలాగే సాంప్రదాయ సినిమా థియేటర్స్కి సంకటంగా మారు తుంది అని అంతా అభిప్రాయపడుతున్నారు. కరోనా మహమ్మారి ద్వారా సంప్రదాయ సినిమా థియేటర్లు చాలా వేగవంతమైన నష్టాన్ని చూసాయి, పూర్తిగా ఎప్పుడు బయటపడతామో అనేది చెప్పలేము. కావున రెండు మాధ్యమాలు సామరస్యంగా కలిసి ఉండాల్సిన సమయం వచ్చింది అని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న కోవిద్ పరిస్థితులు అదుపులోకి వచ్చిన మరుక్షణం అగ్రశ్రేణి సినిమా రంగం పూర్తిగా సినిమా థియేటర్లు పైనే ద్రుష్టి సారిస్తాయి అలానే OTTలో సినిమాలు విడుదల చాలా మేరకు తగ్గిపోతాయి. కేవలం

వేరే బాషల సినిమాలు మరియు చిన్న బడ్జెట్ సినిమాలకు మాత్రమే OTT పరిమితి అయిపోతుంది. అలానే రానున్న కాలంలో ఇలాంటి పరిస్థితులు మళ్ళీ వచ్చిన సినిమా థియేటర్ మూసివేసే పరిస్థితి రాకుండా సినిమా థియేటర్లలో కొన్ని జాగ్రత్తలు మార్పులు చేయించాలి

### సినిమా థియేటర్ తో జ్ఞాపకాలు :

సినిమా చూశామా లేదా అనేకంటే, ఎక్కడ చూసాము, ఎవరితో చూసాము అనేదే తెలుగు మరియు ఇతర దక్షిణ భారత ప్రేక్షకులకు ముఖ్యం. సినిమా హాల్ లో సినిమా చూడడం అనేదానితో ఎన్నో జ్ఞాపకాలు పెనవేసుకొని వున్నాయి. కొత్త గ పెళ్ళైన జంటను తరచు సినిమాకి పంపటం, పండుగ రోజున ఇంటిల్లిపాది సినిమాకు వెళ్లడం, స్నేహం పంచుకోవాలంటే సినిమా థియేటర్, బాధను మర్చిపోవాలంటే సినిమా, ప్రేమ పావురాళ్లకు (కుర్రకారుకు) సినిమా థియేటర్ ఒక అడ్డా. ప్రతి సినిమా థియేటర్ అంతులేని జ్ఞాపకాలకు సాక్షి.

బుకింగ్ కౌంటర్ అనుభవాలు కూడా ప్రేక్షకులకి మరపురాని జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. మొదటి రోజు సినిమా టికెట్ బుకింగ్, నెల, బెంచి, బాల్కనీ టీకెట్స్, పండుగ రోజులలో బ్లాక్ టిక్కెటింగ్ వంటివి వీటిలో కొన్ని. అంతర్జాలంలో టికెట్స్ అమ్మటం మొదలైనప్పటినుండి డిజిటల్ గ అంతరాయాలు ప్రేక్షకులలో ఏర్పడ్డాయి, టికెట్ కౌంటర్ యొక్క ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది.

భక్తి మరియు దేవుని సినిమాల లో తెలుగు సినిమా కు నిర్దిష్టమైన పేరు వుంది. రాముడు, కృష్ణుడు, దేవీ దేవతల సినిమాలు థియేటర్స్ ని పవిత్ర స్థలాలుగా మార్చేస్తుండేవి. దేవుళ్ళ విగ్రహాలు, ప్రేక్షకులకు (భక్తు లకు) పూనకాలు పూనడం వంటివి ఎన్నో సందర్భాలు ఉన్నయి.

హబెర్మాస్, జె. (2010) చెప్పిన విధంగా సినిమా థియేటర్ ఒక బహిరంగ ప్రదేశంగా ఏర్పడింది. అన్ని కులాల, జాతుల, మతాల వాళ్ళకి ఒక తటస్థ ప్రాంతం గ వుంది. దక్షిణ భారతం లో సినిమా రాజకీయాలకు పునాదిగా నటులను రాజకీయ నాయకులుగా, ముఖ్యమంత్రులు గ చేసింది. సినిమా థియేటర్ నటులు స్టార్స్ గా ఎదగడానికి వేదికగా ఉన్నాది. అభిమానులు, అభిమాన సంఘాలను వారి సందడి సినిమా విడుదలై నప్పటినుండి మనకు థియేటర్ దగ్గరే కనిపిస్తుంది. కటౌట్స్, పూలదండలు, పాలాభిషేకాలు, బెనిఫిట్ ప్రదర్శనలు సినిమా థియేటర్ లో పండుగ వాతావరణం కనిపిస్తుంది. కులరాజకీయం సినిమా తో తోడయ్యి అభిమాన సంఘాల మధ్య గొడవలకు కూడా థియేటరులే సాక్ష్యం.

### OTT పెరుగుదల :

OTT ప్లాట్ఫాం ప్రతి ఒక్కరికీ, ఎక్కువగా మధ్యతరగతి కుటుంబాలకు సినిమాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రాంతీయ భాషల్లో ఉన్న సినిమాలు మాత్రమే కాదు, భారతదేశంలోని ఇతర భాషా సినిమాలు మరియు హాలీవుడ్ సినిమాలు కూడా OTT ద్వారా అందుబాటులో ఉన్నాయి. కాబట్టి, ఇతర భాషా సినిమాలకు వీక్షకుల సంఖ్య కూడా పెరిగింది. ప్రజలు తీరికలేని పని ఒత్తిడి వల్ల థియేటర్లో సినిమా చూడటానికి సమయం కేటాయించలేకపోతున్నారు. అందరూ దానికి బదులుగా ఇంట్లోనే హోమ్ థియేటర్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడు మనకు కావలసిన సినిమాను ఎప్పుడైనా ఎక్కడైనా OTT సహాయంతో చూడవచ్చు. సౌకర్యం మరియు సౌలభ్యం కోసం మన ప్రాధాన్యత OTT కోసం మార్గం సుగమం చేసింది. మన మునుపటి ఆసక్తుల ఆధారంగా సిఫార్సు చేయబడిన సినిమాలను చూడటం OTT ద్వారా చాలా సులభం. చూసే ప్రేక్షకుల ఆధారంగా సినిమాలను వర్గీకరించగల సామర్థ్యం కూడా OTTలో ఉంది. పిల్లల కోసం పిల్లల సినిమాలు, కుటుంబం, డ్రామా, థ్రిల్లర్, రోమ్-కామ్, హర్రర్ అన్ని ఛాయిస్లు మన చేతుల్లో ఉన్నాయి. లాక్డౌన్ సమయంలో, OTT కుటుంబ సభ్యులను దగ్గరకు తీసుకువచ్చింది. వివిధ భాషల

సినిమాలు, యానిమేటెడ్ చలనచిత్రాలు మరియు ఎప్పుడైనా టీవీ సీరియల్స్ చూడటానికి లభ్యత OTT ద్వారా సాధ్యమవుతాయి, ఇది చిన్న పిల్లల నుండి బామ్మ మరియు ఇంట్లో తాతల వరకు ప్రతి వయస్సు ప్రేక్షకుల ఆసక్తిని ఎంపొందించింది. ఇప్పుడు కేబుల్ లేదా సన్ డైరెక్ట్ లేదా టాటా స్కై అవసరం లేదు ప్రతిదీ OTT ప్లాట్ఫాంపై చూడవచ్చు. OTT కోసం పెరుగుతున్న డిమాండ్ మరియు ప్రేక్షకులతో, డిజిటల్ ప్లాట్ఫారమ్లను నియంత్రించడానికి ప్రభుత్వం చర్యలు లేదా మార్గ దర్శకాలను తీసుకుంది. నగ్నత్వాన్ని నియంత్రించడానికి మరియు ఉపయోగించాల్సిన పదాలను గూర్చి సెన్సార్ బోర్డు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మూవీ టిక్కెట్లు మరియు మాల్ లో మూవీ యొక్క అధిక ధర కంటే, తక్కువ ఖర్చుతో ఎన్నో సినిమాలను చూడగలిగే OTT ఆకర్షిస్తుంది.

మన రాష్ట్రంలో కేవలం తెలుగు సినిమాలు లేదంటే తెలుగులోకి అనువదించిన ఇంగ్లీష్ మరియు హిందీ సినిమాలు మాత్రమే థియేటర్లో విడుదల అవుతాయి. అదే OTT ప్లాట్ఫారం ద్వారా అన్ని భాషల సినిమాలు మనకు అందుబాటులోకి వచ్చాయి దాని వలన వాళ్ళ సంప్రదాయాలు, సంస్కృతి మనం తెలుసుకోగలుగు తున్నాము. నెట్ఫిక్ లో రిలీజ్ అయిన రెండు తమిళ చిత్రాలు KD (A) Karuppudurai మరియు మండేలా చిత్రాల ద్వారా తమిళనాడులో పాటించే ఒక దురాచారం గురించి మనకి తెలిసింది. తలైకూతఅల్ అనే సంప్ర దాయం వయసు అయిపోయి మంచానికే పరిమిత మయిన ముసలివాళ్లను కుటుంబస్తులు చంపేసి వాళ్ళకి విముక్తి ప్రసాదిస్తారు. తలకి బాగా నూనె మర్దన చేసి పది నుండి పన్నెండు లేత కొబ్బరికాయలు తాగిస్తారు దీని వలన మూత్రపిండాలు దెబ్బతిని మెల్లగా మిగతా అవయవాలు కూడా పని చెయ్యటం మానేసి రెండు మూడు రోజుల్లో చనిపోతారు. ఇలా వేరే భాష చిత్రాలు చూడటం వలన కూడా ఎన్నో విషయాలపై పరిజ్ఞానం పొందడానికి అవకాశం వుంది.

## OTT లో ఉన్న పలురకాలు :

తెలుగు సినిమాను వివిధ ఒటిటి ప్లాట్ఫామ్లలో అందిస్తున్నారు. వాటిని విస్తృతంగా నాలుగు వర్గాలుగా వర్గీకరించారు. 1. తెలుగు భాషా-నిర్దిష్ట %ఒు%, ఇక్కడ తెలుగు భాషా సినిమా లేదా ఇతర భాషా సినిమా మరియు తెలుగులో డబ్ చేయబడిన వెబ్ సిరీస్ మాత్రమే అందించబడతాయి. 2. సౌత్ ఇండియన్ స్పెసిఫిక్ OTT తెలుగు, తమిళం, మలయాళం మరియు కన్నడ అనే నాలుగు దక్షిణ భారత భాషల నుండి సినిమాలను అందిస్తుంది. 3. జాతీయ (భారతీయ) నిర్దిష్ట OTT ప్రధానంగా హిందీ భాషా కంటెంట్. ఇక్కడ మీరు దక్షిణ భారత భాషా చిత్రాలతో పాటు దక్షిణ భారతదేశం నుండి వచ్చిన అసలు చిత్రాలను దాని భాషలలో చూడవచ్చు. అంతర్జాతీయ %ఒు% ఎక్కువగా ఆంగ్లంలో కంటెంట్ను అందిస్తుంది, అయితే వివిధ భారతీయ భాషలలోని ఆడియో మరియు ఉపశీర్షికలతో పాన్-ఇండియన్ కంటెంట్ను కవర్ చేస్తుంది.

## తెలుగు భాషా - నిర్దిష్ట OTT :

"ఆహా", తెలుగులో మొదటి ప్రాంతీయ OTT ప్లాట్ఫాం ఇది 2020 లో ప్రారంభమైయింది, ఇక్కడ పాత నుండి తాజా తెలుగు సినిమాలు అన్ని అందు బాటులో ఉన్నాయి. కొన్ని ఆహా ఒరిజినల్ సినిమాలు, తెలుగు టాక్ షోలు చాలా మంది తెలుగు ప్రజల హృదయాలను ఆకట్టుకున్నాయి. ఇది తక్కువ ధర వార్షిక ప్రణాళికలో ఒక ఖాతాకు 10 స్క్రీన్లతో వస్తుంది.

## దక్షిణ భారత నిర్దిష్ట OTT :

"సన్ నెక్స్ట్", OTT ప్లాట్ఫాం ద్వారా సన్ టివి, జెమిని టివి, సూర్య టివి మరియు ఉదయ టివిలలో ప్రసారమయ్యే టివి సీరియల్స్ మరియు ప్రోగ్రామ్లతో పాటు దక్షిణ భారతదేశ ప్రాంతీయ భాషల్లో సినిమాలు

అందుబాటులో ఉన్నాయి. అలాంటి మరొక ప్రాంతీయ OTT ప్లాట్ఫాం ముఖ్యంగా మలయాళ చలన చిత్రాల కోసం నీ స్ట్రీమ్, ఇది దేశవ్యాప్తంగా చాలా మంది ప్రేక్షకుల ఆసక్తిని పొందింది. అలాగే ఆనంద్ టీవీ, కేరళ విజన్, నీ సినిమా, జీవన్ టీవీ, వి టీవీ, దర్శన టీవీ, సఫారి టీవీ, కైరాలి టీవీ వంటి కొన్ని స్థానిక టీవీ ఛానల్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.

**జాతీయ (భారతీయ) నిర్దిష్ట OTT :**

జీ5, భారతదేశంలోని అన్ని ప్రాంతీయ భాషలలో లభించే అగ్రశ్రేణి ఛానెల్ ,ఇది డిస్నీ హాట్స్టార్, అమెజాన్ ప్రైమ్ మరియు నెట్ఫ్లిక్స్తో పోటీపడి రాబోయే OTT ప్లాట్ఫామ్లలో ఒకటి. జీ టీవీ, జీ తెలుగు, జీ తమిళం, జీ మలయాళం, జీ కన్నడ తదితర జీ చానెల్స్ ద్వారా సినిమాలు, టీవీ సీరియల్స్ అందుబాటులో ఉన్నాయి. JioCinema అనేది ఉచిత OTT ప్లాట్ఫామ్, ముఖ్యంగా జియో ఫోన్ నంబర్లను కలిగి ఉన్న వ్యక్తులకు మాత్రమే పరిమితం చేయబడింది.. ఇది లైవ్ టీవీని చూడగలిగే జియో టీవీతో పాటు వస్తుంది. ఎయిర్టెల్ ఎక్స్ట్రీమ్, వూట్, ఆల్ట్ బాలాజీ, సోనిలివ్, వియు, హొయిచోయ్ - బెంగాలీ కంటెంట్, ఈరోస్ నౌ మరియూ అన్ని టెలిఫోన్ సంస్థలు OTT లను ఆఫర్ గ మరియు తమ సొంత ప్లాటుఫార్మ్ను కూడా ఏర్పరుచు కున్నాయి.

**అంతర్జాతీయ OTT :**

ప్రపంచవ్యాప్తంగా విస్తారమైన OTT ప్లాట్ఫాంలు ఏ ప్రదేశం నుండి అయినా అందరికీ దగ్గరగా అందు బాటులో ఉన్నాయి. ఉపశీర్షికలతో అన్ని భాషలలో విస్తృత శ్రేణి సినిమాల లభ్యత ఉత్తమమైనది. అమెజాన్ ప్రైమ్, నెట్ఫ్లిక్స్ మరియు డిస్నీ హాట్స్టార్ అగ్రస్థానంలో ఉన్నాయి. యూట్యూబ్ అనేది పురాతన OTT ప్లాట్ఫామ్, ఇక్కడ పేదల నుండి ధనవంతుల వరకు ప్రతిదీ పొందుతాము. అందరూ యూట్యూబ్తో సమయం గడుపుతారు. డిస్నీ హాట్స్టార్ అనేది అంతర్జాతీయ OTT ప్లాట్ఫాం, భారత దేశంలోని అన్ని ప్రాంతీయ భాషల స్టార్ ప్లస్, స్టార్ మా మొదలైన వాటి ద్వారా వచ్చే టీవీ సీరియల్స్ ఇందిలో లభిస్తున్నాయి , హాట్స్టార్ ం డిస్నీ యువ ప్రేక్షకులు కోరుకునే డిస్నీ లేదా యానిమేటెడ్ చలనచిత్రాలను జోడించింది. అగ్రస్థానంలో ఉన్న అమెజాన్ ప్రైమ్ షాపింగ్ అనువర్తనం, మధ్యతరగతి ప్రజలు మరియు విద్యార్థులకు అందుబాటు ధరలతో విస్తృత శ్రేణి వర్గాలతో ఉన్న ఎన్నో సినిమాలును అందిస్తుంది. నెట్ఫ్లిక్స్ ఖరీదైన OTT ప్లాట్ఫామ్లలో ఒకటి, భారతదేశంలోని టీవీలలో "నెట్ఫ్లిక్స్ ఎన్ చిల్" అనే టాగ్ లైన్తో ప్రచారం చేస్తున్నారు. ఇందిలో పురాణ చలనచిత్రాలు, డాక్యుమెంటరీలు, వెబ్ సిరీస్లు అలానే ఇది కామ కథల చిత్రంతో ప్రాచుర్యం పొందింది. ముబి (కల్ట్ క్లాసిక్స్ టు మోడరన్ మాస్టర్ పీస్) అనేది కొత్త వేదిక, ఇక్కడ పాత కాలం నుండి అన్ని భాషల ఆధునిక యుగం వరకు ప్రత్యేకంగా ఎంచుకున్న ప్రామాణికమైన సినిమాలు అందుబాటులో ఉన్నాయి.

**కోవిడ్ మహమ్మారి మరియు సినిమా థియేటర్లు:**

OTT రాకతో కొత్త-పాత సినిమాలను మంచి ప్రమాణాలతో ఇంటి ఇంటికి తీసుకువచ్చింది. సినిమా పెద్ద స్క్రీన్ నుండి ఇంట్లో చిన్న టీవీ స్క్రీన్కు, మొబైల్ ద్వారా అర చేతిలోకి మారిపోయింది. నెలకు రూ./- నుంచి సంవత్సరానికి 399/- కోసం ప్రజలు తమ ఇంట్లోనే ఉండి అతి తక్కువ ఖర్చుతో సినిమాలను చూడవచ్చు. కరోనా మహమ్మారి సమయంలో ఇంట్లో వారి సోఫాతో కట్టిపడేసిన ప్రజలకు ఇది ఉత్తమ వినోదంగా చెప్పవచ్చు. కరోనా మహమ్మారి సమయంలో చాలా మంది ప్రజలు OTT గురించి తెలుసుకున్నారు.

'ఆహా' OTT తెలుగు సినిమాలని రిలీజ్ చేయడమే కాక వాటి ప్రచారం, మార్కెటింగ్ మరియు టెలివిజన్, సామజిక మాధ్యమాల లో ప్రమోషన్ బాధ్యతలను కూడా తీసుకొని సినిమా రంగంలో కొత్త బిజినెస్ విధానలని తెరపైకి తెచ్చాయి.

సినిమా థియేటర్ మీద ఆధారపడిన ఉద్యోగులకు, వ్యాపారులకు OTT రాకతో జీవవనోపాది కోల్పోతున్నారు. పార్కింగ్ లో పని చేసేవారు, కాంటీన్ నడిపేవారు, టికెట్ కౌంటర్ నడిపేవారు, ప్రొజెక్షనిస్ట్ మరియు ఇతర సాంకేతిక నిపుణులు, స్వీపరులు, ప్రచార సామగ్రి తాయారు చేసేవారు, డిస్ట్రిబ్యూటర్లు ఇంకా యాజమాన్యం ఇలా చాల మంది సినిమా ఎడిటింగ్ రూమ్ నుండి పనిచేసే రంగం రోజు రోజుకీ కనుమరుగవుతుంది. సినిమా హాల్స్ ఆయా ప్రాంత లోకల్ ప్రభుత్వాలకు పన్నుల రూపం లో వెన్ను దన్నుగా ఉన్నాయి. ఇప్పుడు OTT రాకతో సినిమా ద్వారా వచ్చే ఉద్యోగాలు మరియు పన్నులు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. OTT సంస్థల ఖాతాల్లోకి లాభాలు వెళుతున్నాయి.

టెలివిజన్ రంగం అభివృద్ధి జరగినప్పుడు కొన్ని సినిమా హాల్స్ కల్యాణ మండపాలుగా, అపా ర్ట మెంట్స మారాయి. సినిమా హాల్స్ ప్రపంచీకరణ, మార్కెట్ మార్పుల వలన సినిమా హాల్స్ సీటింగ్ కెపాసిటీ తగ్గించి ఒక థియేటర్ని రెండు లేదా మూడు థియేటర్లు మార్చడం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో మనం చూడవచ్చు. బహుళ అంతస్తుల మాల్స్ (బజారులు) వచ్చిన తరువాత చిన్న సినిమా హాల్స్ గుంపుగా ఒకే చోట అందుబాటులోకి వచ్చారు. ఈ మార్పు సినిమా థియేటర్ కల్చర్ ని రూపు మార్చాయి. అభిమాన సంఘాలు, అభిమానులు అంత ర్జాలం, సామజిక మాధ్యమాలలో తమ అభిమానినని వ్యక్తపరుస్తున్నారు. ఈరోస్, సత్యం, రిలయన్స్, పి.వి. ఆర్ మరియు సినిమా కుటుంబాలు సినిమా థియేటర్స్ తమ కిందకు తెచ్చుకొని గుత్తాధిపత్యం తద్వారా చిన్న సినిమాలకు అవకాశం తక్కువగా కల్పిస్తూ సినిమా రంగం మీద పెను మార్పులు తెచ్చారు.

## సినిమా ప్రదర్శన యొక్క భవిష్యత్తు :

ఈ కరోనా సమయంలో సినిమా చాలా అభివృద్ధి చెందింది. చిన్న-బడ్జెట్ సినిమాలు పెరుగుతున్నాయి మరియు క్రమంగా గుర్తించబడుతున్నాయి. ఈ ప్రకారం లాక్డౌన్ సమయాలలో, చాలా చిన్న-బడ్జెట్ సినిమాలు సమాచార మరియు ప్రేరణాత్మక స్క్రిప్టతో అభివృద్ధి చెందాయి, ఇక్కడ కథ చాలా తక్కువ పాత్రలు మరియు పరిమిత స్థానాల చుట్టూ తిరుగుతుంది. లాక్డౌన్ సమయంలో చిన్న-బడ్జెట్ సినిమాలు మరియు వెబ్ సిరీస్లు పెద్ద విజయాన్ని సాధించాయి. అవి చాలా మంది ప్రజల హృదయాలను ఆకర్షిస్తున్నాయి. కాబట్టి తదనుగుణంగా భవిష్యత్తులో అధిక బడ్జెట్ సినిమాల కంటే చిన్న బడ్జెట్ సినిమాలకు అవకాశం ఉంది. భవిష్యత్తులో థియేటర్లు మూసివేయబడతాయి లేదా ప్రీ-పాండమిక్తో పోలిస్తే వాటి సంఖ్య తగ్గుతుంది. అయితే, థియేటర్లో చలనచిత్రం చూడడం అనేది ఒక మధురానుభూతి, అది ప్రజల హృదయాల్లో ఎప్పటికీ ఉంటుంది. భవిష్యత్తులో OTTలో ఒక సినిమాను విడుదల చేయడం ద్వారా అగ్ర హీరోలకు మరియు అధిక బడ్జెట్ సినిమాలకు భారీ నష్టం కలిగించవచ్చు.

**ప్రస్తావనలు :**

గై, రాండర్. (1997) స్టార్లైట్, స్టార్బ్రైట్ - ది ఎర్లీ తమిళ సినిమా. చెన్నై: అమరా

హబెర్మాస్, జె. (2010). పబ్లిక్ స్పియర్: ఎన్సైక్లోపీడియా ఆర్టికల్ (1964). ప్రజా గోళం యొక్క ఆలోచన: ఒక రీడర్, 114-120.

బాస్కరన్, ఎస్. థియోడర్ (1981) ది మెసేజ్ బేరర్స్: ది నేషనల్ పాలిటిక్స్ అండ్ ది ఎంటర్టైన్మెంట్ మీడియా ఇన్ సౌత్ ఇండియా 1880-1945 మద్రాస్

పాండియన్, M.S.S. (1995) 'బియాండ్ కలోనియల్ క్రంబ్స్: కేంబ్రిడ్జ్ స్కూల్, ఐడెంటిటీ పాలిటిక్స్ అండ్ ద్రావిడియన్ మూవ్మెంట్ (లు)' ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ 30: 7/8 (ఫిబ్రవరి 18-25)

శ్రీనివాస్, ఎస్. వి. (2000). సినిమా హాలులో పబ్లిక్ ఉందా? ఫ్రేంవర్క్, 42.

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# మహిళలపై హింస నిర్మూలనకు జాతీయ మరియు అంతర్జాతీయ చట్టాలు ఒక పరిశీలన

- డా॥. ఎమ్. నాగేశ్వర రావు
డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్,
ఉస్మానియా యూనివర్సిటీ,
హైదరాబాద్.

- డా॥. ప్రవీణ్ కుమార్
రీసెర్చ్ అసిస్టెంట్, ప్రాంతీయ పట్టణ పర్యావరణ
మరియు అధ్యయన కేంద్రం, ఉస్మానియా
యూనివర్సిటీ హైదరాబాద్.

ప్రపంచవ్యాప్తంగా నేడు మహిళలు మరియు బాలికలు అనేక రకాలైన హింసలకు, నేరాలకు, వేధింపులకు గురి అవుతున్నారు. హింస అనేది మానవ హక్కుల ఉల్లంఘన. ఇది ప్రపంచంలోని పేద, ధనిక దేశాలు అనే తేడా లేకుండా అనేక దేశాల్లో వివిధ రూపాలలో మహిళల పైన హింస జరుగుతూనే ఉంది. కొన్ని దేశాల్లో ఈ పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. అక్కడి మహిళలు, బాలికలు విద్యకి, ఉద్యోగానికి అనర్హులు. మరికొన్ని దేశాల్లో స్త్రీ ఒక బానిసగా జీవించ వలసి వస్తుంది. చాలా సందర్భాల్లో మహిళలపై జరుగు తున్న హింసాత్మక సంఘటనలను, నేరాలను కేసులుగా నమోదు చేయడం లేదు.ఒకవేళ నమోదు చేసిన నిందితులకి శిక్ష విధించడంలో జాప్యం లేదా పూర్తిగా శిక్ష పడకపోవడం అనేది జరుగుతుంది. ఐక్యరాజ్యసమితికి చెందిన యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (UNODC) (వియన్నా) పరిశోధనల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అన్ని మహిళల హత్య , అత్యాచారం , గృహ హింస , వేధింపులు వంటి మొదలగు నేరాలలో బాధితులలో దాదాపు 60 శాతం మంది సన్నిహిత భాగస్వాములు లేదా కుటుంబ సభ్యుల చేతిలో మరణిస్తున్నారు. ఇది లింగ సంబంధిత వివక్షతను మరియు ప్రాణాంతక హింసకు పరాకాష్టను సూచిస్తుంది. ఈ హింస పాటు, అనేక రూపాల నేరాలు ,వివక్షత నేటికీ కొనసాగుతూనే ఉంది. వీటిలో ఆన్‌లైన్ బెదిరింపు, వేధింపులు, సహజీవనం, సంబంధాల దుర్వినియోగం మరియు అత్యాచారం వంటివి నేరాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహిళలపై జరుగుతున్న అనేక రకాలైన హింసను నిర్మూలించడానికి ఐక్యరాజ్యసమితి (యుఎన్) అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలనకు నడుం బిగించింది. ఇందుకుగాను అంతర్జాతీయ మహిళల పై హింస నిర్మూలన దినోత్సవంలో వివిధ దేశాల ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు మరియు ప్రభుత్వేతర సంస్థలు మహిళలపై జరుగుతున్న అనేక రకాలైన హింసల పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తుంది. దీనికి గాను 2000 సంవత్సరం నుండి ప్రతి నవంబర్ 25 ను" అంతర్జాతీయ మహిళా హింస నిర్మూలన దినం గా" జరుపుకుంటున్నాము.

**నేపథ్యం :**

నవంబర్ 25, 1960 న, డొమినికన్ పాలకుడు రాఫెల్ ట్రుజిల్లో ఆదేశాల మేరకు డొమినికన్ రిపబ్లిక్‌లో ముగ్గురు సోదరీమణులు, పాట్రియా మెర్సిడెస్ మిరాబల్, మరియా అర్జెంటీనా మినర్వా మిరాబల్ మరియు ఆంటోనియా మరియా తెరెసా మిరాబల్ హత్యకు గురయ్యారు. ట్రుజిల్లో నియంతృత్వాన్ని అంతం చేయడానికి మిరాబెల్ సోదరీమణులు తీవ్రంగా పోరాడారు. మహిళల హక్కులపై కార్యకర్తలు 1981 నుండి ఈ ముగ్గురు మహిళలు మరణించిన వార్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయంగా మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఒక

రోజును జరపాలని నిర్ణయించుకున్నారు. డిసెంబర్ 17, 1999 న, నవంబర్ 25 ను ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం మహిళలపై హింసను నిర్మూలించడానికి అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవంగా నిర్ణయించింది.

## ఐ.రా.స. ఉమెన్ సంస్థ- కృషి :

మహిళలపై హింసను నిర్మూలించడానికి అంతర్జాతీయ దినోత్సవంను ఐక్యరాజ్య సమితికి చెందిన" ఎంటిటీ ఫర్ జెండర్ ఈక్వాలిటీ అండ్ ది ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ నిర్వహిస్తుంది. దీనిని యుఎన్ ఉమెన్ అని కూడా పిలుస్తారు.ఇది మహిళల సాధికారత కోసం పనిచేస్తున్న ఐక్యరాజ్యసమితి సంస్థ.

## మహిళలపై హింసలను నిర్మూలించడంపై UN జనరల్ అసెంబ్లీ ప్రకటన:

మహిళలపై జరిగే అన్ని రకాల హింసలను నిర్మూలించడంపై యుఎన్ జనరల్ అసెంబ్లీ డిక్లరేషన్ ద్వారా వైవాహిక అత్యాచారాలు మహిళలపై హింసకు గుర్తైనట్లు గుర్తించబడ్డాయి.మానవ హక్కులలో సార్వత్రిక ప్రకటనను 1948 లో యుఎన్ జనరల్ అసెంబ్లీ ఆమోదించింది. దీనిని అంతర్జాతీయ మాగ్నా కార్టాగా కూడా వర్ణించారు. ఈ క్రింది మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు పేర్కొనబడ్డాయి. అవి.

a. కన్వెన్షన్ ఆన్ పొలిటికల్ రైట్స్ ఆఫ్ ఉమెన్ (1958)
b. కన్వెన్షన్ ఆన్ ది నేషనలిటీ ఆఫ్ మ్యారీడ్ ఉమెన్ ( 1958)
c. కన్వెన్షన్ ఆన్ ది కన్ సెంట్ ఆఫ్ మ్యారేజ్ మినిమం ఏజ్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ మ్యారేజేస్ (1964)
d. కన్వెన్షన్ ఆన్ ది ఎలిమినేషన్ ఆఫ్ ఆల్ ఫామ్స్ ఆఫ్ డిస్క్రిమినేషన్ అగైనెట్స్ ఉమెన్ ( 1979)
e. కన్వెన్షన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ ద చైల్డ్ (1986)
f. ఆప్షనల్ ప్రోటోకాల్ టు ద కన్వెన్షన్ ఆన్ ది ఎలిమినేషన్ ఆఫ్ ఆల్ ఫామ్స్ ఆఫ్ డిస్క్రిమినేషన్ అగై నెస్ట్ ఉమెన్ (2000)

## భారత రాజ్యాంగంలో మహిళా రక్షణ చట్టాలు :

బాల్య వివాహ నిరోధక చట్టం, (1929), ముస్లిం వ్యక్తిగత చట్టం (షరియాత్) (1937), కనీస వేతనాల చట్టం (1948), హిందూ వివాహ చట్టం (1955), ఇమ్ మోరల్ ట్రాఫికింగ్(ప్రివెన్షన్) యాక్ట్(1956), వరకట్న నిషేధ చట్టం (1961), మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ (1971), మహిళల అసభ్య ప్రాతినిధ్యం (నివారణ) చట్టం (1986), సతీ సహగమం (నివారణ) చట్టం (1987), నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ యాక్ట్ (1990), ది ప్రీ-కాన్సెప్షన్ అండ్ ప్రీ-నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (లైంగిక ఎంపిక నిషేధం) చట్టం (1994), గృహ హింస నుండి మహిళల రక్షణ చట్టం (2005), లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ (పోక్సో) చట్టం (2012), పని ప్రదేశంలో మహిళల లైంగిక వేధింపులు (నివారణ, నిషేధం) చట్టం (2013) .

## భారత దేశంలో మహిళల స్థితిగతులు :

లింగ అసమానతలను దశలవారీగా తొలగించడం ద్వారా మహిళలకు సమాన న్యాయం అందించే దేశాలలో భారతదేశం ఒకటి . మనదేశంలో లక్ష్మి, సరస్వతి వంటి స్త్రీ దేవతలను ఆరాధిస్తున్నాము. ప్రాచీన భారతీయ చరిత్రలో మహిళా పండితులు మరియు మహిళా పాలకులుగా రాణించారు. క్రీస్తుపూర్వం 4000 వేద కాలంలో స్త్రీలకు పురుషులతో సమానమైన హోదాను కలిగి ఉన్నారు. పురాణ ఇతిహాసాలలో మహిళలు రాజ్య పరిపాలనలో ప్రత్యేక స్థానం అన్నట్టుగా పేర్కొంటున్నాయి. వేద కాలంలో విద్యావేత్తలుగా అనేక చర్చలు మరియు ప్రసంగాల్లో పాల్గొన్నారు. పాండ్య రాజ్యాన్ని మహిళలు కూడా పాలించినట్లు "ఇండికా" గ్రంథంలో మెగస్తనీస్ రాశాడు. మరియు శాతవాహన రాజ్యంలో; రాణి "నాగనికా" రాజ్య పాలన చేశారు. గుప్తుల కాలంలో,

మొదటి చంద్రగుప్త "భార్య కుమార దేవి పాలనకు గుర్తుగా వారి బొమ్మలతో కొన్ని నాణేలను ముద్రించారు. చాళుక్య రాజ్యంలో విజయ భట్టారిక రాణి హెూదాలో పరిపాలించారు. నాగరిక సమాజంలో మహిళలు ఎల్లప్పుడూ వివక్షకు గురవుతారు మరియు మౌనంగా వివక్షతను భరిస్తున్నారు. ఆధునిక భారతదేశంలో, 70 శాతం మంది మహిళలు వివిధ నేరాలకు గురవుతున్నారు. 2019-2020 సంవత్సరం నాటి" ప్రపంచ ఆర్థిక ఫోరం" రూపొందించిన (WEF - 2020), లింగ సూచిక నివేదిక ప్రకారం, భారతదేశం లింగ వివక్షతలో ప్రపంచంలో 112వ ర్యాంకులో ఉంది. 2018- 2019 సంవత్సరంలో దేశంలో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికలో మహిళలపై సుమారుగా 3.60 లక్షల నేరాలు నమోదయినట్లుగా పేర్కొంది. 2019 సంవత్సరానికి NCRB నివేదికలో 17,521 కేసులతో తెలంగాణ రాష్ట్రం, దేశంలో మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలలో 9 వ స్థానంలో ఉంది. డిల్లీలో నిర్భయ అత్యాచారం సంఘటన తరువాత; 24 అక్టోబర్, 2014 న తెలంగాణ పోలీసులు "షీ టీమ్స్" ను మహిళల, బాలికల రక్షణ కోసం ప్రారంభించారు.ఆంధ్ర ప్రదేశ్ లో మహిళల రక్షణ కోసం దిశ "మహిళా పోలీస్ స్టేషన్" లను ఏర్పాటు చేశారు.12 ఏళ్లలోపు బాలికలపై అత్యాచారానికి మరణశిక్ష విధించిన మొదటి రాష్ట్రం మధ్యప్రదేశ్.రాజస్థాన్ అసెంబ్లీ క్రిమినల్ లాస్ (రాజస్థాన్ సవరణ) బిల్లును మార్చి 09, 2018 న ఆమోదించింది. 12 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలికలు. కొత్త సవరణ 1860లో భారత శిక్షాస్మృతికి సెక్షన్ 376-ఎఎ మరియు 376-డిడిని చేర్చారు. క్రిమినల్ సవరణ చట్టాలు (రాజస్థాన్ సవరణ బిల్లు,) 2018 ఆమో దించడంతో, బాల రేపిస్టులకు మరణశిక్ష విధించిన రెండవ రాష్ట్రంగా రాజస్థాన్ నిలిచింది.

## భారతదేశంలో మహిళలపై హింస :

అత్యాచారం, యాసిడ్ దాడి, వరకట్న హత్యలు, పరువు హత్యలు, మానవ అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్ మరియు యువతులతో బలవంతంగా వ్యభిచారం చేయించడం, చేయడం వంటి మహిళలపై నేరాలు మన దేశంలో రోజురోజుకు పెరుగుతున్నాయి. మన పోలీసు రికార్డులు మహిళలపై నేరాలు ఎక్కువగా జరుగుతున్నట్లు పేర్కొంటున్నాయి. దేశం యావత్ ను దిగ్భ్రాంతికి గురి చేసిన అత్యంత, హేయమైన నిర్భయ అత్యాచారం కేసు దేశ రాజధానిలో జరిగింది. ఉన్నావ్ పైన అత్యాచారం, బాధితురాలి కుటుంబ సభ్యుల హత్య కేసు ఏకంగా రాజకీయ నాయకులు చేసిన అత్యాచారం, హత్యోదంతం. కతువా చిన్నారి రేప్ కేసు, దిశ , హత్రస్ గ్యాంగ్ రేప్ లు సమాజాన్ని భయాందోళనలకు గురి చేసిన దుర్ఘటనలు. దేశానికి చట్టాలు చేయవలసిన వారే, రక్షణ కల్పించాల్సిన బాధ్యత కలిగిన నాయకులే ఈ విధంగా మహిళలు పైన అత్యాచారాలు, హత్యలు చేయడం చూస్తే ఎంతో బాధ కలుగుతుంది. వీరేనా దేశ భవిష్యత్తుకు అవసరమైన చట్టాలను దేశ అత్యున్నత శాసన వ్యవస్థ ద్వారా రూపొందించేది? అనే ప్రశ్న విజ్ఞత కలిగిన ఆలోచనా పరులు రేకెత్తిస్తున్న తీస్తున్న ప్రశ్న. కొందరు పోలీసులు సైతం మహిళలపై హత్య, అత్యాచారం, నేరాలు చేయడం పోలీసు వ్యవస్థకే ప్రశ్నార్థకం.

## జాతీయ నేర గణాంకాల నమోదు సంస్థ నివేదిక (NCRB) :

దీనినే నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో అంటారు. ఈ సంస్థ కేంద్ర హెూం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ సంస్థ ముఖ్య విధి దేశంలోని వివిధ రాష్ట్రాలలో, కేంద్ర ప్రాంతాలలో జరిగినటువంటి వివిధ రకాల నేరాలను నమోదు చేస్తుంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, 2010 నాటి నివేదికలో మహిళలపై నేరాల పెరుగుదల రేటు, జనాభా పెరుగుదల రేటును మించి పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది.అంతకు ముందు, అత్యాచారం మరియు వేధింపులకు సంబంధించిన సామాజిక కళంకం కారణంగా మహిళలపై అనేక నేరాలు పోలీసులకు నివేదించబడలేదు. ఎన్సిఆర్బి (నేషనల్

క్రైమ్ రికార్డ్స్ బ్యూరో) 2017 రిపోర్ట్ ప్రకారం దేశంలో మహిళలపై 59,849 కేసులు నమోదయ్యాయి. 56,011 కేసులతో రాష్ట్రాల వారీగా ఉత్తర ప్రదేశ్ అగ్రస్థానంలో ఉండగా, రెండు, మూడవ స్థానాలలో 31,979 కేసులతో మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ 30,002 కేసులు నమోదయ్యాయి. తెలంగాణ రాష్ట్రం 17,521 కేసులతో 9 వ స్థానంలో ఉంది. దేశంలోని 19 మెట్రోపాలిటన్ నగరాల్లో, హైదరాబాద్ నగరం (హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లు ఉన్నాయి) 2332 కేసులతో మహిళలపై నేరాలలో నాల్గవ స్థానంలో ఉంది. దేశ రాజధాని ఢిల్లీ (11,724), మహిళలపై జాతీయ స్థాయిలో నేరాలకు మొదటి స్థానంలో నిలిచింది, ఆ తర్వాత ముంబై (6,058), బెంగళూరు (3,427) వరుసగా జాబితాలో నిలిచాయి. ఏది ఏమైనప్పటికీ, భారత శిక్షాస్మృతి ప్రకారం 1 లక్షకు 1,050 నేరాలతో ఢిల్లీలో అత్యధిక నేరాలు నమోదు అవుతున్నాయి. మహిళలపై చేసిన నేరాల సంఖ్య 2016 తో పోలిస్తే 2017 లో 6% నుండి 9% కి పెరిగింది .

## జెండర్ ఇండెక్స్ రిపోర్ట్ -2020 :

భారతదేశంలో లింగ వివక్ష పెరుగుతోంది, జెనీవా ఆధారిత అంతర్జాతీయ సంస్థ యొక్క ర్యాంకింగ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం (WEF) జెండర్ గ్యాప్ ఇండెక్సును 2019-2020 విడుదల చేసింది .2019-2020 సంవత్సరంలో భారతదేశం ర్యాంక్ 112 వ స్థానంలో ఉంది, 2018 ర్యాంక్ 108 వ భారతదేశం దిగువ స్థానం 108 వ నుండి 112 వ WEF నివేదిక, ఆరోగ్య మరియు ఆర్థిక రంగాలలో దేశం మొదటి 5 స్థానాల్లో ఉండటంతో, లింగ సమానత్వంలో ఐస్లాండ్ అగ్రస్థానంలో ఉంది. చైనా (106 వ), శ్రీలంక (102 వ), నేపాల్ (101 వ), బ్రెజిల్ (92 వ), మరియు బంగ్లాదేశ్ (50 వ), యెమెన్( 153వ) చివరి స్థానంలో ఉంది .భారతదేశంలో మహిళలకు పరిమిత ఆర్థిక అవకాశాలు (35.4%) ఉన్నాయి. పాకిస్తాన్ (32.7%), యెమెన్ (27.3), సిరియా (24.9) మరియు ఇరాక్ (22.7%) తో పోల్చ తే, దేశీయ కంపెనీ బోర్డులో భారతీయ మహిళలు అతి తక్కువ స్థానంలో (13.8%)ఉన్నారు. చైనాలో కేవలం 3.7 శాతం. ఈ ఏడాది భారత రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుదల సానుకూలంగా ఉందని నివేదికలో పేర్కొంది. (World Ecomic Forum నివేదిక - 2019 ప్రకారం).

## ముగింపు :

రాజ్యాంగం అమల నుండి ఇప్పటి వరకు మహిళల మరియు బాలికల రక్షణకు,భద్రతకు భారత ప్రభుత్వానికి మరియు రాష్ట్ర లకు ఎన్నో కమిటీలు, కమిషన్లు, కేంద్ర, రాష్ట్ర న్యాయస్థానాలు, సంఘాలు అనేక రకమైన సూచనలు చేశారు. మహిళలు మరియు బాలికలను వారిపై వివిధ రకాల నేరాల నుండి రక్షించడానికి వినూత్న కార్యక్రమాలు, చట్టాలు, చర్యలను ప్రవేశపెట్టడానికి భారత ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నంలో తెలంగాణ పోలీసులు "ఆమె బృందం" ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మహిళల భద్రతలో ఒక అడుగు ముందుంది. , SHE టీమ్స్‌ను మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్, ఒరిస్సా, ఆంధ్ర ప్రదేశ్, రాజస్థాన్ మరియు ఉత్తర ప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో మహిళల భద్రతకు కృషి చేస్తున్నాయి. అన్ని రాష్ట్రాల్లో మహిళా రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి. పాఠశాల విద్య నుండే స్త్రీలను గౌరవించే విధంగా విద్యార్థులను నేర్పించాలి.ఇది మన సమాజం మహిళలపై నేర రహితంగా చేస్తుంది మరియు మన సమాజానికి గౌరవాన్ని కలిగిస్తుంది.మహిళలపై బాలికలపై హత్య హత్యాచార కేసులను ఫలితంగా పూర్తిచేయడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి దోషులను వెంటనే శిక్షించాలి .

చివరగా కవి శేషేంద్ర చెప్పినట్లుగా ................"
నా దేశపు స్త్రీలకు రంగు రంగుల కలలు కనే నూలుతో కొకలల్లి, సీతాకోక చిలుకల్ని చేస్తా .జీవన వన సీమల్లో

ఎగరేస్తా...... నా దేశపు జెండా ఎగరేస్తూ పొండని పంపిస్తా........................ అన్న మాటల్ని నిజం చేద్దాం. మహిళలకి అండగ, రక్షణగా నిలుద్దాం. స్త్రీ రక్షణే.. దేశానికి సురక్ష.

**ఆధార గ్రంథాలు :**


1. మాధవి. S. "స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళలు" యోజన తెలుగు మాసపత్రిక, ఆగస్టు-2015 సంపుటి:43,సంచిక:10 pp.49,ISSN : 0971-8729.
2. World Economic Forum "Global Gender Index Report, 2020" Geneva, ISBN-13:978-2-940631-03-2.pp11-24.
3. Laxikanth.M%, "Governance in India" 2nd Edition, Tata McGraw-Hills (India) Private, Ltd, 2019.pp1.1 -1.3.ISBN; 978-93-392-0478-5.
4. Ibid pp19.17-19.19
5. Crime in India 2018, Statistics, Published by National Crime Records Bureau, Ministry of Home Affairs, Government of India.pp195-294.
6. Pratiyogita Kiran (banking& current affairs book) (English monthly) magazine for competitive examinations, issue 6, May -2018,pp4

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలుగు జానపద సాహిత్యంలో అద్దంకి దావీదు ఉయ్యాల పాటలు

- డా॥. మార్క్ పొలొనియస్, సహాయ ఆచార్యులు & ప్రిన్సిపాల్, తెలుగు విభాగం,
విశ్వవిద్యాలయ పి.జి. సెంటర్, గద్వాల్, పాలమూరు విశ్వవిద్యాలయం.

ఏ జాతి చరిత్ర చూసినా ఆ జాతి జీవన పథంలో మతానికి ప్రత్యేకస్థానం ఉన్నది. మనిషికి ఉన్న విశ్వాసం, ప్రవర్తనా నియామవళిపై ఆ జాతి యొక్క సమైక్యత ఆధారపడి ఉంటుంది. ఈ సమైక్యత సిద్ధాంతం స్థిరత్వాన్ని పొందడానికి మతం కీలక పాత్ర వహిస్తుంది. మత ప్రమేయం వల్ల సంస్కృతి, సాంప్రదాయాలు ఎన్నో మార్పులకు గురి అయిన దేశాలలో భారతదేవం ఒకటి. భారత దేశం తన సంస్కృతితో పాటు ఇతర సంస్కృతులను కూడా ఆదరించి, అనుసరించి తనదైన ప్రత్యేకతను నిలుపుకొని అన్ని మతాలను సంస్కృతుల్ని తనలో కలుపుకొని భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శిస్తున్నది. భౌద్ధం, జైనము, ఇస్లాం, క్రైస్తవం ఇలా ఎన్నో మతాల వారిని ఈ దేశం ఆదరించింది. అందులో భాగంగానే ఆంధ్ర దేశంలో కూడా వివిధ మత సంస్కృతులకు, ఆచారాలకు ఆలవాలమైంది.

తెలుగు సాహిత్యం పై శైవ, వైష్ణవ మత ప్రభావంలాగా క్రైస్తవ మత ప్రభావము ఎంతగానో ఉన్నది. అంతే కాకుండా తెలుగు సాహిత్య అభివృద్ధికి క్రైస్తవ మతం విశేష కృషి చేసింది. క్రైస్తవ మతము ఉత్తర భారత దేశంలో కన్నా దక్షిణ భారత దేశంలోనే ఎక్కువ వ్యాపించింది. క్రీస్తు శకం 52లో క్రీస్తు శిష్యుల్లో ఒకడైన సెయింట్ థామస్ (తోమా) భారతదేశానికి క్రైస్తవమతం తీసుకొని వచ్చాడు. అందులోనూ తెలుగు ప్రాంతంలో సాహితి సంస్కృతుల యందు ప్రత్యేకత గడించిన క్రైస్తవమతము విజ్ఞాన ధాయకమై తెలుగు కళా సంస్కృతుల వికాసానికి తోడ్పడి, తెలుగు జాతి సంస్కృతిపై చెరగని ముద్ర వేసింది.

ప్రాచీన కాలం నుండి మన దేశంలో మత విశ్వాసాలను, ఆచారాలను, సాంప్రదాయాలను ప్రచారం చేయడం కోసం జానపద బాణీలనే ఉపయోగించుకున్నారు. ఉదాహరణ బౌద్ధులు పాళీ భాషను, శైవులు దేశీ భాషను ఉపయోగించారు. ఈ విధంగా ఆయా మతాలు, కులాలు, జాతులు జానపద సాహిత్యానికి ఉన్నత స్థానాన్ని కల్పించారు. క్రైస్తవమతం కూడా తమ మత ప్రచారానికి జానపద సాహిత్యాన్ని ఉపయోగించుకొని దానికి విశిష్టమైన స్థానంను కల్పించింది.

నిజానికి పల్లెపట్టు బాణీలలో వినిపించే మత సత్యం జానపదుని మనస్సునకు అతికినంత తేలికగా శాస్త్రోక్తమైన సంగీత బాణీలు అతకవు, శ్రమ జీవుల శ్రయోపశమనం కోసం పాడుకునే దరువులు ఏలపాటలో మిళితమై పదజాలం, అది అందించు భావం వారు గుండెల్లో గూడు కట్టుకుంది. ఈ విధంగా పెండ్లి పాటలు, నలుగు పాటలు, చెక్క భజనలు, ఉయ్యాల పాటలు, బుర్ర కథలు, కోలాటాలు, హరికథలు మొదలైన కళారూపాలను క్రైస్తవ మత ప్రచారం కోసం ఉపయోగించారు.

17వ శతాబ్దపు ప్రారంభంలో క్రైస్తవ మత ప్రచారం కొరకు ఒక నూతన మార్గం అనుసరించారు. దీనికి అధ్యుడు రాబర్ట్ డి. నొభిలి. ఇతడు జెసూటు ఫాదరి సంఘ ప్రతినిధిగా క్రీ.పూ. 1606వ సంవత్సరంలో దక్షిణ భారతదేశంలోని మధురకు వచ్చాడు. నొబలికి పూర్వము మధురను పాలించిన వీరప్ప నాయకుని కాలంలో ఫాదరీ ఫెర్నాండేజ్ 14 సంవత్సరములు క్రైస్తవ తమ ప్రచారం చేశాడు "పర్వర్"లు అనే చేపలు పట్టే మత్స్యకారులను మాత్రం క్రైస్తవులుగా మార్చగలిగాడు.

కాని అగ్రకులాల వారు క్రైస్తవ మతాన్ని స్వీకరించక పోవడానికి ఈ క్రింది కారణాలు అడ్డువచ్చాయి. క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వారు హైందవ ఆచారాలను

విస్మరించడమూ, "పర్‌వర్"లు అనబడే మత్స్యకారులు అంటరాని వారై ఉండి క్రైస్తవులు కావడం వలన అగ్ర కులాల వారెవ్వరూ క్రైస్తవ మతాన్ని స్వీకరించలేదు.

ఈ పరిస్థితులను అర్థము చేసుకున్న నొబలి తన మత ప్రచారం కోసం వేషభాషలన్ని, ఆచార వ్యవహారాలన్ని మార్చివేసి సన్యాసిగా కషాయ వస్త్రాలను ధరించాడు. జంధ్యం వేసుకున్నాడు. ముఖానికి విభూతి దిద్దాడు. చేతిలో కమండలాన్ని ధరించాడు. శాఖాహారిగా ఒక చిన్న గుడిసెలో కాపురం పెట్టాడు. బ్రాహ్మణులతో కలిసి మెలిసి తిరిగాడు. ఇలా నొబలి క్రైస్తవ మతములో హైందవ సాంప్రదాయాలకు చోటు కల్పించాడు. ఆ నాటి నుండి ఈ నాటి వరకు క్రైస్తవ మతములో హైందవ సాంప్ర దాయాలు కొనసాగుతున్నాయి.

క్రైస్తవమతం తెలుగు ప్రాంతాల్లో ఉన్న మారుమూల గ్రామాల్లో కూడా వ్యాపించింది. వారు పాడుకున్న జానపద గేయాలలో ప్రదర్శించే నాటకాలలో, కళారూపాల్లో క్రీస్తు ప్రధానంగా ఉంటాడు. ఇందులో ఎక్కువగా క్రీస్తు జనన, మరణాన్ని గూర్చి, క్రీస్తు చేసిన అద్భుతాలు, క్రీస్తు రెండవ రాకడను గూర్చిన అంశాలు ఉన్నాయి.

## ఉయ్యాల పాటలు :

జానపదగేయ లక్షణాలలో కవి వారి యొక్క కాలం తెలుసుకోవడం చాలా కష్టం అని ఆచార్య నాయిని కృష్ణకుమారి గారు జానపదగేయ గాథలు అనే పుస్తకంలో పేర్కొన్నారు. కాని క్రైస్తవ జానపద సాహిత్య విషయాన్ని గమనించినట్లయితే క్రైస్తవ మతం భారత దేశంలో ప్రవేశించిన తరువాత అచ్చు యంత్రాలు, గ్రంథా లయాలు అభివృద్ధి చెందడం చేత పాట ఎవరు వ్రాశారో కనుగొనడం సులభతరమైనది.

## అద్దంకి దావీదు :

పల్లె పట్టులతో పరిచయాన్ని పెంచుకుంటే ఎలాంటి సాహిత్యాన్ని కూర్చోవచ్చునో ఇతని రచనలు సాక్ష్యం ఇస్తాయి. పుట్టింది, పెరిగింది పల్లెటూరు, పని చేసి జీవిత యాత్రను ముగించింది పల్లెటూరు. అందుకే గ్రామీణ సంగీత బాణి దావీదు కవి జీవితంలో భాగమైంది. ఆ రాగాలు వాగులా ప్రవహించాయి. చెవినిబడ్డ ప్రతి బాణి ఈ కవికి తన భావాలు చెప్పడానికి ఆస్కారమైంది.

వీరి రచనలు, 'మార్గ దర్శిని', 'సత్యావతారం', 'చిన్న కుమారు', 'మీతానుభవం', 'యోసేపు', 'అగ్నిగుండం', 'పూలగంప', నయమాను మొదలైనవి గేయాలు. ఈయన నిరాడంబరాన్ని చూచినవారికి ఈయన కవిగా - గొప్ప సంగీతకవిగా కనిపించకపోవచ్చు. కానీ వీరి పాటలను విన్న వారు వీరిని మరిచి పోవడం గాని వీరి మేధాశక్తిని అంచనా కట్టడంగాని అంత తేలికకాదు.

ఈయన గీతాల్లోని క్రీస్తుమత సారాంశం గ్రామీణ జీవిత సత్యాల నాలంబనం చేసుకొన్న మూలంగా జీవన స్రవంతిలా నిత్యం ప్రవహిస్తూనే ఉంటుంది. తెలుగు ప్రాంతంలోని అసంఖ్యాక క్రైస్తవులకితడు చిరపరిచితుడు కావడానికి కారణం వారు వాడిన సజీవభాష.

బైబిల్‌లోని క్రొత్త నిబంధన గ్రంథములో ఉన్న కొన్ని సంఘటనలను ఆధారం చేసుకొని ఈ క్రింది ఉయ్యాల పాటను అద్దంకి దావీదుగారు వ్రాశారు.

అక్కలారావినరె ఉయ్యాలో - ఆశ్చర్యమౌకథను ఉయ్యాలో
చక్కనైనవాడు ఉయ్యాలో - స్వామి క్రీస్తే సయ్య ఉయ్యాలో
మనపాపములకొరకు ఉయ్యాలో - మనుజుడై వచ్చెనే ఉయ్యాలో
అద్భుతంబులజేసే ఉయ్యాలో - ఆశ్చర్యముగతాను ఉయ్యాలో
కానానులోపెండ్లి ఉయ్యాలో - కార్యమపుడుయేసు ఉయ్యాలో
నీరు ద్రాక్షారసపు ఉయ్యాలో - తీరుగాజేసెనే ఉయ్యాలో
గాలివానను నిలిపె ఉయ్యాలో - కడువింతగాతాను ఉయ్యాలో
సంద్రంబుపై క్రీస్తు ఉయ్యాలో - చక్కగానడచేను ఉయ్యాలో
అయిదువేల్ మందికీ ఉయ్యాలో - అయిదురొట్టెలు మరియు ఉయ్యాలో
రెండుచేపలతోడ ఉయ్యాలో - తేడుభోజనమిచ్చె ఉయ్యాలో

ఈ విధంగా క్రీస్తు ప్రభువు చేసిన వివిధ అద్భుత కార్యాలను ఉయ్యాల పాటగా పాడుకుంటున్నారు.

ఒక బీద ముసలమ్మ దైవభక్తురాలు, ఆమెకొక మనుమడు మాత్రమే కలడు. ఆమె ఏకులు వడుక్కోని జీవించేది. ఒక దినము సగము జొన్నరొట్టె మాత్రమే తనకును తన మనుమనికిని మిగిలియుండెను. ఇంతలో ఒకసాధు ఆకలిగొని ఆ గ్రామము చేరగా ఆ సగము రొట్టె ఆయన కిచ్చెను. దేవుని యెడల నెక్కువ కృతజ్ఞతతో తిరిగి తన రాట్నము దగ్గర కూర్చుండి ఏకులు వడకుచు సంతోషముఖముగలదై ఏ విధంగా పాడుకుందో క్రింది ఉయ్యాల పాట తెలియజేస్తుంది.

ఉన్న సగమురొట్టె ఉయ్యాలో సాధన్నకే యిస్తివి! ఉయ్యాలో
మనుమనికిని నాకును ఉయ్యాలో - యింత మాడైన లేదాయె ఉయ్యాలో
నాకేమిలేకుంటే ఉయ్యాలో - నాకు నా దేవుడుండగ ఉయ్యాలో
పిన్నతమమునుండి ఉయ్యాలో - యే ! సన్నయెనను బెంచె ఉయ్యాలో
ఆకాశము భూమి ఉయ్యాలో - ఆయనే చేసెగద ఉయ్యాలో
సత్యముగ యేసుడే ఉయ్యాలో - యీ సర్వసృష్టికి తండ్రి ఉయ్యాలో
రాతిలో కప్పను ఉయ్యాలో - రక్షింపగలతండ్రి ఉయ్యాలో
నాకింతయియ్యడా ఉయ్యాలో - నాకింక భయమేమి ఉయ్యాలో
కలుగులో యెలుకను ఉయ్యాలో - కాపాడగల తండ్రి ఉయ్యాలో
నాకింతయియ్యడా ఉయ్యాలో - నాకింక భయమేమి ఉయ్యాలో
మంటిలో నెఱ్ఱను ఉయ్యాలో - మనపగలడాతండ్రి ఉయ్యాలో
నాకింతయియ్యడా ఉయ్యాలో - నాకింక భయమేమి ఉయ్యాలో
అడవి పక్షులకెల్ల ఉయ్యాలో - ఆహారమిడుతండ్రి ఉయ్యాలో
నాకింతయియ్యడా ఉయ్యాలో - నాకింకభయమేమి ఉయ్యాలో

ఇలా ఆమె పాడుతూ ఏకులు వడుకుతుండగా ఆకాసమునుండి ఒక గరుడపక్షి ఒక పెద్ద బంగారు దండను తన ఒడిలో వేసెను! అప్పుడు ముసలమ్మ ఆశ్చర్యముతోనూ, కృతజ్ఞతా విశ్వాస ప్రేమతోనూ, ఇలా మళ్ళీ పాడెను.

కాకిచె ఏలియానుయ్యాలో, కాపాడినట్లుగా ఉయ్యాలో
నా మీద దయచేత మయ్యారో, యీ మాల నిచ్చెనే నుయ్యాలో
చిన్నలకు పెద్దలకు ఉయ్యాలో యే నన్న యేదిక్కికను ఉయ్యాలో
ఆయనను నమ్ముడి ఉయ్యాలో - మన కన్ని సుకములు గలుగు ఉయ్యాలో

బైబిల్‌లోని పాత నిబంధన గ్రంథములో ఉన్న మొదటి రాజులు 17వ అధ్యాయంలో ఉన్న విషయాలు ఈ యొక్క పాటకు మూలం.

ఈ ఉయ్యాల పాటలు మొదట మత ప్రచారం కోసం ఉపయోగించారు. కాని ఇవి నేటి సమాజంలో దురాచారాలను ప్రతిగటించడానికి, కుల వ్యవస్థ నిర్మూలనకు, స్త్రీ విద్యను ప్రోత్సహించటానికి, మద్యపానాన్ని నిషేధించుటకు, పేదవారికి, దిక్కులేనివారికి సహాయ పడుటకు మానవుడు సమాజంలో ఆర్థికంగా అభివృద్ధి పొందుటకు అద్దంకిదావీదు గారి ఉయ్యాల పాటలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1) జానపద గేయ గాధలు - ఆచార్య నాయిని కృష్ణకుమారి

2) ఖమ్మం, కొత్తగూడెం, జానపద గేయాలు - ఆచార్య మాదిరెడ్డి అండమ్మ

3) తెలుగు క్రైస్తవ సంఘ కీర్తనలు - పరిశీలన - ఆచార్య జయసలోమి

4) తెలుగులో క్రైస్తవ సాహిత్యం - డా॥ ఆర్.ఆర్. సుందర్‌రావు

5) జానపద కళారూపాలు - సాహిత్యం - డా॥ కె. ఆనందన్

6) భజన కీర్తలు - అద్దంకి దావీదు.

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# సీమ రైతుల వేదన వినిపించిన 'రాయలసీమ రైతు'

- డా॥. ఎన్. ఈశ్వరరెడ్డి , అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

రాయలసీమ రత్నాలసీమగా కీర్తించబడిన స్థాయి నుండి రాళ్ళసీమగా, కరువు సీమగా, కార్పణ్యాల సీమగా మారడం వెనుక ప్రధాన కారణం నీటి కొరత. వర్షాభావం. ప్రాంతీయ సమస్యలను జాతీయస్థాయిలో బలంగా వినిపించి ఒప్పించలేని నాయకత్వం.

కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలు రాయలసీమగా గుర్తింపు పొందాయి. దత్తమండలాలుగా పిలువబడి, రాయలసీమగా మారిన సందర్భం తెలసిందే. రాయలసీమ అంటేనే ఆందోళన కలిగించే విధంగా తయారు చేసిన సినిమా సంస్కృతిని పక్కనబెడితే, రాయలసీమ జీవన ముఖ చిత్రాన్ని భైరపురెడ్డి రెడ్డి నారాయణ రెడ్డి గారు రాసిన 'రాయలసీమ రైతు' కావ్యాన్ని పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశం.

## రైతు కావ్యాలు :

ఆధునిక తెలుగు సాహిత్యంలో రైతు ప్రస్తావన అనేక కావ్యాలలో కనిపిస్తుంది. రైతు జీవితం ఇతివృత్తంతోనే సంపూర్ణంగా వచ్చిన కావ్యాలు కూడా కొన్ని ఉన్నాయి. వాటిలో కృషీవలుడు, రైతు రామాయణం, పొలి, రైతు రాయలు మొదలైనవి ఉన్నాయి.

దువ్వూరి రామిరెడ్డి 'కృషీవలుడు' (1919) కావ్యాన్ని 'గణ్యములగు నూతన సృష్టులతో' నవజీవనమును ప్రతిఫలించింది. రైతుల, కాపుల ఇల్లాండ్ర దైనందిన దినచర్యలతో, రుతు వర్ణనలతో, చమత్కార పూరితంగా రాశాడని కట్టమంచి రామలింగారెడ్డి గారు చెప్పిన అభిప్రాయాలు సాధికారవైనవి. 'మున్నూటరవది దినములు. కష్టపడి పనిచేసే కాపు ఇల్లాండ్రకు ఆటవిడుపే లేదు.'

"కడలు మొదలు లేని నీ కష్టములకు
ప్రతిఫలంబగు సస్య సంపత్తి గాంచి
కవివి కాకున్న వాగ్మిత గలగకున్న
బ్రణుతి వర్ణింపు మొకసారి భాగ్య గరిమ"
(కృషీవలుడు)

అంటూ దువ్వూరి రైతు శ్రమకు అక్షర రూపం ఇచ్చాడు.

వానమామలై జగన్నాథాచార్యులు 'రైతు రామాయణం' (1980) పేరుతో సుమారు ఐదువందల పుటలు గల పద్యకావ్యాన్ని రచించాడు.

ఈ కావ్యంలో రైతే రాజు. రాముడికి ఉన్న గుణాలతో ఉండే రైతు నాలుగు చేతులతో పనిచేసే 'చతుర్బాహుడు'. నాలుగు మూలల పంటల్లో తానే ఉంటాడు. పశు పోషణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టే ముక్కంటి అతడు. మొక్కలను రక్షించే సహస్రాక్షుడు అతడు. గొడ్డలి పడితే పరసురాముడు. హలం పడితే బలరాముడు. తన భార్యతో కలిసి నడిస్తే శ్రీ రఘురాముడతడు. ఈ రైతు 'రాముడు' తెలంగాణా వీరుడు. జమీందారు పాపారావు ఈ కావ్యంలో రావణుడు. పాపారావు దౌర్జన్యాలకు, అణచివేతలకు గురైన గ్రామీణులకు, రైతులకు అండదండగా నిలిచి, జనంలో నూతన చైతన్యాన్ని తెచ్చి గ్రామ సౌభాగ్యానికి దోహదం చేస్తాడు రైతు రాముడు.

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారి 'పొలి' (2007) సేద్యకావ్యంగా వచ్చిన వచన కావ్యం. పాలకులు పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగమై, రైతుల పట్ల ఉదాసీన దృక్పథాన్ని కలిగి ఉండడాన్ని ఎత్తిచూపిస్తాడు. ప్రభుత్వాలు రైతులను బాధ్యతగా చూడడం మానేసి ఆత్మహత్యలకు కారకులవుతున్నారని, శ్రమ జీవిని బతికించడంలో విఫలమయ్యారని వాపోతాడు. ప్రపంచీకరణ ముసుగులో రైతును అన్ని రకాలుగా నాశనం చేస్తున్న వ్యవసాయ విధానాల మార్పుకోసం 'పొలి'

చల్లడానికి రాచపాళెం పూనుకున్నాడు. 'గిట్టుబాటు ధర లేదు. ఉత్పత్తులపై రైతులకు అధికారం లేదు, దళారీ కబంధహస్తాలలో, అప్పుల ఊబిలో ఆత్మహత్యలను వెతుక్కుంటున్న రైతు జీవితాన్ని అద్భుతంగా చిత్రించాడు.

"కలుపు మొక్కలు / పరన్నాబుక్కులు
నిలువ నీడనిస్తే / నీడనే తినేస్తాయి
పీడగా మారతాయి" (పొలి)

అంటూ వ్యవస్థలో కలుపు మొక్కల్లా పాతుకుపోయిన దళారీ మూకలను పీకి పారేయమంటాడు. 'కలుపు మొక్కల్ని ఎర్ర మడకలతో దున్ని భారతభూమిలో సమతా విత్తనాలు నాటాలని ఎర్రజెండాల రెపరెపలే బతుకు చీకట్లను పారదోలతాయని ఆశించి ఆశించి పండుటాకై రాలిపోయిన' రైతు ఆత్మను ఆవిష్కరించిన కావ్యం 'పొలి'.

గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి 'రైతు రాయలు' (2009) పేరుతో రాసిన పద్యకావ్యం రాయలసీమ రైతులను, ప్రాంతీయ సమస్యలను వస్తువుగా వివేచించిన కావ్యం, చెరువుల కోసం ఆత్మ బలిదానం చేసే 'ముస లమ్మ మరణం' లాంటి కథే ఇందులో ఉంటుంది. అయితే ఇది కన్నీటి పాటకాదు. ఎంతో పట్టుదలతో చెరువును తవ్విన శ్రమజీవియైన రైతు కథ. శ్రీకృష్ణదేవరాయల ఔదార్యానికి, కర్షక ప్రీతికి సంబంధిం చిన కథ. వ్యవసాయం శాపంగా మారి, రైతులు ఆత్మ హత్యలు చేసుకుంటున్న తరుణంలో పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టి, ఎత్తు పెంచి, బ్యాక్ వాటర్‌తో ఊళ్ళు నగరాలు మునిగి పోయేట్టు చేయడాన్ని వ్యతిరేకిస్తాడు. ఊరి ఊరికో చెరువు ఉండాల్సిన అవనరాన్ని తెలియజేస్తాడు. 'తటాక నిర్మాణం పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని చాటి చెప్పే కథగా 'గోపినొళ్ళు చెరువు' కథను రైతు రాయల కథగా చిత్రించాడు. కొర్రబువ్వ, చింతచిగురు, గురిగాకు, సద్దన్నం వంటి సీమ ఆహార అలవాట్లను కూడా ఈ కావ్యం ప్రస్తుతించింది. విద్వాన్ విశ్వం రాసిన పెన్నటిపాట, డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి రాసిన కన్నీటసీమ కవితా సంపుటిగా వచ్చిన రైతు కవితతో పాటు అనేక మంది కవులు రైతు జీవితాన్ని అద్భుతంగా చిత్రించారు. అందరి కవిత్వాన్ని పరామర్శించే అవకాశం లేనందున కేవలం రైతు జీవితంపైనే ప్రత్యేకంగా వచ్చిన కొన్ని కావ్యాలను ప్రస్తుతించాను.

## కవి పరిచయం :

భైరపురెడ్డి రెడ్డి నారాయణ రెడ్డి కడప జిల్లా, రాయచోటి తాలూకా, రెడ్డివారి పల్లి పంచాయితీ లోని మడితాడు గ్రామంలో 02.02.2023 లో జన్మించాడు. శ్రీమతి నాగమ్మ, వెంకటరెడ్డి ఈయన తల్లిదండ్రులు. పాఠశాల విద్య కూడా పూర్తి చేయలేకపోయినా, అద్భుతమైన రచన చేయగల నైపుణ్యాన్ని సాధించారు. తండ్రి ద్వారా లభించిన వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించి, అష్టకష్టాలు పడ్డాడు. కలాన్ని - హలాన్ని సమప్రాధాన్యంతో నడిపించిన హాలిక కవి నారాయణరెడ్డి. తలపోతలు (1970) సంగమేశ్వర శతకం (1973) రాయలసీమ రైతు (1976) ఈయన రచనలు.

## రాయలసీమ రైతు - కావ్య పరిచయం :

రాయసీమ రైతు ఐదు ఖండాల ఆధునిక సంప్రదాయ రైతు కావ్యం. కృషీవల ఖండం. మిత్ర సమాలోచనా ఖండం, మేఘోత్కళిత ఖండం, వర్షారంభ ఖండం, ఫలప్రాప్తి ఖండం అనే విభాగాలలో మూడువందల ఇరవై మూడు పద్యాలు కలిగిన కావ్యం రాయలసీమ రైతు. రాయలసీమలోని రైతుల కష్టాలకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది ఈ కావ్యం. 1952లో వచ్చిన భయంకర కరువు సృష్టించిన విలయాన్ని అక్షరీకరించిన పద్య కావ్యం ఇది. ఈ కావ్యాన్ని పరిశీలించే ముందు సీమను ఛిద్రం చేసిన కరువుల గురించి తెలుసుకోవలసి ఉంది.

## రాయలసీమ కరువులు :

భారతదేశంలో కరువుతో అల్లాడే ప్రాంతాల్లో రాయల సీమ ఒకటి. రుతుపవనాల వైఫల్యం, నీటి వనరుల లోటు, భూగర్భ జలాల అలభ్యత మొదలైన కారణాల వల్ల వర్షాధార ప్రాంతమైన రాయలసీమ కరువు కోరల్లో

ఎక్కువ కాలంగా నలిగిపోతోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 1857 నండి 1931 వరకు సుమారు 57 సంవత్సరాల కాలంలో నైరుతి రుతుపవనాలు 12 సార్లు, ఈశాన్య రుతుపవనాలు 24సార్లు వైఫల్యం చెందాయని చరిత్ర పుస్తకాలు సాక్ష్యం చెబుతున్నాయి.

రాయలసీమ రత్నాలసీమ అని ఎందుకు అనిపించు కుంది? అనే సందేహాలు సర్వసాధారణంగా వస్తుంటాయి.

విజయనగర రాజుల కాలంలో నీటి పారుదల వ్యవస్థకు అధిక ప్రాధాన్యం ఉండేది. చెరువుల తవ్వకం, నీటిపారుదలకు అవసరమైన కాలువల తవ్వకం వంటి వ్యవసాయాభివృద్ధి కార్యకలాపాల కోసం ఆనాటి రాజులు ఖజానా నుండి ఖర్చు చేయడమేగాక, రాణుల ఆభరణాలు కూడా అమ్మి సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించారని తెలుస్తోంది. కొండ ప్రాంతాల్లో జలాశయాలు నిర్మించి, కాలువల ద్వారా వ్యవసాయ అవసరాలు తీర్చినట్టు రాయల కాలం నాటి చెరువులు సాక్ష్యమిస్తున్నాయి.

రాయలసీమ ప్రాంతంలో 1832-33లో వచ్చిన భయంకర కరువుకు 'నందన కరువు' అనే పేరు పెట్టారు. కరువు పరిస్థితులు మనుషుల్ని దోపిడీలకు, దొంగతనాలకు కూడా పురిగొల్పాయని, అందుకు ఉదాహరణగా సి.పి. బ్రౌన్‌కు రాసిన లేఖల్లో 'కడప బజారు షావుకారు ఇంటిపై వంద మంది పడి దోచుకొని పొయ్యి ఆకలి తీర్చుకున్నారని' ఐతేపురం కృష్ణారెడ్డి పేర్కొన్నాడు (బ్రౌన్ లేఖలు). అదే సమయంలో కడప, కంభం, మద్రాసు ప్రాంతాల్లో ఈస్టిండియా కంపెనీ వారు గంజి కేంద్రాలను ఏర్పాటు చేశారు. గంజి కోసం ప్రారంభమైన వలసలు సీమవాసుల్ని చెన్నపట్నం దాకా చేర్చాయంటే అతిశయోక్తి కాదు.

1858లో ఈస్టిండియా కంపెనీ నుండి పాలనాధికారం బ్రిటీష్ ప్రభుత్వం స్వీకరించింది. 1870-72 ప్రాంతంలో సీమ ప్రాంతాన్ని మరో భయంకర కరువు ఆవహించింది. దాని పేరు 'ధాతు కరువు'. పరాయి పాలకుల మనసులను కూడా ఈ కరువు కరిగించింది. బ్రిటీష్ ప్రభుత్వం ప్రజలను ఆదుకునే తాత్కాలిక చర్యలతో పాటు, నీటి పారుదల వ్యవస్థపై పరిశోధనలు ప్రారంభించింది. సర్ ఆర్థర్ కాటన్, సర్ మెకంజీ వంటి ఇంజనీర్లు ఈ పనికి పూనుకున్నారు. సర్ ఆర్థర్ కాటన్ (1890లో) రూపొందించిన కర్నూలు-కడప కెనాల్ (కె.సి. కెనాల్) కార్యరూపం దాల్చి కర్నూలు జిల్లాలో 1,84,000, కడప జిల్లాలో 94,000 ఎకరాలకు నీటి పారుదుల సౌఖర్యం లభించింది. తదనంతర పాలకుల నిర్లక్ష్యం వల్ల 1947 నాటికి దీని ప్రాభవం తగ్గిపోయింది.

స్వాతంత్ర్యానికి ముందు 1937లో జరిగిన శ్రీబాగ్ ఒప్పందం కృష్ణా, పెన్నా, తుంగభద్ర నదీ జలాలపై సీమకు హక్కును కల్పించింది. 1951లో ప్లానింగ్ కమిషన్ అనుమతితో కృష్ణా-పెన్నార్ ప్రాజెక్టు రాయలసీమకు హక్కుగా బలపడింది. తదనంతర ముఖ్యమంత్రులు ఎన్.టి. రామారావు, వై.ఎస్. రాజశేఖర రెడ్డి, వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి గార్ల చొరవతో రాయలసీమ నెమ్మది నెమ్మదిగా పచ్చబడుతూ వస్తోంది. ఇప్పటికీ, ఇంకా నీరందని ప్రాంతాలు చాలానే ఉన్నాయి.

### 'రాయలసీమ రైతు' కావ్యం - వస్తు విశ్లేషణ :

రాయలసీమరైతు కావ్యం రాయలసీమలోని రైతుల జీవితాన్ని దృశ్యీకరించింది. గతాన్ని వర్తమానాన్ని పక్కపక్కనే పెట్టి, రతనాల సీమగా నీరాజనాలందుకున్న సీమ రాళ్ళసీమగా మారిపోయిన దుర్దశను చిత్రించింది. నిత్యం కరువులతో అల్లాడే దుర్భిక్ష ప్రాంతంగా మారిపోయిన వైనాన్ని తెలియజేస్తుంది. 1952లో వచ్చిన భయంకర కరువును ఆలంబనగా చేసుకొని వచ్చిన కావ్యం రాయల సీమ రైతు. ఇది సీమ పూర్వాపరాలను విశదీకరిస్తుంది.

ఒకప్పుడు 'షడృుతువులు శోభితాంకృతం' గా ఉండే సీమలో బాహుదానదీ పరివాహక ప్రాంతమైన రాయచోటి పరిసరాలు పచ్చని పొలాలతో మురిసి పోయేవి. 'పాడిపంటల నాలక్షి పాదుకొనియె' అన్నంత

సుందరంగా ఉండేది. ఒక పల్లెలో 'కడు ప్రహర్ష మతితో' రైతు కష్టపడేవాడు. కవికి కావ్యం ఎంత శోభనిచ్చేదో, రైతుకు పొలం అంత శోభనిస్తూ ఉండేది. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అనే సిద్ధాంతాన్ని నమ్మే రైతు తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూ ఉండేవాడు. కాలానికి అనుగుణంగా పంటలు పండిస్తూ ఆదాయాన్ని పొందేవాడు. ఇలా రైతు జీవితం 'రైతే రాజు' అన్నంతగా సాగిపోయేది.

కరువు కాలం దాపురించే ముందు రైతు వేరుశనగ గింజలు భూమిలో వేస్తాడు. ఏడు రోజులకు మొలకలొచ్చాయి. రైతు కోర్కెలు మోసులెత్తాయి. వాన రావడం మానేసింది. రైతులో ఆవేదన మొదలైంది.

గ్రామసీమల వాతావరణం రంగు మార్చుకొంటూంది. ఆదాయాలు లేక, ఇంటికి కావలసినవి అందించలేక పోవడంతో ఆప్యాయతలు తగ్గిపోయాయి. పొలంపై ఉన్న ప్రేమ, ఆసక్తి మాత్రం తగ్గవు.

తన బాధలను పంచుకోవడం కోసం రైతు తన స్నేహితుడి ఇంటికి బయలుదేరుతాడు. ఎండ ఎక్కువగా ఉంది. 'వర్షాన్ని కురిపించే సూర్యుడు వర్షాన్ని దూరం చేసి పైరులను వాడగొడుతున్నా'డని వాపోతూ మిత్రుని ఇంటికి చేరుకుంటాడు. కళలను తొణికించే ముఖం కళవళించి పోవడాన్ని గుర్తించిన మిత్రుడు కారణం అడుగుతాడు.

గత కాలపు సంతోషాలు 'భూమీలలనా శిరోమణికి మేలిమివస్త్రం' కట్టినట్టుగా ఉండే పచ్చటి పైరు చిరుగుల నుండి మొదళ్ళు దాకా ఎండిపోయిన విధానాన్ని ఏకరువు పెడతాడు.

'కాలము మాయయో! కరుడు గట్టిన మర్త్యుల కర్మతంత్రమో' తెలీదు గానీ, పైరు పెట్టిన రోజు నుండి వర్షం పడలేదని, విత్తనాలు కూడా వ్యర్థమై పోయాయని చెప్తాడు. భానుడు వేయి హస్తాలతో బలిమిని తపింప చేశాడని, ఎండ ఎక్కువై వాన పూర్తిగా రాకపోవడం గోరు చుట్టుపై రోకలిపోటుగా మారిందని ఆవేదన వ్యక్త పరుస్తాడు. బాధలు విన్న మిత్రుడు రైతును ఆదు కుంటానని హామీ ఇస్తాడు. ఇక్కడితో కృషీవల ఖండం ముగుస్తుంది.

రాయలసీమలో కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలు ఉన్నాయి. కవి ఆయా జిల్లాలలో బాగా పండే పంటలను ప్రస్తావిస్తాడు. వజ్రకరూరులోని వజ్రాలతో పాటు పొగాకు, ద్రాక్ష, రాగి, వేరుశెనగ, జొన్న, మధురఫల వృక్షజాతులకు అనంతపురం ఆలవాలంగా నిలిచిందని, వరి, పత్తి, వేరుశెనగ, గట్టి ధాన్యం, మధుర ఫల వృక్షాలు, కాయగూరలు కర్నూలులలో బాగా పండుతాయని, అరటి, నిమ్మ, తమలపాకులు, మామిడి తదితర పంట ఫలాలతో కడప, కొబ్బరికాయలు, చెరుకు, మామిడి తదితరాలు చిత్తూరు జిల్లాలో విరివిగా పండుతాయని పేర్కొంటాడు.

లక్ష్మీ (సంపద) సరస్వతి (విద్య), అత్తాకోడళ్ళు అయినా సీమలో ఒద్దికగా ఒదిగి పోయారని, రాయలకాలం సిరులకు, పాండిత్యానికి నిలయంగా మారిందంటాడు. నెలకు మూడు వర్షాలతో, సర్వజన సమానత్వాన్ని ఆచరిస్తూ; కారుణ్య కాంతులతో రామరాజ్యంలా ఉం డేదని గతాన్ని తలపోస్తాడు. 'సఖల సౌఖ్యా వ్యాప్తి - అమిత జయోన్నతి, ఆంధ్రభోజ ఖ్యాతి స్వర్గంలా ఉం డేదని తెలియజేస్తాడు. రాయల వారి పాలన అంతమై పోయిన తర్వాత క్షామం సీమను ఆవహించిందని, ఉత్తరదేశం నుండి వచ్చిన అశ్వపతులు చెలరేగి దోచు కున్నారని, అదుపు తప్పిన పైరు, తారుమారైన విలువలు సీమను నరకంగా మార్చాయంటాడు. 'ఫలసస్యమైన గోవులాంటి' పొలాన్ని కరువు వ్యాఘ్రం బలితీసుకుందని ఆవేదన వ్యక్తం చేస్తాడు.

**కరువు తీవ్రత :**

"కరువులోనబుట్టి కరువులోన పెరిగి
కరువులందె బ్రతుకు కాంచు జనుల
కర్కశులయి భీతి గనరని ఈర్ష్యచే
కడిమి మెరసి కరువు కలచెననగ"

అని సీమలో పుడుతున్న వారి బతుకు గురించి చెప్తాడు.

కాలచరిత్రకారుడు సీమ భాగ్యరేఖను ఉక్కు నరాలతో కఠినంగా రాశాడని వాపోతాడు. కరువు ధూర్తుడు, కరువు కక్ష గట్టిన కాలుడుగా మారి ప్రాణుల జీవపదార్థాలను హరించాడు అంటాడు. కరువు 'కర్కోటక విసంపుకాటు' వేసిందని, తలకు మించిన లేమితో సీమ ఇబ్బంది పడుతోందని బాధపడతాడు.

మండుటెండలు మనుషుల చూపును కూడా దెబ్బ తీస్తున్నాయి. చెరువులు దీనత్వంలోకి జారిపోయాయి. వాన చుక్క లేకుండానే వర్షరుతువు వెళ్ళిపోయింది. వేడి గాడ్పులు మేఘాలపై దండెత్తినాయి. వమ్ము పంట (తాలు గింజలు), కొరగాని వేరుశెనగ రైతుల శ్రమను వెక్కి రిస్తున్నాయి. మూడు కార్లు పండిన పొలాలలో ఇప్పుడు జొన్నలు కూడా పండడం లేదు. ఎండిపోయిన పైర్లు పశువుల మేతకు కూడా పనికిరాకుండా పోయాయి.

బ్రతకడమే కష్టంగా మారిపోయిన సమయంలో ఇల్లు, ఇల్లాలు, పిల్లలను వదిలి పనుల కోసం రైతులు వలస దారి పట్టవలసి వచ్చింది. 'హాలికోత్తముల్ బహుళార్థికగ్గమైన' విధానాన్ని కళ్ళ ముందుంచుతాడు నారాయణరెడ్డి.

పనిలేక పోవడం వల్ల కొంత మంది తప్పుడు పనుల వైపు మళ్ళుతున్నారని. పశుకోటి చావని శవాలుగా మారి పోతోందని. వంద రూపాయల విలువ చేసే ఆవును పది రూపాయలకే అమ్ముకోవలసిన దుస్థితి దాపురించిందని దుఃఖిస్తాడు.

"వానకు కర్వు శ్రీగలుగ పాడికి గర్వు నీటికిన్
మానని కర్వు, కూటికిని మాడ్చెడు కర్వు, సమస్త సంపదన్
న్యూనము చేసి మానవుల నొంచెడు కర్వులె, కర్వులేనిదా
భానుడి వేడి దీప్తికిని బాయక వీచెడి వేడి గాడ్పుకున్"

సీమ పరిస్థితి ఇంత దయనీయంగా మారిపోయింది. పెట్టిపోసే గుణముండే పెద్ద గృహస్తులు అడవికి వెళ్ళి కట్టెలు కొట్టి తెచ్చుకొని బతకాల్సిన అగత్యం ఏర్పడింది.

## స్త్రీల బాధలు :

'సీమలోని కుటుంబాలు ఆకలితో, ఆవేదనతో ఎంత నలిగిపోయాయో గ్రామ స్త్రీల అవస్థను చూస్తే తెలుస్తుంది. స్త్రీలు శుభకరంగా భావించే సంప్రదాయాలకు దూరమయ్యారు. పూలు, తలనూనె, పసుపు, కుంకుమ, గాజులు, తాళిబొట్టు మొదలైన వాటికి స్త్రీలు దూరమయ్యి ఏడుస్తుంటే, వారిని చూసి వారి భర్తలు కూడా ఏడ్చారంటాడు కవి. ఈ కరువు స్త్రీ పురుషుల సంబంధాల్ని కకావికలం చేసింది. స్త్రీలు పురుషుల్ని గౌరవించడం మానేశారు. ఒకపూట కూడా గృహస్తులకు కడుపునిండా భోజనం పెట్టలేక స్త్రీలు శోకమూర్తులవుతున్నారు. కమ్మలు, గజ్జెలు, కడియాలు, రింగులు, ఇతర ఆభరణాలను దినవెచ్చం కోసం అమ్ముకున్నారు. స్త్రీల ముఖాల్లో కళ తప్పింది' అని ఆనాటి స్త్రీల వ్యథలను ఏకరువు పెడతాడు కవి.

**అకాలవర్షం :**

రాయలసీమకు వచ్చి ఆగిపోయిన గ్రీష్మరుతువు సకలజీవుల్ని పీల్చి పిప్పి చేస్తుంటే ఉన్నట్టుండి వచ్చిన అకాల గాలీవాన ఏదో మూల ఉండే పంటలను కూడా తుడిచిపెట్టేసింది. ఈ ఉపయోగంలేని వాన కారణంగా అప్పటికే అమలులో ఉన్న ప్రధానమంత్రి రైతు సహాయ పథకం అందకుండా పోయింది.

'కాలుని పాశంబులా', 'విలయ కాలుని ఘోర విష చూపులా వచ్చిన గాలివానకు మేకలు, గొర్రెలు వణికి చచ్చాయి. గుంపులు గుంపులుగా చచ్చిన మెకాలను మనుషులు తినలేదు. వాటిని తినడానికి నక్కలు, తోడేళ్ళు కూడా రాలేదంటాడు నారాయణ రెడ్డి.

**జీవన విధానంలో మార్పు :**

'సీమలో వర్షం పడిందని తెలియగానే చచ్చి బతికినంత సంతోషంతో వలస పోయిన వాళ్ళు తిరిగి వస్తారు. అయినా, కరువు ఇక్కడే పుట్టినట్టు దాన్ని ఆనవాళ్ళు బలంగా నిలిచి పోయాయి. ఆహారం దొరక్క, పనులు లేక చిక్కిశల్యమైన మనుషులు పక్కదారులు వెతు

కున్నారు. బాధలు భరించలేక తాగుడుకు బానిసలై పోయారు. మద్యనిషేధాన్ని ఉల్లంఘించి సొంత బట్టీలు పెట్టుకున్నారు. అడపాదడపా తాగే వారు కూడా పూటుగా తాగడం మొదలు పెట్టారు. అప్పటి కాంగ్రెసు పాలనలో జనం స్నాన పానాలను కల్లుతో చేశారని' తెలియచెప్తాడు.

పాలు, పెరుగు అమ్ముకొనే స్త్రీలు ఇప్పుడు ఊరూరూ దిరిగి కల్లు అమ్ముకుంటున్నారని, పాలు తాగి పని చేయడం కంటే, నీళ్ళు దాగి నిమ్మళంగా ఉంటేచాలని కొందరు సోమరులుగా తయారయ్యా రంటాడు.

## రైతుల పరిస్థితి :

ఉత్సాహవంతులైన కొందరు రైతులు పొలాలు సాగు చేసినా, అనావృష్టితో నాశనమౌతున్నాయి. 'వాన పడినట్టే ఉంటుంది. కాలికి బురద కూడా అంటదు.' ఒక సంవత్సరం కురిస్తే నాలుగైదేండ్లు వాన కనపడకుండా పోయే పరిస్థితులు సీమను ఆవహించాయి. చాలీ చాలని వానతో పంట పొలాలు పాత రోగుల్లా మారిపోయాయని, దుక్కి దున్నిన రైతులు చాతకపక్షుల్లా వాన కోసం ఎదురు చూస్తున్నారని, వేసిన విత్తనాలు మొలవక ముందే కలుపు మొక్కలు మొలిచి రైతును నాశనం చేశాయని వివ రిస్తాడు.

**కరువు కారణాలు :**

భైరపురెడ్డి రెడ్డి నారాయణరెడ్డి మేఘోత్కలిత ఖండంలో కరువుకు కారణాలను అన్వేషిస్తూ పురాణాల వైపు నడిచిపోతాడు. ఇంద్రుడిని కొలవక పోవడం వల్లే ఇలాంటి పరిస్థితులొచ్చాయని చెప్పే ప్రయత్నంలో ఆధునిక కావ్యంలో సంప్రదాయ ఛ్చాయలను తీసు కొచ్చాడు. అత్యంత భౌతిక దృష్టితో నడిచిన కావ్యం ఒక్కసారిగా భావవాదంలోకి జారిపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

ఏ ఏ కార్తుల్లో ఎలాంటి వాతావరణం ఉంటుందో రైతులకు బాగా తెలుసు. ఈ కవికి కూడా స్వయంగా తెలుసు. 'పునర్వసు పుష్యమిలో 'కాటకమె జీవిత కథగనయ్యె'. ఆశ్లేషలో ఒక చిన్న జల్లు పడిపోయింది. వర్షం పడుతుందనే భ్రాంతి కల్పిస్తుంది. 'పుబ్బ కార్తెలో వానలు పూజ్యమయ్యె'. ఉత్తరాయణ కాలంలోనైనా వానలు పడతాయని ఎదురుచూస్తుంటే, ఎర్రగొండ, శేషాచల కొండల్లో రగిలిన అగ్ని ఆశలను మాడ్చేసింది. ఇదంతా ఇంద్రుడి కోపం వల్లే జరిగిందని కవి ఉవాచ.

కరువు కారణాలను ఎతుక్కునే క్రమంలో కొందరు 'కర్మ' అన్నారు. కొందరు 'విధి' అన్నారు. మరికొందరు 'కాల'మని, ఇంకొదరు 'దైవ'మని, ఇంకా కొంతమంది 'సహజ'మని, 'శక్తి' అని తోచిన కారణాలు చెప్తుంటారు. పాపాలు పెరిగిపోవడం వల్లే వానలు దూరమయ్యాయని, ధర్మం నాలుగు పాదాలతో నడవడం లేదని, 'సత్యం' చెప్పేవారు కరువయ్యారని... ఇలా ఎవరికి తోచిన కారణం వారు చెప్తుంటారు. రాయల కాలం తర్వాత, నాటి నీటిపారుదల వ్యవస్థ నాశనమైందని, ప్రస్తుతం వున్న ప్రభుత్వాలు సీమలోని నీటి పారుదల వ్యవస్థను పట్టించుకోవడం లేదని, అందుకే కరువు శాశ్వతంగా సీమలో తిష్ట వేసిందని పేర్కొంటాడు.

**వికసించిన పచ్చదనం :**

'వర్షారంభ ఖండం'లో కవి ఆశిస్తున్న పరిస్థితులను కావ్యంలో తయారుచేసినట్టు కనిపిస్తుంది.

కాలతంత్రం లాగా వర్షాలు ప్రారంభం అయ్యాయి. మిత్రదర్శనం, మేఘ సంచారం, మలయ మారుతాలు కలిసి శుభాలను చేకూర్చాయి. నేనంటే నేను అనుకొంటూ మబ్బులు పోటీపడి వర్షాన్ని కురిశాయి. కన్ను మూసినా, తెరిచినా కనబడనంత చిక్కగా పడిన వర్షం బాటసారులకు దురవస్థలు తెచ్చి పెట్టాయి. రాత్రంతా కురిసిన వర్షం అలసిపోయి, వేకువన వెలసి విశ్రాంతి తీసుకుంది అనడంలో కవి ఆలోచనలకు అనుగుణంగా వర్షం కురిసిందని అర్థం చేసుకోవచ్చు.

'పుట పుటన పొల్చి సస్యంబు ఎదురుజూపె'. హాలికులకు స్వర్గంగా మారిపోయింది. పశువులకు మేత పెరిగింది. ఎద్దులు పుష్టిగా తయారయ్యాయి. వాటిని

చూసి రైతు మనసు ఉప్పొంగింది. మెట్టభూములు కూడా మూడు కార్లు పండడం ప్రారంభమయ్యాయి.

వర్షాలు పడితే రైతులు ఎంత కష్టానికైనా ఓర్చుకుంటారని, 'చావు బతుకుల మూలం సస్యం' అని పేర్కొంటాడు. 'ఇక మంచి రోజులొచ్చాయి. పేదలకు సాదలకు, వికలాంగులకు, ఆశ్రితులకు ఇష్టపూర్వకంగా భోజనం పెడుతున్నారు. పంటలతోపాటు పశుపక్ష్యాదులు వృద్ధి చెందాయి.

భూమి నిండుగా సస్యం, ధర్మార్థ కామముల అనుసరణ, పెద్దలపట్ల గౌరవం పరిఢవిల్లాయి. 'దినము ప్రతి రాత్రి పడుచుండె తెరపనీక, పగలు పని చేటు కాకుండ బాసటయ్యె' అలాంటి వర్ష పరిస్థితులు సీమకు వచ్చినట్లుగా భావించాడు కవి.

రాయలసీమ ఇలా ఉండాలని కవి ఆశించాడు. అలా ఉన్నట్టే కావ్యంలో కల్పించాడు. సీమ సస్యశ్యామలం అయితే ఎవరు మాత్రం ఎందుకు సంతోషించరు?

చివరగా 'ఫలప్రాప్తి ఖండం'లో ఇతర వృత్తుల కన్నా వ్యవసాయమే మంచిదని, రైతులు రాత్రి పగలు కష్టించి లోకోపకారులుగా ఉంటారని ప్రకటిస్తాడు.

**నాటి వ్యవస్థ రూపం :**

అదే సమయంలో ప్రభుత్వ పెద్దలు చేస్తున్న అక్రమాలను కూడా ఈ ఖండంలో ఎండగట్టాడు.

'కోటా'ల రెట్టింపు, గుమస్తాల తప్పుడు లెక్కలు, రేషన్ డీలర్‌ల బ్లాక్ మార్కెట్ నిర్వాకం, పన్నుల ఎగవేత, అక్రమార్జన, స్టాకును ఇతర రాష్ట్రాల్లో అమ్మి సొమ్ము చేసుకోవడం వంటి దురాగతాలను పెద్ద మనుషుల్లా చెలామణి అయ్యేవారు చేస్తున్నారని తెలియ చెప్తాడు. ప్రతి చిన్న ఉద్యోగికీ దొంగ దండాలు పెట్టాలని, అబద్దాలు చెప్పాలని వాపోతాడు. 'అడుసులో కాలు పెట్టడమా? అధికారుల అడుగులకు మడుగులెత్తడమా?' ఈ రెంటి కన్నా భిక్షాటనమే మేలంటాడు కవి. మోసపూరితంగా వ్యవహరిస్తూ, ఎక్కువ ధర, తక్కువ తూకంతో వ్యాపారులు దోచుకుంటున్నారని, కల్లిబొల్లి కబుర్లతో, తియ్యని మాటలతో, నటనలతో జనాన్ని మోసం చేస్తున్నారంటాడు.

కాంట్రాక్టర్‌ల మోసాలు, ఇచ్చిపుచ్చుకునే లంచాల సంప్రదాయం, తప్పు చేస్తున్న వారే పై స్థాయిలో ఉంటూ మంచివాళ్ళను తప్పుడు మనుషులుగా చిత్రిస్తూ ఉండడాన్ని గర్హిస్తాడు.

ప్రభుత్వాలకు నిజం చెప్పేవారు నిష్ఠూరంగా కనిపిస్తారని వాపోతాడు. ఈ పరిస్థితి ఇప్పుడు చాలా ఎక్కువైంది. విమర్శిస్తే జైళ్ళు, కేసులే గతి.

**కవి దీవెన :**

రాయలసీమ 'సస్యానుకూలమై సర్వధ్యానంబులు పండగ వర్షంబు పడును గాక' అనీ, 'రామరాజ్యంబు రాయలసీమతోడ భారతము సంపదలతోడ చెలువారు గాక' అంటూ కోరిక తీర్చే దీవెనలిస్తాడు కవి. అంతేగాక కావ్యపఠనానికి ఫలశ్రుతిగా 'ఈ రచనను చదివితే ఆయురారోగ్య భాగ్యాలు కలుగుతాయని పురాణ పద్ధతిలో ముగిస్తాడు.

రాయలసీమ కరువును, రైతుల సేద్యాన్ని వాన పోకడలను స్వీయ అనుభవంతో, మిత్రుల సంభాషణ ద్వారా తెలుసుకున్న విషయాలను పద్యరూపంలో రాశానని, పాఠకులు ఆదరించాలని కూడా విన్నవిస్తాడు.

**ముగింపు :**

భైరపురెడ్డి రెడ్డి నారాయణరెడ్డి 20వ శతాబ్దంలో రాయలసీమలో వచ్చిన అతిపెద్ద కరువుకు సాక్షీభూతం. స్వయంగా దాని ప్రభావాన్ని చవిచూసిన వ్యక్తి. అందుకే 'రాయలసీమ రైతు' కావ్యం ఆనాటి రైతుల కడగండ్ల చిత్రణకే ప్రాధాన్యం ఇచ్చింది.

రాయలసీమ గతకాలపు ఔన్నత్యాన్ని, ఈ ప్రాంతపు పంటల విశేషాలను తెలియజేస్తూనే, పాలకుల శీతకన్నును ఎండగట్టాడు. 'కరువు' సీమను వలసలవైపు

తరమడాన్ని, కాని పనులు చేయించడాన్ని గుర్తించాడు. తను కలగంటున్న సీమ ఎలా ఉంటుందో చూపించి, సీమ సస్యశ్యామలం కావాలని ఆకాంక్షించడం ఈ కావ్య ప్రత్యేకత.

**ఆధార గ్రంథాలు :**


1. రాయలసీమ రైతు - భైరపురెడ్డి రెడ్డి నారాయణ రెడ్డి (1976), రాయవరం (పోస్టు), రాయచోటి తాలుకా, కడప జిల్లా.
2. కృషీవలుడు - దువ్వూరి రామిరెడ్డి (ఏడవ ముద్రణ - 1957), కవికోకిల గ్రంథమాల, ఎల్లాయ పాలెం (పోస్టు), నెల్లూరు జిల్లా.
3. పొలి (సేద్యం కావ్యం) - రాచపాళెం (2007), (ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి), శ్రీమతి ఆర్. లక్ష్మి, 28-3-169, తారకనాథ కాలనీ, అనంతపురం - 515001.
4. రైతు రామాయణం - వానమామలై జగన్నాథాచార్యులు (1980), సౌభాగ్య ప్రింటింగ్ ప్రెస్, కరీంనగర్.
5. రైతు రాయలు - గుత్తి (జోళదరాశి) చంద్రశేఖర రెడ్డి, 15, మొదటి దశ, జయప్రకాష్ నగర్, మియాపూర్ (వయా), హైదరాబాదు - 500050.
6. రాయలసీమ కన్నీటి గాథ - డా॥ ఎం.వి. రమణారెడ్డి (2001), రాయవరం, ప్రొద్దుటూరు, కడప జిల్లా.
7. చరిత్రలో రాయలసీమ - భూమన్ (1989), రాయలసీమాభివృద్ధి అధ్యయనాల జాతీయ సంస్థ, 9-4311, పద్మావతి నగర్, తిరుపతి.

# తెలుగు కథా వికాసంలో తెలంగాణ ప్రాంత కథకులు

- డా॥. పడాల జగన్నాథరావు , అసిస్టెంట్ ప్రొఫిసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, ఖైరతాబాద్, హైదరాబాద్.

అల్లం రాజయ్యతో పాటు తెలంగాణ నుంచి పోరాట కథనికను సుసంపన్నం చేసినవాళ్ళు సాహు, బి.యస్.రాములు, రఘోత్తమరెడ్డి, కాలువ మల్లయ్య, కె.రామ్మోహన్‌రాజు, ఉప్పల నరసింహం, సరిపల్లి కృష్ణారెడ్డి, తోట మహదేవ్, సి.హెచ్. మధు, సృజన్, చెరబండరాజు, నందిని సిద్ధారెడ్డి, పి.చంద్ లాంటి వాళ్ళెంతోమంది ఉన్నారు. విద్యాసాగర్, దేవరాజు మహరాజు, కాసుల ప్రతాపరెడ్డి లాంటి వాళ్ళు పట్టణ సంఘర్షణను చిత్రించారు. సాక్షి, జింబో కోర్టు కథానికల రచయితలుగా ప్రసిద్ధికెక్కారు. సింగిల్ కాన్సెప్ట్ కథానికలతో కె.వి.నరేందర్, వలస కథానికలతో జూకంటి జగన్నాతం ప్రసిద్ధులయ్యారు. తనకు ముందున్న రచయితల గ్రామీణ జీవితచిత్రణ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తూ చక్కని కథానికలు రాస్తున్నాడు పెద్దింటి అశోక్‌కుమార్. దిగంబర సాహిత్యోద్యమ సారధులైన నిఖిలేశ్వర్, జ్వాలాముకి కవిత్వమే కాకుండా హైదరాబాద్ జీవితాల గూర్చి చక్కని కథానికలే రాశారు. ఇటీవలి కాలంలో తెలుగు సాహిత్యంలో తలెత్తిన మైనారిటీ వాద సాహిత్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ చక్కని కథానికలు రాస్తున్నారు. స్కైబాబ, షాజహానా - స్త్రీవాద రచయిత్రిగానే కాకుండా తెలంగాణా మాండలికంలో కథానికలు రాస్తూ ముందుకు తీసుకెళ్తుంది.

గీతాంజలి, హృదయం నిండా తెలంగాణను నింపుకొని కథానికలు రాస్తున్నాడు శ్రీధర్ దేశ్‌పాండే. అడవి, ఊరులాంటి నవలలే కాకుండా ప్రకృతిపై చక్కని కథానికలు రాశాడు వసంతరావు దేశ్‌పాండే. సింగిడి కథానికలు రాసి డా॥బి.దామోదర్‌రావు, నిత్య గాయాలనది కథానికతతో బెజ్జారపు రవీందర్, వ్యాపార మిళితమై పోయిన బతుకులను చిత్రిస్తూ బెజ్జారపు వినోద్‌కుమార్, తెలంగాణా బతుకు వెతలను చిత్రిస్తూ బి.వి.యన్.స్వామి, బోధనం నర్సిరెడ్డి, పంజాల జగన్నాథం, డా॥పులిపాటి గురుస్వామి తమ సాహితీ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. అపారమైన ఆర్తితో దళిత కథానికలను సృష్టిస్తూ దార్ల రామచంద్ర, నల్లాల లక్ష్మీరాజం, అన్నవరం దేవేందర్ తమ సాహితీ ప్రస్తానాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. వీళ్ళే కాకుండా చెరబండరాజు, జాడి కథానికతో ప్రసిద్ధుడైన సందానంద శారద, చంద్ర, గంగుల నరసింహారెడ్డి, నలిమెల భాస్కర్, కలకోటి కిషన్‌రావు, కొక్కుల భాస్కర్, కొక్కుల పద్మావతి, అమరావతి, యెన్నెం ఉపేందర్, రేగులపాటి కిషన్‌రావు, ఎనుగంటివేణుగోపాల్, వనమాల చంద్రశేఖర్, అంబల్ల జనార్ధన్, గోగు శ్యామల, చొప్పదండి సుధాకర్, అఫ్సర్, గూడ అంజయ్య, భూపాల్, లోకేశ్వర్, జాజులగౌరి, జూపాక సుభద్ర లాంటివాళ్ళు అనేకమంది తెలంగాణ కథ్యానికను ముందుకు తీసుకెళ్తున్నారు. తెలంగాణ కథానిక విశిష్టతను కాపాడుతున్నారు.

'అమ్మ'కు ముందు..-డా॥నలిమెల భాస్కర్: 'భగవంతుడంతటా ఉండకపోవడం వల్ల తల్లుల్ని సృష్టించాడు' జెవిష్ సామెత. నిజమే! తల్లి ప్రత్యక్ష దైవం. అందుకే మనమంతా మాతృదేవోభవ అంటున్నది. తల్లి ప్రాశస్త్యం అంతా యింతా కాదు. కుటుంబంలో, సమాజంలో, సాహిత్యంలో, జీవితంలో, ప్రపంచంలో ఎక్కడ చూసినా అమ్మ స్థానం నిరుపమానం. తమిళంలో 'తాయిల్ శిరందదు ఒకరు కోయిలుమ్ ఇల్లై' అని ఓ సామెత వుంది. దాని కర్థం 'తల్లిని మించిన కోవెల లేదు' అని. తెలుగు భాషలోనూ, ప్రపంచ భాషలన్నింటిలోను తల్లి గొప్పతనాన్ని వివరించే సామెతలు బోలెడున్నాయి. కారణం అమ్మకు ఆల్టర్నేటివ్ ఎవరూలేరు. మిత్రుడు కె.వి.నరేందర్ అమ్మను గురించీ, అమ్మతనం గురించీ, అమ్మగొప్పతనం గురించీ బాగా తెలిసినవారు కనుక ఇప్పుడు 'అమ్మ' పేరున ఓ కథా సంకలనం తీసుకొచ్చారు.

ఒక ఉదాత్తమైన వస్తువును గ్రహించి దాన్ని అనేక కోణాల్లో చూపడం అంత సులభం కాదు. ఇది ఉల్లేఖాలంకారం లాంటిది. అయితే కె.వి.నరేందర్ తనకేవీ అసాధ్యం కావలి నిరూపించారు. ఒకే యితివృత్తాన్ని కేంద్రంగా తీసుకొని అమ్మకు సంబంధించిన ఎన్నెన్నో వృత్తాలు గీసారిందులో.

మొదటి కథ 'అమ్మ'లో భార్య స్వార్ధపరత్వం, తల్లి అమాయకత్వం చక్కగా ప్రస్ఫుటమయ్యాఇ. రాజ కీయాల్లోనూ (కొన్ని రంగాల్లో) స్త్రీలకు రిజర్వేషన్లు కల్పిం చారు. అయితే నిజానికి అధికారం భర్తలదే అయినప్పుడు మాతృత్వాన్ని నిలుపుకోవాడానిక్కూడా హక్కులేని స్త్రీమూర్తి పడే బాధకి అక్షర రూపం 'అవిశ్వాసం'. తల్లిని పంచు కుందాం అని కొడుకులు ఎంతగా ఆశించినా, తల్లి యిద్దరినీ సమానంగా చూసినట్లు పైకి అనిపించినప్పటికీ తన ఓటు చెల్లకుండా చేసి కనువిప్పు కల్గించిన కథ 'అమ్మని పంచుకుందాం'. ధ్వని ప్రధాన కథ యిది. తన తల్లి చెడ్డతల్లి అని జైలు కొచ్చిన కొడుకు కథా, మంచి తల్లి అని చెరసాల పాలైన మరొక కొడుకు కథా.. ఏకకాలంలో సమాంతరంగా రెండు కథల్ని నడిపారు కె.వి.నరేందర్ 'వెన్నెల'లో. 'డెవివరీ' మంచి కథ. నరేందర్ గారి హృదయం ఈ కథలో వుందనిపించిది. శై'శవ'గీతం చదవగానే మలయాళంలోని లలితాంబికా అంతర్జనం గారి 'సమిముద్దు' కథ గుర్తుకొచ్చింది. మంచి కథ. ఈ సంకలనంలో నన్ను బాగా కదలించిన కథ 'ప్రస్థానం'. నరేందర్ చిత్త సంస్కారానికి ఈ కథ తార్కాణం. గొప్ప కథ, నిస్సందేమంగా ఈ కథలన్నీ మంచి కథలు.

ఈ కథల్లోని భాషకి చదివించే శక్తి వుంది. కథని అద్భుతంగా మలచగల్గిన నేర్పు నరేందర్‌లో పుష్కలంగా వుంది. నరేందర్ కథలకు సార్వజనీనత వుంది. భవిష్యత్తులో నరేందర్ గొప్ప కథా రచయితగా ఎదగడానికి ఈ కథలు అపూర్వ పూర్వరంగాన్ని ఆపాదించి పెట్టాయి.

'అమ్మ' ఒక ప్రపంచం...- బి.ఎస్.రాములు: సమాజాన్ని, సమాజంలోని భాషని, భావ వ్యక్తీకరణనీ, ఆలోచించే తీరుని, నడకను, నడతను, కళలను, సంస్కృతిని, సాహిత్యాన్ని నేర్పేది అమ్మ. అందుకని అమ్మ ఒక బడి. అమ్మ ఒక ప్రపంచం. అమ్మ త్యాగాలకు ప్రతీక. అమ్మ చెప్పేదంతా సహజం అనుకునే సహజాత వాహిక అమ్మ. ప్రశ్నించకుండా విశ్వసించే గలిగేటట్టు చేయగలిగేది అమ్మ. విశ్వాసాలను, దృక్పథాలను అమ్మలా ప్రేమతో నేర్పి నంతగా తర్కంతో, ప్రశ్నించడంతో నేర్పడం సాధ్యం కాదు. అలాగే అమ్మప్రేమ ఒక సాధనం కాదు. అమ్మ ప్రేమ ఒక లక్ష్యం. పిల్లల్ని ప్రేమించటమంటే తనని తాను ప్రేమించుకోవటమే. అందుకే అమ్మ ప్రేమలో పిల్లల పట్ల భేదభావాలుండవు. అమ్మ అనగానే అందరూ గారాలు పోతారు. పసిపిల్లల్లా మారిపోవాలని కోరుకుంటారు. కాని అమ్మతనాన్ని కొందరు స్త్రీవాదులు వ్యతిరేకిస్తారు. అమ్మని త్యాగశీలిగా ప్రశంసించి చేయించుకునేదంతా వెట్టి చాకిరీయే తప్ప నిజమైన ప్రేమ కాదంటారు. ఇందులో నిజముంది. ఆప్యాయంగా పెంచిన అమ్మల్ని పాత ఇంట్లో వదిలేసి కొత్తింట్లో కాపురాలు పెట్టి నెలకింత పంపడమో, వృద్ధుల ఆశ్రమంలో వేసిరావటమో, ఇంట్లో వుంటే జీతంలేని పనిమనిషిగా చూడటమో తప్ప అమ్మ తిన్న కంచాలు కడిగే కొడుకులెందరు? వంటలో సహకరించే వాళ్లెంతమంది? అసలు వంటే నేర్చు కోనవసరం లేదనుకునే పుత్రరత్నాలు ఇంటిపనిని, తల్లిని, వంటపనిని గౌరవిస్తారనుకోవటం వెర్రిభ్రమ. తమ సుఖాలకోసం, అవసరాలకోసం అమ్మను ప్రేమను వాడుకోవటమే ఎక్కువ జరిగేది.

మగపిల్లల్ని ఒకతీరుగ, ఆడపిల్లల్ని ఒకతీరుగ పెంచి అసమానతల్ని పెంచిపోషిసుతన్నది అమ్మే. ఈ పల్లీలు ఇక్కడే తిను.. వాళ్లకు. వీళ్లకు పెట్టకు అని అమ్మే స్వార్థాన్ని నేర్పుతున్నది. అదే స్వార్థం అవసరాలు తీరాక అమ్మని పనికిరాని పాత వస్తువులా జమకడుతున్నది. అందరూ అమ్మకన్న పిల్లలే. అమ్మ భావమే ఒక ఆదర్శప్రపంచం. అమ్మతనంలోని పరిపూర్ణతని రామాయణ, భారతాలంత పెద్ద గ్రంథాలుగా రాసినా అమ్మని పరిపూర్ణంగా సృజిం చడం ఎవరి తరమూ కాదేమో... అమ్మకూ, భార్యకూ మధ్యగల తేడా చెప్పటంతో 'అమ్మ' కథల సంపుటి మొదలై.. ప్రస్తుతం అమ్మతనానికి సైన్సుకు మధ్య

జరుగుతున్న సంఘర్షణ (మదర్ 2000)తో కథల సంపుటి పూర్తవుతుంది. అమ్మ గురించి, అన్ని పార్శ్వాల్లో కాకపోయినా కొన్ని కోణాలైనా స్పర్శించే 'అమ్మ' కథా సంకలనం తెలుగులో ఇదే మొదటిది. ఈ రీత్యా తెలుగు కథాసాహిత్య చరిత్రలో ఈ సంకలనం ఒక నూతన చరిత్రకు నాంది. ఈ పుస్తకం ఏమాత్రం స్పందింపచేయ గలిగినా కె.వి.నరేందర్ తెలుగు సాహిత్యంలో కొత్తరూపంతో, కొత్త స్వభావంతో సరికొత్త రచయితగా ఆవిష్కరింపబడతాడు.

అమ్మ కొడుకు ఒకరికి భర్త అయితే, ఒక గారాల కూతురు ఒక ఇంటికోడలై ఒకరికి భార్య అవుతుంది. ఈ స్వభావాల్లో పాత్రల్లో వచ్చే మార్పులే అమ్మ కథ. ఏ వదినల్ని, అన్నల్ని స్వార్థపరులని ఆడిపోసుకున్నాడో దాంట్లోకి తాను తనకు తెలియకుండానే దిగబడటం జీవితంలోని వైచిత్రి. నిజానికి ఈ స్థితి అమ్మకూడా ఎదుర్కొంది. అమ్మమ్మ, నానమ్మ కూడా ఎదుర్కొన్నదే. లేకపోయివుంటే అమ్మతోపాటు పెద్దమ్మలూ, చిన్నమ్మలూ, పెదనాన్నలూ, చిన్నాన్నలు, చిన్నతాతలు, పెదతాతలు ఎందరో కల్సి ఒకే కుటుంబంగా ఉండి ఉండేది, ఉమ్మడి కుటుంబంలోని సోషలిజం విచ్చిన్నమై వ్యక్తి కుటుంబంగా మారడానికి కారణం స్వార్థమే. ఆ స్వార్థానికి 'పిల్లల చదువులు' అనే ముసుగు తగిలించు కోవటం ఒక కారణమైతే, చిన్నవాడి ఆశల్ని ఎవరూ ఆలోచించని కోణంలో ఆవిష్కరించటం ఈ కథ ప్రత్యేకత. సోవియట్ రష్యాలో, చైనాలో రాజకీయాలు స్త్రీలను వంటపని నుండి, ఇంటిచాకిరీ నుండి విముక్తం చేసాయి. మన రాజకీయాల్లో జనాభా అదుపుపేరిట మొదలైన ఒక చట్టం, పిల్లల్ని కనే హక్కుని ఎలా కాలరాచివేస్తోంది 'అవిశ్వాసం' కథ తెలుపుతుంది. స్త్రీలకిచ్చే రిజర్వేషన్లు భర్తలు, అన్నలు అనుభవించే సంధి దశకు సంబంధించిన సామాజిక చరిత్రను ఈ కథ విప్పి చెపుతుంది.

పిల్లల కోణంలో కథ రాయాలంటే కష్టం. గర్భస్థ శిశువు పెళ్లింలకాని తల్లిని నిలదీసే కథ 'పొత్తికడుపులో నెత్తుటి పుష్పం'. ఇందులోని మెలోడ్రామా చెప్తే సాగనుపోతుంది. చదివి ఆశ్చర్యపోవల్సిందే. ఎంతకాదన్నా నరేందర్ కరీంనగర్ గడ్డపై పుట్టినవాడే కాబట్టి... అతను కూడా విప్లవ పరిణామాలని, జీవితాలని చిత్రీకరించక తప్పలేదనడానికి 'డెలివరీ' కథ స్పష్టం చేస్తుంది. ఈ "అమ్మ" కథలసంపుటి పరిధిలోకి రాని అలంటి కథల్ని గతంలో ఉదయంలో రాసాడు. మానవ సంబంధాల్ని రెగ్యులరైజ్ చేయటంకోసం మొదలైన రాజకీయాలు క్రమంగా అమ్మను కూడా రాజకీయ స్వార్థాలకనువుగా కుదించేదిగా స్వార్థం ఎలా బలిపోయిందో 'అమ్మని పంచుకుందాం' కథ చిత్రిస్తుంది.

'వెన్నెల' కథలో ఏ ఆసరాలేని దిక్కులేని, తల్లి పిల్లల్ని తన పెట్టుబడిగా భావిస్తుంది. అందులో తప్పులేదు. అయితే తనస్వార్థం కోసం సుఖం కోసం కొడల్నే అమ్మేసే తల్లిని నరికి జైలుకెళ్లడమే అతడికి తెల్సింది. ప్రేంచంద్ ఇలాంటి సమస్యను ఏమీ పరిష్కరించకుండానే 'కఫన్' అనే కథ (ఒక ఊరికథ సినిమా)లో వదిలేసాడు. దొంగలు, తాగుబోతులైన తండ్రీకొడుకులు కోడలు ప్రసవవేదనతో విలవిలలాడి శిశువుతోపాటు చనిపోతే ఆ శవాన్ని చూపి డబ్బులడుక్కొని సారాకొట్లోకెళ్తారు. ఎంత హృదయ విదారక దృశ్యం? దీనికి ప్రేంచంద్ ఎక్కడా వివరణ ఇవ్వడు. నరేందర్ కూడా ఎక్కడా వివరణ ఇవ్వడు. సమాజంలోని శ్రమ, దోపిడీని కథ చదువుతున్నప్పుడు పాఠకుడే గుర్తుచేసుకోవాల్సి వుంటుంది. 'వెన్నెల' కథలో ముగ్గురు అమ్మల్ని చూపాడు. 'శైశవగీతం' తల్లి కడుపులో ఉండి సమాజాన్ని ఫోటోతీసిన చిత్రం. అద్భుతశిల్ప విన్యాసం ఇందులో వుండగా... గర్భగుడిని ఆడపిల్లలు పుట్టకుండా మార్చేస్తే ఆ తర్వాత సమాజం సాగేదెలా? జీవితంలో అమ్మ, ఆలి నిర్వహించే పాత్ర అనిర్వచనీయమైంది. మగవాడు ఎంత పరాధీనుడు, అస్వతంత్రుడంటే ఈ ఇద్దరూ లేని ఇల్లు, జీవితం ఎంత అరాజకంగా గడుపుతాడో అందరికీ తెల్సు. తను ఆడదేనన్న విషయం మర్చిపోయి అత్తలు సైతం ఆడపిల్ల వద్దని కోడళ్లని శాసిస్తున్న నేపథ్యం గర్భగుడి కథలో అంతర్గతంగా కన్పిస్తుంది.

ఈ సంపుటిలో మరో మంచి కథ 'ప్రస్థానం'. మా అమ్మ నన్ను బడిలో చేర్చేనాటికి మా నాన్న పోయాడు. అయినా అమ్మపేరు కాకుండా స్కూల్లో నాన్నపేరే ఎక్కించారు. తొమ్మిదినెలలు మోసి, కని పెంచిన తల్లిపేరు కాకుండా ముందు తండ్రిపేరు నమోదు చేయడంలో ఎంత హింసవుందో గమనించామా? ప్రస్థానం కథలో 'తమ వృత్తిలో తండ్రులుండరని' ఒక వేశ్య అంతరంగాన్ని మనసుని కుదిపేరీతిలో చిత్రించాడు నరేందర్. ఇవాళ స్త్రీవాదులొచ్చారు. తల్లిపేరు కూడా వుండాలని ఉద్యమం తీసారు. తండ్రిపేరుతో పాటు తల్లిపేరు రాయడానికి ఇబ్బందేమీ లేకపోయినా.. అసలు తండ్రే తెలీని వేశ్య వృత్తిలోని సంఘర్షణ మనసుకు కట్టినట్లు తీర్చిదిద్దారు. అమ్మలపట్ల కొడుకుల కుండే వాస్తవిక ప్రేమ ఎలాంటిదో 'నానమ్మ' కథలో చూడవచ్చు. అలాగే విదేశీ పండగలు ఈ దేశంలోకి ఎలా చొచ్చుకు వస్తున్నాయో తెలిపేకథ 'మదర్స్ డే'. ఈ కథలోనూ తల్లిప్రేమ ఎంతగా రాజీ పడుతుందో విశదీకరించాడు.

మదర్ 2000 కథలోనే ఒక వైవిధ్యముంది. తను గతంలో ఉదయం డైలీ సీరియల్‌గా టెస్ట్‌ట్యూబ్ బేబీలపై రాసిన నవల 'బేబీ ఓ బేబీ'ని కుదించి చివరి కథగా చేర్చాడు. అమ్మతనంతో ఆడుకుంటున్న సైన్సుని కొస మెరుపుతో చురకంటించాడు. మన పురాణాల్లోను, ఇతిహాసాల్లోను వీర్యం తప్ప భర్త ప్రమేయంలేనివారి ద్వారా ఎందరో మగపురుషులు తల్లులకు పుట్టారు. అదేదో నోబెల్ బహుమతి గ్రహీతల సెమన్ బ్యాంక్ ఏర్పడబోతోందంటే అందరూ భయపడి చస్తున్నారు. అందులో వున్నది మగ అహంకారామే తప్ప, మానవజాతి సమస్యకాదని మన పురాణ పురుషుల పుట్టుకలు, పెరుగుదలలు స్పష్టం చేస్తున్నాయి. ఇలాంటి సమస్యను హక్కుల సమస్యగా మార్చినపుడు ఆధునిక సైన్సుతో పరిష్కరించడం ఎలా సాధ్యం? అందుకే విషాదం. మానవజాతి మొత్తంగా మానవాలికి బాధ్యత వహించగలిగే దృక్పథం ఏర్పడిన నాడు ఈ సమస్యలే ఉత్పన్నం కావు.

కె.వి.నరేందర్ కథలు మెరుపుతీగల్లా వుంటాయి. మబ్బు ఎక్కడిదో, మబ్బుల మధ్య మెరుపు ఎక్కడిదో, వర్షం ఎక్కడిదో, మెరుపు ఎందుకు మెరిసిందో తెలియదు. జీవితం మబ్బులు, మెరుపు తీగల్లా కథల్లో అలా మెరిసి ఇలా మాయమవుతుంటాయి. అయినప్పటికీ కథల్లో సామాజిక స్పృహని ఎలా వ్యక్తం చేయాలో, సమాజం విధిస్తున్న పరిమితులేమిటో విశ్లేషించుకునే సంఘర్షణలో నరేందర్ వున్నాడు. గెలుగుచుకోవాలనుకునే జీవితాలను, ఓడిపోయే జీవితాలుగా మార్చడమే విప్లవం చేస్తున్నపని. రచయితగా ఓడిపోయే జీవితాన్నిచ్చే ఈ నిర్భందాలు, పెత్తనాలు లేని రచయితగా ఎదగాలనుకున్నవాడు నరేందర్. ఎదిగాడు కూడా. సామాజిక విరుద్ధాంశాల ఐక్యతలో భాగంగానే కె.వి.నరేందర్ తన క్రమాన్ని తాను తీసుకున్నాడనుకుంటాను. నాలాగ, మరికొందరిలాగా విషాదాంత నాయకులుగా మిగిలిపోవడానికి అసలే మాత్రం ఇష్టంలేని దృక్పథం నరేందర్‌ది. ఇందులోనే జీవితాన్ని గెలుచుకోవాలని నిశ్చయించుకున్న స్థితప్రజ్ఞుడు కె.వి.నరేందర్. గెలుచుకున్న జీవితానికి, గెలువగలిగిన జీవితానికి, గెలుచుకోవల్సిన జీవితానికి మధ్య నిరంతర వైరుధ్యం, సంఘర్షణ ఉంటుంది. టాగోర్, ప్రేంచంద్, శరత్‌బాబు, టాల్‌స్టాయ్, చెహోవ్, గోర్కీ, చలం, జాషువా, కొ.కు. రావిశాస్త్రి, సినారె, గూడ అంజయ్య, కాలువ మల్లయ్య ఎవరికి వీలైన తీరుల్లో వారు ఈ వైరుధ్యాన్ని పరిష్కరించుకున్నారు. కె.వి.నరేందర్ కూడా అంతే. ప్రతికలు, టీవీ, సినిమా, సాహిత్యరంగాల్లో తన సత్తా ఏమిటో, స్థానమేమిటో పరీక్షించుకోవాలన్న తపన నరేందర్‌లో అధికం. మానవీయ అంశాల్ని పట్టుకోవడంలో క్రమంగా పట్టు సాధిస్తున్నాడు. ఉత్కంఠ కథా శిల్ప నిర్మాణంతో, వేగవంతమైన శిల్పంతో ఈ 'అమ్మ' కథలు పాఠకుల్ని ఉత్తేజపరుస్తాయి. ఈ కథల్లో చదివించే మంచి వస్తువూ ఉంది. సమీక్షకులు, సహృదయ పాఠకులు ఏ రచయితనైనా తనవాడిగా మార్చుకున్నప్పుడు ఆ ఆత్మవిశ్వాసంతో రచయిత వస్తుగాఢతను సాధిస్తాడు.

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# భావకవితా చంద్రుడు బసవరాజు

- డా॥. పి. విజయకుమార్, సహాయ ఆచార్యులు (తెలుగు), ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

బసవరాజు అప్పారావు గేయాలు అనుభవ తరంగాలు. వెతికిన కొద్దీ రత్నాలు లభించే గేయ సముద్రాలు బసవరాజు అప్పారావు గారివి. బసవరాజు గేయాలలో ప్రధానంగా ఒక ఆవేశపు విసురు, ఒక విశ్వాసం దర్శనమిస్తాయి. సరళత, ఋజుత్వం వారి గేయాలలో స్పష్టంగా కనిపిస్తాయి. అప్పారావు గీతాలలో జాతీయకాంక్ష, ప్రేమతత్త్వం, విరహవేదన, కృష్ణలీలలు, పండుగలు, దేవుళ్ళు, ప్రకృతివర్ణనలు, చారిత్రక నిర్మాణాలు, జీవిత సంఘటనలు ఇలా ఎన్నో ఇతివృత్తాలు సాక్షాత్కరిస్తాయి. బసవరాజు అనుభవాలే శాశ్వత శిల్పాలుగా గేయాలలో చెక్కబడ్డాయి. మలచబడ్డాయి. బసవరాజు అంటే గేయాలు, గీతాలే తలపునకు వస్తాయి. భావకావ్య జగత్తుకు ప్రవేశిక లాంటివారు బసవరాజు అప్పారావు. తన గేయాల ద్వారా భావకవులలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. గేయకవితా ప్రస్థానాన్ని తీర్చిదిద్దిన వారిలో విశిష్టుడిగా సాహిత్యచరిత్రలో బసవ రాజు అప్పారావుని పేర్కొనవచ్చు. "నగ్నంగా నిజంగా ఉంటుంది యీయన కవిత్వం. జిలుగూ తళుకూ ఉండదు, ఉండటానికి వీలులేదు. ప్రతిభావమూ గుండె చీల్చుకుని దూకుడుగా వస్తుంది. అందుచేతనే ఈయన పాటల్లో తొలి చరణాలే గుండె పట్టుకుంటవి" అని బసవరాజు అప్పారావు కవిత్వాన్ని గూర్చి ముద్దుకృష్ణ పల్కిన పల్కులివి. బసవరాజు అప్పారావు పాటలు రాయడమే కాదు తమ పాటలని గొప్పగా పాడి వినిపించే వారట.

బసవరాజు అప్పారావు గేయాలను పరిశీలిస్తే వారి జీవితం ఎన్నో ఒడుదుడుకులు, ఆవేదనలతో, కన్నీళ్ళు, నిట్టూర్పులతో గడిచినట్లుగా అనిపిస్తుంది. "వేదాద్రి శిఖరాన వెలిగొన్న జ్యోతి / మినుకుమని కాసేపు కునికి పోయింది / దేవలోకమునుంచి దిగినట్టి గంగ / వచ్చినదారినే పట్టి మళ్ళింది / పంజరం దూరిన బంగారు పిట్ట / తలుపు దీసేవేపో తర్లి పోయింది / కాపురమ్మొచ్చిన కన్నెపాపాయి / ఇల్లు కాళీచేసి వెళ్ళిపోయాడు." ఈ గీతం బసవరాజు పాటలన్నింటికీ కిరీటం. చివరి పంక్తి ఈ పాటకు తురాయి. అప్పారావుగారి పసిపాప మరణించి నప్పుడు కవి గుండె సడికి అక్షరరూపంపై గేయం ఎంతో లోతైన తాత్త్విక మర్మాన్ని "కొద్దికాలం కాపురమొచ్చిన కన్నిపాపాయి యిల్లు కాళీ చేసి వెళ్లిపోయాడు" అని ఎంత సహజమైన మామూలు మాటల్లో చెప్పారో మనం చూడవచ్చు. కృష్ణశాస్త్రి పై గేయంలోని చివరి పంక్తిని "ప్రపంచ కావ్య భాండాగారంలో గొప్ప పంక్తుల్లో ఒకటిగా భావించారు.

"అతనెప్పుడూ మామూలు శబ్దాలుదాటి వెళ్ళలేదు. ఎవరితోనైనా కష్టసుఖాలను వేగంతోనూ, వేదనతోనూ చెప్పుకునేటప్పుడు అపూర్వ శబ్దాలకూ, అల్లిక జిగిబిగికి పరుగెత్తుతామా! ఈ గుణం వల్లనే అతను గురజాడకి అనుచరుడైనాడు. కొన్ని కొన్ని చోట్ల అంతకన్నా అధికుడ య్యాడు. గురజాడలో యీ ఆస్తత, యీ ఆర్ధ్రత అంతగా లేవు. వర్చువర్తు సామాన్యభాషలో కవిత్వం చెప్పాలని ఒక మతంగా అవలంబించి చేసిన పని ఇతనింకోలాగ చేయలేక చేసి ఊరుకొన్నాడు. ఊరుకొన్నాడా? పదిమందీ పరవశులై వినేటట్లు ఆలాపించాడు. జీవద్భాషకూ, వ్యావహారిక భాషకూ యింత దగ్గరగా కావ్యభాషను తీసికొని వచ్చే యత్నం గొప్పది కాదూ" అని కృష్ణశాస్త్రి బసవరాజు అప్పారావుని గూర్చి పేర్కొన్నారు.

ప్రేమతత్త్వం, ప్రకృతి చిత్రాలు, భక్తి, కవిజీవితచర్య, చరిత్ర అన్న భావనలు బసవరాజు గేయాలలో కనిపిస్తాయి. ప్రేమస్వభావాన్ని జీర్ణించుకున్న స్థితి అప్పారావు గేయాలలో ప్రతిధ్వనిస్తుంటుంది. ప్రేమకన్నా ఎక్కువ ఏముంది అని ఎల్ల కామ్య పదవులకన్నా ప్రేమే ఎక్కువంటాడు. 'చెలి

వలపు లేని నీ కలిమి కాల్పనె' అంటారు. 'వలపెఱుంగక బ్రతికి కులికి మురిసేకన్నా ఈ సృష్టిలో విలపింపమేలురా' అంటారు. ప్రేమకన్నా ఈ సృష్టిలో గొప్పదేముంది అనే భావన అప్పారావుగారి పల్కులలో ప్రతిధ్వనిస్తుంది. "ప్రేమించు సుఖముకై ప్రేమించు ముక్తికై, ప్రేమించు ప్రేమకై" అని సుఖం, ముక్తి, ప్రేమ కోసం ప్రేమించమని అతిసహజంగా ప్రేమతత్వాన్ని ఆవిష్కరించారు. కొన్ని దృశ్యాలను తిలకించినప్పుడు బసవరాజు అప్పారావు హృదయం వేగంగా స్పందిస్తుంది. జీవితానుభవాలతో మమేకమై కవిత్వం ఉప్పొంగుతుంది. బిందువంత పదంలో సింధువంత భావాన్ని ఇముడ్చుకుంటుంది బసవరాజు సాహిత్యం. విత్తనమంత అక్షరంలో వృక్షమంత అర్థాన్ని పొదువుకుంటుంది అప్పారావు గారి కవిత్వం.

ఒకనాడు ఆగ్రాలో పండువెన్నెలలో బసవరాజు అప్పారావు తన ధర్మపత్నితో కలిసి 'తాజ్‌మహల్'ను దర్శించి అద్భుతమైన అనుభూతి పొంది పరవశించిపోయారు. ఆ పరవశమే 'తాజ్‌మహల్' గేయంగా రూపుదిద్దుకుంది. మామిడిచెట్టును అల్లుకొన్నది / మాధవీలతొకటి / యేమా రెండిటి ప్రేమసంపద / ఇంతింతనలేము / చూడలేని పాపిష్టి తుపానూ / ఊడబీకెలతనూ / మోడయిపోయీ మామిడిచెట్టూ / మొగము వేలవేసీ / ముచ్చటైన ఆకులు కాయలనే / వెచ్చని కన్నీళ్ళోడ్చే / పచ్చనాకులా బొమ్మరింటిలో / పండొక్కటి రాల్చీ / మామిడిచెట్టూ మాధవిలతతో / మాయలో గలసింది / కామితమిచ్చే మామిడిపండూ / కవులకు మిగిలింది అంటారు తాజమహల్ కవితలో. ముంతాజ్‌బేగం అకాల మృత్యువు వాత పడిందని కవిహృదయం ఆక్రోశించి, షాజహాన్ ప్రేమచిహ్నం 'తాజ్‌మహల్'గా రూపుదిద్దుకుంది అని ఊరట చెందింది. ఈ గేయంలోని పంక్తులు బసవరాజు అప్పారావు జీవితగాథకు అన్వయించవచ్చు అన్న విమర్శకులున్నారు. పాపిష్టి తుఫాను మామిడి చెట్టుకు అలుకున్న మాధవీలతను పొట్టన పెట్టుకుంటే బసవరాజు అప్పారావు జీవితగాథలో ఝుంఝూ మారుతం మామిడి చెట్టునే కూకటి వ్రేళ్ళతో పెకలించివేసింది. చిన్న వయస్సులోనే దివికేగిన భావకవిచంద్రుడు బసవరాజు అప్పారావు. బసవరాజు కవనంతో ప్రేమతరంగాలే భావగర్భితమై, రసపూరితంగా దర్శనమిస్తాయి. అప్పారావు కవిత్వంతోనే బ్రతికాడంటారు కొందరు. బసవరాజు కావ్యాలలో కన్నా అతని జీవితంలోనే కవిత్వం ఎక్కువగా దొరుకుతుందంటారు మరికొందరు. అతని కావ్యాలు జీవితాలు ఒకటేనని కొందరన్నారు. అనుభూతి పొంది పాఠకులకు అదే అనుభూతిని పొందించడంలో అప్పారావు గారు దిట్ట. అందుకే బసవరాజు అప్పారావు గేయాలు గుండె పట్టుకుంటాయి.

భారతదేశంలో 'నాగులచవితి' నాడు పుట్టలో పాలు పోయడం, పూజచేయడం ఆనవాయితీగా వస్తూ ఉంది. తెలుగువారికి అనాది నుండి వస్తున్న సంప్రదాయం అది. "నాగులచవితికి నాగేంద్ర నీకు / పొట్ట నిండా పాలు పోస్తాము తండ్రి" అని నీ పుట్ట దరికి నా పాపలొచ్చేరు / పాపపుణ్యముల వాసనే లేని / బ్రహ్మ స్వరూపులౌ పసికూనలోయి / కోపించి బుస్సలు కొట్టబోకోయి" అంటారు. శివరాత్రి నాడయినా పరమశివా! అని మనసారా నోటి నిండుగా పల్కవేమిరా అని వాపోతారు. 'గ్రహణాల'నాడు రాబోయే ప్రమాదాన్ని సూచిస్తూ "రాబోకు రాబోకురా, చందమామ/ రాహు పొంచున్నాడురా తోవలోన / పరమ రాకాసిరా పాపిష్టి రాహువు / పొత్తిలా నినుబట్టి మింగబోయేనురా" అని రాహువు పొంచి ఉన్నాడని హెచ్చరిక చేస్తారు. "నన్నెవ్వరాపలేరీవేళా! నాధాటి కోపలేరీవేళా అంటారు. నిజంగానే అప్పారావు కవిత్వధాటిని ఎవ్వరూ ఆపలేరు.

"ఇది మొగల్ దివాణమా? / ప్రళయ శివమహాశ్మశానమా? / ఇది విజయస్తంభమా? / చలవిద్యు చ్చంద్ర చూడదంభమా? / ఇవి జీర్ణసమాధులా ? / ప్రమథగణ నివాస వీధులా? / ఇది యవన వికాసమా! / నటేశ తాండవ విలాసమా!" అంటూ 'కుతుబ్‌మీనార్' పేరుతో కవిత్వాన్ని కురిపించారు.

నవంబరు 11వ తేదీని ప్రపంచంలో అన్ని దేశాలలో యుద్ధంలో చచ్చినవారిని, జపించిన వారినీ కూడా స్మరించడానికి సభలు చేస్తారు. 11-11-1932న ఢిల్లీ రాజధానిలో ఆంగ్లేయులు విజయకోలాహలం చేస్తున్నారు. ఆనాడు బసవరాజు అప్పారావు గుండె పీక్కుని పోయింది. వేదన తగ్గడానికి కుతుబ్‌మీనార్‌కి వెళ్ళాడు. అక్కడ ఉన్న చిత్రాన్ని చూచి స్పందించి పై గీతాన్ని రాసారు. ఢిల్లీ సామ్రాజ్యమెవరిది? ఇప్పుడు విజయకోలాహలం చేస్తున్న ఆంగ్లేయులదా? కుతుబ్‌మీనారు విజయస్తంభము గట్టించిన ముసల్మానులదా? పాండవులకు అశోకపృథ్వీ రాజాదులకు వారసులైన ఆర్యులదా? ఒక పక్క కుతుబు మీనారు పక్కన అశోకస్తంభము, ఒకపక్క ముసల్మాను మసీదు, ఖిల్లా, ఇంకొక ప్రక్కన ఆర్యాదేవాలయమూ, దుర్గము పాడై రూపుమాసిపోతూ వున్న ఈ ఉభయ దృశ్యాలపైనా పరదేశవాసులైన ఆంగ్లేయుల పరిపాలనా! భావకవి సామ్రాట్టునైన నాది కాదా యీ ఢిల్లీ! అంటారు అప్పారావు.

"గుత్తొంకాయ్ కూరోయ్ బావా / కోరి వండినానోయ్ బావా ! కూరలోపలా నా వలపంతా / కూరిపెట్టినానోయ్ బావా! కోరికతో తినవోయ్ బావా!" అంటూ మరదలు బావతో కూరలోనే వలపు భావాన్ని కూరిపెట్టిన వైనాన్ని చక్కని భావుకతతో మనకందించారు. "ఒంటిగా ఉయ్యాల లూగితివా నా ముద్దుకృష్ణా! జంటగానను బిల్వదగ దోయీ? అంటూ కృష్ణునిపై ప్రేమస్వభావాన్ని 'వటపత్రశాయి'లో వ్యక్తం చేశారు. ఏడ తిరుగాడెదవు కృష్ణా! ఈ వాడకే రావైతి కృష్ణా" అంటూ విరహ స్వభావాన్ని స్పష్టం చేశారు. 'నీపై మోహమునో కృష్ణా'! అంటూ మోహభావాన్ని గోపికా గీతములు ద్వారా అభివ్యక్తం చేశారు. 'ఏలనింక యమునా కళ్యాణి, నే లీలామానవుడు గోపాలుడు లేడాయె' అంటూ యమునా సాంత్వనాన్ని అభివ్యక్తం చేశారు.

"కోయిలా కోయిలా కూయబోకే గుండెలూ బద్దలు చేయబోకే అంటూ ఆనాటి మధురజ్ఞాపకాలు మరల గుర్తుకు వచ్చి తననెంతో బాధకు గురిచేస్తున్నాయని చింతతో ప్రాణాలు తీయబోకని 'కోయిల' కవిత ద్వారా వ్యక్తం చేశారు. ఎన్ని తపస్సులు చేస్తే నాకీ మానవజన్మ కల్గింది. "ఈ జన్మలో నాకు ఈ రాణిని చెట్టబట్టాను. తపస్సు గర్వంతో ఏ తప్పు జేశానో నా చిట్టితో ఎడబాటు శిక్ష తగిలింది" అని ఎడబాటు ఆవేదనను వ్యక్తీకరించారు.

జాతీయ గీతాలు రచించి జాతీయోద్యమ స్ఫూర్తిని నింపారు. క్షత్రియుడైన కౌశికుడు కాలేదా బ్రహ్మఋషి. నేడు కోమటి బిడ్డ కూడా బ్రహ్మర్షి అయ్యాడని, కొల్లాయి గట్టితేనేమి మా గాంధీ కోమటైపుట్టితేనేమి? అని 'మాగాంధి' కవితను ఆవిష్కరించారు. ఈశ్వరుడే గాంధి లాగా అవతరించారని, గాంధీమహాత్ముడు బయలుదేరితే జగత్తంతా కలకల నవ్విందని, చకచక నడిస్తే భూదేవి కంపించిందని, ఆయన కనువిప్పితే అధర్మం గడగడ వణికిందని, నవ్వితే స్వరాజ్యం కన్నుల గట్టిందని, గొంతు విప్పగా ప్రణవం గణగణ మ్రోగిందని, గాంధీతత్త్వాన్ని అభివ్యక్తం చేశారు. సిగ్గు లేదా నీకు శరము లేదా అన్నమైనాలేక బీదలల్లాడుతుంటే సీతాకోకచిలుక లాగా సీమ గుడ్డ కట్టి తిరగడానికి అని ప్రశ్నించి పూటకూడు లేని ప్రజకు రాట్నమొకటే పెన్నిధి అంటారు. అప్పారావు సౌందర్యోపాసనను ఈశ్వరారాధనకి సాధన మార్గంగా స్వీకరించి 'ఆనందోబ్రహ్మ' అని విశ్వసించిన వైనం అప్పారావు గేయాలలో కనిపిస్తుంది.

"బసవరాజుకి అనుభూతి రావడమేమిటి, పాటలోనో, పద్యంలోనో అనెయ్యడమేమిటి? అందుకే అతని గీతాలలో అంతవేడి. ఆ వేగమే, ఆ వేదనే అతని కవిత్వానికి ప్రాణం. పాటలో పల్లవే గుండె పట్టు కొంటుంది. అంత తొందరలో అంత వేడిమిలో గుండె చీల్చుకు వచ్చిన పాటకు, అంత నగ్నంగాను, అలాగే యువతలికి విసిరివేసినపుడు కల్పనకు అవకాశముండదు. శిల్పానికి స్థిమితముండదు. భావనాశిల్పాల్లేని వెలితిని అతని పాట భర్తీ చేసేది. అతని పాట అంతర్వాహిని కాదు. అడుగున శృతికాదు. పాటదే పైచెయ్యి. అందుకే

అతని రచనలు కొన్ని కావ్యాలలాగా కూర్చొని చదివేవికావు. గొంతెత్తి పాడేవి. పాడేటప్పుడు అతని గీతాలకున్న శక్తి మరే యితర కవి గీతాలకీ లేదనిపిస్తుంది" అంటారు కృష్ణశాస్త్రి.

"బ్రతుకు బరువు మోయలేక చితికి, చివికి, డస్సి, వాడి
పికరు పుట్టి పారిపోయి ఒకడనె ఏ తోటలోనొ
పాట పాడుతుండగ నా ప్రాణి దాటి యేగేనా
ప్రాణి దాటి యేగుచుండ పాటనోట మ్రోగేనా"

అని కోరుకున్నాడు. అలా మజిలీ లేని యాత్రికుడు అప్పారావు పాట పాడుతూనే పరమపదించారు. నా విధుర జీవితమ్మునే నాటకముజేసి జగతి రంజింపలేనా' అని అప్పారావుగారే ఒక సందర్భంలో అన్నారు. కాని విధివశాత్తు చిన్నవయస్సులోనే నూరేళ్ళు నిండినంత పని అయ్యింది. బసవరాజు గేయాలలో ప్రధానంగా ప్రకృతి సౌందర్యారాధన, జాతీయాభిమానం, ఆంధ్రాభిమానం, ప్రేమతత్త్వం, విరహవేదన, పండుగల వైశిష్ట్యం, చారిత్రక నిర్మాణవిశేషాలు, జీవిత సంఘటనల నేపథ్యంలో అప్పారావు గేయ కవితావాణి చక్కని అనుభూతిని మిగిల్చి సాహిత్య చరిత్రలో చిరస్మరణీయులుగా మిగిలిపోయారు.

**ఆధార గ్రంథాలు :**

1. అర్థశతాబ్దపు ఆంధ్రకవిత్వం - శ్రీపాదగోపాలకృష్ణమూర్తి
2. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు - ప్రయోగములు - సి. నారాయణరెడ్డి
3. భావకవిత్వం - ఇంద్రగంటి శ్రీకాంతశర్మ
4. తెలుగు కవితావికాసం - కడియాల రామమోహనరాయ్
5. తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య

# మరుగునపడిన కవి మన్నెం రాములు

- పెబ్బేటి మల్లికార్జున్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

మన్నెం రాములు అనే కవి నాగర్‌కర్నూల్ జిల్లాలోని గోరిట గ్రామవాసి. ఈ కవి రాసిన 'నిర్వచన శిల్పకళా విజయము' అనే కావ్యరాత ప్రతులు నాగర్‌కర్నూల్ పట్టణ వాసియైన జహంగీర్ అనే పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుని దగ్గర ఉన్నాయి.

ఈ కావ్యం యొక్క గద్యలో కవి తన గురించి "ఇతిశ్రీ నారదగిరి వేంకటేశ్వర పాదారవింద సంసేవిత శ్రీ లక్ష్మణదాస ప్రియశిష్య నాగదాస పౌత్ర వేంకయార్య తనూభవ మన్నెం రాములు ప్రణీతంబైన నిర్వచన శిల్ప కళావిజయమను ఏకాశ్వాస కావ్యము సమాప్తము" అని చెప్పుకున్నాడు. వీరి తాత నాగయ్యకు పోలీస్ పటేల్‌గిరి ఉండేది. ఈయన కూడ కవి. మన్నెం రాములు తన కావ్యాన్ని ఈశ్వరునికి అంకితం ఇచ్చాడు.

కవి ఈ కావ్యంలో విచిత్రమైన కథను కావ్యంగా మలిచాడు. సత్యపురమనే పట్టణంలో పరిపూర్ణాచారి అనే శిల్పి ఉండేవాడు. ఆదేశపు రాజు నిర్మించతలపెట్టిన శివాలయ నిర్మాణానికి ఇతడు శిల్పి. అందమైన శిల్ప నిర్మాణం చేసే ఇతడు వాటికి మించిన అందగాడు. ఆ దేశపు రాకుమార్తె ఇతని అందానికి ముగ్ధురాలై అతన్ని ప్రేమిస్తుంది.

ఇతని సౌందర్యానికి ముగ్ధులయిన స్త్రీలు అతని మనోహర రూపాన్ని మనసులో నిల్పుకొనగా, ఆ ఆకర్షణ ప్రభావం చేత వారికి పుట్టిన శిశువులందరూ ఆ శిల్పినే పోలి ఉన్నారు. ఈ విషయం తెలిసి అగ్రహోదగ్రులైన వారి భర్తలు రాజుకు ఫిర్యాదు చేయగా, రాజు శిల్పికి మరణదండన విధించాడు. కాని ఆ యువకుడు పతి వ్రతలైన స్త్రీలను అవమానించవద్దని ఋతుకాలమున నిష్ఠతో ఏ పురుషుని ధ్యానిస్తారో ఆ రూపమే పిండ రూపంగా మారుతుందని చెప్తాడు. అందుకు ఋజువుగా తను చెక్కిన వృషభరాజాన్ని చూసిన ఆవులు అలాంటి రూపాన్నే కలిగిన దూడలకు జన్మనివ్వడాన్ని చూపుతాడు. రాజు సంతోషభరితుడై తన కూతురునిచ్చి వివాహం చేయడంతో కథ సుఖాంతమవుతుంది.

ఈ కవి యొక్క కథాశైలిని పద్యపటుత్వంను పరిశీలించినప్పుడు గొప్పకవిగానే కన్పిస్తాడు. శిలలను శిల్పాలుగా చెక్కుతున్న సందర్భంలో అక్కడకు వచ్చిన ఆ పట్టణ స్త్రీలు అతని నైపుణ్యానికి ముగ్ధులవుతారు.

అనియొక లేమ వచ్చి తనివారగనోయి కళాప్రపూర్ణ ఈ
పనితనమెందునేర్చితివి పాణాలకందగు వన్నెదెచ్చు నీ
వనిశము రాతి చక్కదనమారసి మానవకాంత
రూపముల్
గనివో లేదో నీ రచన కల్మషమంటగ జేయబోకుమా"
(30వ పద్యం)

అని ఆశ్యర్యపడ్డారు. ఈ కావ్యంలోని కొన్ని వర్ణనలు ప్రబంధకాలపు సాహిత్యాన్ని గుర్తుకు తెస్తాయి. నాయిక యైన సురక్తను పరిపూర్ణాచారీ చూసినప్పుడు ఆమె అందాన్ని

ఉ. కన్నులు కల్వరేకులగు కాంచన వర్ణము మేనుయౌ,
కురుల్
మిన్నగు కారుమేఘములు, మేలిమి కర్ణద్వయంబు
విష్ఠరాల్
పొన్న గులాబి పుష్పముల బోలెడి బుగ్గల తీరజూడ నీ
కన్నెకు మించినట్టి కలకంఠిని గానము ఏ
జగంబునన్ (పద్యం-42)

అని వర్ణించాడు. రాజు ఊహలను ఆధారాలుగా, ఋజువులుగా స్వీకరించి శిల్పికి మరణదండన వేసినప్పుడు రాజుయొక్క అజ్ఞానాన్ని, మూఢత్వాన్ని కవి

ప్రశ్నిస్తాడు. ధర్మపీఠం పై ఉన్న రాజు విచక్షణారహితంగా తీర్పులు ఇవ్వడం సరికాదని, భోజునిలాగా ప్రజలందరూ మెచ్చే తీర్పు ఇవ్వాలని సూచిస్తాడు.

ఉ. రాజగువాడు సర్వవిధ రాజస విద్యలు నేర్చి యుక్తిచే
తేజముతోడ సర్వజగ తీవరులెల్లరు మెచ్చునట్లుగా
భోజునిరీతి సర్వజన పూజ్యులుగావలెగాని యిట్టులన్
బీజములేని యూహలను బెంచుచు లోకులద్రుంచ జూతురే (73వ పద్యం)

స్త్రీలు గర్భం దాల్చినప్పుడు ఎవరి రూపాన్ని మనస్సులో నిల్పుకుంటారో ఆ ఆకర్షణ ప్రభావం చేత వారికి పుట్టిన శిశువులందరు ఆ రూపాన్నే పోలి ఉంటారని, ఇదే విధమైన వృషభం కథకూడా చెప్పాడు.

ఉ. మానసికంబునం గలుగు మానవకోటుల రూపభేదముల్
పూనికతోడ దెల్పెదను పుణ్యవతుల్ ఋతుకాల మందునన్
దేనిని నాత్మలో నిడి తదేకము ధ్యాన మొనర్చుచుందురో
దానినె పిండరూపమున దైవమొనర్చు నుదాత్తపద్ధతిన్' (78వ పద్యం)

కాని ఇది సంభవమేనా? దీన్ని శాస్త్రాలు కూడా అంగీకరింపకపోవచ్చు, శాస్త్రీయంగా ఇది తప్పు భావన అయ్యే ఆవకాశం ఉంది. కాని కథ విచిత్రమైన భావనలతో ఉండటం వలన పాఠకులకు ఆసక్తిగొల్పే అవకాశం ఉంది.

ఏకాశ్వాసంగా రచింపబడిన ఈ కావ్యం నిర్వచనంగా సాగింది. పూర్వకవులెందరో చంపువుగా కాకుండా నిర్వచనంగా రాశారు. ఆధునికుల విషయంలో ఇది విశేషమైన కావ్యంగానే పరిగణించవచ్చు.

ఈ కవి రాసిన ఇతర కావ్యాలు తెలియరాలేదు. మన్నెం రాములు పేరుగాని, రచనగాని ఏ సాహిత్య చరిత్రలలో పేర్కొలేదు. ఈ ప్రాంతంలో మరుగునపడిన కవులలో ఇతనొక్కడు.

# స్త్రీత్వ వేదనలో 'జ్వలిత కౌసల్య'

-డా॥. వి. త్రివేణి, అసోషియేట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

'ఆధునిక రచనల్లో ప్రాచీన సాహిత్యంలో కన్నా స్త్రీ ప్రాధాన్యం ఎక్కువగా కనిపిస్తుంది. స్త్రీ విముక్తిని కోరే మహిళా చైతన్య భావాల వ్యాప్తి, పరిధి ఇటీవలి దశాబ్దాల్లో ఇంకా విస్తరించింది. స్త్రీ వాదోద్యమ ప్రభావం పురుషుల మీద, పురుషుల రచనల మీద పడడం ఆహ్వానించ దగింది. స్త్రీవాదులు కోరే సాంఘిక న్యాయాన్ని ఇప్పుడిప్పుడే పురుషులు అర్థం చేసుకుంటున్నారు. అంగీకరిస్తున్నారు. ఈ విషయంలో జరుగవలసిన అభివృద్ధి చాలా ఉన్నప్పటికీ, కనీసం ప్రథమ దశ ప్రారంభమయింది. భూమయ్య చిత్రించిన 'జ్వలితకౌసల్య' ను ఈ దృక్కోణం నుంచి అర్థం చేసుకోవాలి. కావ్యనామమే కావ్య వస్తు స్ఫోరకంగా ఉంది. అయితే భూమయ్య కావ్యం స్త్రీవాద కావ్యం అని నేను ముద్ర వెయ్యటం లేదు. ఈ కావ్యాన్ని అర్థం చేసుకోవడానికి స్త్రీవాద పరిచయం ఉప యోగిస్తుందనే నా సూచన' (పుట.2)

'జ్వలిత కౌసల్య' మొదటి ముద్రణ సందర్భంలో 'లఘుటిప్పణి' రచిస్తూ ఆచార్య చేకూరి రామారావు ప్రస్తావించిన అంశం ఇది. ఆచార్య అనుమాండ్ల భూమయ్య 1999 నాటికే ఈ పుస్తకాన్ని రచించి ప్రచురించారు. స్త్రీవాద భావజాలం తెలుగు సాహిత్యంలో ప్రవేశించి విస్తృత ప్రయోజనాలు చేకూరుతున్న కాలమది. స్త్రీవాద పరివ్యాప్తిలోను, ఉద్యమ రూపంలో కార్యరూపం దాల్చడంలోను సాహిత్యం హితోధిక సాయం చేస్తున్న సమయమది. ఆ పరిమిత కాలంలోనే స్త్రీవాదం ప్రపంచ ప్రమాణాల మీద నిలబడుతూ వినూత్న భావజాలాన్ని ప్రకటించింది. స్త్రీలు వెలువరించిన సాహిత్యమే గాక, ఆచార్య చేకూరి రామారావు చెప్పినట్లు పురుషుల సాహిత్య మనోగతాలపై ప్రభావాన్ని చూపింది. సంప్రదాయక పౌరాణిక పాత్రల్లో గల స్త్రీల అభినివేశాన్ని సాహిత్యబద్ధం చేస్తూ నూతన ఒరవడిని సృష్టించారు. ఆధునిక సాహిత్య ధోరణులకు అనుగుణంగా సావిత్రి, పురూరవ, సీత, జాబాలి, వరూధిని, ఊర్మిళ, కౌసల్య, కైకేయి, కచదేవయాని, గాంధారి, పూర్ణమ్మ, కన్యక పాత్రల భావైక స్ఫూర్తిని చిత్రించారు. స్త్రీ పౌరుష కాంక్షను, శక్తి సామర్థాలను, మనోఅభిష్టాన్ని, చింతనాత్మక వ్యథను వెలువరించారు. తద్వారా ఆధునిక సమాజానికి ఒక ఉపదేశాత్మక సందేశం అందించారు.

'జ్వలిత కౌసల్య' కావ్యాన్ని స్త్రీవాద కోణం నుండి అవగాహన చేసుకోవడమే ఈ వ్యాసం ఉద్దేశం. సహృదయులు అవలోకిస్తారని ఆశిస్తున్నాను. ఆచార్య అనుమాండ్ల భూమయ్య దృక్పథం స్త్రీవాదం గాకపోయినా; వస్తు నిర్దేశం దృష్ట్యా ఈ అంశం నిర్ణయాత్మమైందని భావిస్తున్నాను. పూర్తి కథాంశం కౌసల్య గుండెలలో గూడు కట్టుకున్న అగ్నిజ్వాలను విచ్ఛేదం చేయడం. కౌసల్య మనోగతాన్ని ఆవిష్కరించడం. తద్వారా దీర్ఘకాలంగా ఉన్న మనోవ్యథ నుండి ఉపశమనం కోరుకోవడం. ఈ నేపథ్యంలోనే తన సంసారిక జీవితంలో తీరని కోరికలు, బహుభార్యత్వం వల్ల భర్త నుండి పొందిన ప్రేమాను రాగాలు, తోటి సవతులతో పడిన అవమానాలు ఒకటేమి సగటు మహిళ పడే ఆవేదన కౌసల్యలో ఆవిష్కృత మవుతుంది. కౌసల్య మనోవేదన స్త్రీవాద లక్షణాలకు అన్వయింపదగినవే.

మరొక అంశం 'జ్వలిత కౌసల్య' ఒక విధంగా చేతనాత్మక కావ్యం. అంతర్గత మథనం, భావాల సంఘర్షణ, అనుభవాల సంచయం అన్ని కలిపి మనో విశ్లేషణ సూత్రాల్లోకి కౌసల్య ఇమిడిపోతుంది. మానసిక వ్యథను ప్రత్యక్షంగా ఈ కావ్యంలో చిత్రించారు కవి. ఎంతో కాలంగా మనస్సులో దాచుకున్న ఆవేశాన్ని, క్రోధాన్ని బయట పెట్టడం మనోవైజ్ఞానిక అంశాలకు అనువర్తించ వచ్చు. అచేతనంలో దాగి ఉన్న మానసిక సంవేదనను

చేతనత్వంలోకి తీసుకొని రావడం ఇందులోని ప్రధానాంశం. దు:ఖప్రోదిని చేధించడానికి కవి ఈ కావ్యాన్ని ఆలంబనగా చేసుకున్నారు. తనకు కలిగిన అన్యాయాన్ని మరొకరి విషయంలో కలుగకుండా ఉండడంలో కౌసల్య చేసిన ఉపదేశం సత్ప్రవర్తన దిశగా నడుస్తుంది. కథాగమనాన్ని, పాత్రల ప్రవర్తనా శైలిని కవి అత్యంత నేర్పుతో ప్రదర్శించారు.

ఉపదేశాత్మకంగా కావ్యాన్ని వెలువరిచడంలో కవి ప్రధాన శ్రద్ధ వహించారు. ఆధునిక సాహిత్యంలో ఇటువంటి ప్రయత్నాలు చాలా జరిగాయి. స్వతంత్ర కథలను తీసుకొని పాత్రలపరంగా ధర్మప్రభోదం విస్తృతం చేశారు రచయితలు. అంతేగాక సంప్రదాయిక పాత కథల ప్రయోగం నేటి సమాజాన్ని సంస్కరించాయి. సందేశాత్మకమైన గాథలు వ్యవస్థ పునరుద్ధరణకు కృషిచేశాయి. సామాజిక ప్రయోజనానికి ప్రాచీన సాహిత్యంలోని గుణాత్మకమైన వస్తు నేపథ్యం కవులకు తోడ్పాటునందించాయి.

'జ్వలిత కౌసల్య' కావ్య స్వభావంలో స్త్రీవాద భావవ్యక్తీరణ మనోవైజ్ఞానికి విశ్లేషణ, ఉపదేశాత్మకం వంటి విభిన్నమైన మౌలికాంశాలను గుర్తించవచ్చు. కవి కావ్య నిర్మాణంలో ప్రకృష్టమైన వస్తువును సరళతరం చేశారు. పద్య రచనా సౌగంధంలో మేటి ఆచార్య అనుమాండ్ల భూమయ్య రామాయణ గాథలోని కౌసల్య మనోవేదనను వాల్మీకి రచనాపరంగా నినదించారు కవి. వాల్మీకి రామాయణంలోని ఆయోధ్య కాండలో 20వ సర్గలో కౌసల్య శ్రీరాముని ఎదుట తన వేదనను వ్యక్తపరిచిన ఘట్టం ఉంది. మొత్తం ఆరు సర్గలలో వ్యక్తపరిచిన ఆవేదన కవి కావ్యానికి ప్రధానాధారంగా నిలిచింది. ఆ ప్రేరణ వల్లనే ఈ కావ్యం రూపొందింది. శ్రీరాముడు ఈ జన్మకు ఏకపత్నీ వ్రతుడిగా ఉంటానని ప్రమాణం చేయడం ఇందులోని ముఖ్యాంశం. కథాంశాన్ని మొత్తం ఎనిమిది ఉప శీర్షికలలో విభజించారు. సంక్లిష్టమైన కథ ఉప శీర్షికలో ఒద్దికగా నిలిపారు భూమయ్య. కైకేయి వరం, జ్వలిత కౌసల్య, అనంత క్రోధం, మాతృ హృదయం, పితృ వాక్యం, పుత్ర వాత్సల్యం, ఏకపత్నీ వ్రతం, మంగళాశాసనం వంటివి ఈ కావ్యానికి ఒక క్రమణికను సూచించాయి. కథా గమనంలో కార్యోన్ముఖతను సాధించడం కవి కవితా ప్రక్రియలో ప్రదర్శించిన ప్రత్యేక నైపుణ్యం. 109 పద్యాలు కలిగిన ఈ కావ్యం నాలుగు ముద్రణలు సంతరించుకోవడం విశేషం. చేకూరి రామారావు, బేతవోలు రామబ్రహ్మం, పేర్వారం జగన్నాథం వంటి విమర్శకులు ఈ కావ్య ముద్రణలో ముందు మాటలు రాశారు. అబ్బూరి ఛాయాదేవి, మలయవాసిని, వాసా ప్రభావతి, వెంకమాంబ, గంగప్ప వంటి సాహితీవేత్తలు స్త్రీ సంవేదనా రూపంలో 'జ్వలిత కౌసల్య'ను పరామర్శించారు.

తండ్రి ఆజ్ఞ మేరకు పినతల్లి ఇంటికి వెళ్ళిన శ్రీరాముడికి ఘోర ఉపద్రవం మీద పడుతుంది. పట్టాభిషిక్తం పొందే వేళలో అరణ్యానికి వెళ్ళాలనే కైక అనుజ్ఞను శ్రీరాముడు శిరసావహిస్తాడు. తన తల్లితో నివేదించి అనుమతి పొందడానికి కౌసల్య భవనానికి వచ్చినప్పటి నుండి కథా ప్రస్థానం ప్రారంభమవుతుంది. ఆచార్య అనుమాండ్ల కౌసల్య మనో చింతనను ప్రత్యక్ష పెట్టడానికి ఆరంభ పద్యాన్ని ప్రయోగించారు. తల్లిదండ్రుల సాపేక్ష కైకేయి వరంలో ఉపేక్ష ప్రత్యక్ష కావ్య కథన ధారకు ఉత్కర్షగా నిలిచింది.

తల్లి కొడుకుల ఆప్యాయతా వాత్సల్యాలను అత్యంత మధురంగా భూమయ్య ప్రవేశపెట్టారు.

స్వాగతింప తన కెదురు వచ్చినట్టి
తల్లి పాదమ్ముల మ్రొక్కె ధర్మమూర్తి
రామచంద్రుండు, కౌసల్య రామునెత్తి
శిరము మూర్కొనె కౌగిట జేర్చి (పుట.15)

వర్తమాన కాలంలో తెలుగువారింటి వ్యవహార రూపంలో ఉన్న ఆచార సంప్రదాయాలను ప్రవేశపెట్టారు కవి. కౌసల్య రామచంద్రుల అనుబంధాన్ని చూపించారు. శ్రీరాముడు శిరస్సు వంచి గౌరవ వందనం చేయడం,

కౌసల్య శ్రీరాముడిపై పుత్ర వాత్సల్యాన్ని ప్రకటించడం హృదయ మనోహరంగా భూమయ్య రచించారు.

గతంలో తన తండ్రి కైకకు ఇచ్చిన రెండు వరాలను ప్రస్తుతం తీర్చుకుంటున్నట్లు... తల్లితో నివేదిస్తాడు శ్రీరాముడు. ఒకటి భరతుడికి యువరాజ పట్టాభిషేకం, రెండవది పద్నాలుగు సంవత్సరాలు రాముడు అరణ్య వాసం చేయడం. ఈ విషయాలు తెలిపి అడవులకు వెళ్ళ డానికి తల్లి కౌసల్య అనుమతిని పొందడానికి వచ్చినట్లుగా తెలుపుతాడు. తండ్రి ఆజ్ఞను పాటించడం ఉత్తమ ధర్మంగా ప్రకటిస్తాడు. ఒక్కసారిగా రాముడి మాటలు విన్న కౌసల్య 'స్వర్గమున నుండి పడిన దేవత వోలె నేల పడిపోయె' అని కవి వర్ణిస్తాడు. శాపవశాన అప్పుడప్పుడు దేవ లోకం నుండి దేవ కన్యలు, కిన్నెరలు, గంధర్వులు, కింపురుషులు భూలోకం మీద ఉద్భవించడం చూస్తుంటాం. భూమయ్య ఈ ఉపమానం ప్రయోగించడంలో తన జన్మను కోల్పోయిన స్త్రీ దైన్యస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుంది. కౌసల్య దు:ఖ వారధికి ఇది అనుసంధానింపబడింది.

స్త్రీలు తమకు కలిగిన శోకానికి, విషాదానికి ప్రకృతిని ప్రమేయం చేయడం గమనిస్తుంటాం. కౌసల్య తన కుమారునికి కలిగిన విపత్తుకు చింతిస్తుంది. 'ఇదేమి దినము కత్తులే కిరణములుగా కరకు గుండె దాల్చి సూర్యుడిదేలా ఉదయమునందె' అంటూ తన విధికి, వ్యథకు విలపిస్తుంది. ఒక్కో దినం గడియను బట్టి శుభాలు, అశుభాలుగా పరిగణింపబడుతాయి. కాలం మీద, సూర్య చంద్రుల కాలగమనం మీద జనులకు కొన్ని నమ్మకాలు, విశ్వాసాలు ఉన్నాయి. ప్రకోపాలు కూడా లేకపోలేదు.

'పుట్టినింట ఆనాడు నేపొందిన సుఖ
మేమో కాని, ఈ మీ తండ్రి ఇంట నేను
కాలు మోపిన పిదప సుఖము నెరుంగ
నిన్ను గన్నాను బ్రతుకు కన్నీరు తడిచె'

అంటూ కౌసల్య తన జీవిత గాధను వినిపిస్తున్న సందర్భంలో ఒక విషయం స్పష్టమవుతుంది. పుట్టింట్లో తానెంత సుఖం పొందిందో తెలియని తనంలోనే కౌసల్య వివాహం జరిగింది. బాల్యంలోనే దశరథ మహారాజుతో పరిణయం జరగడం కూడా ఆమె దు:ఖానికి ఒక హేతువు. బాల్య వివాహాల మీది దుష్ప్రభావాలు రామాయణ కాలం నుండి భారంగా మారాయని 'జ్వలిత కౌసల్య' ద్వారా ప్రత్యక్షంగా తెలుస్తుంది. చివరకు అంతపుర స్త్రీలు అయినా వైవాహిక జీవితంలో దు:ఖ సాగరాన్ని ఈదార నడానికి ఈ దృష్టాంతం తార్కాణంగా నిలుస్తుంది. తాను పుట్టి పెరిగి, ఆడి పాడి, ఆనందంగా గడిపిన రోజులు అనుభవంలో లేని పరిస్థితి ఆమెది. ఇక వివాహం అయిన తర్వాత అత్తవారింటిలో ఏనాడు సుఖం పొందినట్లు ఏ ఆనవాలు వ్యక్తపరచలేకపోవడం ఆమె విధిరాతను తలపోస్తాయి. దీనికి రెండు కారణాలను కవి భూమయ్య ప్రస్ఫుటం చేశాడు. ఒకటి కౌసల్య వివాహానంతరం భర్త నుండి సుఖం పొందలేకపోవడం. దీనికి కారణం దశరథుడి బహుభార్యత్వ ప్రాధాన్యం. కైకేయిపై మోజును పెంచుకోవడం. ఆమెకు దాసుడు కావడం. రెండవది సపత్నుల వ్యవహార ధోరణి. కౌసల్య పట్ట మహిషి అయినా ఆమెకు గౌరవాదరణలు దక్కలేకపోవడం. సపత్నుల పరుష వాక్కులు ఆమె హృదయాన్ని గాయపరచడం. అవమానాల జలధి ఉదృతంగా మారి గుండెలో సుళ్ళు తిరగడం.

న దృష్ట పూర్వం కళ్యాణం సుఖం నా పతి పౌరుషే
అపి ప్రత్యే2పి పశ్యేయ మితి రామాస్థితం మయా
అయోధ్య : సర్గ : 20 : శ్లో : 38

అత్యంత నిగృహీతాస్మి భర్తుర్నిత్య మతంత్రితా
పరివారేణ కైకేయ్యా సమావాప్యథవా2వరా
అయోధ్య : సర్గ : 20 : శ్లో : 42

వాల్మీకి రామాయణంలో శ్లోకాలను అనుమాండ్ల భూమయ్య తన ముందు మాటలో ప్రస్తావించారు. భర్త వల్ల సుఖం లేకపోయిన విషయాన్ని వాల్మీకి రామా

యణంలో పై శ్లోకాల్లో తెలుపబడింది. ఈ కావ్యానికి రామాయణ శ్లోకాల్లో కౌసల్య హృదయ తప్త జ్వాలను కవి ప్రవేశపెట్టారు. ఈ శ్లోకాల ఆధారంగానే కరుణ రసాత్మక గాథగా ఈ కావ్యం రూపాంతరం చెందింది.

## వంధ్యత్వం :

కొడుకు మీద ఉన్న ప్రేమ, వాత్సల్యం కౌసల్య నోట అద్భుతంగా ప్రకటింపజేశారు భూమయ్య. శ్రీరామ చంద్రుడు రాజ్యానికి యువరాజు పట్టాభిషిక్తుడైనప్పుడే తాను సుఖపడే దశ వస్తుందని భావించింది. కౌసల్య తన కడుపు తీపి మేర రామచంద్రుని అల్లారు ముద్దుగా పెంచుతుంది. ఆ సమయంలో నిప్పులాంటి వార్త ఆమె అంతరంగాన్ని కల్లోలం చేసింది. పద్నాలుగు సంవత్సరాలు దండకారణ్యంలో వనవాసం చేయటం అనే తండ్రి ఆజ్ఞను ఆమె జీర్ణించుకోలేకపోయింది. ఆ విషయం ముందుగా తెలిసి ఉంటే కొడుకుగా శ్రీరాముడిని కనకుండా ఉండేదానిని అని ఆమె బాధపడుతుంది. కన్నతీపిని కూడా వద్దనుకునే విషమ పరిస్థితి కౌసల్యకు ఎదురవడమనేది మాతృ హృదయం కలవరపడే విషయం.

నాడు నిన్నునే గనకున్న నష్టమేమి
కలిగెడిది? వంధ్యయను పేరొకటి యే తప్ప
సంతులేదన్న ఏకైక చింత తప్ప
వంధ్యకు మరొక్క చింత రవ్వంత లేదు (పుట.20)

ఏ ఇల్లాలు అయినా గొడ్రాలుగా ఉండడం అనే విషయాన్ని కలలోనైనా తలంచదు. కాని కౌసల్య తన నోటి ద్వారా ఆ పద్యాన్ని ఉచ్ఛరించడం అత్యంత వేదనాభరితమైంది. కొడుకును కని అడవుల పాలు చేయడం కంటే గొడ్రాలుగా మిగిలిపోవటమే ఉత్తమంగా భావించిన కౌసల్య కడుపుకోతను ఇక్కడ అర్థం చేసుకోవచ్చు. కవి అనుమాండ్ల భూమయ్య కౌసల్య పాత్రలో స్త్రీ దు:ఖ హేతువుకు పరాకాష్టగా వంధ్యత్వమనే శబ్దాన్ని ప్రయోగించడం గమనించవచ్చు.

## కడుపుకోత :

కౌసల్య పరి పరివిధాలుగా శ్రీరాముడి మీద ఉన్న తల్లి ప్రేమను వ్యక్తపరిచిన తీరు కవి తన నేర్పుతో ప్రదర్శించాడు. తన దు:ఖానికి అంతం లేదని వాపోతూ, తనకు ఇంత దు:ఖం అనుభవించే శక్తి లేదని తలపోస్తుంది కౌసల్య. తన మీద దయచూపే ఏ దైవం కనిపించడం లేదని దు:ఖిస్తుంది. ఏ దిక్కు చూసినా శూన్యమే కనిపిస్తుందని తన దురదృష్టానికి చింతిస్తుంది.

కౌసల్య బాల్యంలో తన రామచంద్రుడు ఆడిన ఆటలు, అల్లారు ముద్దుగా పెరిగిన జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను కౌసల్య గుర్తుకు తెచ్చుకోవడం కథా సందర్భాన్ని బట్టి ప్రధానమైనది. వెన్నను కొంత తిని అంతకన్నా మన్నును రుచిగా తిన గోరే రాముడిని చూసి కౌసల్య ఆవేదన చెందేదట. తల్లి చేత తిట్లు తింటూ దెబ్బ తగలకుండా తిరిగేవాడట. ఆటలు ఆడి అలిసిపోయి అమ్మ ఒడిలో చేరి పాలు తాగుతూ, తన కోరిక తీరలేదని ఏడ్చే వాడట. 'అమ్మ పిలిచె రారా! అన్నము తినిపోవవేగ' అని కౌసల్య ఎంత పిలిచినా ఆట పాటలలో మునిగి పోయేవాడట. ఇటువంటి శ్రీరాముడి అల్లారు ముద్దు చేష్టలను మరకముందే అడవుల పాలు కావడం కౌసల్యకు తీరని దు:ఖాన్ని మిగిలించింది.

జాలి చూప / గలుగు దైవ మొక్కరు గాని కానరారు / శూన్య గగనమే ఏ వైపు చూడనైన (పుట.21)
దెబ్బ తగలకుండ తిరిగెడు పని చేష్ట / కనగ నింత నోచుకొనని లేదా? (పుట.21)
తలపు తీరుకున్న ఏడ్చు తీయని పసి ఏడ్పు / వినగనింత నోచుకొననా నేను? (పుట.21)
ఆడి పాడుచుండు అందాల రాశిని / కనగ వినగ నోచుకొనగ లేదా? (పుట.21)

విధి తనతో ఆడుతున్న ఆటకు కౌసల్య ఎంతగా వ్యథ చెందిందో ఈ పద్యపాదాల్లో స్పష్టంగా కవి వ్యక్త పరిచాడు.

## సంతాన పరితాపం :

సంతానం కోసం ఎన్నో నోములు, వ్రతాలు నోచింది కౌసల్య. ఎంతో కాలంగా అవన్ని 'ఎడారి నలికిన

విత్తనములయ్యె' నని ఒక శిలగా మారిపోయింది. ఎప్పుడైతే శ్రీరాముడు జన్మించాడో, అప్పుడు కౌసల్య పునర్జన్మ ఎత్తినట్లుగా భావించింది. ఒక తల్లిగా సార్థకం కాని స్త్రీ జన్మ ఊహించలేనిది. కౌసల్య సంతానప్రాప్తి కోసం పరితపించిన సన్నివేశాలు కవి సహజంగానే వర్ణించాడు. తాను సంతానం కోరుకుంటే తన ఇంటిలో సాక్షాత్తు ఆ శ్రీ మహా విష్ణువే అవతరించినట్టుగా భావించింది.

పాల సంద్రమే మా ఇంట పరిమళించె
కల్పవృక్షమే నట్టింట కదలి యాడె
సత్య ధర్మమ్ములమృతమై జాలువారె
చలువ పందిళ్ళు వేసెను చందమామ (పుట.22)

శ్రీరాముని పుట్టుక సందర్భాన్ని ఆనంద పరవశాన్ని కౌసల్య వదనంలో కవి అద్భుతంగా వర్ణించాడు. బాల్యం నుండి రామచంద్రుని చూచుకోవడమే తపంగా, అలంకరించడమే పూజగా కౌసల్యకు కాలం సాగింది. అంతలోనే యువరాజు పదవికి రాముడు చేరుకోవడం తల్లికి ఆశ్చర్యమే. ఇంతలోనే వనవాస ఆజ్ఞను తట్టుకోలేక పోయింది. 'నా ఉరమ్ము వగుల ఏడ్చి ఏడ్చి శిలనైతినెపుడొ, ఇప్పుడేడ్చి ఏడ్చి నేనేమౌదు నింక తండ్రి!' అంటూ రోదిస్తున్న తీరు కవి నైపుణ్యంలో కరుణను చిందించింది.

## భర్త ప్రేమ లేమి :

భర్తవల్ల సుఖం పొందలేకపోవడమనేవి దీర్ఘకాలంగా కౌసల్య తీరని దు:ఖానికి కారణంగా నిలిచింది. పేగుతెంచుకు పుట్టిన బిడ్డను వనవాసం పంపడం ధర్మమూర్తి అయిన మహారాజుకు తగునా అని నిలదీస్తుంది. శ్రీరామచంద్రుడు అడవులకు పయనమై వెళ్తుండగా 'జీవముండునే? కూలీన చెట్టునైతి' అని కౌసల్య రోదిస్తుంది. తన పెండ్లి అయినప్పటి నుండి శుభంగానీ, సుఖంగానీ అంతవరకు తాను చూడలేదంటూ శ్రీరాముడితో మొరపెట్టుకుంటుంది. తన భర్త ఒక రాజు అయి ఉండగా తాను మాత్రం కళ తప్పి ఉన్నానని బాధపడుతుంది. ఈ సందర్భంలో కవి అద్భుత పోలిక వర్ణించారు 'సూర్యుని ముఖమొక్కింతైన చూడలేని కమలవనమట్లు' భర్త ప్రేమనే కనలేని బ్రతుకిదేమి!' అని తలరాతను నిందిస్తుంది.

నాణ్యమౌ ఏడువారాల నగలు కలవు
నను గొలువ దాస దాసీజనమ్ము కలదు
ఎన్ని ఉండి వీనిననుభవింపలేని
భాగ్యహీనను పతిప్రేమబడయలేక (పుట. 24)

సగటు స్త్రీ భర్తనుండి ఆశించేవి ప్రేమానురాగాలు మాత్రమే. కౌసల్యకు ఏడువారాల నగలు, చుట్టూ దాసదాసీ జనము ఉండి కూడా భాగ్యవిహీనురాలైన స్థితిని కవి తన కవితా ప్రతిభలో ప్రదర్శించారు.

## సపత్నుల హేళన :

ఏ ఇల్లాలు అయిన ఎంత కష్టమొచ్చినా భరిస్తుంది కాని సవితి పోరును భరింపగరాదు. కాని కౌసల్యకు అనునిత్యం సవతుల నుండి పరుష వాక్యాలు, దూషణలు ఎదురవుతూనే ఉంటాయి. సపత్నులతో సమానమైన గౌరవాన్ని పొందలేని తన చిన్నతనాన్ని శ్రీరాముడి ముందు విన్నవించుకుంటుంది. రాజుకు పెద్ద భార్య అయి ఉండి, ప్రజల దృష్టిలో మహారాణి అయి ఉండి కూడా సపత్నులతో పడుతున్న హింసను కౌసల్య విడమరిచి చెప్పింది.

సా బహూన్య మనోజ్ఞాని వాక్యాని హృదయచ్ఛిదాం
అహంత్రోప్యే సపత్నీ నామ వరాణాం వరా సతీ
(అయోధ్య : సర్గ : 20, శ్లో : 39)

సవతులిందరిలో నాకు సాటివచ్చు
వారెవరు లేరు, నా కంటె వయసులోన
చిన్న వారయు వారు నన్నెన్ని మాట
లాడి కష్టపెట్టెదరొనే ననగరాదు (పుట.24)

వాల్మీకి రామాయణంలో కౌసల్య శ్రీరాముడితో తన సపత్నుల వల్ల పడిన పరుష వాక్కుల తీరు స్పష్టంగా చెప్పబడింది. అనుమాండ్ల భూమయ్య ఈ విషయాన్ని

ప్రత్యేకంగా పేర్కొన్నారు. తల్లి అనుభవించిన సపత్నుల వల్ల బాధ, తన సీతకు ఎదురు కాకూడదనే ఉద్దేశంతో ఏకపత్నీ వ్రతుడిగా ప్రతిజ్ఞ చేశాడు. సపత్నుల హేవగింపు వల్ల పొందిన బాధ ఈ కావ్యానికి మూలాధారంగా నిలిచింది. తల్లి హితబోధ ద్వారా శ్రీరాముడిలో సంస్కరణ భావాన్ని పెంపొందింపజేసింది. కౌసల్య తన దు:ఖం రెట్టింపు కావడానికి రెండు కారణాలు గాక మూడింటిని తెలుపుతుంది. ఒకటి పతి ప్రేమ లేకపోవడం, రెండు సపత్నుల పరుషవచనాలు, మూడవది శ్రీరాముడి వనగమనం.

## స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల లేమి :

యువరాజు పదవిని అలంకరించే కొడుకు ఉండగానే దూషణలకు గురవుతున్నానని కౌసల్య వ్యధ చెందుతుంది. ఇక శ్రీరాముడు అడవులకు వెళ్ళిపోయిన తర్వాత తన పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అని బాధపడుతుంది. తన భర్త తనకు ఏ మాత్రం స్వేచ్ఛ ఇవ్వలేదని రాముడితో మొరపెట్టుకుంటుంది కౌసల్య.

నేను రాణినే అయి కూడా కాను, మీ జ
నకుడు నను నిగ్రహించి ఇంతయును స్వేచ్ఛ
నీయలేదు, ఆ తల్లి కైకేయి దాస
జనముతో సాటిగానైన సరకుగొనడు (పుట.25)

అంటూ దశరథుడు ఎంతగా ఆమెను కట్టుదిట్టం చేసేవాడో తెలుపుతుంది. భార్యలకు స్వేచ్ఛ ఇవ్వకపోవడమనేది పితృస్వామ్య వ్యవస్థలో మొదటిది. స్త్రీలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అవసరం లేదనే పురుషాధిపత్య సమాజం అనాదిగా కొనసాగుతూ వస్తున్న విషయం వాల్మీకి రామాయణంలోనే తెలుస్తుంది. తాను ఒక పట్ట మహిషి కూడా. రాజు స్వేచ్ఛ ఇవ్వకపోవడాన్ని ధిక్కరిస్తుంది కౌసల్య. తన భర్త చులకన భావంతో చూడడం వల్ల దాసి జనంలో తన రాణితనం చెలామణి కావడం లేదని బాధ పడుతుంది. ఇప్పటికీ దాసీజనం ఈ రీతికి నడుచుకొంటున్న సందర్భంలో కైక కొడుకు రాజయిన తర్వాత భయంతో తనను చూడడానికి రారేమోనని కౌసల్య సందేహిస్తుంది. ఏకాంతాన్ని ఎలా భరించగలనని శ్రీరాముడితో నివేదిస్తుంది. 'కాలమింక నా గళమున బడిన కాలనాగొ ఏమొ!' అని కౌసల్య చిందిస్తుంది.

## కైకేయి పోరు :

కౌసల్య తన సవతులన్నింటిలో కైక సాధింపును తట్టుకోలేకపోతుంది. ఎల్లప్పుడు పరుష వాక్యాలతో దూషించే కైకేయి తన మీద ఎంతటి క్రోధాగ్నిని చల్లుతుందోననే కౌసల్య వాపోతుంది. కైక వ్యక్తిత్వాన్ని కౌసల్య ఆవేదనలో కవి అత్యంత సహజంగా చిత్రించారు. శ్రీరాముడు అడవులకు వెళ్ళిన తర్వాత కౌసల్యను కైకేయి బ్రతుకనివ్వదనే మాటను కవి ప్రస్తావించడంలో ఆమె ఎంతటి నియంత స్వభావాన్ని కలిగిందో తెలుస్తుంది.

కాల సర్పమట్లు కడు వంకరగ నడుచు
నడత గల కైక కుబుసమ్ము విడిచె ; ఇపుడు
విషము చిమ్ముచు నను కాటు వేయునేమొ?
కన్నతండ్రి! నాయన! నిన్నె కాటువేసె. (పుట.26)

అంటూ కైకేయిని కాలసర్పంతో పోల్చుతూ కౌసల్య ఆక్రోశిస్తుంది. కాని తన కష్టాలను, బాధలను కౌసల్య తన ఇష్ట సఖులకు కూడా చెప్పుకోలేదట. కవి అను మాండ్ల భూమయ్య కౌసల్య స్వభావాన్ని చిత్రిస్తూ 'నా ముఖాన మట్టి విసిరినదని నేను / నట్లె కోపించి మట్టిని ఆమె మీద / విసరలేను. దానిని తీసివేయమేలు' అని తెలుపుతారు. కౌసల్య వ్యక్తిత్వంలో నీతి, ధర్మం, మంచితనం ప్రదర్శింపజేశారు కవి.

## సవతుల కలత :

కైకేయి మొదలైన సవతులలో ఎదురయ్యే కలతను ఎదలోనే దాచుకొని ఇంతకాలం సగమైపోయిన కౌసల్య ఈ ముసలితనంలో ఇంకా భరింపలేకపోయింది. పట్ట మహీషి అయినందు వల్ల సవతులందరూ తనను అధికంగా బాధిస్తున్నట్లుగా కౌసల్య తెలుపుతుంది. మొదటి భార్యను అయిన నేరం వల్ల నేమో తనను మరింత సవతులు అవమానిస్తున్నట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

## మాతృ ప్రేమ :

లక్ష్మణుడు ఆవేశంగా మాట్లాడిన మాటలు న్యాయ మనిపించి భావించిన కౌసల్య శ్రీరాముడి వనవాసానికి అనుమతించదు. తండ్రి లాగా తల్లి కూడా పూజ్యురాలని చెబుతూ అడవులకు వెళ్ళకూడదని శ్రీరాముడిని ఆజ్ఞాపిస్తుంది. ఈ సందర్భంలోనే కవి భూమయ్య కౌసల్యలో పుత్రుడిపై ఉన్న ప్రేమను అనేక విధాలుగా వర్ణిస్తారు. చిన్నప్పటి నుండి కౌసల్యకు కలిగిన బాధనెల్లా రాముడు తన చిట్టి వ్రేళ్ళతో తుడిచిన సన్నివేశాలను గుర్తు చేసారు. ఆ వేదనతోనే రాముడు పసితనంలో ఆడిన ఆట వస్తువులే ఆయన అడవులకు వెళ్ళిన తర్వాత ఆమెకు బ్రతుకు వస్తువులవుతాయని సూచించారు.

క్రూర మృగముల నిలయమ్ము, కోయటన్న
పలుకు దిక్కులేని అడవి పదియునాలు
గేండ్లు పగలు గడచిన రేయియె గడవదు
ఇట్లివియె నాకిరువదెన్మిదేండ్లు తండ్రి! (పుట.41)

అడవులలో ఎటువంటి పరిస్థితి ఉంటుందో కౌసల్య తలచుకొని బాధపడుతుంది. ఆ రాముడి పసితనం నుండి అల్లారు ముద్దుగా పెంచిన జ్ఞాపకాలను నెమరు వేసుకుంది. రాముడికి మెత్తని గుడ్డ ఒత్తుకొని పోయినా బాధపడే తల్లి మనస్సు అడవుల్లో కఱకురాళ్ళ మీద నిద్రించడం దుర్భరమైందని ఆవేదన చెందుతుంది.

కడుపులో ఉండగా రాముడు తన పాదాలతో తన్నుతుండగా కౌసల్య ఆ పాదాలు ఎంత కందిపోయెనో అని కలత చెందిందట. భూమయ్య వర్ణనలో తల్లి ప్రేమకు తార్కాణంగా కౌసల్యనే నిలుస్తుందని చెప్పవచ్చు. కాని అటువంటి పాదాలు రాయిరప్పలు తాకి రక్తం చిందిస్తాయని తలచుకొని బాధపడుతుంది. 'తండ్రీ! నీ ముద్దు పాదమందారములకు నా యెదను తొడుగుదునయ్య!' అంటూ కౌసల్య పేర్కొంటుంది. తల్లి ప్రేమకు అపూర్వ నిర్వచనం ఈ పద్య పాదం. కవి మాతృ స్పర్శకు గొప్ప చమత్కృతి. తనను కూడా అడవులకు తోలుకొని పొమ్మని కౌసల్య ప్రాధేయపడుతుంది. అడవుల్లోని భయానక పరిస్థితులను రాముడికి తెలియజేస్తుంది.

## లక్ష్మణుడి సేవ :

ఈ కావ్యంలో లక్ష్మణుడి మాటలు కౌసల్య దు:ఖానికి కొంత ఉపశమనాన్ని కలిగిస్తాయి. పుత్ర శోకంతో కుమిలిపోతున్న కౌసల్యను చూసి తన తండ్రిపై ఉగ్రరూపమెత్తుతాడు. రాముడు అడవులకు వెళ్ళ కూడదని వారిస్తాడు. తన అన్నకోసం ఏమైనా చేస్తా నంటాడు లక్ష్మణుడు. చివరికి తండ్రిని, కైకను, భరతుడిని బంధిస్తానని శపథం చేస్తాడు. రాముడిపై అచంచల భక్తిని ప్రదర్శిస్తాడు. లక్ష్మణుడి ఆక్రోశం కౌసల్య ఆవేదనను కొంత శాంతింపజేసింది. 'అన్నకు ఆపద సంభవింపనే నగ్నిని దూకెద ముందుగనే' అన్న లక్ష్మణుడి మాటల్లో అగ్రజుడి పైగల సోదరప్రేమ, సేవాతత్పరత కనిపిస్తుంది. కవి ఈ పాత్ర కల్పనలో ఉత్సాహాన్ని ప్రదర్శించారు.

## రాముడి ఏకపత్నీ వ్రతం :

'జ్వలిత కౌసల్య'గా రగిలిపోతున్న తల్లి దు:ఖాన్ని నివారింపజేస్తూ శ్రీరామచంద్రుడు చల్లగా స్వచ్ఛంగా ఏకపత్నీవ్రతం ప్రతిజ్ఞ చేస్తాడు. తల్లి నిరంతర శోకానికి కారణం తండ్రి ప్రేమ లేకపోవడం, తండ్రి బహు భార్యత్వాన్ని స్వీకరించడం అని గ్రహిస్తాడు. తన తల్లి లాగా సీత దు:ఖించకూడదని నిర్ణయించుకొని మాట ఇస్తాడు.

గడిచినట్టి కాలమ్మేదో గడిచిపోయె
తండ్రి తప్పొప్పులివియని తలపలేను
ఏ పరిస్థితులెట్లు రానిమ్ము నాకు
ఒక్క సీతయే ఈ జన్మకున్న భార్య (పుట. 57)

అన్న శ్రీరాముడి ప్రతిజ్ఞకు కౌసల్య దు:ఖం తొలిగిపోయినట్లుగా కవి కల్పించారు. 'ఏదో పరిమళా మృత పుష్పమింత సాగివచ్చి కౌసల్య శిరస్సుపై విచ్చు కొనియె' అని వర్ణిస్తారు. కౌసల్య తనకు జరిగిన పరాభవం తిరిగి తీసుకొని రాలేనిది. తన కాలం చెల్లిపోయింది. తన సీతకు ఇటువంటి దుర్గతి పట్టకూడదని కౌసల్య

మనోభావం. ఈ ప్రతిజ్ఞతో కవి తన కావ్యానికి సద్గతిని ఏర్పరిచారు. ఆచార్య అనుమాండ్ల భూమయ్య స్త్రీత్వంలో కౌసల్యను చిత్రించి రాముడిని ధర్మ నిరతివైపు పయనింప జేశారు. మూర్తిమత్త్వ నిర్మాణంలో 'జ్వలిత కౌసల్య'ను అపూర్వ సృష్టిగా నిలువరింపజేశారు. సంప్రదాయ స్త్రీవాద ధోరణికి ప్రతినిధిగా ఈ కావ్యాన్ని చిత్రించారు. సమకాలీన సామాజిక వీక్షణంలో అంతర్భాగంగా పౌరాణిక ఐతిహాసిక పాత్రల మనోగతాన్ని ఆవిష్కరించారు.

**ఆధార గ్రంథాలు :**

1. కృష్ణకుమారి, నాయని, ఆచార్య, 2013, విమర్శ విద్యా సార్వభౌమం, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్.
2. ప్రియదర్శిని, కె.,డా॥, (సం) 2015, ప్రతిభాత్రయి, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్.
3. భూమయ్య, అనుమాండ్ల, డా॥, 2004, అంతర్వీక్షణం, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్.
4. భూమయ్య, అనుమాండ్ల, డా॥, 2011, (నాల్గవ ముద్రణ), జ్వలిత కౌసల్య, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్.
5. రామారావు, చేకూరి, ఆచార్య (సం) 2003, అంతర్వీక్షణ సార్వభౌమం, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్.

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# కరోనా కరాళ నృత్యాన్ని ఆవిష్కరిస్తున్న కవిత్వం

-డా॥. వై. సుభాషిణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

చరిత్రలో మానవ మనుగడను సందిగ్ధంలో పడేసిన మహమ్మారులు ఎన్నో! అందులో ఒకటి కరోనా! మానవ మనుగడ మీద యుద్ధం ప్రకటించిన మహమ్మారులలో కరోనా మొదటిదీ కాదు. చివరిదీ కాబోదు. కరోనా అంత విస్తృతంగా కాకపోయినా, కరోనా కంటే తీవ్రతతో విరుచుకు పడిన 'పాండెమిక్స్ చరిత్రలో ఉన్నాయి. ప్లేగు, స్పానిష్ ఫ్లూ వంటి మహమ్మారులెన్నో కోట్లాది జనాలను హత మార్చాయి. ప్రతి మహమ్మారీ వైద్యశాస్త్రానికి కొత్త సవాలు విసురుతూనే ఉంది. వైద్యశాస్త్రం ఒకదాన్ని అణచేస్తే, మరో మహమ్మారి మళ్ళీ విజృంభిస్తోంది. మనిషి ఆధిపత్యం మీద సవాలు విసురుతోంది. కంటికి కానరాని వైరస్‌లే అతిపెద్ద పోటీగా నిలుస్తున్నాయి. ఇలాంటి మహమ్మారుల మీద ఎంతో సాహిత్యం వచ్చింది. ప్రస్తుతం ప్రజల్ని బాగా భయపెడుతున్న మహమ్మారి ఈ కరోనా! దీనిపై స్పందిస్తూ ఎందరో కవులు రచనలు చేస్తున్నారు. ప్రజలకు సమస్యలు చుట్టుముట్టినప్పుడు మేమున్నా మంటూ ముందుకు వస్తున్నారు. వారి కలాలతో కవాతు చేస్తున్నారు. ప్రకృతిలోని ప్రతి అంశానికీ స్పందించినట్లే కరోనా విలయంపై స్పందించారు. సాహిత్యరూపంలో భరోసాను ఇస్తున్నారు. కొండంత అండను అందిస్తున్నారు. కరోనా పట్ల ప్రజలలో అవగాహనను కల్గించడానికి, భయాన్ని పారద్రోలడానికి, ఆత్మస్థైర్యాన్ని నింపడానికి తెలుగు కవులు చేస్తున్న ప్రయోగాలు ఎన్నో! ఎన్నెన్నో! అందులో ఒకటి కవిత్వం.

మహమ్మారులు విలయతాండవం చేస్తున్నప్పుడు వైద్యం మన శరీరాన్ని కాపాడే ప్రయత్నం చేస్తుంది. కవిత్వం మన మనసుకు దన్నుగా నిలుస్తుంది. గందర గోళంగా ఉన్న మనసుకు ఊరటనిస్తుంది. విపత్తుల కాలంలో బయటపడే మానవస్వభావం మీద ఒక అవగాహన కలిగిస్తుంది. జరగబోయే స్థితికి మనల్ని సన్నద్ధం చేస్తుంది. ఆత్మ విశ్వాసాన్ని నింపుతుంది. గడిచిన నాలుగు నెలల రోజుల్లో కరోనాపైన వేలల్లో కవితలొచ్చాయంటే కరోనా తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

## కరోనా తీవ్రత :

మానవ చరిత్రలో వందరోజులకు పైగా మానవాళి ఒక భయంకర వాతావరణంలో బతకడం బహుశా ఇదే మొదటిసారి. రోగమే భయానకమైంది. అది కలిగించిన భయం భరించరానంత భయంకరంగా ఉన్నది. నిజానికి ప్రపంచం చాలా చిన్నదైపోయిన తరుణంలో మనుషు లందరూ ఒకరికొకరు దూరమై భయపడుతున్నారు. కరోనా వైరస్ ఏ ప్రాంతాన్నీ వదలకుండా అంతటా వ్యాపించింది. మనుషులు ఎవరిని ఎవరూ కలవకూడదు. తాకకూడదు. భౌతికదూరం పాటించాలి. ఎన్నడూ లేని ఒక విచిత్రమైన విషవలయం నుండి మానవాళి ప్రయాణిస్తున్నది. దీనికి మనిషి చేసే విపరీత పోకడలే కారణాలుగా భావిస్తూ డా. పెరుగు రామకృష్ణగారు కవిత్వీకరిస్తున్నారిలా!

విశ్వవేదికపై ఒక మహమ్మారి
మరణ మృదంగం మోగిస్తూ
కరోనా నామకరాళ తాండవం చేస్తూ
మనిషిని సమూహం నుంచి వేరు చేసి
ఏకాంతవాసపు ఏకాకిని చేసింది

(ఈనాడు, 7.4.2020)

కరోనా మహమ్మారి మనిషిని సమూహం నుండి దూరం చేసిన వైనం మానవ తప్పిదాల వల్లనే జరిగిన ఒక విపత్తుగా గుర్తించాడు. ఈ సమయంలో మనలోని సంస్కారాన్ని మేల్కొల్పి మానవత్వాన్ని చాటుకోవాల్సిన ఆవశ్యకతను చాటుతున్నాడు. మరో కవితలో -

మనిషి ఊపిరిని ఆపి చంపే
కంటికి కానరాని ఆ సూక్ష్మజీవి

నిశ్శబ్ద యుద్ధాన్ని ప్రకటించింది
దాని ఒంటినిండా పొడుచుకొచ్చిన
కత్తులలాంటి ఆయుధాలతో .....

(ప్రస్థానం, ఏప్రిల్ 2020)

మనుషుల ప్రాణాలతో ఆడుకొనే ఈ మహమ్మారి కంటికి కనబడకుండానే మనిషితో యుద్ధం చేస్తోందని, దాని ఒంటి నిండా కత్తులలాంటి ఆయుధాలతో మనిషికి మనిషిని దూరంచేసి తన మనుగడను చాటుకొంటోం దంటూ డా.పి.విజయలక్ష్మి పండిట్ అంటున్నారు. ప్రపంచ దేశాలన్నిటినీ ఒక కుదుపు కుదిపేస్తూ మానవ మనుగడనే మాయం చేసేస్తోందంటూ ఆవేదన చెందుతున్నారు. అందరినీ గృహబందీలుగా చేసి మనసు మమతలను జనులలో పూయిస్తోందంటున్నారు. ఇంకో కవితలో ఫక్కి రవీంద్రనాధ్ -

మిలమిల కాంతులతో మిడిసిపడ్డ నగరం.....
ఒక్కసారిగా ఒళ్ళు పేల్చే
జ్వరమొచ్చిన దానిలా వణికి పోతోంది
ఇంపూతెంపూ లేకుండా పెరిగిపోతున్న
రోగుల సంఖ్యతో హడలిచస్తోంది.

(ఈనాడు, 9.4.2020)

అంటున్నారు. ఇదేవిధంగా ఈ మహమ్మారి విలయ తాండవాన్ని విల్సన్ రావు కొమ్మవరపు కవిత్వీ కరిస్తున్నారిలా!

అతిచిన్న కంటికి కనిపించని నలుసు
విలయం సృష్టిస్తూ.....
ఎక్కడ అదృశ్యదాడి చేస్తుందోననే భయంతో
పిడచకట్టుకుపోయిన నాలుకలు కొన్ని
మాటల పొదుగులో మౌనంగా ఈదులాడుతూ
కనిపించని శత్రువును ఎదుర్కొంటున్నాయి

(ఈనాడు, 24.4.2020)

కంటికి కనిపించని అతిచిన్న వైరస్ విలయం సృష్టిస్తూ ఎక్కడ అదృశ్యదాడి చేస్తుందోననే భయంతో జీవిస్తున్న మానవ మనుగడను చిత్రీకరిస్తున్నారు. కంటికి కనబడని ఆ శత్రువు మీద శుభ్రత, భద్రత, ఐక్యత, భౌతికదూరాలనే ఆయుధాలుగా వాడి తరిమికొట్టాలని కూడా పిలుపు నిచ్చాడు. మానవ మేధస్సుదే అంతిమవిజయం కావాలని కూడా ప్రకటిస్తున్నాడు. కరోనా వల్ల జరుగుతున్న మానవ జీవన విధ్వంసాన్ని ఆవేదనాత్మకంగా వర్ణించాడు విల్సన్ రావు. మనుషుల ప్రాణాలు పోతూ ఉంటే ఆ మనసు ఎంత విలవిలలాడుతుందో ''రుజువు చేసుకుందాం!'' కవితలో జగన్నాథం రామమోహన్ అంటున్నారిలా!

ప్రాణాలు అంకెల్లోకి తర్జుమా అవుతుంటే
పచ్చికొమ్మను మెలితిప్పినట్లు
నా మనసు మెలితిరుగుతూ....
పచ్చిపుండై సలుపుతోందిప్పుడు

(ఈనాడు, 12.4.2020)

## పేదల దుస్థితి :

పేదల దుస్థితిని ఎలుగెత్తిన కవితలు ఎన్నో ఉన్నాయి. కరోనాతో పేద, మధ్య తరగతి ప్రజల జీవితం ఛిద్రమైంది. ముఖ్యంగా పేదలకైతే తీరని దుఃఖం మిగిల్చింది. ఈ పరిణామాన్ని కవులు పట్టుకోగలిగారు. కరోనా మిగిల్చిన కన్నీటి వ్యథను అక్షరాలకు ఎత్తింది కవిత. సామాన్యుల బతుకు చిత్రం ఎంతటి విషాదంగా ఉందో కళ్ళ ముందుంచింది. ప్రజల భాషలో కవితలల్లిన తీరు కడుహృద్యంగా ఉంది. అందులో ఒక కవిత ''రుజువు చేసుకుందాం''! ఇందులో పేదలు అభిమన్యులై ఆహుతికాకుండా ఉండాలంటున్నారిలా!

వాళ్ళు అభిమన్యులై ఆ పురుగుకు
ఆహుతి కాకముందే
చుట్టుముట్టిన ఆ అదృశ్య
శత్రువును ఛేధించేందుకు....

(ఈనాడు, 12.4.2020)

పేదలకు ఆకలితో పోరాటం కొత్తేమీ కాదు. అనునిత్యం ఆకలి సుడిగుండంలో కొట్టుమిట్టాడుతూనే ఉంటారు. కాని ఈ మహమ్మారి కరోనా వ్యూహంలో

చిక్కుకొని అభిమన్యుడిలా ఆహుతి కాకముందే ఆ అదృశ్య శత్రువును జయించాలంటున్నారు. నిత్యావసరాలనే ఆయుధాలను అందించి వారి బతుకుపోరుకు కావాల్సిన శక్తినిచ్చి సాటి మనుషులమని రుజువు చేసుకొందామంటున్నారు జగన్నాథం రామమోహన్.

కరోనా విలయం మధ్య పేదల ప్రాణాలు గాలిలో దీపాలుగా తయారయ్యాయి. కన్నతల్లినీ, ఉన్న ఊరును వదిలి వందలు వేల కిలోమీటర్లు వలస వెళ్ళి పనులు చేసుకొంటూ జీవించాల్సిన పరిస్థితి కొందరిది. వచ్చిన దాన్లో సగం ఇంటివద్ద ఉండే వృద్ధులు, పిల్లల పోషణకు పంపుతూ గడపాల్సిన అవసరం వారిది. ఇలా సాగుతున్న వారి జీవితాల్లో కరోనా అతిపెద్ద సంక్షోభాన్ని సృష్టించింది. లాక్ డౌన్ తో అన్ని రంగాలు స్తంభించాయి. రాష్ట్రాల సరిహద్దులు మూతపడ్డాయి. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని వలస కూలీల బతుకులు రోడ్డున పడ్డాయి. ఆకలే ఆవాసంగా చావుతో సావాసం చేస్తున్న పేదల దుస్థితిని చెప్తున్నారు చిత్తలూరి.

రెక్కాడితే డొక్కాడని బతుకులు
ఇంటి జైల్లో ఎప్పటికీ విడుదలవ్వని ఖైదీలై
అందని ఆకలి గింజలకోసం ఊచల చాటున
పంజరంలోని పక్షుల్లా విలవిలలాడుతున్నాయ్
పనుల్లేని తనం ఒకర్ని యాచించలేనిగుణం
శ్రమజీవులకు నరకయాతన చూపిస్తూ
బయటి కరోనా భయంకంటే
ఇంట్లో ఆకలి భయమే నిలువునా
ప్రాణాలు తోడేస్తోంది

(ఈనాడు, 22.4.2020)

ఆకలికి కడుపు నింపుకోవడానికి తిండిలేక, నిద్ర పోవడానికి చోటుకూడా లేక చావుకీ, బతుక్కీ మధ్య నలుగుతూ ఉన్న పేదలస్థితి దుర్భరం. పనులు లేక, మరొకరిని యాచించలేని ఆత్మాభిమానం శ్రమజీవులకు నరకయాతనలా ఉంది. ఇంట్లో బందీలై తిండిలేక పంజరంలోని పక్షుల్లా విలవిలలాడుతున్న జనాల నిస్సహాయత హృదయవిదారకంగా చిత్రించారు. బయట ఉన్న కరోనా భయంకంటే ఇంట్లో ఆకలి భయమే వారిని నిలువునా దహించి వేస్తోన్న తీరు వారిని కలచి వేస్తోందంటారు చిత్తలూరి. మరో కవితలో -

పాలు మరవని చంటిబిడ్డలాగ
గుక్కపట్టి ఏడుస్తోంది దేశం
ఇప్పుడీ దేశానికి కావాల్సింది
దేవుడు కాదు
తల్లిసొంటి మనుషులు
తండ్రిసొంటి మనుషులు
మనుషులసొంటి మనుషులు

(ఈనాడు, 23.4.2020)

కరోనా మహమ్మారికి అతలాకుతలమవుతూ ఉంది ప్రపంచం. పాలు మరవని పసిబిడ్డలా గుక్కపట్టి ఏడుస్తోందంటూ దేశాన్ని పోలుస్తున్నాడు. ఏమి చేయాలో అంతుచిక్కని అయోమయ స్థితిని ఎదుర్కొంటోంది దేశం. అలాంటి ఈ దేశానికి తల్లిదండ్రిలా కాపాడే సంరక్షకులు కావాలంటూ ఆవేదన చెందుతున్నారు తగుళ్ళగోపాల్.

## ప్రవాస భారతీయుల వేదన :

పేదలకు తిండిలేక పడుతున్న బాధ ఒకరకమైతే, విదేశాలలో చిక్కుకొన్న వారి స్థితి మరోరకమైన దుఃఖానికి హేతువవుతోంది. "దూరపు కొండలు నునుపు" చందాన విదేశాలకి వెళ్ళి చిక్కుకుపోయిన వేలాదిమంది భారతీయులు విలవిలలాడుతున్నారు. కరోనా ధాటికి చాలా దేశాల్లో ఉద్యోగాలు, ఉపాధులు తీవ్రంగా దెబ్బతిన్నందువల్ల తిరిగి వచ్చేయాలనుకొంటున్న వారి సంఖ్య విపరీతంగా ఉంది. కరోనా పడగనీడలో విదేశాల్లో చిక్కుకొని అల్లాడుతున్న వైనాన్ని 'నునుపెక్కిన కొండలు' కవితలో నల్లు రమేష్ అంటున్నాడిలా!

గ్రహణాలు మాకు కొత్తకాకున్నా
మృత్యు చీకట్లు ముసిరిన వేళ
పిడికిట్లో శ్వాసలు పట్టుకుని

భయం ముంగిట బిక్కు బిక్కుమంటున్నాం
(ఈనాడు, 21.4.2020)

ఉన్నత ఉద్యోగం, చక్కటి ఉపాధి, నాణ్యమైన విద్య...... ఈ మూడింటి అన్వేషణలో తెలుగు వాళ్ళెప్పుడూ ముందుంటారు. సాంకేతికతపై భరోసాతో అమెరికా వెళ్ళినా, రెక్కల కష్టంపై నమ్మకంతో అరేబియా ఎడారుల్లో అడుగిడినా చదువులమ్మ దీవెనలు ఆకాంక్షిస్తూ ఏదేశమేగినా అక్కడ తమకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకొంటారు. అనూహ్యంగా ప్రపంచమంతటా విస్తరించిన కరోనా వైరస్ ఇలాంటి లక్షలాదిమంది ఆశలపై నీళ్ళు గుమ్మరిస్తోంది. ఎప్పుడు ఏమవుతుందోననే భయంతో ప్రవాసాంధ్రులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. మృత్యుచీకట్లు కమ్ముకొన్న సమయంలో పిడికిట్లో ప్రాణాలు పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్న వారి స్థితి హృదయవిదారకంగా ఉందంటూ మనముందు పెట్టారు రచయిత.

పారిశుధ్య కార్మికుల సేవానిరతిః కరోనా భయంతో లోకమంతా ఇళ్ళలోనే ఉంటే, పారిశుధ్యకార్మికులు మాత్రం రోడ్లమీద కవాతు చేస్తున్నారు. వీధుల్లో చెత్త ఊడుస్తూనో, కాలువలు శుభ్రం చేస్తూనో, ఇంటింటికీ వచ్చి చెత్త సేకరిస్తూనో ఎప్పుడూ కనిపించే వాళ్ళే, ఇప్పుడు జనం దృష్టిలో సరిహద్దు సైనికుల్లా కనిపిస్తున్నారు. వైరస్ వీరవిహారం చేసే తావుల్లోకి జంకు గొంకులేకుండా వెళ్ళి సేవలందిస్తున్నారు. తగిన భద్రతా కవచాలు లేకపోయినా సరే విధులకు భయపడటంలేదు. కనిపించని క్రిమితో పోరాడుతున్న వీళ్ళదగ్గరున్న ఆయుధాలు... కేవలం చేతులు, చీపుళ్ళు, గుండెల్లో ధైర్యం. వీటితోనే కరోనాను చిమ్మి ఊడ్చేయడానికి, కడిగి పోసేయడానికి, ద్రవం చల్లి తరిమేయడానికి కంకణం కట్టుకొన్న వారి సేవానిరతి అమోఘమైంది. ఏ డబ్బులతోనూ కొలవలేని సేవలంది స్తున్న సైనికవీరులను జూలూరు గౌరీశంకర్ కీర్తిస్తున్నారిలా!

ప్రపంచానికి ప్రాణభయం పట్టుకున్నాక
కొందరు ధైర్యంగా ప్రాణాల్ని పణంగా పెట్టి
అండయ్యారు.
చెత్త తీసుకుపోతానమ్మా అని అరిచే అరుపులెవరివి?
సూక్ష్మక్రిముల దాడిలో చిక్కుకున్న
నగరాన్ని శుభ్రం చేస్తున్న ఆ ఆరోగ్యతల్లులెవరు?
ఆ పొరకల తల్లుల పాదాలకు దండాలు
ఏ విష క్రిమి మన గూళ్ళదాకా రాకుండా
మహానగరం గల్లీ గల్లీని శుద్ధిచేస్తున్న
ఆరోగ్య తండ్రులకు దండాలు
(ఈనాడు, 10.4.2020)

పారిశుధ్య కార్మికుల త్యాగాలకు దండాలు అర్పిస్తున్నారు కవులు. ప్రపంచమంతా భయపడి ఇళ్ళల్లో దాక్కొంటుంటే ఆ మహమ్మారి బారిన పడుతామనే భయంలేకుండా ప్రతివీధినీ శుద్ధిచేస్తున్న పారిశుధ్య సైనికులకు చేతులెత్తి మొక్కాల్సిన సందర్భంగా పేర్కొన్నారు. కరోనా వల్ల జరుగుతున్న జీవన విధ్వంసాన్ని ఆవేదనాత్మకంగా చిత్రీకరించారు. అంతేకాదు మానవజాతిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ వారివారి ఇళ్ళలో ఉండడమే అతి పెద్ద ఉద్యమమని చెబుతున్నారు.

## డాక్టర్ల త్యాగనిరతి :

డాక్టర్ల త్యాగం, సేవానిరతి అమోఘమైంది. వారికి ఏమిచ్చినా ఏమి చేసినా వారి రుణం తీర్చలేనిది. ఎందుకంటే దేశాలే సరిహద్దులు ఏర్పరచుకొంటున్న సమయంలో కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు వైద్యులు, సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. రోగి ప్రాణాలను కాపాడటానికి ప్రాణాలొడ్డి మరీ వైద్యసేవలు అందిస్తున్నారు. వారి సేవలకు చలించిన కవి కటుకోర్వుల రమేష్ వారినిలా కీర్తిస్తున్నారు.

కరోనా పిడికిళ్ళ మధ్య నలుగుతూ
మరణ మృదంగాలను మోగిస్తూ
దేశాలు గిరిగీసుకుంటున్న వేళ
హృదయాలను విశాలం చేసుకుంటూ
వైద్యులు భూలోక దేవుళ్ళై కదులుతున్నారు
(ఈనాడు, 5.4.2020)

'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లు కాకుండా డాక్టర్లు భూలోకదేవుళ్ళుగా శ్రమిస్తున్న వారి త్యాగనిరతి అపారమైంది. అందరినీ మృత్యుఘాతాలతో కృంగదీస్తున్న కర్కశ కరోనాని మౌనంగానే తుద ముట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆటుపోటుల జీవితంలో తమ గమ్యాన్ని చేరుకొంటూ సాగాల్సిన ఆవశ్యకతను చాటారు. మరో కవిత 'నా తెల్లకోటు వెనుక'లో డాక్టర్ల మనోభావాలు అక్షరీకరిస్తున్నారిలా గట్టు రాధికా మోహన్.

కేంద్రకమే లేని వైరస్ తో చేసే
ఈ యుద్ధంలో నేనే ఓ కేంద్రంగా మారిపోయాను
నా చుట్టూ పగలు రాత్రులన్నీ
చీకటిగా మారిపోయాయి
గాల్లో వేలాడుతున్న ప్రాణాలు
దీనంగా నన్ను కౌగిలించుకొంటున్నాయి
(ఈనాడు, 8.4.2020)

కేంద్రకమే లేని వైరస్ తో పోరాడుతున్న యుద్ధంలో డాక్టర్లే కేంద్రంగా మారిపోయిన స్థితిని చెప్తున్నారు. భార్యా బిడ్డా, తల్లీదండ్రి, ఇల్లూవాకిలి వంటి బంధాలన్నీ వదులుకొని రాత్రీ పగలు కష్టపడుతున్న తీరు బాధాకరం. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్న ఎంతోమంది రోగుల ఆర్తనాదాలు తనవిగా భావించి వారు చేస్తున్న సేవలు లెక్కించలేనివి. తమ జీవితాలను, కుటుంబాలను సైతం లెక్కచేయకుండా నిరంతరం శ్రమిస్తున్న డాక్టర్ల ఆవేదనానుభూతిని మరో కవితలో సిరికి స్వామి నాయుడు చెప్తున్నారు.

అమ్మా అంటూ కన్నబిడ్డ కంకటిల్లుతుంటే
కడుపారా పాలివ్వలేని ఒక నిస్సహాయతావరణంలో
నిలువెత్తు కన్నీటి శిలలా కరిగిపోతోంది!
చెట్టును అల్లుకున్న తీగలా
పేగుపాశం తననల్లుకోబోతుంటే
అంటుకోవద్దంటోంది అల్లంతదూరంనుంచీ...
(ఈనాడు, 20.4.2020)

ఆసుపత్రుల్లో ఏ క్షణం కరోనా సోకుతుందోననే ఆలోచనతో తన ఇంటికి తనే పరాయిగా మారి, కన్నబిడ్డ ఏడుస్తున్నా కడుపారా పాలు కూడా ఇవ్వలేని నిస్సహాయ తావరణంలో కన్నీటిశిలలా మారిన డాక్టర్ల కన్నీటిగాథలు (తెల్ల పావురమై...!) వ్యక్తం చేస్తున్నారు. వెన్నెలాకాశంలో గోరుముద్దలు తినిపించాల్సిన బిడ్డకు, అందివ్వలేని దుస్థితిని తెలుపుతున్నారు. కరోనా రోగుల సేవలోనే తన కన్నబిడ్డ ఆలనాపాలనా చూసుకొంటున్న మాతృమూర్తి ఆవేదనలు ఎన్నో! కనీసం బిడ్డను దగ్గరకు తీసుకోలేని అసహాయస్థితి. పులికి మాటిచ్చి వచ్చిన గోవులా ఆ తల్లి బిడ్డకు దూరమవుతోంది. ఆ తల్లి త్యాగాన్ని ఆ వైరస్ గుర్తిస్తుందా అనే ఆవేదన కవిది. మరో కవితలో వైద్యసేవలు చేసి చనిపోయిన తర్వాత మాకొక తెల్లబట్ట కప్పండి చాలంటున్న డాక్టర్ల దీనగాథను కంచరాన భుజంగరావు 'దూది పువ్వు' కవితలో చెప్తున్నాడిలా!

ప్రాణాలకు హామీలేని పులిజూదంలో
నేనైనా మా సిబ్బందైనా బలైపోతే మాత్రం
శ్మశానాల ఆమోదం కోసం మా శవాన్ని
ఊరూరా తిప్పకండి!
ప్రభుత్వలాంఛనాలు, గౌరవ వందనాలు
ప్రకటించక్కర్లేదు గానీ
తెల్లని పువ్వులాంటి మనసుతో
ఒక తెల్లబట్ట కప్పండి చాలు
(ఈనాడు, 25.4.2020)

దేశంలో కొన్ని ప్రాంతాల్లో వైద్యులు, ఆరోగ్య సిబ్బందిపై జరుగుతున్న దాడులు ఎన్నో! కరోనాతో చనిపోయారని భావించిన వైద్యనిపుణులకు కనీసం అంత్యక్రియలైనా జరుపనివ్వకుండా అడ్డుకొంటున్న ఉదంతాలు మరెన్నో! నెల్లూరులో చనిపోయిన ఒక డాక్టరుకు అంతిమ సంస్కారం చేయడానికి ఒప్పుకోని ప్రజలను ఉద్దేశించి ప్రాణాలకు హామీలేని ఈ సందర్భంలో మాకేదైనా అయితే ఎలాంటి లాంచనాలు అవసరం లేదు. స్వచ్ఛమైన మనసుతో ఒక తెల్లబట్ట మాత్రమే కప్పమంటున్న వైద్యుల

ఆవేదన వర్ణనాతీతం. కనీసపు మానవత్వం కూడా లేకుండా ఉన్న నేటి సమాజం ఏవైపు దారి తీస్తుందోననే బాధ మనసును కలచివేస్తున్నది. ఇంత జరుగుతున్నా మారని మనసులకు ఈ కవిత చెంపపెట్టులాంటిది.

### ప్రకృతి ప్రకోపం :

మనిషి ప్రకృతితో సహజీవనం చేస్తున్నాడు. ప్రకృతి సూత్రాలను ఉపయోగిస్తూ తన జీవనవిధానాన్ని సుఖమయం చేసుకొనే శక్తిని సాధించుకున్నాడు. ప్రకృతి శక్తులని ఉపయోగించుకొనడమనేది మనిషికుండే విశిష్టతే! కాని ప్రకృతి యుద్ధమే ప్రకటించి, దానిని ధ్వంసం చేస్తూ పోవడంతో ప్రకృతి తిరగబడుతున్నది. ప్రకృతిని పూజించే దశనుండి శాసించేదశకు చేరుకోవడం నాగరికత అభివృద్ధే అనుకొన్నాం. కాని ఇవ్వాళ ప్రకృతి గడగడ లాడిస్తున్నది. ఒక చిన్న ప్రాణంలేని కణం మనల్ని ముప్పుతిప్పలు పెడుతున్నది. వేలాదిమంది మరణిస్తుంటే అసహాయంగా దీనంగా ఒక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. దీనికి కారణాలను అన్వేషిస్తూ 'కొత్త ప్రగతి దారుల్లోకి' కవితలో పక్కి రవీంద్రనాథ్ అక్షరీ కరిస్తున్నారిలా!

ఉరుకులూ పరుగుల మధ్య మనం ఉమ్మేసిన కాలుష్యమో....

ఆకాశహర్మ్యాలకు ఎగబాకి పోవాలన్న అత్యాశతో
మనిషితనాన్ని తొక్కుకుంటూ దూసుకెళ్ళిన నిర్లక్ష్యమో....
పచ్చని చెట్లను కాదని పొగగొట్టాలను పాతుకుంటూ
పర్యావరణాన్ని పలుచన చేసిన పర్యవసానమో....
ఇంతటి ఈ వైపరీత్యానికి కారణమేమంటే
ఏదని చెప్పగలం?

(ఈనాడు, 9.4.2020)

కరోనా మహమ్మారి వలన అస్తవ్యస్తమైపోయిన దేశప్రగతిని దృష్టిలో ఉంచుకొని, పచ్చని చెట్లను కాదని మనిషి అత్యాశతో చేసిన పనులే దీనికంతటికీ కారణ మంటున్నారు కవి. ప్రకృతిని నిర్లక్ష్యం చేసిన ఫలితమే ఇది అని హెచ్చరిస్తున్నారు. మానవ తప్పిదాలను గుర్తుచేస్తున్నాడు. ఏదైనా దెబ్బ తగిలినా, ప్రమాదం ముంచుకొచ్చినా 'అమ్మా' అని అరుస్తాం, అర్థిస్తాం. అమ్మ భరోసా, రక్షణ అలాంటిది. ఇప్పుడు మనమంతా అలాంటి భరోసా, రక్షణ కోసమే ఎదురుచూస్తున్నాం. మందూ మాకూ లేని కరోనా విలయంలో చిక్కుకొని, చిన్న ఆలం బనైనా దొరక్కపోతుందా అని నిరీక్షిస్తున్నాం. దొరకాలని ప్రార్థిస్తున్నాం. ఇదంతా మనం చేసిన తప్పుల ఫలితమేనని తెలుసుకోలేకపోతున్నాం. దీనితో ఇలాంటి మహమ్మారులు మనపై దాడికి దిగుతున్నాయి. అందుకే అమ్మలకే అమ్మ అయిన ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తు చేస్తున్నారు కవులు.

అనేకానేక తప్పిదాలనుంచి ఒక నూతన అన్వేషణగా
మనిషి ఒక పరిశోధనగా ... ప్రయోగంగా
ప్రకృతి ప్రేమ పాఠం నేర్పింది
విశ్వమంత కుటుంబాన్ని గుర్తు చేసింది.
ప్రకృతిని ప్రేమిస్తేనే వికృతులన్నీ
తొలగిపోతాయన్న ఆత్మవిశ్వాసమేదో మొలకెత్తింది

(ఈనాడు, 26.4.2020)

ప్రకృతిని ప్రేమిస్తేనే అన్ని ఆపదలు తొలగిపోతాయనే ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తంచేశారు 'ప్రకృతిని ప్రేమిస్తేనే' కవితలో శిఖా - ఆకాష్. ఈ మహమ్మారి మనుషులందరినీ ఏకం చేసింది. అంతా ఒక కుటుంబమనే విషయాన్ని గుర్తు చేసింది. మరో కవితలో -

ఇది ప్రకృతి వైపరీత్యం కానేకాదు చిన్నా
మనిషి స్వయం కృతాపరాధమేరా నాన్నా
మానవత్వాన్ని పూడ్చిన చోటునే
మనిషి మళ్ళీ మనిషిగా మారి అందరూ కలిసి
సాంఘిక దూరాన్ని పాటిస్తూ పాడు కరోనాకు పాడె కట్టాలి

(ఈనాడు, 14.4.2020)

మానవత్వాన్ని పూడ్చిన చోటే మేల్కొల్పాల్సిన అవసరాన్ని చాటుతున్నారు. ఇది ప్రకృతి వైపరీత్యం ఏమాత్రమూ కాదని తనకు తానుగా మనిషి చేసుకొన్నదేనని పేర్కొంటున్నారు సురేంద్ర రొడ్డ. కరోనా కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను చెప్తూ, అందరూ భౌతిక దూరాన్ని పాటిస్తూ కరోనాకు పాడె కడదామంటున్నారు. కరోనాపై ప్రతిఘటనాయుద్ధాన్ని ప్రకటిస్తూ-

విర్రవీగుతున్న కరోనా కరాళ నృత్యాన్ని
మన డప్పు చప్పుడుతో ఓడిస్తాం

(ఈనాడు, 14.4.2020)

అంటున్నాడు. కరోనా మహమ్మారిని ఓడించగల శక్తి మనలో ఉందని కవి భావన. మరో కవితలో ఈ మహమ్మారి చేస్తున్న ఆగడాలను భారత రామాయణ కథలను చెప్పినట్లుగా చిన్నారులకు కథలరూపంలో వివరించమంటున్నారు 'అనగనగా ఆ రోజుల్లో!' కవితలో కె.జోసెఫ్.

కంచం దగ్గర కూర్చున్నప్పుడు
కంచెలా కాపు కాసే పోలీసుల, డాక్టర్ల వీరగాథలను
తొలికారం ముద్దగా పెట్టండి
చందమామరావే జాబిల్లిరావే అనే లాలిపాట బదులు
మెతుకులు దొరకని బతుకుల గాథలు
జోలపాటలుగా పాడామని
మీ పిల్లలకు, పిల్లల పిల్లలకు చెప్పండి

(ఈనాడు, 13.4.2020)

కంటికి కనిపించని క్రిమి చేసిన ఆగడాలను, పోలీసులు, డాక్టర్లు వీరగాథలను చందమామ కథలుగా చెప్పమంటున్నాడు. తిండిలేక అల్లాడుతున్న బతుకుల గాథలను జోలపాటలుగా కరోనా కరాళనృత్యాన్ని పాడమంటున్నాడు. ఇన్ని దారుణాలకు ఒడిగడుతున్న కరోనా మహమ్మారిని పారద్రోలడానికి పచ్చని చెట్టొకటి కావాలంటున్నారు ఈతకోట సుబ్బారావు.

కరోనాని అమాంతం గొంతు నులిమి
మెలితిప్పి పట్టపగలే ఉరితీసి
మనుషుల్ని స్వతంత్రులు చేసే
పచ్చని చెట్టొకటి కావాలి.

(ఈనాడు, 28.4.2020)

ప్రకృతి ఎంతో స్వచ్ఛమైనది. అందరి ఆరోగ్య ప్రదాత. ఎలాంటి మహమ్మారులనైనా తరిమికొట్టే లక్షణం గలది. అందుకే కరోనాని ఒక్కసారిగా చంపేసి, మనుషుల్ని స్వతంత్రుల్ని చేసే పచ్చని చెట్టు ఒకటి ఉంటే బాగుంటుందని కవి ఆశాభావం.

కొన్నాళ్ళకు... కరోనా కీటకం వాలేందుకు
ఏ ఊపిరి పూలూ కనబడక...ఓడానని వెడలదా

(ఈనాడు, 11.4.2020)

అంటున్నారు దొండపాటి నాగజ్యోతి శేఖర్ 'అరుదైన సమయం' కవితలో. అందరూ స్వీయ నిర్బంధంలో ఉండి ఒకరికొకరు సహకరించుకొని నడుచుకొంటే కొన్ని రోజులకు కరోనా కీటకం ఇక కబలించడానికి ఎవరూ దొరకక ఓడానని వెళ్ళి పోతుందనే ఆశాభావాన్ని కవి వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తుపై ఒక విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు. రచయితలందరిది ఒకటే దృష్టి. అది సర్వమానవాళి శ్రేయస్సు. ఈ విపత్తునుండి ప్రాణాలు కాపాడుకోవడానికి ప్రపంచం మొత్తం యుద్ధం చేస్తోంది. కాని ఓడిపోవడానికి మనిషి సిద్ధంగా లేడు. మన సంకల్పం సంక్షోభంకంటే గొప్పది. స్వీయ నియంత్రణలో మనల్ని మనం రక్షించుకోవాలి. ప్రపంచంలో ఇలాంటి మహమ్మారులు ఎన్నో వచ్చాయి. వాటన్నిటినీ జయించి వచ్చినట్లే ఈ కరోనాను కూడా ఎదుర్కోవాలని కవుల భావన.

మహమ్మారులు, వాటి గురించిన సాహిత్యం మనకు ఒక విషయాన్ని స్పష్టం చేస్తూ ఉంది. ఈ భూమ్మీదకు మనం అతిథులమని, ఇదేమీ మన సొత్తుకాదని తెలుసుకోమంటోంది. ఎందుకంటే మనుషుల్ని అంతం చేయడానికి పెద్ద పెద్ద యుద్ధాలు చేయాల్సిన అవసరం లేదని కంటికి కానరాని అతిచిన్న ప్రాణి చాలు అని! కనుక మనం ఈ విషయాన్ని తెలుసుకొని, ప్రవర్తిస్తే మరి కొన్నాళ్ళు ఆనందంగా జీవించగలుగుతాం!

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల సంక్షేమ చట్టం : ఒక పరిశీలన

## (MAINTENANCE AND WELFARE OF PARENTS AND SENIOR CITIZENS ACT, 2007 : A BRIEF OVERVIEW)

-డా॥. పి.కె.ఐ.యస్. రామారావు, ఫ్యాకల్టీ, లా స్కూల్, క్రైస్ట్ విశ్వవిద్యాలయం, బెంగళూరు.

సీనియర్ సిటిజన్స్ (వయోవృద్ధుల)కు మన ప్రభుత్వం ఎన్నో ప్రయోజనాలను కల్పించింది. రైల్ టికెట్లలో రాయితీ, బ్యాంకుడిపాజిట్లలో అధిక వడ్డీ, వయో వృద్ధులకు ప్రభుత్వ పింఛన్లు, దేవాలయాలలో ప్రత్యేక దర్శనాలవంటివి కొన్ని సౌకర్యాలు ఉదాహరణలుగా చెప్పవచ్చు.

ఆయా రంగాలలో తలపండిన వ్యక్తుల నుండి తగిన సలహాలు తీసుకోవడం, వాటిని అమలు చేయడం తద్వారా వచ్చే ప్రయోజనాలను అందుకోవడమన్నది మనమందరం తరచుగా చూస్తున్నాము.

కానీ ఇట్టి తలపండిన వ్యక్తులు ఇంట్లో వారి కుటుంబ సభ్యుల నిరాదరణకు గురికావడం అన్నది కూడా ఒక సామాజిక వాస్తవం. ఇంట్లో తల్లిదండ్రులు మీద చేయి చేసుకోవడం కూడా అక్కడక్కడ జరుగుతున్నవి.

ఈ సమస్యను పరిష్కరించడం కోసమే వచ్చిన చట్టం తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల సంక్షేమ చట్టం 2007. వయస్సు 57 సంవత్సరాలు నిండిన వారంతా ఈ చట్టం పరిధిలోనికి వస్తారు. ఎటువంటి నిరాదరణకు గురికాబడినా, లేదా శారీరక, మానసిక హింసకు గురికాబడినా అట్టివారు ఒక తెల్లకాగితం మీద వివరాలు రాసి, ఈ చట్టం క్రింద నియమించ బడిన అధికారికి అందజేస్తేచాలు. సమస్య పరిష్కారం కేవలం రెండు నెలల వ్యవధిలో జరగాలన్నది ఈ చట్టం చెబుతోంది. తల్లిదండ్రులను నిరాదరణగాచూసిన కుటుంబసభ్యులకు ఊచలు లెక్కబెట్టేలా శిక్షించే అధికారం ఆ ప్రత్యేక అధికారికి ఉంది.

చాలీ చాలని సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకు వస్తున్న వారి పరిస్థితి ఏమిటి? సంపాదనతో సంబంధం లేకుండా ఉన్నంతలో తల్లిదండ్రులను పోషించాలని చట్టం చెబుతోంది.

వయస్సు పైబడ్డ అమ్మానాన్నలకు కావలసింది పరమాన్నాలు, పట్టుబట్టలు కావు. పట్టెడన్నం, ఒక ఆత్మీయ పలకరింపు. కాదంటారా?

సరే ఇప్పుడు సమాజంలో గౌరవమర్యాదలు, డబ్బూ, దస్కం ఉన్న కుటుంబాలలో ఏమిజరుగుతోందో చూద్దాం. ఇదే కథ. అమ్మానాన్నలపట్ల నిరాదరణ. పెద్దవాళ్ళు తీసుకొనే ఉదయపు కాఫీలో కాస్త మందో మాకో కలిపేస్తే పోలా... అన్నంతదూరం వెళుతోంది ఈకాలపు యువత ఆలోచన. వృద్ధాశ్రమంలో పెట్టేద్దాం అని కొడుకు కోడల మధ్య ఒక అంగీకారం. సరే అమ్మానాన్నలను బల వంతంగా ఒప్పించి ఒక ఆశ్రమంలో చేర్పించారనే అనుకుందాం. అప్పుడు ఈ చట్టప్రకారం అమ్మానాన్నలు ఏమి చేయవచ్చు? ఒక తెల్లకాగితం మీద వివరాలు రాసి, ఈ చట్టం క్రింద నియమించ బడిన అధికారికి కంప్లైంట్ అందజేయవచ్చు. ఇరుపక్షాల వాదనలు విన్నతర్వాత ఆరోపణలు నిజమనితేలితే, కొడుకు కోడలిని ఊచల వెనకకు పంపించే అధికారం ఆ అధికారికి ఉంటుంది.

ఒక్కోసారి, అమ్మ, నాన్నగారి పేరుమీద ఉన్న ఇంటిని మభ్యపెట్టి, మస్కాకొట్టి దస్తావేజుల మీద మోసపూరితంగా సంతకాలు చేయించుకొనే ప్రబుద్ధులు వున్నారు. ఇదివరలో అయితే ఆస్థిని వెనక్కు రాబట్టుకోవడానికి చాలా తతంగం వుండేది. ప్లీడరు ఖర్చులు, కోర్టుఫీజులు సంవత్సరాలపాటు కోర్టుచుట్టూ తిరగడం లాంటివి

ఉండేవి. కానీ ఈ చట్టంలో 2019లో తగిన మార్పులు చేసారు. ఆస్థిని తిరిగి రాబట్టుకోవడంకోసం ఇప్పుడు ఏకోర్టు చుట్టూ తిరగవలసిన అవసరం లేదు. ఇటువంటి కేసులను పరిష్కరించే అధికారం ఈ ప్రత్యేక అధికారికి ఇచ్చారు. మోసపూరితంగా రాయించుకున్న ఇంటి కాగితాలకు ఎటువంటి విలువ లేకుండాచేసే అధికారం ఈ ప్రత్యేక అధికారికి ఉన్నది.

ఇటీవల కాలంలో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం, నాన్నగారు నివాసంలోవుంటున్న ఇల్లు, అది స్వార్జితం కావచ్చు లేక పూర్వీకుల నుంచి వచ్చినది కావచ్చు. అమ్మనాన్నలకు తమ ఇంట్లోవున్న సభ్యుల యొక్క నిరాదరణకు గురికాబడినట్లుగా భావిస్తే. అటువంటి కుటుంబ సభ్యులను మెడపట్టి బైటకుగెంటివేసే అధికారం ఉంటుంది. ఇది కోర్టు ఇచ్చిన తీర్పు. ఈ కోర్టుఇచ్చిన తీర్పు అందరి మన్ననలను పొందింది.

పదవీవిరమణ చేసే ఉద్యోగులు సాధారణంగా చేసే ఒక పొరపాటు ఏమంటే ఉన్న ప్రతి ఒక్కరూపాయి స్వంత ఇంటిని ఏర్పాటుచేసుకొనేందుకు ఖర్చుపెట్టడం. సాధారణంగా వయస్సుపైబడిన వారికి అద్దెఇల్లు దొరకడం కష్టం. అందువల్ల స్వంతఇల్లు ఏర్పాటుచేసుకావాలన్న కోరిక వాళ్ళలో బలంగా ఉంటుంది. ఇప్పుడు సమస్య ఏమిటంటే ఇంట్లో అందరూ కలసి ఉండవలసిరావడం, మరియు కొడుకు, కోడలుతో సూటిపోటి మాటలు పడవలసిరావడం. చేతిలో రూపాయి లేకపోవడం. ఇది పరిష్కాంలేని సమస్య కాదు. ఇటీవల బ్యాంకులు ఒక ప్రత్యేకమైన స్కీమ్ ఏర్పాటుచేసారు. ఈ స్కీమ్ ప్రకారం బ్యాంకువారు ఆ ఇంటిని తనఖాపెట్టుకొని ప్రతీనెలా రూ.25,000లు వరకు ఇస్తారు. ఇంటి యజమాని బ్యాంకువారికి ఇంటిని స్వాధీనపరచవలసిన అవసరం లేదు. సుమారు 25 సంవత్సరములు ఈ విధంగా నెలవారీ డబ్బులు ఇస్తారు. ఇంటిని తనఖా నుండి విడిపించుకొనేపని పిల్లలది.

చట్టాలు బలంగా చేసినంతమాత్రాన, అధికారులు దానిని సమర్ధవంతంగా అమలు చేసినంతమాత్రాన పిల్లలకు, ఇంట్లో పెద్దలపట్ల ప్రేమ పుట్టుకురాదు. అది స్వతహాగా రావాలి. ఒక్కసారి మీరు ఇంట్లోపెద్దలకు ఇంత చారూఅన్నం మీచేత్తో తినిపించండి. అప్పుడు మీరు ఎదుర్కొనే సమస్యలు చెప్పి, వారి సలహాతీసుకొని వాటిని అమలు చేయండి. వారికి కొండంత తృప్తి. ఇంట్లో పెద్దవారిని ప్రేమగాచూసుకొనే వాళ్లకు, ఆ దైవాశీస్సులు నిండుగా వుంటాయి. ఇక అన్ని విజయాలు మీ వెంటే.

చివరిగా ఒక మాట... అమృతం తాగేవాళ్లు దేవతలూ, దేవుళ్లు. వాటిని కన్నబిడ్డలకు పంచేవాళ్లు అమ్మానాన్నలు. అవునంటారా.

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలుగు సాహిత్య విమర్శ : రాయలసీమ దోహదం రాచమల్లు రామచంద్రారెడ్డి

-డా॥. పల్లె కృష్ణ తెలుగు అధ్యాపకులు, సి.ఎస్.ఎస్.ఆర్ & ఎస్.ఆర్.ఆర్.యం. డిగ్రీ & పి.జి. కళాశాల, కమలాపురం, కడప జిల్లా.

ఆధునిక యుగంలో తెలుగు సాహిత్యంలో వైవిధ్యం ఎక్కువగా కన్పిస్తుంది. ఈ వైవిధ్యం ఎన్నో ప్రక్రియలకు, మరెన్నో ధోరణులకు మూలమైంది. అటువంటి ఆధునిక ప్రక్రియలలో విమర్శ ఒకటి. కప్పిచెప్పేది కవిత్వమైతే, విప్పి చెప్పేది 'విమర్శ' అని పెద్దల ఉవాచ. ఆధునిక తెలుగు సాహిత్యంలో విమర్శ బహుళ ప్రచారం పొంది సాహితీ ప్రియులందరికీ చేరువైంది. తెలుగు సాహిత్య విమర్శ క్రీ.శ.19వ శతాబ్ది ద్వితీయార్ధంలోనే పురుడు పోసుకుంది. నవ్యాంధ్రవాఙ్మయ నిర్మాతగా ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో అగ్రస్థానం అలంకరించిన కందుకూరి వీరేశలింగం పంతులుగారి 'విగ్రహతంత్ర విమర్శనము' 1876లో 'వివేకవర్ధని' పత్రికయందు వెలువడడంతో ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ ప్రారంభమైంది. కనుక తెలుగు సాహితీ సుక్షేత్రంనందు విమర్శనా స్రవంతిని అవతరింపచేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. అయితే ప్రాచీనాంధ్ర వాఙ్మయంలో 'విమర్శ' తెలుగులో లేదా? అంటే ఉందనే చెప్పాలి. కవులు తమ కావ్యాల్లో 'సుకవిస్తుతి', 'కుకవినింద'ల రూపంలో కావ్య, కవిత్వ చర్చల, వ్యాఖ్యాన రూపంగానో చేయడం కన్పిస్తుంది. అయితే అది ఒక ప్రత్యేక ప్రక్రియగా అవతరించింది మాత్రం ఆధునిక కాలంలోనే. కందుకూరి వీరేశలింగం పంతులుగారితో ప్రారంభమైన ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ 'కట్టమంచి రామలింగారెడ్డి'గారి 1914'కవిత్వతత్త్వ విచారము' ద్వారా ఒక స్వరూపాన్ని సంతరించుకుని, కట్టమంచివారి 1939 'వ్యాసమంజరి', 'పంచమి' వంటి సాహిత్య విమర్శల ద్వారా తెలుగు సాహిత్య విమర్శ వికాసం చెందింది.

రాయలసీమలో ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ 'కట్టమంచి రామలింగారెడ్డి'గారితో మొదలై రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, ఆర్.యస్.సుదర్శనం, సర్దేశాయి తిరుమలరావు, పుట్టపర్తి నారాయణాచార్యులు, రాచమల్లు రామచంద్రారెడ్డి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య వంటివారితో తెలుగు సాహితీ విమర్శనాలోకానికి తనదైన ముద్రను బలంగానే వేసింది. ఈనాడు కూడా ఎందరో విమర్శకులు ఆధునిక భావజాలంతో విస్తృతంగా విమర్శ రంగంలోకి ప్రవేశిస్తూ రాయలసీమ సాహితీ విమర్శను పరిపుష్టం చేస్తున్నారు. అలాంటి విమర్శకులలో రాయలసీమలో ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో తనదైన ముద్రవేసుకున్న ధీశాలి రా.రా.

కడప జిల్లా తెలుగు సాహిత్య విమర్శలో శ్రీ.శ్రీగారితో క్రూరుడైన విమర్శకుడిగా పేరొంది, మార్క్సిస్ట్ సాహిత్య విమర్శకు ఒక నిర్దిష్టమైన స్వరూపాన్ని అందించిన మహనీయుడు 'రా.రా.'గా ప్రసిద్ధిగాంచిన వారు 'రాచమల్లు రామచంద్రారెడ్డి'గారు. నిర్మొహమాటంగా, నిరలంకారికంగా విమర్శ చేయడం ఆయనలోని ప్రత్యేక శైలికి నిదర్శనం. నిజాయితీ కలిగిన విమర్శకుడిగా స్పష్టమైన సామాజిక సాహిత్య దృక్పథంతో మార్క్సిస్ట్ భావజాలంతో 1960 నుండి రెండు దశాబ్దాలకాలం తెలుగు సాహిత్య విమర్శను మంచి వాతావరణంలో ప్రయణింపచేసిన ఘనకీర్తి 'రాచమల్లు రామచంద్రా రెడ్డి'గారికే దక్కుతుంది. భౌతికవాద ప్రాపంచిక దృక్పథం కలిగిన ప్రగతిశీల రచయితగా, విమర్శకులుగా వీరు పేరు పొందినారు.

## రా.రా. జీవితం :

రా.రా. 28-02-1922 కడప జిల్లా పులివెందుల తాలూకా పైడిపాళెం గ్రామంలో ఆది లక్షుమ్మ, బయపురెడ్డిగార్లకు జన్మించారు. ఇంజనీరింగ్ చదువుతూ

మధ్యలోనే స్వస్తి చెప్పి సాహిత్యరంగంలోకి ప్రవేశించారు రాచమల్లు రామచంద్రారెడ్డిగారు. వీరి భార్య పేరు రామలక్షుమ్మ, సంతానం అశోక్, జయంతి, మధువర్ధన్. వీరు 1959-63 వరకు కడప జిల్లా రాజకీయ సాంస్క ృతిక పక్ష పత్రిక 'సవ్యసాచికి' సంపాదకత్వం వహించారు. 1964 జనవరి నుండి జూన్ దాకా ఆరు నెలలు విశాలాంధ్రలో పనిచేశారు.1968-69 వరకు సాహిత్య త్రైమాసిక 'సంవేదనకు' సంపాదకత్వం వహించారు. 1969-75 వరకు మాస్కో ప్రగతి ప్రచురణాలయంలో అనువాదకులుగా పనిచేశారు.1977-79 వరకు ఈనాడు దినపత్రికలోనూ పనిచేయడం జరిగింది. 24-11-1988వ సంవత్సరం హైదరాబాదులో స్వర్గస్తులైనారు రా.రా.గారు.

## రా.రా. - రచనలు :

చంద్రమండలం శశిరేఖ (బాల సాహిత్యం), విక్రమార్కుని విడ్డూరం (బాల సాహిత్యం), అన్నం పెట్టని చదువు (బాలల నాటిక), పద్మవ్యూహం (నాటిక), సమాజ వికాసం (ప్రహసనం), అలసిన గుండెలు (కథల సంపుటి), కావ్య చిత్ర (పెద్ద కథ), సారస్వత వివేచన (సాహిత్య విమర్శ), వ్యక్తి స్వాతంత్ర్యమూ-సమాజ శ్రేయస్సు (వ్యాసాలు ), రా.రా. లేఖలు (మిత్రులకు సాహిత్యంపై రాసిన జాబులు), అనువాద సమస్యలు ( అనువాద కళపై వ్యాసాలు) వంటి రచనలు చేశారు. సాహిత్య అకాడెమీ ద్వారా ఈ పుస్తకం 'అనువాద్ సిద్ధాంత్' పేరుతో హిందీలోకి డా. జె.ఎల్. రెడ్డిగారు అనువదించారు. రా.రా. అనువాద గ్రంథం ఈ విధంగా జాతీయ స్థాయిలో ప్రశంసలందు కుంది.

## రా.రా. పై మార్క్సిజం ప్రభావం :

మార్క్స్ గతితార్కిక భౌతికవాదానికి మూడు సూత్రాలను ప్రతిపాదించాడు.

1. పరస్పర విరుద్ధ శక్తుల మధ్య సంఘర్షణ, 2. విరోధ వైరుధ్య సూత్రం, 3. పరిమాణము గుణముగా మారు పద్ధతి.

ఈ మూడు సూత్రాలు కలసి గతితార్కిక భౌతికవాదం ఏర్పడినది. ఈ వాదానికి వర్గకలహ సిద్ధాంతం గుండెకాయ వంటిది. మానవ జాతి చరిత్ర ఈ సిద్ధాంతముల సరికొత్త వెలుగులో పరిశీలించడం మొదలైంది. 1935 నాటికే భారత దేశంలోని మేధావులు, రచయితలు కొందరు మార్క్సిస్ట్ దృక్పథం చేత ప్రభావితులైనట్లు తెలుస్తున్నది. ఇదే సంవత్సరం అఖిల భారతాభ్యుదయ రచయితల సంఘం ఏర్పడడం, 1936 ప్రథమ మహాసభ మున్షీ ప్రేమ్‌చంద్ అధ్యక్షతన జరగడం, ఆయన ఉపన్యసిస్తూ "విశ్వజనీన దృష్టిగల రచయిత పెట్టుబడిదారీ విధానమును, సామ్రాజ్యవాద ధోరణిని సహింపలేడనీ, రచయిత కర్తవ్యం వినోద విలాసములను చిత్రించుట కానే కాదని, ప్రస్తుత సమాజమును దివిటీ పట్టి నడిపించు టయే రచయిత ధ్యేయమని ఎలుగెత్తిచాటినాడు."

మార్క్సిజం సిద్ధాంతాలను బాగా అర్థం చేసుకున్న మహనీయుడు రా.రా. అందుకే "సమకాలీన సజీవ రచనల మీద సరైన విమర్శలు సాహిత్య వికాసానికి చాలా అవసరం" అంటారు 'విమర్శ' అనే వ్యాసంలో రా.రా. "ఉత్తమ సాహిత్యానికి జన్మస్థానం సమాజ జీవితమైనట్లే దాని గమ్యస్థానం కూడా సమాజ జీవితమే" అని వారి అభిప్రాయం. సాహిత్యానికి తత్వజిజ్ఞాసకూ గమ్యం సమాజమే ; లక్ష్యం సమాజ పురోగమనమే. సకల మానవ మేధా క్రియలకూ ధ్యేయం ఉన్నత సంస్కృతీ సంపన్నమైన ఉత్తమ మానవ జీవితమే. ఉన్నత మానవ సంస్కృతీ ప్రమాణాలు నిరూపించడం, మానవ మన: ప్రపంచపు సంకుచిత స్వార్థ దుర్గాలు బ్రద్దలు కొట్టడం, నూత్న సౌందర్యలోకాల దర్శనం చేయించడం, నూతన ఆనందమయ జీవిత వ్యవస్థకు మానవ హృదయాలను పరిపక్వం చేయడం - ఇవి ఆయన దృష్టిలో ఉత్తమ సాహిత్య లక్ష్యాలు. మనిషిలోని స్వార్థచింతనను, సంకుచితభావనలను రూపుమాపి, విశాల దృక్పథంతో కొత్త ఆలోచనలను రేకెత్తించడం, మానవ హృదయాన్ని పరిపూర్ణం గావించడమే ఉత్తమ సాహిత్య లక్ష్యాలని

ఆయన అభిప్రాయం. మానవ హృదయ వికాసం, సుఖమయ జీవితం కోసం ఆయన ఎంతగానో పరితపించారు.

## రా.రా. సాహిత్య విమర్శ :

"రాచమల్లు రామచంద్రారెడ్డిగారిలో నాకు నచ్చిన అంశాలు రెండు : ఆపేక్ష, శాస్త్రీయదృక్పథం. వ్యక్తుల పట్ల, సమాజం పట్ల అనితరసాధ్యమైన ఆపేక్ష ; విసుగు చెందకుండా విషయాన్ని సుబోధకంగా విడమరచి చెప్పే సుగుణం. ఆయన దృష్టిలో శాస్త్రజ్ఞానం కంటే శాస్త్రీయ దృక్పథం చాలా ముఖ్యం" అని అంటారు కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి.[3] నిజమే ఒక విషయం గురించి ఎంతో లోతుగా ఆలోచించి సూటిగా సుత్తిలేకుండా గుండెలు చీల్చినట్లు, కుండ బద్దలు కొట్టినట్లు, అర్థవంతంగా చెప్పడంలోనే ఆయనలో మార్క్సిస్ట్ భావజాలం ఎంతగా వేళ్ళూనుకుపోయిందో తెలియచేస్తుంది. ఒక విమర్శ కుడిగా నిజాన్ని నిక్కచ్చిగా చెప్పడమే ఆయన ప్రత్యేకత.

ఒక రచనలో గల సమాజ జీవితాన్ని చక్కగా విమర్శించినపుడే సాహిత్యం బాగుపడుతుంది. నిజాయితీ కలిగిన విమర్శకుడు చేసే పనీ అదే. సామాజిక దృక్పథం ఎక్కువగాగల వ్యక్తిగా, నిజాయితీగల విమర్శకుడిగా సాహిత్యాన్ని విమర్శించడం ఆయనలోని కరుకైన విమర్శకున్ని బయటపెడుతుంది. అయితే రా.రా.కు నచ్చని అభిప్రాయాలను నిరసించడంలోనూ ఆయన కరుకైన విమర్శనాశైలి రచయితలను బాధపెడుతుంది. అంతమాత్రాన ఆయన శైలి అంతా ఇలానే ఉంటుంది అనుకోవడం పొరపాటే అవుతుంది.

"తెలుగు సాహిత్య విమర్శకు భావజాల పరంగానూ, వివేచనపరంగానూ పట్టిన అనేక రోగాలకు వైద్యం చేసిన డాక్టర్ రా.రా."[4] అని ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు అంటారు. సమకాలీన సజీవ రచనల మీద సరైన విమర్శలు సాహిత్య వికాసానికి చాలా అవసరం. ఈ సత్యం అందరికీ తెలిసిందే కానీ సరైన విమర్శలు మాత్రం రావడం లేదు. తమ అభిమాన రచయితల మీద పొగడ్తలు కురిపించే వ్యాసాలు తప్ప, సమకాలిక రచయితలమీద, రచనలమీద గుణదోష విచారణ చేసే శాస్త్ర సమ్మతమైన సిద్ధాంత పూర్వక, నిష్పాక్షిక విమర్శలు చాలా అరుదైనాయి అంటారు 'విమర్శ' అనే వ్యాసంలో రా.రా. ఉత్తమ సాహిత్య విమర్శలు తక్కువ అవడం వలన పాఠకులలో విచక్షణ తగ్గిపోతున్నదని ఉత్తమ సాహిత్య అభిరుచులకు బదులు అసంస్కృత హృదయుల నీచాభిరుచులే ఆదరణ, వ్యాప్తి పొందుతున్నాయని రా.రా. ఎంతగానో బాధపడ్డారు.

## విమర్శకు గీటురాయి రా.రా :

తమ సాహిత్య వ్యాసాలలో గురజాడ వారి గురించి నిశితంగా చర్చించారు రా.రా. "గురజాడ మనస్తత్వంలోని విపరీత ధోరణి" అనే వ్యాసం ద్వారా గురజాడ అంతరంగాన్ని తేటతెల్లం చేశారు. గురజాడ రాసిన "మనిషి" గేయం-

"మనిషి చేసిన రాయిరప్పకి
మహిమకలదని సాగిమొక్కుతు
మనుషులంటే రాయిరప్పల కన్న కనిష్టం
గానూ చూస్తావేల బేలా ?
దేవుడెకడో దాగెనంటూ
కొండ కోనలు వెతుకులాడే వేలా ?
కన్నుతెరిచిన కానబడడో ?
మనిషి మాత్రుడియందు లేడో
యెరిగి కోరిన కరిగియీడో ముక్తి"

అనే గురజాడ వారికి మంచి ఆదర్శభావాలు ఉన్న విషయం అందరికీ తెలిసిందే అయినా కన్యాశుల్కం నాటకం ద్వారా గురజాడవారు ఏ సమస్యకూ సరైన పరిష్కారం ఇవ్వలేదని అంటారు రా.రా. వితంతు వివాహాలకు గురజాడవారు నూటికి నూరుపాళ్ళు అనుకూలమే అయినా కన్యాశుల్కం నాటకంలో ఆ సమస్యను ఎందుకలా అల్లరి పాలు చేసినాడు? గిరీశం లాంటి వాణ్ణి కథానాయకునిగా ఎందుకు సృష్టించినాడు? అలాగే 'సంస్కర్త హృదయం' అనే కథలో కూడా ఇలాంటి ప్రశ్నే సంధిస్తాడు రా.రా. నిజానికి ఈ ప్రశ్న రా.రా. పాఠకుల

తరపున సంధించినట్లుగా తెలుస్తుంది. దానికి సమాధానంగా గురజాడ మనస్తత్వ ధోరణిలోని విపరీతానికి కారణం ఆనాటి సమాజం సర్వాంగాలలోను కుళ్ళిపోయిందని, సర్వతో ముఖమైన సంస్కరణ అవసరమని తెలిసి కూడా ఆనాటి సంస్కర్తల అసంపూర్ణ జ్ఞానం అవాస్తవిక దృక్పథం వలన ఆనాటి సంఘ సంస్కరణోద్యమాల పట్ల సానుభూతి చూపలేక పోయినాడు. ఇదే గురజాడ మనసులోని వైపరీత్యం అని, గురజాడ అంతరంగాన్ని లోతుగా విశ్లేషిస్తూ- ఆయన గొప్పతనం ఆయన రచనల్లోని జీవిత వాస్తవంలో ఉంది, విప్లవాత్మక భావనలో ఉంది, మానవతా దృక్పథంలో ఉంది, ఈ సర్వగుణాల సమగ్రతలో ఉంది అంటారు రా.రా.

సృజన పత్రిక వారు చలంపై ప్రత్యేక సంచిక ప్రకటించినపుడు దాన్ని సమీక్షిస్తూ "మహానుభావుడు చలం" అనే వ్యాసంలో 'సుమారు మూడు దశాబ్ధాల పాటు తెలుగు జాతిని తట్టి, తిట్టి, ఊపి, నిద్రలేపి బాధించి, బోధించి తన రచనల కొత్త కాంతితో కండ్లు చెదరగొట్టి కొత్త జ్ఞానంతో జీవితపు చీకటి కోణాలను వెలిగించి కొత్త జీవితానంద జ్యోతులతో కొడిగట్టిన హృదయాలను ఉద్దీపింపజేసినవాడు చలం, తెలుగు జాతికొక కొత్త జీవిత దృక్పథం ఇచ్చినవాడు, తెలుగు సాహిత్యానికి ఒక కొత్త పరమార్థం కల్పించిన వాడు, తెలుగు పాఠకులకొక కొత్త చైతన్యం కలిగించిన వాడు చలం" అని చలం గారిని చక్కగా సంభావించారు రా.రా. "తెలుగు కవిత్వానికి కొత్త సౌందర్య స్వర్గద్వారాలు తెరిచినవాడు తెలుగు వచన సాహిత్యానికున్న ఇరుకు హద్దులు బద్ధలు కొట్టి, తన కథలతో, నవలలతో, మ్యూజింగ్స్‌తో, లేఖలతో, ప్రేమలేఖలతో దాన్ని ఆకాశమంత విశాలం చేసినవాడు చలం" అని చలం గొప్పతనాన్ని విశదీకరించారు రా.రా. తెలుగు సాహిత్యం మీద చలం ప్రభావం అపారంగా ఉందని సుస్పష్టం చేశారు రా.రా. చలం గురించి ఇంత గొప్పగా చెప్పిన రా.రా. చలం రచనల్లో 'పురూరవ విశిష్టమైనదే అయినా సిద్ధాంత దృష్ట్యా దాని విలువ గొప్పదే అయినా కావచ్చు కానీ, సాహిత్య దృష్ట్యా అది చాలా నికృష్టమైన రచన అని నా అభిప్రాయమంటూ' నచ్చని విషయాల గురించి తీవ్రంగానే స్పందించారు రా.రా.

అద్దేపల్లి రామమోహనరావు 'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' గ్రంథాన్ని పరిశీలించి- శ్రీశ్రీ విశ్వాసాలను, అభిప్రాయాలను వదిలేసి శిల్పం మీద మాత్రమే అద్దేపల్లివారు దృష్టి సారించారని విమర్శిస్తూ, "ఆయన అజ్ఞాన కవచాన్ని ఛేదించగల ఆయుధం నా దగ్గర లేదు" అని తీవ్రస్థాయిలోనే ధ్వజమెత్తారు రా.రా. ఇది వరకే చెప్పినట్లు నచ్చని విషయాల గురించి తన అభిప్రాయం చెప్పేటపుడు ఒక్కోసారి విమర్శను దాటి రచయితను బాధపెట్టారని తెలుస్తుంది.

బాలగంగాధర తిలక్ గారి 'అమృతం కురిసిన రాత్రి' కావ్య సంపుటిని సమీక్షిస్తూ "శ్రీశ్రీ తర్వాత ఇంత భావుకత్వం గల కవి బహుశా మనకు లేడేమో" అన్నారు రా.రా. కె.వి. రమణారెడ్డి గారి 'మహోదయం'(1999 ప్రజాసాహితి, ఫిబ్రవరి సంచిక)ను సమీక్షిస్తూ, అది ఒక 'విజ్ఞాన సర్వస్వం'గా కీర్తించారు. అయితే "రమణారెడ్డిగారి శైలే - ఒక విధంగా ఆయన కృషికి అన్యాయం చేస్తున్నది" అని విమర్శించారు.

రా.రా. కథకులకు ఒక దిశానిర్దేశం చేస్తూ కథానికా - లక్షణాలకు లక్ష్యాలుగా "అలసిన గుండెలు' కథాసంపుటి నిర్మించారు. కథ ఎన్ని మలుపులు తిరిగినా ఎన్ని సంఘటనలను తనలో ఇముడ్చుకున్న లక్ష్యం ముక్కుసూటిగా ఉండాలని ఆయన ఈ సంపుటిలో "కథానికా దాని శిల్పము" అని ఒక విస్తృతమైన వ్యాసం రాశాడు. అంతేగాక కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి రాసిన "కుట్ర" కథానికా సంపుటికి రా.రా. విపులమైన పీఠిక సమకూర్చాడు. (25-3-1982). సాహిత్యం కాలక్షేప సాధనం కావడం రా.రా. అంగీకరించడు.

ఈ విధంగా రా.రా. తన అభ్యుదయ సిద్ధాంతాలతో, ఆలోచనలతో, ఎదుటి వారు ఎంతటి వారైన తనదైన శైలితో విమర్శించడం కన్పిస్తుంది. 'పాపినేని శివశంకర్'

గారు అభిప్రాయపడినట్లు "ఇవాళ ఏ సాహిత్యాన్ని వ్యాఖ్యానించేటందుకైనా మార్క్సిజానికి ఉన్నన్ని సాధనాలు ఇంకే సాహిత్య సిద్ధాంతానికీ లేవని" "ప్రత్యేకించి తెలుగు సాహిత్యానికి మార్క్సిస్ట్ సిద్ధాంతం చేసినంత గొప్ప దోహదం ఇంకే సిద్ధాంతమూ చెయ్యలేదు. ఆ దోహద కారుల్లో మద్దుకూరి చంద్రశేఖరరావు, రాచమల్లు రామచంద్రారెడ్డి, కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ, కె.వి. రమణారెడ్డి,లతో పాటు త్రిపురనేని మధుసూదన రావు మొదలైన మేధావులు ఉన్నారని," "ఈ సిద్ధాంతాల వల్ల మార్క్సిస్టు కవులు, రచయితలు అంతకుముందు తెలుగు సాహిత్యంలో స్పృశించని ఎన్నో కోణాల్ని వెలుగు లోకి తెచ్చారన్నారు."

సాహిత్య ప్రక్రియ ఏదైనా సరే దాన్ని తన విమర్శనా పరిధిలోకి తెచ్చుకొని తనదైన శైలిలో విమర్శించడం ఒక్క రా.రాకే సొంతం. తన అభిప్రాయం వ్యక్తీకరించడానికి తనకొక వేదిక కావాలని తపనపడి 'యుగసాహితి' మిత్రులతో కలిసి 'సంవేదన' అనే త్రైమాసిక పత్రికను ప్రారంభించి ఏడు సంచికల వరకు నెట్టుకు వచ్చారు. "ఉత్తమ సృజనాత్మక రచయితగా, సాహిత్య విమర్శకుడిగా, సంపాదకుడిగా, మేధావిగా, అనువాద కుడిగా బహుముఖ ప్రజ్ఞావంతులుగా" రా.రా అందరికి ఆదర్శనీయులు, చిరస్మరణీయులు. సాహిత్యానికి, సమాజానికి విడదీయరాని సంబంధం ఉంటుంది. అలగే కవి అయినా, రచయిత అయినా సంఘజీవిగా జీవితం సాగిస్తాడు. కనుక అతనిపై సమకాలీన సమాజ ప్రభావం ప్రసరించుట సహజం కనుక రా.రా గారు కూడా సమాజంలో అపుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా మార్క్సిజం వైపు దృష్టి మరల్చడం రాయలసీమ సాహితీ విమర్శలో పెనుమార్పులు తీసుకురావడానికి దోహద పడింది.

**ఆధార గ్రంథాలు :**

1. కంభంపాటి సత్యనారాయణ : గతితార్కిక భౌతికవాదం.
2. సినారె-పుట: అభ్యుదయకవిత్వోద్యమము :ఆధునికాంధ్రకవిత్వము, సంప్రదాయములు: ప్రయోగములు-పుట:555
3. కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి : సాహిత్య వ్యాసాలు : పరిచయం : పుట -7
4. ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి : సాహిత్య విమర్శ శైలి : చర్చ -62
5. పాపినేని శివశంకర్- నిశాంత-సాహిత్య, తాత్విక వ్యాసాలు - 117,118.

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# బాంధవ్యాలు నవలలోని – కుటుంబ సంబంధాలు

– ఏరుకొండ శ్యాం ప్రసాద్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ యూనివర్సిటీ, వరంగల్.

బాంధవ్యాలు నవల 2001లో వెలువడింది. తనకు అక్షరాలు రాకపోయినా తనచేత అక్షరాలు రాయించిన, రాయిస్తున్న అమ్మకు ఈ బాంధవ్యాలు అంకితం అంటూ నవీన్ తన అమ్మకు అంకితం చేశారు. భారత దేశపు పాతిక సంవత్సరాల సాంఘిక, రాజకీయ, ఆర్థిక పరిణామాల, చిత్రణ ఈ నవలలో చిత్రించారు. 1969 తర్వాత కాలాన్ని వస్తువుగా తీసుకొని 'బాంధవ్యాలు' నవల రాశారు నవీన్. నవలాత్రయం నవలలో చివరిది ఈ "బాంధవ్యాలు".

నవీన్ నవలల్లో మానవ అస్తిత్వం. దాని చైతన్యం మానసిక సామాజికాంశాలను స్పృశిస్తూ సాగుతుంటుంది. ఆ చైతన్య సమాజ అంతశ్చైతన్యాన్ని జాగృత పరుస్తూ దిశానిర్దేశం చేస్తుంది. ఈ గుణాలు నవీన్ నవలల్లో పుష్కలంగా ఉండటం వల్లనే కాలపు హద్దులను చెరిపేస్తూ పాఠకులను నిత్య నూతనంగా ఆకర్షిస్తున్నవి. నవీన్ నవలలు ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేకతను సంతరించుకొని అంతిమంగా అంతస్సూత్రంగా, సంస్కార దృక్పథాన్ని కలిగిస్తున్నది. ఈ దృష్టితో చూసినపుడు నవీన్ బాంధవ్యాలకు ఆధ్యాత్మిక దృష్టితో పరిష్కార మార్గాన్ని ఈ "బాంధవ్యాలు" అనే నవలలో చూపాడని తెలుస్తుంది.

తెలంగాణలోని వరంగల్, నల్లగొండ జిల్లాలోని ఓ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన లెక్చరర్ నరేందర్ కుటుంబం చుట్టూ అల్లిన నవల బాంధవ్యాలు. రుక్మిణమ్మ, వెంకటరామయ్యలది వ్యవసాయ కుటుంబం. వీరికి ఆరుగురు సంతానం నరేందర్, సురేందర్, సురేష్. కొడుకులు, సునంద, శకుంతల, ఊర్మిళ కూతుళ్ళు. ఈ కుటుంబంలో సునంద అందరి కన్నా పెద్దది. ఆ తర్వాత నరేందర్. సునంద ఆడపిల్ల కావడం వలన పెళ్ళి చేసి అత్తవారింటికి పంపడం మూలంగా ఈ కుటుంబానికి సంబంధించిన కష్టనిష్ఠూరాలన్నింటికీ నరేందర్ బాధ్యుడు కావలసి వస్తుంది. అందులో నరేందర్ చదువు కొని లెక్చరర్‌గా ఉద్యోగం చేయడం మూలంగా కుటుంబ భారమంతా అతని మీదే పడుతుంది. నరేందర్ భార్య అరుణ ఈ విషయంలో కొంత అసంతృప్తిని వ్యక్తం చేస్తుంది. మీ నాన్నకు మీరొక్కరే సంతానం కాదు కదా అంటూ ఆమె నరేందర్‌ని ప్రతిసారీ ప్రశ్నిస్తుంది.

నరేందర్ తమ్ముళ్ళు సురేందర్ అతని భార్య ప్రమీల, సురేష్ అతని భార్య సంగీత కుటుంబ వ్యవహారాల్లో పాలుపంచుకోకుండా 'తామరాకు మీద నీటి బిందువులాగా' ప్రవర్తించడం అరుణను మానసిక క్షోభకు గురిచేస్తుంది. "కాసిన చెట్టుకే రాళ్ళ దెబ్బలన్నట్లు" ఉమ్మడి కుటుంబంలో ఎన్ని త్యాగాలు చేసినా, ఎవ్వరూ గుర్తించకపోగా, నిష్ఠూరాలు పోవడం మూలంగా కలత చెందిన అరుణ, తన భర్త నరేందర్‌తో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా మనం మారాలి అని వాదించింది.

ఫ్యూడల్ వ్యవస్థకు సంబంధించిన భావజాల ఛాయలు బలంగా ఉండటం వల్ల బాంధవ్యాల ఎండ మావుల వెంట పరుగెత్తాడు. తాను కన్న ప్రతి కలను సాకారం చేసుకోవాలని తాపత్రయపడ్డాడు. ఈ క్రమంలోనే ఇల్లు కట్టుకున్నాడు. తన కొడుకు పవన్‌కు తన చెల్లెలు శకుంతల కూతురు పావనికి పెళ్ళి చేయాలని విఫల యత్నం చేశాడు. నరేందర్ చేసిన ఈ జీవిత ప్రయాణంలో అడుగడుగునా తన కుటుంబీకులు, బంధువులు తన చుట్టూ వున్న సమాజం, తమకున్న సెంటిమెంట్లతో కల్పించిన ఆటంకాలన్ని ఎలా ఎదుర్కోవాలి అని బతుకీడుస్తున్న సమయంలో కాలేజీలో రామనాథం అనే వ్యక్తి పరిచయం అవుతాడు. అతనికి నరేందర్‌కి ఉన్న బాధలుంటాయి. కానీ వాటికి బెదిరిపోకుండా ఓర్పుగా

నేర్పుగా సమాజంలో ప్రయాణం సాగిస్తుంటారు. ఈ రామనాథం నరేందర్‌కి సమస్యలను ఎదుర్కోవడంలో సహకరిస్తూ ఎలా సాధించుకోవాలో చెబుతాడు. తన బంధువులు సమస్యలను సృష్టించగలరే గానీ పరిష్కారాలను బాధ్యత వహించరు.

నరేందర్‌కు ఉన్న సమస్యలు ఒక్కొటి పరిష్కారమవుతున్నా తృప్తి లభించదు. కానీ రామనాథానికి ఉన్న సమస్యలు పరిష్కారం కాకున్నా ప్రశాంతంగా జీవితాన్ని కొనసాగిస్తాడు. ఇలాంటి సమయంలో స్కూటర్ ప్రమాదంలో రామనాథం చనిపోతాడు. అప్పుడు నరేందర్ తన ఆత్మబంధువు ఎడబాటును సహించలేక ఏడ్చిన ఏడ్పు కంటతడి పెట్టిస్తుంది.

రక్తసంబంధీకులు, బంధువులు తన వారు కాదని తనకు రామనాథమే నిజమైన ఆత్మబంధువన్న దేహ బంధువన్ని జ్ఞానం ఈ నవల ద్వారా పాఠకులకు తెలియచెప్పారు నవీన్. అలాగే నరేందర్ తన తల్లి చనిపోయినపుడు పడేబాధ నుండి గ్రహించిన సత్యాన్ని కూడా బాంధవ్యాలు నవలలో రచయిత వాస్తవికంగా చిత్రించారు. అమ్మ తనలో బ్రతుకుతుందని తెలుసు తను కూడా పోయాక తన కూతురులోనో, కొడుకులోనో బ్రతుకుతాడని తెలుసు ప్రపంచంలో ప్రతి జీవికి తనకు సంతానం కావాలని, అర్లులు చాచటం కూడా యిందుకేనేమో అనిపిస్తుంది అతనికి.

నరేందర్ ఇల్లు కట్టుకోవడం కోసం వాళ్ళ బావగారి వద్ద సాయం కోరడం జరుగుతుంది. నరేందర్ కొడుకు పవన్‌కు, చెల్లెలి కూతురు పావనిని ఇచ్చి పెళ్ళి చేయడం గురించి వారి చిన్నతనంలోనే అనుకొని ఒప్పందం కుదుర్చుకోవడం జరుగుతుంది. కానీ కాలం మారుతున్న కొద్ది పావని పవన్‌ల మధ్య దూరం పెరిగి వారి పెళ్ళి చేయలేని స్థితి నరేందర్‌కి ఎదురవుతుంది. పావని రాసిన ఉత్తరం నరేందర్‌లో ఆత్మవిమర్శకు అవకాశాన్ని కలిగించింది. అరుణ తన కుటుంబాన్ని గురించి పడిన ఆరాటం, పవన్ తన జీవితాన్ని గురించి తీసుకున్న నిర్ణయం, పావని తన జీవిత భాగస్వామిని ఎన్నుకోవడం వెనుక సామాజిక పరిణామం అన్ని అర్థం అవుతాయి.

మన సమాజంలో వదిన ఆడబిడ్డల సంబంధాలిలా తప్ప మరోలా ఉండకూడదని ఇది వరకెప్పుడో మన తాత ముత్తాతల కాలంనాడే నిర్ణయమైపోయింది. మీ అమ్మ గాని, మీ అత్తయ్య గానీ, ఆ తరతరాల సాంప్రదాయంలోకీ బానిసలు. ఆ సాంప్రదాయపు సంకెళ్ళలోంచి విడివడి వాళ్ళు స్వతంత్రంగా ఆలోచించి వాళ్ళ సంబంధాల్ని రూపొందించుకోలేరు. ఈ ఫ్యూడల్ వ్యవస్థ అవశేషాలు పూర్తిగా తొలిగిపోయి నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడితే తప్ప మన కుటుంబాల్లోని సంబంధాలు బాంధవ్యాలు ఆరోగ్యకరంగా మారవు. నరేందర్ ఈ జీవిత సత్యాన్ని తెలుసుకోవడానికి చాలా త్యాగాలు చేశాడు. తన కలలను సాకారం చేసుకోవడానికి చాలా మందికి ఇబ్బందులు కలిగించాడు. కానీ తన జీవితం నేర్పిన పాఠాల నుండి పావని రాసిన ఉత్తరాన్ని అర్థం చేసుకున్నాడు.

బాంధవ్యాలు నవలలో సమాజపు నడక ఉంది. వ్యక్తి అస్థిత్వ వికాసం ఉంది. ఈ నవలను చదువుతుంటే మనల్ని మనం చదువుతున్న అనుభూతి కలుగుతుంది. ఈ నవలలో ప్రజాస్వామిక దృక్పథం కుటుంబం, సామాజిక సంబంధాల్లో ఎలా ఉండాలన్న లౌకిక దృక్పథ సంవేదనలున్నాయి.

బాంధవ్యాలు నవలలో మూడు తాత్త్విక దృక్పథాలున్నాయి. ఒకటి అన్నింటికి భగవంతుడే మూలం, మనం పూర్వజన్మలో ఆచరించిన కర్మలే మన ఈ జన్మను నిర్ణయిస్తుంది. రెండవది జీవితంలో అన్నీ యాదృచ్ఛికంగానే జరుగుతాయి. మూడవది వ్యక్తుల మనస్తత్వాలే వాళ్ళ జీవితాన్ని నిర్ణయిస్తుంది. మెజార్టీ ప్రజలు మొదటి దృక్పథాన్నే ఆశ్రయిస్తారు. రామనాథం రెండో దృక్పథానికి ప్రతినిధి, నరేందర్ మూడో దానికి ప్రతినిధి.

కర్మలకు, జన్మలకు, యాదృచ్ఛికాలకు భగవంతుడే కారణమని మెజారిటీ ప్రజలు విశ్వసిస్తారు. అన్నింటికి కారణం భగవంతుడే అని అనుకుంటే వ్యక్తికి సాక్షీభావం

వస్తుంది. తనలో భగవంతున్ని లేక ఆత్మను గుర్తించి విశ్వసిస్తే ప్రపంచం బాధించకుండా ఉంటుంది. కాబట్టి ఈ తత్వంలో కూడా ప్రజాస్వామ్య దృక్పథం ఉందని నరేందర్ భావన.

అత్తాకోడళ్ళు, వదినా మరదళ్ళు, మేనరికాలు ఇలా అన్నింటా సాధారణంగా కనిపించే ఆధిక్యతా భావాన్ని స్త్రీలలో నుండి తొలగించలేక మగాళ్ళు పడే సంఘర్షణను ఈ నవలలో చూడవచ్చు. విశాల మనస్తత్వం ప్రజాస్వామ్య దృక్పథం అలవర్చుకుంటే తప్ప ఈ పరిస్థితిని మార్చలేం అని రచయిత తెలియజేస్తారు. నరేందర్ జీవితం ఎక్కడ ప్రారంభమైందో తిరిగి అక్కడికే చేరడం, ఆనంద విషాదాలకు అతీతంగా ఉండగలిగినపుడే మానవుడు తనతో తాను బయటి ప్రపంచంతోనూ సంపూర్ణమైన సామరస్యాన్ని సాధించగలుగుతారు అని గుర్తించడం చేస్తే ఆ పాత్ర ఓ వృత్తాన్ని పూర్తి చేసుకుందనిపిస్తుంది.

నవీన్ బాంధవ్యాల చుట్టూ ముసిరిన చీకట్లను తన తాత్విక దృక్పథంతో తొలగించాడు. ఇలా ప్రజాస్వామ్య దృష్టికి తాత్విక పరివేశాన్ని ఈ నవలలో కల్పించాడు. అందుకే ఈ దృష్టిలో నవీన్ అపూర్వ దృష్ట "బాంధవ్యాలు" అనే నవల.

**ఆధార గ్రంథాలు :**

1) బాంధవ్యాలు - అంపశయ్య నవీన్
2) నిత్య నవీనుడు - ఘంటా రామారెడ్డి, ఎం. సత్యనారాయణ రెడ్డి (సంపా)
3) అపంశయ్య నవీన్ సాహితీ ప్రస్థానం-ఘంటా రామారెడ్డి, ఎం. సత్యనారాయణ రెడ్డి (సంపా)
4) డా॥ అంపశయ్య నవీన్ జీవితం - సాహిత్యం - డా॥ వి. వీరాచారి (సంపా)

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# చంద్రికా పరిణయం – శబ్దాలంకారాలు

– జి.వి. సుజాత, జూ॥ లెక్చరర్, తెలుగు, ప్రభుత్వ జూ॥ కళాశాల, నందికొట్కూరు, కర్నూలు జిల్లా.

శబ్దాన్ని ఆశ్రయించుకొని, విన్నవెంటనే చెవులకు ఇంపుగా ఉండి పాఠకులను, శ్రోతలను ఆకట్టుకునేవి 'శబ్దాలంకారాలు' శబ్ద ప్రధానమైనవి శబ్దాలంకారాలు. వాక్యంలో ఒకే శబ్దం అక్కడక్కడ ఆవృత్తి కావడం వల్ల చెవికి వినసొంపుగా ఉంటుంది. దానికి తోడు లయ, తూగు ఉందంటే దాని ఆకర్షణ చెప్పనక్కరలేదు.

**1. వృత్త్యనుప్రాసం :**

'ఏక ద్వి ప్రభృతీనాం తు వ్యంజనానాం భవేత్
పునరుక్తి రసానామ వృత్త్యను ప్రాస ఇస్యతే'
(ప్రతాపరుద్రీయం)

ఒక పద్యంలో గానీ, వాక్యంలో గానీ, పాదంలో గానీ ఒకే హల్లు పలుమార్లు ఆవృత్తి చెందడం 'వృత్త్యను ప్రాసాలంకార' మవుతుంది.

అ) మన్మథుని, చంద్రుని మించిన సౌందర్యంతో మదన గోపాలమూర్తి ఉన్నాడు. ఈ భావాన్ని తెలియజేయడానికి కవి వృత్త్యనుప్రాసాలంకారాన్ని వాడుకున్నాడు.

**సీ॥** పరువంపు ననగుంపు బలితంపు జిగి పెంపు,
గని యొప్పు పాణి యుగ్మముల తోడ
జెలువందు నరవిందముల యందములు చింద
ననువొంద౯ గలకన్ను, గోనలతోడ
జగడంబు గనునంబు ముగయంబు జగడంబు,
మేలంబు లాడునె మ్మేని తోడ
దులకించు బలుమించు దలకించు నెఱమించు
గమి మించు హేమాంశుకంబుతోడ

**తే॥** మారు౯బలుమాఱు౯ గేరుమై తీరుతోడ
సోము నలయించు నెమ్మోము గోముతోడ
బరంగు మాపాలిమదన గోపాలమూర్తి
యంచిత స్ఫూర్తి సాక్షాత్కరించి పలికె. (1-13)

లేత చిగురు సమూహాల హెచ్చైన అతిశయాన్ని పొందిన కరద్వయాలతో విష్ణుమూర్తి ఒప్పుతున్నాడని చెప్పడానికి కవి బిందుపూర్వ 'ప' కారాన్ని (ంపు) పద్యంలో పలుమార్లు ఆవృత్తి చేశాడు. విష్ణుమూర్తి చతుర్భుజుడు కాబట్టి యుగ్మములని కవి బహువచన ప్రయోగం చేయడం జరిగింది. సుందరమైన తామరల సౌందర్యం ఉట్టిపడేటువంటి నేత్రాలను విష్ణుమూర్తి కలిగి ఉన్నాడు అని చెప్పడానికి కవి బిందుపూర్వక 'ద' కారాన్ని (ంద) పలుమార్లు ఆవృత్తి చేసి అందంగా చెప్పాడు. శబ్దాలంకారం కేవలం చెవులకింపుగానే కాకుండా, మధురభావం హృదయానికి హత్తుకునేటట్లు చెప్పడంతో కవి సఫలీకృతుడయ్యాడు. మేఘం గర్వాన్ని పరిహసించేటువంటి చక్కని శరీరంతోను అధికమైన మెఱుపు కాంతుల సమూహంతోను అతిశయిస్తున్న బంగారు వస్త్రంతోనూ, మన్మథుని మాటిమాటికీ పరిహసించే చక్కదనంతోనూ, చంద్రుణ్ణే తిరస్కరించే సుందరమైన, సుకుమారమైన ముఖంతోనూ మదన గోపాలుడు ప్రత్యక్షమైనాడని కవి తెలియజేయడానికి బిందుపూర్వ బ కారాన్ని (ంబు), బిందుపూర్వక చ కారాన్ని (ంచు) పలుమార్లు ఆవృత్తి చేయడం జరిగింది.

**2. ఛేకానుప్రాసాలంకారం :**

రెండుగాని, అంతకంటే ఎక్కువగానీ ఉన్న హల్లుల జంటలు అర్థభేదంతో వ్యవధానం లేకుండా ఆవృత్తి చెందితే అది **'ఛేకానుప్రాసాలంకార'** మవుతుంది.

ఆ) కం॥ కో**పాయిత** పా**పాయత**
భూ**పాయిత** దనుజమథన పూజిత మతికిన్
**గోపాలన గోపాలన,**
**గోపాలన** నిబిడరతికి గోహిత కృతికిన్. (1-78)

ఇక్కడ 'పాయత - పాయిత, గోపాలన' అనే పదాలు వెంట వెంటనే హల్లుల జంటలు అర్థభేదంతో వ్యవధానం

లేకుండా ఆవృత్తి చెందాయి. కాబట్టి ఇది **'ఛేకానుప్రాసాలంకారం'** అయింది.

సురభి మాధవరాయలు కవి ఈ 'చంద్రికా పరిణయం' కావ్యాన్ని మదనగోపాల స్వామికి అంకితం చేస్తూ రచించిన షష్ఠ్యంతాలలో భాగంగా ఈ పద్యం రచించాడు. కోపం చేత పాపాలు పాలయిన అధికులయిన రాజుల వలె ఆచరిస్తున్న రాక్షసుల నాశనం చేత పూజనీయుడైన వానికి, రాజులకు (గొల్లలకు) అలంకారమైన భూపాలనంలో మిక్కిలి ఆసక్తిగలవానికి స్వర్గానికి అనుకూలమైన వ్యాపారంగలవానికి మదనగోపాలస్వామికి అంకితం ఇక్కడ 'పాపాయత' అంటే 'పాప = పాపముల చేత; ఆయుతం = అధికులయిన' అని అర్థం. 'భూపాయిత' అంటే 'రాజులవలె ఆచరిస్తున్న' అని అర్థం. ఈ విధంగా ఈ రెండు పదాలు వ్యవధానం లేకుండా ఉన్నాయి. అర్థభేదంతో ఉన్నాయి కాబట్టి ఇది **'ఛేకానుప్రాసాలంకారం'** అయింది.

**ఆ) సీ॥** ఏమాన్యునతి భీమ ప్ర**తాపంబు**
**తాపంబు** శాత్రవ తతికి గూర్చు
నే వీరు ఘనసార హితకీర్తి **కాండంబు**
**కాండంబు** నెల్లెడ నలమి పోల్చు
నే రమ్యు నతి భూరి భూరి ని**కాయంబు**
**కాయంబు** నర్థుల కబ్బజేయు
నే రాజు నుత్సాహ ధీరాంత **రంగంబు**
**రంగంబు** నీతి నర్తకికి నెన్న (1-25)

ఇక్కడ 'తాపంబు, కాండంబు, కాయంబు, రంగంబు' అనే పదాల జంటలు వెంట వెంటనే అర్థభేదంతో వ్యవధానం లేకుండా వచ్చాయి కాబట్టి ఇది చ్ఛకని **'ఛేకానుప్రాసాలంకారం'** అయింది.

ప్రతాపంబు = తేజస్సు, పరాక్రమం ; తాపంబు = సంతాపం, బాధ, దుఃఖం అని అర్థభేదంతో ఈ పదాలు వెంటవెంటనే ఉన్నాయి. అదే విధంగా 'కీర్తికాండంబు' అంటే కీర్తి సమూహం; 'కాండంబును' అంటే బ్రహ్మాండంబును అని రెండర్థాలు. నికాయంబు = సమూహం; కాయంబు - క= చిత్తములకు అయంబు = శుభావహ విధిని సంతోషము. అతరంగంబు = చిత్తం; రంగంబు = నాట్యస్థలం. ఈ విధంగా 'తాపంబు, కాండంబు, కాయంబు రంగంబు' అనే జంట పదాలు వెంట వెంటనే అర్థభేదంతో వ్యవధానం లేకుండా ఆవృత్తి చెందినాయి కాబట్టి ఇది **'ఛేకానుప్రాసాలంకారం'** అయింది.

(ఇ) తే॥ తటియు **గోత్రమ్ములకును గోత్రమ్ము** లరుల
కరుల **కాయమ్ములకును కాయములు** భద్ర
**ఘటకములకు** సదాభద్ర **ఘటకముల** బ
ళిరె వధూకులమణి పయోధరము లెన్న (3-15)

ఇక్కడ 'గోత్రమ్ములు, కాయమ్ములు, ఘటకములు' అనే పదాల జంటలు అర్థభేదంతో వ్యవధానం లేకుండా ఆవృత్తి అయ్యాయి కాబట్టి ఇది **'ఛేకానుప్రాసాలంకారానికి'** ఉదాహరణ మయింది.

తటియు గోత్రమ్ములకున్ = నమీపిన్తున్న పర్వతాలకు; గోత్రమ్ములు = పూజనీయములు. కాయమ్ములకున్ = వీణాకాయములకు; కాయములు - కటుద్రవ్యములచే చేసిన ఔషధాలు భద్రఘటకములకున్ = భృంగారువులకు; సదాభద్ర ఘటకములు= ఎల్లప్పుడూ శ్రేయస్సును చేకూర్చేవి. ఈ విధంగా వేర్వేరు అర్థాలతో వెంట వెంటనే ఈ జంట పదాలు ఉన్నాయి కాబట్టి ఇది **'ఛేకానుప్రాసాలంకారం'** అయింది.

**ఈ) సీ॥** బెళుకు చూపులవానిఁ **బలుమాఱు బలుమారు**
సొంపు నిందించు మేల్సొబగు వాని
నొఱపు మించినవాని **నెఱమించు నెఱమించు**
మెలపు గందించు నెమ్మేని వాని
సొగసు మీఱినవాని **పగడంబు పగడంబు**
తలపు కుదించు మేల్ తళుకు వాని
కళుకు హెచ్చిన వాని **కపురంపు కపురంపు**
వలపు చిందించు నవ్వొలయువాని
(3-79)

ఇక్కడ 'బలుమాఱు, నెఱమించు, పగడంబు, కపురంపు' అనే పదాల జంటలు వ్యవధానం లేకుండా అర్థభేదంతో ఆవృత్తి చెందాయి కాబట్టి ఇది చక్కని **'ఛేకానుప్రాసాలంకారం'** అయింది.

బెళుకు చూపులవానిఁ బలువమాఱు (వానిన్+పలువమాఱు) - పలుమాఱు = సారెకు, చాలాసార్లు; బలు = అధికమైన, మారు = మన్మథుని యొక్క సొంపు = సౌందర్యం. నెఱమించు నెఱమించు మెలపున్ - నెఱమించు = అధికంగా ప్రకాశిస్తున్న; నెఱమించు = నిండు మెఱుపుయొక్క, మెలపున్ = జాగరూకతను. పగడంబు పగడంబు తలపున్ - పగడంబు = ప్రవాళం యొక్క; పగ = విరోధం, డంబు - అతిశయం యొక్క, తలపున్ = చింతను. కపురంపు కపురంపు వలపున్ - క = సుఖమునకు; పురంపు = స్థానమైన కపురంపు వలపున్ = కర్పూర సంబంధి పరిమళమును. ఈ విధంగా పై పదాల జంటలు వ్యవధానం లేకుండా అర్థభేదంతో ఆవృత్తి చెందాయి కాబట్టి ఇది **'ఛేకానుప్రాసాలంకారం'** అయింది.

**3. యమకాలంకారం :**

ఒకే రకమైన హల్లుల జంటలు వ్యవధానంతో ఆవృత్తి చెంది, అర్థభేదం ఉన్నట్లయితే అది **'యమకాలంకారం'** అవుతుంది.

అ) కం॥ ఆ కాంతయందు పెద్ద
క్ష్మా కాంతుడు గాంచె మల్ల శౌరిని విలస
న్నా **కాంతరమా కాంతర**
**సా కాంతర సాకాంతరమా** విశేషు సజ్జన
పోషున్. (1-28)

ఆ కాంతయందు పెద్ద వసుమతీశుడు (పెద్దక్ష్మా కాంతుడు) విలసత్ అంటే ఒప్పుతున్న 'నాక' అంటే పాపరహితమైన; అంతర = హృదయంలోని; మా కాంతరస = విష్ణుభక్తి చేతను; ఆ కాంత = ఒప్పునట్టి రమా = సంపదయొక్క లేదా విష్ణుభక్తి యొక్క మనోజ్ఞ సంపద యొక్క; ఇక్కడ 'రస' శబ్దం రాగమందు ప్రయోగింపబడింది. ఆ రాగం భక్తిరూపమవుతుందని భావం. విద్వత్‌పోషకుడైన మల్లరాయని చూశాడు.

ఇక్కడ 'నా కాంతరమాకాంత రసాకాంత రసాకాంత రమా' అనే చోట హల్లుల జంటలు వ్యవధానంతో ఆవృత్తి చెంది అర్థభేదంతో ఉన్నాయి కాబట్టి ఇది **'యమకాలంకారం'** అయింది.

(ఆ) సీ॥ అహిరోమలతిక పొందందిన గాని నొం
**పగ రాదు** మలయాగ**మారుతముల**
కనకాంగి కౌగిలి యెనసిన గాని పెం
**పగరాదు** మధుపభా**మారుతముల**
ఘన వేణి కూడి మించిన గాని రూపుదూ
**ల్పగరాదు** శశభృన్న **వప్రకరముల**
వనజారి వదన జేరిన గాని సిరు లడం
**పగరాదు** వనసంభ **వప్రకరముల**
**తే॥ ననుచు** రాజీవనేత్ర మోహంబు చాల
**ననుచు** రాజీవసాయకానల్ప భయము
**మలయగా హిత** చింతమై కలగ చిత్త
**మలయగా హిత** నిభుడు తాపాప్తి నడల.
(4-5)

ఇక్కడ "ఒంపగరాదు - పెంపగరాదు; మారుతముల -భామారుతముల; దూల్పగరాదు - అడంపగరాదు; నవ ప్రకరముల - (వనసం) భవ ప్రకరముల" అనే జంట పదాలు వ్యవధానంతో ఆవృత్తి చెంది, అర్థభేదముతో ఉన్నాయి కాబట్టి ఇది **"యమకాలంకారం"** అయింది.

అహిరోమ తిలక పొందు - అంటే సర్పతుల్యమైన రోమలతికగల చంద్రిక సాంగత్యాన్ని పొందిననే గాని; మలయాగ మారుతములన్= మలయపర్వత సంబంధులైన గాలులను ఒప్పించడానికి అలవి కాదు. అంటే చంద్రిక సర్పతుల్యమైన రోమావళి కలది కాబట్టి తత్సాంగత్యంతో వాయువు గెలువవచ్చునన్నది ఉద్దేశం. 'కనకాంగి కౌగిలి' అంటే సంపెంగను పోలిన అంగాలు గల దాని ఆలింగనాన్ని పొందిన గాని; 'మధుపభా మారుతములన్' అంటే ఆడు తుమ్మెదల రొదలను

నశింపజేయ నలవి కాదు. చంద్రిక చంపకాంగి కాబట్టి ఆమె కౌగిట్లో చేరినట్లయితే తేనెటీగలను అడపవచ్చు. 'ఘనవేణి' అంటే మేఘాన్ని పోలిన జడగల దానిని పొంది అతిశయించిననే గాని; 'శ శభృన్నవ ప్రకరములన్' అంటే చంద్రుని నూత్న ప్రకృష్ట కిరణాలను రూపమాపనలవి కాదు చంద్రిక మేఘాలవంటి (జలదం) వేణి (జడ) కలది కాబట్టి దాని సాంగత్యం చేత చంద్రకిరణాలను కప్పవచ్చు. 'వనజారి వదనన్' అంటే చంద్రుని మోముగల దానిని పొందిననే గాని; 'వనసంభవ ప్రకరములన్' అంటే కను బొమల సమూహాలయందు కాంతులను అణచడానికి అలవి కాదు. చంద్రిక చంద్రుని వంటి మోము కలది కాబట్టి ఆమెను చేరినట్లయితే కమలాల సిరులను అణచవచ్చు. చంద్రుడు వస్తే వెన్నెలకు అంతవరకు విరాజిల్లే కమలపుష్పాలు ముడుచుకు పోవడం సహజం కదా! దాన్నే కవి ఇలా చెప్పాడు. ఈ విధంగా ప్రకృతిలోని సహజ రీతులను తీసుకొని చంద్రికకు అన్వయించి చెప్పడం ఇక్కడి విశేషం. ఈ విధంగా అర్థభేదంతో యమకాలంకారాన్ని కవి చక్కగా రూపొందించాడు.

**4. ముక్తపదగ్రస్తాలంకారం :**

ఒక పాదం చివర వదలిన పదాన్ని మళ్ళీ రెండవ పాదం మొదటి పదంగానూ, అలాగే రెండవ పాదం చివర విడిచిన పదాన్ని మూడవపాదం మొదటి పదంగానూ ఇలా ప్రతి పాదంలోనూ వదలిన పదం తరువాతి పాదంలో స్వీకరించినట్లయితే **'ముక్తపదగ్రస్తాలంకారం'.** అలాగే ఒక వాక్యం చివర విడిచిన పదాన్ని తరువాతి వాక్యంలో ఆ పదాన్ని తిరిగి గ్రహిస్తే కూడా అది **'ముక్తపదగ్రస్త'** మవుతుంది.

అ) మ॥ తనుభా నిర్జిత **మార మార**రిపుకాంతా చిత్త
సం**సార సా**
**ర** నిరస్తాఘక**వార వార**ణభిదా రాజద్భులో **దార**
**దా**
**ర** నివేశాయిత **సూర సూర** సితభా రమ్యాక్షి
వి**స్తార తా**
**ర** నిభఖ్యాతి వి**సార సార** సభవ ప్రస్తుత్య
నిత్యోదయా. (1-169)

ఇక్కడ 'మార, సార, వార, దార, సూర, తార, సార పదాలు వాక్యం చివర విడిచి మళ్ళీ ఆ పదాలు స్వీకరించ బడ్డాయి కాబట్టి ఇది **'ముక్తపదగ్రస్తాలంకారం'** అయింది.

ఆ) **కం॥** శరణాగత శుభ**కరణా**
**కరణా** తీతాత్మ వివిధ కార్యా**చరణా**
**చరణా** నతాసు **హరణా**
**హరణా**యిత సత్యమంత కాభరణా. (1-170)

ఇక్కడ మొదటి పాదం 'కరణా' పదంతో అంత మయింది. ఆ 'కరణా' పదం మళ్ళీ రెండవ పాదంలో ప్రారంభమయింది. అలాగే రెండవ పాదం చివర 'చరణా' పదం ఉంది. ఆ విడిచిన పదాన్ని తిరిగి మూడవ పాదం ప్రారంభంలో 'చరణా' పదం స్వీకరించబడింది. 3వ పాదం చివర 'హరణా' ఉంది. దాన్ని తిరిగి 4వ పాదం ప్రారంభంలో 'హరణా' స్వీకరించబడింది.

(ఇ)
పృథ్వి : ధరాధరమచ్చరికా**ధర ధరా**రి ముఖ్యోదయ
ద్ధరాపహ మహత్తరా**దర దర**స్వనోత్సేకితా
శరప్రకర నిష్పత**చ్ఛర శర** ప్రభూతాలయా
వరాంక కలన ప్రభా**వర వర**ప్రదానుగ్రహా.
(1-171)

ఇక్కడ మొదటి పాదంలో 'ధర; రెండవ పాదంలో 'దర'; మూడవ పాదంలో 'శర' (నిష్పతత్+శర = నిష్పతచ్ఛర); 4వ పాదంలో 'వర' పదాలు విడిచి మళ్ళీ తర్వాతి వాక్యం ప్రారంభంలో స్వీకరించబడ్డాయి. ఇలా విడిచిన పదం, మళ్ళీ స్వీకరించబడింది కాబట్టి దీనికి **'ముక్తపదగ్రస్తాలంకార'** మనే పేరు సార్థకమయింది.

# తెలుగు సాహిత్యంలో బహుజన కథలు – వైవిధ్యం

- జన్ను అశోక్

సాహిత్యానికి సమాజానికీ మధ్య ఎపుడూ విడదీయ రాని సంబంధం ఉంటుంది. సమాజం లేకుండా సాహిత్యం లేదు. ఏ కాల నిర్ణయం చేయాలన్నా ఆ కాలానికి చెందిన, ఆ కాలంలో వచ్చిన సాహిత్యమే ఉప యోగపడుతుంది. అందుకే 'సమాజ దర్పణం సాహిత్యం' అన్నాడు మాక్సిం గోర్కి, సాహిత్యంలో సామాజిక నిబద్ధత కలిగిన రచనలే నిలుస్తాయి. ఆయా కాలాల్లోని సామాజిక కొలమానాలు సాహిత్యంలో కనిపించాలి. వెలువడే సాహిత్యంలో కొన్ని నియమాలుంటాయి. ఆ నియమ నిబద్ధతలకు అనుగుణంగానే సాహితీ ప్రక్రియను గుర్తిస్తాం. ఈ సాహిత్య ప్రక్రియల్లో కథానిక పాత్ర గణనీయ మైంది. కథానిక ఆధునిక ప్రక్రియే అయినా ప్రపంచ మంతా ప్రజాస్వామ్యం వైపు పయనిస్తున్న కాలంలో పుట్టిన ప్రక్రియ. అందువల్ల కథపై సామాజిక బాధ్యత ఎక్కువ. మన తెలుగు కథలను, కథకులను పరిశీలిస్తే ఈ బాధ్యతను గుర్తెరిగే కథా రచయితలు కథా సృజన చేశారనిపిస్తుంది.

ఈ ఆధునిక ప్రక్రియగా కథ వాస్తవాలను ప్రతి బింబిస్తూ ముందుకు నడుస్తుంది. 'నాది ప్రజా ఉద్యమం. దాన్ని ఎవరి కోసమూ వదులుకోను' అని ఆ రోజుల్లో (1910) ధైర్యంగా చెప్పి, తన మార్గమేమిటో తన ఐదు కథల ద్వారా సామాజిక పునాదిని వేసినవాడు గురజాడ. ప్రజా సమస్యలను, జీవితాలను వస్తువులుగా తీసుకుని కథలు రాస్తున్న వారే రచయితలుగా గుర్తింపు పొందు తారు.

గ్రామాల్లోని ఉద్యమాలతో పాటు సంఘర్షణలను, వైరుధ్యాలను, మారుతున్న విలువలను, నశిస్తున్న వృత్తులను, మనుషుల్లో జరుగుతున్న కొట్లాటలను, అనివార్యమవుతున్న వలసలను, మానవ సంబంధాల్లో వస్తున్న మార్పులను, కూలిపోతున్న వ్యవస్థల స్వరూప స్వభావాలను, రూపాయి ప్రవేశంతో జరుగుతున్న మార్పులను అన్నింటినీ తమ కథల్లో నిక్షిప్తం చేస్తున్నారు బహుజన రచయితలు.

స్త్రీవాద చైతన్యం, దళితవాద చైతన్యం విస్తరిస్తున్న క్రమంలో బీసీలు, బహుజనులు కూడా తమ అనుభవా లను, తమ జీవితాల్లోని చీకట్లను రాయడం మొదలు పెట్టారు. ఆధునిక తెలుగు కథలో బహుజన జీవితాన్ని మొదట ప్రవేశపెట్టినవాడు చింతా దీక్షితులు, ఇతని 'దాసరి పాట' అనే కథ బుర్ర కథల్ని గానం చేసి పొట్ట పోసుకునే దాసర్ల గురించి వివరిస్తుంది. తెలంగాణ నుండి 1930లో సురవరం ప్రతాపరెడ్డి రాసిన 'గ్యారా కదూ బారా కొత్వాల్ కథలో తను పండించిన సారకాయల్ని లంచానికి పోగొట్టుకున్న రైతు బహుజనుడే. 1940లో కె. సభా రాయలసీమ నుండి కల్లుగీత వృత్తిదారులపై 'కల్లుముంత' కథను రాశారు. 1941లో జి.రామకృష్ణ 'చిరంజీవులు' కథను రాశారు. ఈ కథలో బహుజనుడైన వెంకట్రాముడు రెడ్డి దగ్గర వెట్టిచాకిరి చేస్తూ చివరికి రెడ్డి దౌర్జన్యానికి బలైపోతాడు.

1943లో కాళోజీ నారాయణరావు 'మనమే నయం' కథ రాశారు. 1945లో తెలంగాణ నుండి జి.రాములు 'ఆత్మఘోష' కథను రాశారు. చేనేత వృత్తిని చేసే పద్మశాలీల గురించి రాసిన కథ. 1949లో పి.వి.నర్సింహా రావు 'గొల్లరామవ్వ' కథను రాశారు. నిజాం పరిపాలనా కాలంలో తనను వెంటాడుతున్న రజాకార్ల కన్నుగప్పి తన ఇంట్లో చేరిన 'సంఘం' యువకుని కాపాడడానికి గొల్ల రామవ్వ ఆ యువకుడిని తన మనవరాలి పక్కన పడుకోబెట్టి రజాకార్లు వచ్చినపుడు వారిని చూపించి వారికి కొత్తగా పెళ్లి అయిందని చెప్పి ఆ యువకుని ప్రాణాలకు

తెగించి కాపాడుతుంది. ఇది అచ్చమైన బహుజన కథ. 1956లో జి.సురమౌళి 'ముక్కోటి బలగమోయి' కథ వచ్చింది. వట్టికోట ఆళ్వారుస్వామి కథల్లో పూర్తిగా తెలంగాణ బహుజన, జీవితమే చిత్రితమైంది. 'పరిగె' కథలో మల్లయ్య గ్రామాధికారులకు, దొరలకు వచ్చే ప్రభుత్వ ఉద్యోగులకు వెట్టిచాకిరి చేసి చివరికి తన పొట్ట పోసుకోవడానికి కూడా సమయంలేని సన్నజీవి. ఒకనాడు ఇంటి వద్ద తండ్రీ, చెల్లెలు ఆకలితో బాధపడుతుండగా తిండి గింజలు సంపాదించుకొస్తానని చెప్పి ఒక చేనులో పరిగె కర్రలను పోగు చేసుకొని ఇంటికి బయలుదేరాడు. ఇంతలో చేను రైతు వచ్చి కల్లంలో ధాన్యం కట్టలను దొంగతనం చేశాడని పోలీసులకు అప్పగిస్తాడు. జైలు కెళ్లాడు. దాశరథి రంగాచార్య 'తామరపూలు', తెలంగాణ తొలితరం కథకులు గూడూరి సీతారాం రాసిన 'రాజమ్మ రాజీర్కం', 'లచ్చి' 'నారిగాని బతుకు', 'రంగడు' తదితర కథలనిండా బహుజన జీవితమే పరుచుకొని ఉంది. 'నారిగాని బతుకు' కథలో గౌండ్ల నారిగాని బతుకు శిథిలత్వం కనిపిస్తుంది. కల్లు గీసే ఇండ్లల్లో సాధారణంగా పురుషులు తాటి చెట్టు ఎక్కి కల్లు గీసుకొని వస్తే స్త్రీలు కల్లు విక్రయిస్తారు. అయితే తాగిన మత్తులో కస్టమర్లు కల్లు వంచిన స్త్రీలను లైంగికంగా వేధించడం కనిపిస్తుంది. ఇదే అనుభవం నారిగానికి ఎదురయింది. దాంతో నారిగాడు గౌండ్ల ఇండ్లలో స్త్రీలు కల్లు అమ్మనే వద్దని నిర్ణయించుకొని కొడుకుకు కూడా ఇదే సూత్రం చెబుతాడు. కానీ కొడుకు వినడు. కోడలి చేత కల్లు అమ్మిస్తాడు. కల్లు అమ్మకపోతే దినం గడవది, దరిద్రం దాపురిస్తుందని నారిగాని కొడుకు అనుభవం.

శ్రీపతి 'వరమీయని వేలుపు' రా.వి.శాస్త్రి 'ఆరుసారా కథలు', అట్టాడ అప్పల్నాయుడు 'షా', గంటేడ గౌరునాయుడు 'గంజి మెతుకులు', 'ఏటి పాట', కథల్లో బహుజన జీవితమే కనిపిస్తుంది. ఆంగ్ల శిల్ప మర్యాదను తెలుగుకథలకు అనువర్తింపజేసే ఆడెపు లక్ష్మీపతి రాసిన 'త్రిభుజపు నాలుగో కోణం' కులవృత్తిని కోల్పోయిన పద్మశాలీలు వ్యాపార రంగంలోకి మారినా అందులో కూడా నష్టాలు వచ్చి జీవితాలు ఎలా శిథిలం అయ్యాయో తెల్పే కథ.

రాయలసీమ నుంచి జి.రామకృష్ణ రాసిన 'గంజి కేంద్రం', కొలకలూరి ఇనాక్ రాసిన 'పిండీకృతశాటి', 'తలలేనోడు', బండి నారాయణస్వామి 'అవశేషం', 'సంఘపశువు', 'సావుకూడు', 'చమ్కీదండ' 'అద్దం', 'రెండు అబద్దాలు', డా.వి.ఆర్.రాసాని కొత్తజూదం, మెరవణి, శాంతి నారాయణ 'పల్లేరుముల్లు', కలువకొలను సదానంద 'తులసీ తీర్థం', పులికంటి కృష్ణారెడ్డి 'గొడ్డు' తదితర కథల నిండా బహుజనుల బాధలే నిండి ఉన్నాయి. సుంకోజి దేవేంద్రాచారి కథ 'అన్నంగుడ్డ'లో "మాకు చెప్పలేదే ఏపమాను కోసేదానికి. తీర్లు, పలకలు ఎవరు కొసిచ్చిరి?" అడిగాడు ఆచారి. 'ఎంత అమాయక మైన ప్రశ్న వేసినావు ఆచారి' అన్నట్లుగా చూసి "ఊర్లో ట్రాక్టరుండాది. కలకడలో కోత మీషనుండాది. ఇంగ దిగులెందుకు ?" వడ్రంగి వృత్తినే నమ్ముకున్న ఆచారి కుటుంబం ప్రపంచీకరణలో, సాంకేతిక సమాజంలో చేయడానికి పనిలేక కులవృత్తి కుదేలైపోతే, విలవిల లాడుతుంది. డా.రాసాని రాసిన 'కొలిమి' కథ కూడా విశ్వబ్రాహ్మల జీవితానికి సంబంధించిందే. జి.వెంకటకృష్ణ రాసిన 'గరుడస్తంభం', డా. రాసాని రాసిన 'చావుకూడు' కథలు దాసర్ల గురించి రాసిన కథలు. జిల్లేళ్ల బాలాజీ 'మట్టిగాజులు', 'తమ్ముడి మరణం', తుమ్మల రామకృష్ణ 'అడపం', 'మహావిద్వాంసుడు' రాప్తాడు గోపాలకృష్ణ 'అతడు బయలుదేరాడు', బాలకృష్ణమూర్తి 'భజంత్రీలు' కథలు మంగలి వృత్తిని చిత్రించిన కథలు. రాయలసీమ నుండి ఫ్యాక్షన్ నేపథ్యంగా వచ్చిన కథల్లో ఎక్కువ శాతం చితికిపోయింది బహుజనుల జీవితాలే. ఇందుకు మంచి ఉదాహరణ ఇనాయతుల్లా రాసిన 'నిచ్చెన' కథ.

వేంపల్లె గంగాధర్, బా.రహమతుల్లా, ఐతా చంద్రయ్య, డా.నందిని సిధారెడ్డి, డా.బి.వి. ఎన్. స్వామి, డా. నసుమాస స్వామి, బోయ జంగయ్య, మల్లిపురం

జగదీష్, కె. వరలక్ష్మి, శిరంశెట్టి కాంతారావు, మధురాంతకం నరేంద్ర, మహేంద్ర, కేతు విశ్వనాథరెడ్డి, సింగమనేని నారాయణ, సి. ఎస్.రావు, ఎలికట్టె శంకర్, మంచికంటి, చింతా అప్పల్నాయుడు, సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, శాంతి నారాయణ తదితురులెంతో మంది బహుజన కథలు ఎన్నో రాశారు. రాస్తున్నారు.

దిలావర్ కథల్లో బహుజన జీవితాలు దిలావర్ మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీల దృక్పథంతో అనేక కథలు రాశారు. ప్రధానంగా మైనార్టీ జీవితాలను అనేక కోణాల్లో చిత్రించారు. 'వెలిసిపోయిన బతుకులు' కథలో నాటకాలు వేస్తూ, ఇల్లిల్లూ తిరిగి పౌడరులు, పిన్నులు అమ్మే కులవృత్తి వాళ్ళు చేపలు పట్టుకోవడం, గ్లోబలైజేషన్ క్రమంలో బ్యూటీ పార్లర్లు పెరిగి ఆధునిక సౌందర్య సాధనాలు పెరిగి వీరి వ్యాపారం, వృత్తులు ఎలా చితికి పోయాయో చిత్రించారు. కొన్ని ప్రాంతాల్లో ఈ కులాన్ని పూసలవాళ్లు అని పిలుస్తారు. 'గూడుచెదిరిపోయింది' కథలో వడ్రంగి వృత్తి ఎలా ఆధునిక అభివృద్ధిలో శిథిలమవుతూ చివరికి ఉపాధి లేక ఇల్లులేని దుస్థితికి దిగజారిపోయిన క్రమాన్ని చిత్రించారు. కోతిని, పామును ఆడించే వారిని 'కోరలు' కథలో చిత్రించారు. చివరకు అదే పాము కాటుకు జీవితం బలైన విషాదాన్ని అక్షరీ కరించారు.

కె.వి. నరేందర్ చిత్రించిన బహుజన కథలు: కె.వి.నరేందర్ 175కు పైగా కథలు రాశారు. 10 కథా సంపుటాలను వెలువరించారు. 'మనోగీతం', 'అమ్మ', 'యుద్ధం', 'బురదలో జాబిల్లి', 'కాలుతున్న పూలతోట', 'నాన్న', 'నాతిచరామి', 'వూరు', 'సిటీ' పేరిట వెలువ రించిన కథా సంపుటాల్లో చాలా కథలు దళిత, బహుజన జీవితాలకు సంబంధించినవే. 'బండలు' కథలో గుట్టలు తవ్వి రాళ్లను తరలించడం, కంకరగా మార్చడంతో శిల్పుల కులాలు ఎలా ఉపాధి కోల్పోయి శిథిలమవుతూ వస్తున్నారో చిత్రించారు. 'మ్యాచ్ ఫిక్సింగ్' కథలో బీసీల్లో ఆర్థిక సంబంధాలు, వాటి పరిణామాలు విశ్లేషించారు. 'సొంతిల్లు' కథలో బహుజన మధ్య తరగతి వాళ్ళు ఇల్లు కట్టుకోవడానికి అప్పు కోసం తిరిగితే బ్యాంకులు చేసే దోపిడీ ఎలా వుంటుందో చిత్రించారు.

బహుజన కథ తెలంగాణ నుండి మహోన్నతంగా వికసించింది. ఆ తరువాత రాయలసీమను చెప్పుకోవచ్చు. కోస్తా నుండి బహుజన కథ రావాల్సినంతగా రాలేదు. ఉత్తరాంధ్ర నుండి దళిత బహున కథలు రాకపోవడం, రచయితలకు బహుజన జీవితాల పట్ల దృష్టి లేకపోవడం మరింత విచారకరం. రాయలసీమ నుండి కరువు ఫ్యాక్ష నిజం, దళిత బహుజన కథలు మూడు రకాల కథలు సమాన స్థాయిలో వికసించాయి. నల్గొండ జిల్లా బోయ జంగయ్య, వేముల ఎల్లయ్య, భూతం ముత్యాలు, కదిరె కృష్ణ, ఎం.వెంకట్, హలీమ్, స్కైబాబా, ఎస్.కె.రామారావు, కాంచనపల్లి చినవెంకటరామారావు, కాసుల ప్రతాపరెడ్డి మొదలైన వాళ్లు ఎన్నో దళిత బహుజన కథలు రాశారు. వారితో పాటు తెలంగాణ నుండి విస్తృతంగా రాస్తున్న బి.ఎస్. రాములు, ఎనుగంటి వేణుగోపాల్, పెద్దింటి అశోక్ కుమార్, బి.వి.ఎన్.స్వామి, నేరేళ్ల శ్రీనివాస గౌడ్, కె.వి.నరేందర్, అయితా చంద్రయ్య, రామా చంద్రమౌళి, సబ్బని లక్ష్మీనారాయణ, ననుమాస స్వామి, ఒడ్నాల సూర్య, జింబో, రహమ్మతుల్లా, శింరశెట్టి కాంతారావు, షాజహానా, తదితర తెలంగాణా కథకుల బహుజన కథల గురించి మరింత విస్తృతంగా రాసినప్పుడే బహుజన కథకు సరైన న్యాయం జరుగుతుంది.

# యశోదారెడ్డి ధర్మశాల కథలు – ఇదివృత్త వైవిధ్యం

– కె. నవీనారాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యానగర్, హైదరాబాద్.

తెలుగు సాహిత్యంలో తెలంగాణా కథలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇతర ప్రాంతాలో లేని కథల కంటే తెలంగాణ కథ భిన్నంగా విలక్షణంగా కనిపిస్తుంది. సమకాలీన సామాజ పరిస్థితులను, పరిణామాలను మానవ ఔన్నత్యాన్ని చిత్రించడంలో తెలంగాణ కథ అద్భుత విజయాన్ని సాధించింది. తెలంగాణ ప్రాంతంలో పేదరికం నిరక్షరాస్యత, భూమి సమస్య వెట్టి చాకిరి అణచి వేత మొదలైన ప్రాంతీయ సమస్యలు తెలంగాణ కథలలో ఉండే మౌలికమైన లక్షణాలు. మానవ జీవితాన్ని సామాజిక వాస్తవికతను పూర్తి నిబద్ధతతో తమ కథలతో వ్యక్తీ కరించడంలో యశోదారెడ్డిని ప్రత్యేకంగా పేర్కొనవచ్చు. తెలుగు కథా పరిపుష్టికి యశోదా రెడ్డి తన కథల ద్వారా ఎంతో దోహద మొనర్చారు. వీరి కథలు పాఠకుల్ని ఆలోచింప జేస్తాయి. ఆచరణకు పురి కొల్పుతాయి. ఏదో ఒక సందేశం ఇవ్వకుండా కథను ముగించారు.

సమకాలీన తెలంగాణ సమాజాన్ని ఆవిష్కరిస్తూ సమస్యలకు మూలాలను అన్వేషిస్తూ సామాజిక వాస్తవి కతకు దర్పణం పడుతూ కొన్ని కథలలో పరిష్కారాన్ని సూచిస్తూ వీరు కథలను రచించారు. ఏ ప్రాంత సాహిత్యానికైనా ఆ ప్రాంత సమకాలీన సమాజమే వస్తువును సృష్టిస్తుంది. యశోదారెడ్డి తీసుకునన ఇతి వృత్తాలన్నీ వీరు చూపిన సమాజంలోంచి వీరి అనుభవం లోంచి వచ్చిన సజీవదర్పణాలు. మొదటితరం ఆ తరువాతతరం ఆధునిక భావాలతో మాండలిక పద జాలంతో కథా రచనలు చేస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడిన వారిలో యశోదారెడ్డిని మొదటి వరుసలో పేర్కొనవచ్చు. యశోదారెడ్డి కథలలో కుటుంబ సబంధాలు గ్రామీణ పట్టణ సంబంధాలు స్త్రీ సమస్యలు, దాంపత్య జీవన సమస్యలు, కులవ్యవస్థ, వెట్టి చాకిరీ వివాహ వ్యవస్థ, దేవదాసి వ్యవస్థ సంస్కృతి సంప్రదాయాలు నిరుద్యోగ సమస్య, జంతువులకు సంబందించినవి వంటి అనేక విషయాలను తన కథల్లో వివరించారు.

వీరి కథలలో మహబూబ్ నగర్ ప్రాంత విభిన్న ఇతివృత్తాలు కనిపిస్తాయి. వీరి జీవితంలో వైవిధ్యం వీరి కథలలో ప్రతిఫలించింది. మావూరు ముచ్చట్లు, ధర్మశాల, ఎచ్చమ్మ కథలు సంపుటాలలోని కథలు రచనకు ప్రాంతీయ చరిత్ర సంఘటనలు ఎంతగానో ఉపకరిం చాయి. ఇతివృత్తంలోని సంఘటనల మీద వ్యక్తిత్వం ప్రస్ఫుటమవుతుంది. రచయిత్రి కూడా సమాజంలో ఒక వ్యక్తి కనుక ఆ వ్యక్తి మనో దృక్పథాలపై సమాజం యొక్క ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. అయితే రచయిత్రి సమాజాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే కాలంతో పాటు నడవ గలిగి ఉండాలి అప్పుడే ఈ కథలు పాత్ర విలువల నుండి విముక్తమై కొత్తగా వికసించగలుగు తాయి. ఈ పద్ధతిలో చూసినప్పుడు యశోదారెడ్డి కాలంతో పాటు నడిచిన వారని కాల గర్భంలో కలసిపోయిన ఆలోచనలను గురించి తన స్వంత బుద్ధితో ఆలోచించి తనకు అర్థమైన జీవితాన్ని సంఘటనల్ని నిజాయితీగా యశోదారెడ్డి తన కథలను ఇతివృత్తంగా తీసుకొని రచనలు చేశారని ఈ పరిశోధన ద్వారా తెలియపరిచాను.

తాను ఎన్నుకున్న కథా జీవితాలనికి సంపూర్ణతను చేకూర్చడానికి యశోదారెడ్డి అనేక పాత్రల్ని సృష్టించారు. వాటితో కొన్ని ప్రధానమైన పాత్రలు. కొన్ని అప్రధానమైన పాత్రలు. కథా రచయిత్రి యశోదారెడ్డి దృష్టి అంతా ప్రధాన పాత్రలయందు గాని వాని శఈలవైశిష్ట్యాదులను వ్యక్తం చేయుట యందు గాని లగ్నమైయుంటుంది. పాత్రచిత్రణ సహజమును స్వభావసిద్దమై ఉంటుంది. ఆ కారణముగానే పాత్ర తన స్వభావమునకు విరుద్ధముగా ప్రవర్తింపరాదు. పాత్రల్ని తమంతాము నిలబడగల వ్యక్తిత్వము గలవిగాను, కొన్ని భావాలకు

ప్రతీకలుగాను విభజించవచ్చు. ప్రతివ్యక్తి ఏదో ఒక భావానికీ ప్రతినిధి. భావాల్లోకాక అతడు ఆమె చేసే కార్యాల్లో అతని ప్రత్యేక వ్యక్తిత్వం వెల్లడియవుతుంది. పాత్రలకు, సంఘటనలకు ఉన్న సంబంధం కథా రచనకు అతి ముఖ్యమైనది.

పాత్రచిత్రణ కథకు ఆత్మవంటిది. కథ సజీవంగా మన ముందు సాక్షాత్కరించవలెనన్న పాత్ర చిత్రణ విషయములో మిక్కిలి శ్రద్ధ వహించి ఉండవలెను. కథ వస్తువును భరించేవారు కథను నడిపించేవారు పాత్రలు. ఒక్కొక్కసారి పాత్రల్లో అంత: సంఘర్షణ ఉంటుంది. పరిస్థితుల ప్రభావం చేత అవి మార్పు చెందుతాయి. పాత్రల్లో వచ్చిన మార్పును చూచి పాఠకుడు మొదట ఆశ్చర్యపోయినా నెమ్మదిగా మార్పుకు కారణాలున్నాయని గుర్తిస్తాడు. ఆ కారణాలు మార్పుకు ఆధారమని కూడా నమ్ముతాడు. ఒక్కమాటలో చెప్పాలంటే సహజమైన పాత్రకు క్లిష్టత ఉంటుంది. క్లిష్టత లేని పాత్రలు రచయిత లేదా రచయిత్రి చేత సూక్ష్మీకరించబడి ఉంటాయి. యశోదారెడ్డి కథలలో ఒక పాత్రను మించి మరొక పాత్ర వాటి వాటి పరిధుల్లో ఉన్నతత్వాన్ని నిరూపించు కుంటాయి. వీరి కథలలో పాత్ర చిత్రణ పతాక స్థాయిని అందుకున్నది.

పాత్ర ఎంతదన్నది కాదు ఎంత విలువైనదన్నది ముఖ్యం. ఇతివృత్తం కథకు కావలసిన వాతావరణం సమకూరిన తరువాత దానికి అనుగుణంగా పాత్రచిత్రణ జరుగుతుంది. ఒక వ్యక్తిలో రెండు ప్రవృత్తులు ఉండ వచ్చు. ఏది మంచి ఏది చెడు అని విభజించి చెప్పడం కష్టం కావచ్చు. ఈ విధంగా సజీవ పాత్రచిత్రణ గావిం చడం వలన యశోదారెడ్డి కథలు పాఠకునికి ఎప్పటికీ గుర్తుండిపోయేలా రచించారు. ఈ అధ్యాయంలో వివరించిన యశోదారెడ్డి పాత్రలలన్నియు సామాజిక దృక్పథం కలిగినవే ఇందుకు నిదర్శనం మావూరి ముచ్చట్లు, ధర్మశాల ఎచ్చమ్మ కథలు కథలల్లో పాత్రలు వెలిబుచ్చే అభిప్రాయాలు యశోదారెడ్డి అభిప్రాయాలు కలిగి ఉన్నాయని స్పష్టంగా తెలుస్తుంది. ధర్మశాల కథలలో ఇతివృత్త వైవిధ్యాన్ని వివరించడమే ఈ వ్యాస లక్ష్యం.

దరా కథలోని 'శరత్' తన మేనమామ ఇంటికని వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థి. అతను అనుకోకుండా చూసిన సుభద్రను తొలిచూపులోనే ప్రేమించాడు. తనకే తెలియకుండా తన మనసు ఆమెకు దాసోహమన్నది. ఆ బాధతో జ్వరంతో మంచం పట్టాడు. మళ్ళీ సుభద్ర రావడంతో ఆ ఆకర్షణ తారాస్థాయినందుకుంది. సుభద్రను విడిచి ఉండలేని స్థితికి వచ్చాడు. అతని కుక్క మార్వెల్ కూడా అంతే? దారా కోసం పరితపిస్తుంది. సుభద్ర కూడా తనకు తెలియకుండానే శరత్ కు మనసిస్తుంది. శరత్ ఇంటికి వెళ్ళిన సుభద్ర అతన్ని చూడగానే ఆకర్షితురాలవుతుంది. మార్వెల్ దారాలను శరత్, సుభద్రలు కలపాలనుకున్నారు. కాని ఆ దైవం వాళ్ళిద్దరికీ ముడివేసింది. అందుకు పెద్దవారి అనుమతి కూడా లభించింది. కథ సుఖాంతం అయింది దారాతో.

నిప్పుతో చలగాటం కథలో నవనాగరికపు మోజులో పడి జీవితాలను బుగ్గిపాలు చేసుకునే అమ్మాయిలందరికీ ఒక గుణపాఠం నేర్పుతుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభంలేదు. అలాగే జీవితం చేజారిన తర్వాత తిరిగి రాదు. అందుకే దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దు కోవాలి అన్న సామెతలాగా ముందు జాగ్రత్తగా వ్యవహరించి మసలుకోవాలి. తొందరపాటు నిర్ణయాలను తీసుకొని తప్పులు చేయరాదు. అనే నీతి ఈ కథవల్ల తెలుస్తుంది. ఈ కథలోని శ్రీనివాస రావు అమాయకుడు. పని ఒత్తిడివల్ల, ఇల్లు వెతికే హడావిడిలో ఉండడం వల్ల భార్యను సరిగా గమనించలేకపోయాడు.

అకాయ్ చేసిన పెళ్ళి కథలోని సుందరం అమాయ కుడు. చెల్లెళ్ళపై ప్రేమానురాగాలు గలవాడు. చెల్లెళ్ళ పెళ్ళి చేయాడానికి వింత స్లోగన్ చూసి, తానూ వో స్లోగన్ తయారు చేశాడు. ఆ 'అక్కాయి' తండ్రి ఎవరో తెలిస్తే బాగుండునని మనసులో అనుకున్నాడు. చివరికి నిజంగానే

ఆ స్లోగన్ సృష్టించిన వాళ్ళింటి పిల్ల లక్ష్మినే వివాహ మాడాడు. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళ కోసం తాను అమ్ముడు పోవడానికి సిద్ధపడ్డ ఉత్తముడు, బాధ్యత తెలిసినవాడు సుందరం. ఈ కథలో సుందరం తన ఇంద్రియాలను, కోరికలను, చంపుకొని, బాధ్యతలకు కట్టుబడి ఉండే బాధ్యత తెలిసిన కొడుకు. చెల్లెళ్ళపై అమితమైన ప్రేమాభిమానాలుగల ప్రియమైన అన్న. తల్లికి కనుపాపగా మెదిలే బిడ్డ. తండ్రిని అర్థం చేసుకున్న బరువును మోసే కొడుకు సుందరం.

రంగడి ప్రయోజకత్వం కథలోని అనసూయమ్మ గుడ్డిగా కొడుకుగా ప్రేమించే తల్లి. కొడుకు బాగోగులు చూడకుండా అతని భవిష్యత్తు ఆలోచించకుండా గారాబం చేస్తూ సమయానికి తిండిపెట్టి పోషించిన వెర్రి మమకారం అనసూయమ్మది. అనసూయమ్మ గారాబం వల్లే కొడుకు సోమరిగా తయారైనాడని తెలిసిన భర్త ఆమెను ఏమీ అనడు. అనసూయమ్మకు తన కొడుకు బాగుపడాలని లోపల ఉన్నా పైకి మాత్రం ఏమీ అనక లోలోపల నా కొడుకు బుద్ధిమంతుడై బాగుపడితే బాగుండు. అని బాధపడే పిచ్చి తల్లి. లోకంలో కొడుకులను అతిగా ప్రేమించి గారబం చేసి చెడగొట్టే తల్లులకు ఈ రంగని ప్రయోజకత్వం అనే కథ ఒక గుణపాఠం. నలుగురిలో పరువు తీసిన కొడుకును చూసి సిగ్గుతో, అవమానంతో దేవుని ముందు వాలిపోయి బాధపడ్డ అమాయకురాలు అనసూయమ్మ.

ప్రమీల కథలో సీతాపతిరాజు ప్రమీలను పెళ్ళి చేసుకున్నాడు. పెద్దలు మొదటిరాత్రి చేస్తామంటే ఏం? మొదటిరాత్రి? మేం హాయిగా హనీమూన్ వెళ్ళుతాం. అంటూ శృంగార యాత్ర తలపెట్టాడు. సీతాపతిరాజు, అజంతా, ఎల్లోరా బయలుదేరాడు. అల్లుడు గారు పట్టుబట్టడంతో పెద్దవాళ్లు ఏమీ అనలేదు. 'మోక్షాని కంటూ పోతే మొసలెత్తుకపోయెనని' నవ్వుతూ తుళ్ళుతూ సిగ్గులొలుకుతూ వెళ్ళిన ప్రమీల మూడోనాటికే శవమై ఇల్లు చేరింది.

ఈ కథలోని సీతాపతిరాజు నపుంసకుడైన దుర్మార్గుడు. తన లోపాన్ని కప్పిపుచ్చుకొని అందర్నీ మోసం చేసిన వంచకుడు. పాపం ప్రమీలను దారుణంగా హింసించి చంపిన హంతకుడు.

ఆధారాలేమీ దొరకకుండా చేసిన మోసగాడు. అందర్ని మభ్యపెట్టి, మోసగించి, ఉత్తముడుగా చాలా గొప్పగా చలామణీ అయిన దొంగ. సీతాపతిరాజు గురించి పూర్తిగా తెలిసిన శ్రీనివాస్, రాఘవలు పథకం ప్రకారం అల్లిన ఊబిలో దిగి చిక్కుకున్న అమాయకుడు. సంఘంలోని చీడపురుగు సీతాపతి, ఆ చీడ పురుగులను ఏరిపారేసే రాఘువ, శ్రీనివాస లాంటి ఆదర్వ యువకులు సమాజానికి ఎంతైనా అవసరం. పెద్దవాళ్ళు అమాయకంగా తెలియక పైపై మెరుగులను చూసి, డబ్బును చూసి, తమ ఆడపిల్లలను దుర్మార్గులను ఇచ్చి మోసపోవద్దనే నీతి ఈ కథ వల్ల తెలుస్తుంది.

గుళ్ళో గంటలు కథలో రఘు, సీతను చూడగానే మనసుపడ్డాడు. సీత, జానకి, రఘు ముగ్గురూ కలిసి ఆ ఊళ్ళోనే ఉన్నకోటను చూడడానికి వెళ్ళారు. కోటలోని విశేషాలన్నీ చూసి అవసరమైన సమాచారం అంతా సేకరించుకున్నాడు. అందరూ ఇంటికి వచ్చారు. రఘుతో తిరుగుతున్నంత సేపూ స్నేహితురాండ్లిద్దరూ రఘు తన స్నేహితురాలికి భర్త అయితే బాగుండునని అనుకున్నారు. కానీ తమకోసం మాత్రం ఊహించుకోలేదు. రఘు, పరంధామయ్య మొదట కొంచెం మనసులో బాధపడ్డా, అది దైవానుగ్రహం అనుకొని రామయ్య ఇంటికి వెళ్ళి, పెళ్ళి పెద్దగా వచ్చాననీ, రఘుకు సీతనివ్వమనీ అడిగాడు. రామయ్య ఆ మాటలు నిజమా అని నమ్మలేకపోయాడు. సీతను పిలిచి పరంధామయ్యకు పాదాభివందనం చేయించాడు. గుళ్ళో అప్పుడే ఎవరో గంటలు మ్రోగించారు. తథాస్తు దేవతలు ఉన్నారనుకొని సంతోష పడతారందరూ, అందరూ చక్కెర తని నోరు తిపి చేసుకుంటారు.

తియ్యేటి తీగలు కథలోని అరుణ చదువుకున్న సంస్కారవంతురాలు, ఒక ఉద్యోగిని, రచయిత్రి, రేడియో ప్రసంగాలు కూడా ఇచ్చేది. అరుణ బస్సులు దొరకక, ఆటోలు ఆగక, రిక్షా ఎక్కి కూర్చొని, ఆ రిక్షావాడే వేరే త్రోవలో నుండి తీసుకపోతుంటే అతన్ని దబాయించిన ధైర్యం గల స్త్రీ. లేటవుతుందని ఆందోళన పడుతున్న అరుణకు ఆ రిక్షావాని మొండితనం కోపం తెప్పించింది. వాడు ససేమిరా ఆ వైపు వెళ్ళనని మొండికేసేసరికి చేసేది లేక నెమ్మదిగా కూర్చొని అతని విషయాలు అన్నీ అడిగి తెలుసుకున్నది. రహీం కథ విన్న అరుణ హృదయం కరిగింది. ఇలాంటి సుకుమార హృదయాలూ ఉంటారా? అని ఆలోచించిన సహృదయురాలైన రచయిత్రి అరుణ. ఆమె ఆ ఆలోచనలతో రహీం వృత్తాంతాన్నే ఒక కథానికగా మలచిన సమర్థురాలైన రచయిత్రి అరుణ. మనిషిని పైకి కనిపించే వేస, భాషలతో అంచనా వేయకూడదు, అతని హృదయంలో ఎంతో సౌకుమార్యం, ఎంత లోతైన భావాలున్నాయి. ఇలా ప్రతి ఒక్కరి హృదయాన్ని స్పృశించి చూస్తే నిజానిజాలు తెలుస్తాయని ఈ కథ ద్వారా రచయిత్రి తెలియజేస్తుంది.

ఈ కథలోని రహీం చాలా సుకుమారమైన మనసుగల పేదవాడు. చదువుకుంటూ, మరొకవైపు చేయగలిగిన పనులన్నీ చేస్తూ కుటుంబాన్ని నడిపించే బాధ్యత గలిగిన కొడుకు. అన్నకోసం, కుటుంబం కోసం తన సుఖాన్ని త్యాగం చేసి కష్టపడే కష్టజీవి. రహీం తను చేసుకోబోయే అమ్మాయి సల్మ దృష్టిలో రిక్షా తొక్కుతూ ఎదురు పడ్డందుకు, ఆమె కళ్ళలోని నీళ్ళు, మనసులోని బాధను చూసి తట్టుకోలేకపోయాడు. అందుకే ఎన్ని డబ్బులిచ్చినా అటువైపు మళ్ళీ రిక్షా తొక్కుకుంటూ పోనని చెప్పిన ఆత్మాభిమానం గలవాడు. రహీం కష్టజీవి ఎప్పటికైనా తనకు మంచి రోజులు వస్తాయని, మంచి హోదాలో ఉండి, తిరిగి తన సల్మకు దగ్గరవుతాననే నమ్మకం కలవాడు. ఒకవైపు చదువుతూ, మరొకవైపు పని చేసుకుంటూ చిన్న వయసులోనే కుటుంబం బరువు, బాధ్యతలను పంచుకున్న ఉత్తముడు. రహీం పైకి మొరటుగా కనిపించే సుకుమార హృదయుడు.

ఈ కథవల్ల మనుషులను పైపైకి చూసి అంచనా వేయరాదు. ప్రతి హృదయంలోనూ సుకుమారమైన భావాలూ, ఆలోచనలూ ఉంటాయి. కాబట్టి మనిషి గుణగణాలను బట్టి, లోతుపాలను చూసి వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేయాలనే నిజం తెలుస్తుంది.

దిబ్బరొట్టె కథలో నగర జీవితంలోని సౌఖ్యాలకంటే పల్లెటూళ్ళలోని ప్రేమ ఆప్యాయతలు గొప్పవని నిరూపించబడుతుంది. నిజాయితి, ప్రేమ, ఎదనిండిన మమతాను రాగాల ముందు యాంత్రిక జీవితంలో దొరికే సుఖాలు ఓడిపోయాయి. అచ్చమైన ఆవు నెయ్యితో స్వచ్ఛమైన మనసుతో చేసే, పూర్వకాలపు వంటలన్నింటిని(దిబ్బరొట్టె) రుచి చూసాక, ఇక్కడికి ఎందుకు వచ్చానా? అని అనుకున్న రామనాథంగారు ప్రతియేటా ఇక్కడికి వద్దాంలే అన్నాడు భార్యతో. ఈ నవీన యుగంలో దొరికే ఫాస్ట్ ఫుడ్స్ అన్నీ, గ్రామాలలో చేసే సంప్రదాయ పంటల మందు దిగదుడుపే అని తెలుస్తుంది ఈ కథలో.

పేరులో ఏముంది కథ పేరులో ఏముంది అని అనుకునే వారికి పేరులోనే అంతా ఉంది, పేరులేకుంటే ఏది లేదు అనేలా అన్ని రకాల పేర్లను, నిక్ నేమ్స్ ను, బిరుదులను, మారుపేర్లను ఇంటి పేర్లను, పూర్వ కవుల ప్రతిభను తెలియజేసే పేర్లను చక్కగా వివరించింది.

ఎదలోని పొరలు కథలో ప్రభాకరం భార్య జయ మంచిదే. సభ్యత సంస్కారం తెలిసిందే, కాని వాళ్లమ్మాయి స్వీటి మానసికంగా ఎదగని అభాగ్యురాలు. ఆమెను చూసి తన భర్త వైపు బంధువులు ఆదరించక చీదరించుకోవడం చూసి మండిపడింది. అమెరికా నుండి బోలెడు డబ్బు ఖర్చు పెట్టుకొని ఇంతదూరం వస్తే వాళ్ళు తన కూతురుపై కొంచెం కూడా ఆప్యాయత పంచక, అవమానించడం సహించలేక చిరుబురు లాడింది. ఆ తల్లిదండ్రులను, ఆ పాపను గమనిస్తున్న ఒక పెద్దావిడ అమెరికాలో ఉంటున్నారన్న గర్వం డబ్బున్నదన్న

అహంకారంతో వీళ్ళిలా మాట్లాడుతున్నారు. ఆ అమ్మాయి అలా సంస్కార హీనంగా ఉంది అనుకుంది. కానీ ఆ తర్వాత ఆ పిల్ల మానసిక స్థితి బాగా లేదని తెలిసి చాలా బాపడింది. ఆ తల్లి ఆవేదన అర్థం చేసుకుంది. ఆ అమ్మాయి దీనస్థితికి బాధపడింది. హృదయపూర్వకంగా వారితో స్నేహంగా మసలుకొంది.

తన ఊహ తప్పని తెలుసుకొని ఆ అమ్మాయిని మనసారా దీవించింది.

ఇంట ఉండి చూడు వెంట తిరిగి చూడు' అన్న సామెతగా మనుషులను మొదటిసారి చూడగానే అంచనా వేయకూడదు. పూర్తిగా వారితో కలిసి ఉండివారి మనస్తత్వం తెలిసిన తర్వాత అంచనా వేయాలి. అనేది ఇందులో నిశితంగా తెలియచేసే అంశం.

## సందె బిచ్చెం తల్లీ :

యశోదారెడ్డి కథలు పూర్తిగా కొత్త కథ ఇది. ఈ కథలు తాగుడు వ్యసనం అది ఎంత వారినైనా దిగజారుస్తుంది. కుటుంబాన్ని అణగదొక్కుతుందని ఈ కథ ద్వారా తెలుస్తుంది. ఈ కథలు ఆనాడు ఉనన్న దురాచారాలు తాగుడు పేకాట మొదలైనవి కనబడతాయి. యజమాని అటువంటి వ్యసనాలకు భానిసైతే చితికి పోయిన కుటుంబాలకు ప్రతీక ఈకథ.

**నిశ్చితార్థం :**

ఈ కథలో పల్లోటూరు వాతావరణంలోని పద్ధతులు అలవాట్లు, పెళ్ళివారికి చేసే మర్యాదలు చూపే ప్రేమ భయభక్తులతో మెదిలే పద్ధతులు ఈ కథలో కనబడ తాయి. పెద్దావిడ శేషమ్మ వాళ్లు మాట్లాడిన అన్నీ మాట లకూ పెడర్థాలు చెప్పి వివరిస్తుంది. చివరకు చదువుకున్న వాడైనా పెళ్ళి కొడుకు ప్రసాద్ రెండు కుటుంబాల మధ్య సంబంధం తెగిపోకుండా గుళ్ళో పెళ్ళి చేసుకొని వచ్చి దీనించమంటాడు. అతని మనస్సులోని మాట విన్నతర్వాత అందరూ చల్లబడతారు.

**పుర్రెకోబుద్ధి - జివ్వకోరుచి :**

యశోదారెడ్డి తన అనుభవాలను తాను చూసిన, తనకు ఎదురైన వారి మనస్తత్వాలు అభిప్రాయలు ఈ కథలో వెలిబుచ్చింది. ఈ కథలో భార్య మంచిదైనా భర్త మాత్రం మంచివాడు కాదు. తన భర్త ఎంతో పేరున్నవాడు కాని ఎందుకూ అంటూ ఈసడించుకుంటుంది. అవును ఎవరి అభిరుచి వారిది. కొందరికి కొన్ని నచ్చుతాయి. కొన్ని నచ్చవు. ఇష్టాలను ఆశయాలను బట్టి వారి కోరికలు ఉంటాయి. అందుకే రచయిత్రి ఈ కథకు పుర్రెకోబుద్ధి - జివ్వకోరుచి అని పేరు పెట్టారు.

**పెద్దమర్రి :**

పాకాల యశోదారెడ్డి ఎచ్చమ్మ కథలలో మరోకథ పెద్దమర్రి. ఈ కథలో చెల్లెలు అక్కకు ఉత్తరం రాస్తుంది. అందులో మన ఊర్లో గౌరయ్య పొలంలో ఉన్న పెద్ద మర్రి ముచ్చట గురించి వివరిస్తుంది. కర్ణపు రంగయ్య మాదిరిగానే గౌరయ్య తన భూములలోని మర్రిచెట్టును నరికతే ఈ రోజు ఆ వూరికి, ఆచెట్టుకు అంత పేరు వచ్చేదికాదు. మంచి తనంతో అతడు ప్రవర్తించే అతనికి ఏం మంచి జరిగింది. అది పాఠకులకు తెలియజేయడమే ఈ కథలోని ఇతివృత్తం. ఇంకా ఈ కథలో మర్రిచెట్టు ప్రాముఖ్యత చెట్టుకింద వనభోజనాలు ఈతకల్లు తాగడం మొదలైన ఆచారాలు కనిపిస్తాయి.

**కోడలమ్మ ఎతలు :**

ఈ కథలోని కోడలు శారదమ్మ వాళ్ల అత్త పెట్టే చిత్రహింసలను ఎదుటి వారికి చెప్పకున్నట్టుగా ఉంటుంది. ఆ కాలంలో కోడలమ్మ అమాయకురాలు కనుక ఎన్ని మాటలన్నా సహిస్తుంది. భరిస్తుంది. పరమ గయ్యాలి గంగమ్మ అతి గడుసుదనం ఈ కథలో కనిపిస్తుంది. అత్త ఆగడాలకు కోడళ్ళ అమాయకత్వానికి ప్రతిరూపం ఈ కథ.

**మిఠాయి రాములు :**

ఈ కథలో మిఠాయి రాములు పట్నంలో స్థిరపడ్డాక భూ లక్ష్మిని పెండ్లి చేసుకుంటాడు. ఆమెకు పిల్లలు పుట్టక పోతే రాములు సుక్కమ్మను రెండో పెళ్ళి చేసుకుంటాడు.

ఇద్దరు భార్యల ముద్దుల మొగుడుగా పగలే వెన్నెల కురిపిస్తాడు. పిల్లలు లేరని ఇద్దరు భార్యలను చేసు కున్నాడు. ఆ తర్వాత ఐదుగురు పిల్లలకు తండ్రి అయ్యాడు. భార్యలు తమ స్వార్థం చూచుకున్నారే గారి భర్తను పట్టించుకోలేదు. తాగుడు అలవాటు చేసుకున్నాడు. చివరకు తిండికి కూడా కష్టమైంది. డబ్బు, వయస్సు ఉన్నవారు ముందు చూపుతో బ్రతకాలని నీతిని చెప్పుతుంది ఈ కథ.

కథకు చదివించే గుణం ప్రధానం. స్త్రీల అందం ప్రత్యేక అవయవాల వల్ల కాకుండా విడిగా ప్రత్యేకమై శోభాకారకమై భాసించినట్లే కథకు సొగసు అనేక కారణాల వల్ల సిద్ధిస్తుంది. అది కూర్పు నేర్పు కావచ్చు. సంవిధాన చాతుర్యం కావచ్చు. సంభాషణ చమత్కృతి కావచ్చు. భాషా విశేషం కావచ్చు.

ఈ సంపుటిలో ఉన్న కథలల్లో వో ఐదు కథలు మాత్రం, ఆంధ్రప్రభ, స్వాతి, జాగృతి వంటి పత్రికలల్లో అచ్చైనవి. మిగిలిన ఇరవై కథలు, ఈ రెండేళ్లలో వ్రాసినవి. కొన్ని కథలు అప్పుడప్పుడు పత్రికలల్లో వచ్చిన వార్తలు ఆలంబనంగా కేంద్ర బిందువుగా స్వీకరిస్తూ కథగా మలచడం జరిగింది.ఈ కథలను గూర్చి మంచి చెడ్డలు వివరించడం ఈ కథలన్ని మీ ముందున్నవి బాగోగుల నిర్ణయానికి మీరే ప్రమాణం.

# వలసపాలనలో జమిందారీలు – రైతాంగ పోరాట చరిత్ర

- డా॥. కె. శ్రీదేవి
తెలుగుభాష & అనువాద అధ్యాయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

- చంద్రబాబు
పరిశోధక విద్యార్థి, తెలుగుభాష & అనువాద అధ్యాయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

బ్రిటీష్ వలసపాలకుల ఆధిపత్యంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తా, తెలంగాణా నాలుగు ప్రాంతాలు మొఘలాయిలు తర్వాత కాలంలో ఫ్రెంచివారి ఆధిపత్యంలో కొనసాగాయి. అయినప్పటికీ ఈ ప్రాంతాలు స్థానికంగా కొండజాతికి చెందిన రాజుల ఆధీనంలోనూ, క్షత్రియ, వెలమ కులాలకు చెందిన వారి పాలనలోనే కొనసాగాయి. ఆనాటికి రాజులు శిస్తు వసూలు చేసే అధికారం, రక్షణకోసం స్వంత సైనిక బలగాలను పోషించుకునే అధికారం కల్గి ఉన్నారు. అయితే అత్యధిక భాగం విజయనగరం రాజుల ఆధీనంలోనే ఉండేది. బొబ్బిలి యుద్ధం తదనంతర పరిణామాలలో బ్రిటీష్ వలసపాలకులను విజయనగరం రాజు ఆనందగజపతి రాజు ఆహ్వానించాడు. బ్రిటీష్‌వారితో చేతులు కలిపి ఫ్రెంచివారిని యుద్ధంలో ఓడించడం ద్వారా బ్రిటీష్ వలసపాలన ప్రత్యక్షంగా ప్రారంభమయింది. ఈ యుద్ధానంతర పరిణామాలలో నైజాం నవాబు సలాబత్‌జంగ్‌కు, బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ వారికి జరిగిన సంధిలో భాగంగా బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలోకి వెళ్లింది. అయినప్పటికీ స్థానికంగా రాజుల ప్రత్యక్ష పర్యవేక్షణలోనే సామాన్య ప్రజానీకం ఉంది. యుద్ధం జరిగి, విజయం సాధిస్తే జరగబోయే పరిణామాలను గురించి విజయనగరం రాజులకు ఆంగ్లేయులకు మధ్య ఒప్పందం కుదిరింది.

శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి అమల్లోకి వచ్చిన కొంత కాలానికే ప్రధానంగా కొండ జమీందార్లు, కంపెనీ చెప్పిన పద్ధతుల్లో 'పేష్కస్' చెల్లించలేకపోవడంతో బహిరంగవేలం పద్ధతుల్లో ఈ జమీలను కంపెనీ స్వాధీనంలోకి పోవడమో లేదా బహిరంగ వేలంలో అధికమొత్తాలను చెల్లించిన వారికి దఖలు పడటమో జరిగాయి. జమీలు పోవడం తోనూ, కంపెనీ పాలకుల ఆదేశాలను పాటించాల్సి రావడం అనే కారణంతోనూ అనేక ప్రాంతాలలో అసంఘటిత రైతాంగ పోరాటాలు జరిగాయి.

ముఖి వీరభద్రరాజు పితూరీ, పాయకరావు తిరుగుబాటు, అచ్చుపువలస పితూరీ, పట్టశింగి పితూరీ, గొలు గొండ పితూరీ ఇలా అనేక తిరుగుబాట్ల వెల్లువ అటవీ ప్రాంతాలలో సాగింది. రాజ్యం అల్లకల్లోలంగా మారుతోందని గ్రహించిన బ్రిటీష్ ప్రభుత్వం ఈ తిరుగుబాట్ల వెల్లువను అణచివేయడం కోసం సకల అధికారాలు కల్పించి రసెల్ అనే అధికారిని పంపింది. అతడు ఓ వైపు తిరుగుబాట్లను విజయనగర జమీందార్ విద్రోహకర వత్తాసుతో నిర్దాక్షిణ్యంగా అణచివేస్తూ, సాధారణ పరిపాలనా చట్టాలతో వీళ్లను పాలించడం అసాధ్యంగా భావించి ఈ ప్రాంతాలకు వర్తించేలా విశేష అధికారాలతో కలెక్టర్‌ను ఏజెంట్‌గా నియమిస్తూ ప్రత్యేక చట్టాన్ని 1838 సంవత్సరంలో తీసుకువచ్చారు. ఆ తర్వాత కాలంలో విశాఖ జిల్లాలో తిరుగుబాట్ల వెల్లువ కొనసాగుతూనే ఉంది. సాలూరు ప్రాంతంలో కొర్రాయి వలస పితూరి, బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని కూల్చాలనే స్పష్టమైన లక్ష్యంతో సాగింది. 5000 గిరిజన సైన్యాన్ని కొర్రా మల్లయ్య సమకూర్చుకున్నాడు. వాళ్లకి తుపాకి ఆకారంలో ఉండే వెదురుబొంగులతో విల్లంబులను అందించి సాయుధులను చేసాడు. విషయాన్ని గ్రహించిన బ్రిటీష్ పాలకులు 1900 మే 7న ప్రత్యక్ష దాడికి దిగి వీరిపై దమనకాండకు పాల్పడ్డారు. ఉద్యమ నాయకులను నిర్బంధంలోకి తీసుకున్నాడు. నిర్బంధంలోనే కొర్రా మల్లయ్య మరణిం

చాడు. దీని తర్వాత సాయుధ తిరుగుబాట్లకే తలమానిక మైన అల్లూరి శ్రీరామరాజు నేతృత్వంలో రంప తిరుగు బాటు రూపుదిద్దుకుంది. బహుశ దీర్ఘకాలం అంటే 2 సంవత్సరాలపాటు తమ కొద్దిమంది సైన్యంతో బ్రిటీష్ ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టిన రంప చోడవరం తిరుగుబాటు నాయకత్వ నిర్మూలనతోటే అణచివేయ బడింది. మొత్తంగా వలసపాలన కాలంలో సాగిన ఆది వాసీ తిరుగుబాట్లను, కారణాలను సాకల్యంగా, లోతుగా పరిశీలించాల్సి ఉంది.

బ్రిటీష్ కంపెనీ పాలన కూడా అంతకుముందు ఈ దేశంపై దండెత్తిన దురాక్రమణదారులవలనే భారతీయ సామాజిక పునాది చట్రాన్ని కదిపే ప్రయత్నం ఏమీ చేయలేదు సరికదా ఈ చట్రంలో అత్యున్నత స్థానంలో ఉన్నవారి పునాదిని మరింత బలీయం చేసింది. ఆ విధంగా తమకు ఎటువంటి ఢోకా రాకుండా చూసుకొంది. సామాజిక స్థాయిలోని పై వర్గంతో రాజీపడటం ద్వారా తన అధికారాన్ని స్థిరపరచుకొనే ప్రయత్నం చేసింది. ఈ దేశపు భూసంబంధాలలో మౌళిక మార్పులు తీసుకు రావడానికి కంపెనీ ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు సరికదా యధాస్థితిని కొనసాగించడానికే కంపెనీ మొగ్గుచూపింది. సరికదా అంతవరకు దేశంలో లేని భూస్వామ్య వ్యవస్థకు పునాదులు వేసింది. రెవెన్యూ వసూళ్ల యంత్రాంగంగా ఉన్న జమీందార్లకు భూములపై అధికారాన్ని దఖలు పరిచే శాశ్విత నిర్ణయ పద్ధతిని అమలు చేసింది. ఆ విధంగా సామ్రాజ్యవాదం దేశీయ ఫ్యూడ లిజంతో మమేకమైందన్న సూత్రీకరణ తెలుగు ప్రాంతంలో అడుగడుగునా కనిపిస్తుంది.

శాశ్వితశిస్తు నిర్ణయం జరిగిన తర్వాత భూమిపై శాశ్వత హక్కు, వంశపారంపర్యహక్కులతో సహా జమీందారీ వర్గం ఏర్పడిన తర్వాత భూసంబంధాలలో అత్యంత మొరటు పద్ధతులు చోటచేసుతున్నాయి. ప్రాచీన గ్రామ సమాజంలో భూమి ఉమ్మడి ఆస్తిగా పరిగణించబడే స్థితి నుంచి, బ్రిటీష్ తరహా ఫ్యూడలిజంని బ్రిటీష్ సామ్రాజ్యవాదంతో రైతాంగ జీవితం ఎలా అతలాకుతల మైన స్థితిని ఎదుర్కొందో రైతులు అసహాయ స్థితినుంచి ఆందోళనాపథం వైపు అడుగులు వేసిన స్థితిని పరిగణిం చాల్సి వుంది. ఏ పరిస్థితుల్లో రైతాంగం జీవనం గడుపుతోందో అర్థం అవుతుంది.

## బొబ్బిలి జమీందారీ :

బొబ్బిలి జమీందార్ రైతాంగంపై క్రూర నిర్బంధకాండను ప్రయోగించడంలో ఈయన అగ్రగామి. రైతాంగంలో ఏ ఒక్కరూ తనకు ఎదురుచెప్పకూడదనేది ఈయన అహంకార ప్రవృత్తికి నిదర్శనం. అటవీ ప్రాంతా లపై సైతం అధికారం ఈతనిదే అటవీ ప్రాంతాలను ఆనుకొనివున్న గ్రామాలలో వ్యవసాయ భూమిపైకి అడవి జంతువులు వచ్చి దాడిచేస్తే వాటిని కొట్టే హక్కుసైతం రైతాంగానికి లేదు. తమ పంటలు నాశనం అవుతున్న మౌనంగా పట్టనట్లు చూడాల్సిన స్థితి రైతాంగానిది. (ఇంటర్వ్యూ: మద్రాపు సత్యనారాయణ, రైతు నాయకులు) సరిగ్గా 16 శతాబ్దంనాటి జర్మనీ రైతాంగం స్థితిని ఎంగెల్స్ తన ప్రసిద్ధ గ్రంథం 'జర్మనీలో రైతు యుద్ధాలు' అనే పుస్తకంలో వివరించిన విధంగానే ఈ స్థితి ఉంటుంది. బొబ్బిలి సంస్థానంలో అటవీప్రాంతాల పరిరక్షణకు ఒక అటవీశాఖాధికారి ఉండేవారు. బొబ్బిలి జమీందారీ ప్రాంతంలో అటవీప్రాంతం హెచ్చుగానే ఉండేది. దుప్పులు, లేళ్లు, సింహం, సివంగి, చిరుత పులులు, అడవి పందులుండేవి. అడవిపందులు తరచుగా అటవీ భూములను ఆనుకొనిఉన్న వ్యవసాయభూములపై పడి పంటను ధ్వంసం చేసినా వాటిని బంధించే అధికారం కానీ, చంపే హక్కుగాని రైతాంగానికి లేదు. బొబ్బిలి సంస్థానంలో ఈ అటవీ ప్రాంతానికి ఆనుకొని బక్కుపేట, నారశింహునిపేట, రాజేరు, బొడ్డవలస, కొనికొండవలస, నిమ్మలపాడు, చెల్లివలస, డొంగిరివలస, నారాయణప్ప వలస ఇలా అనేక గ్రామాలుండేవి. ఈ గ్రామాల రైతాంగానికి తమ పంటలు తిరిగి ఇంటికి వచ్చే వరకు అడుగడుగునా గండాలే. (మద్రాపు ఇంటర్వ్యూ)

రైతుల జీవన సరళి చాలా సాధారణంగా ఉండేది. కట్టుకోవడానికి గుడ్డలు ఉండేవి కావు. కేవలం మొల వరకు మాత్రమే గుడ్డ కట్టేవారు. ఆడవాళ్ళకు జాకెట్టు తొడిగే అలవాటు లేదు. పిల్లలకు వస్త్రధారణ అనేదే లేదు. వ్యవసాయకులాల పరిస్థితి ఇలా ఉంటే దళిత, గిరిజనుల పరిస్థితి మరింత దారుణంగా వుండేది.

జమీందారు దగ్గర బంధువు అటవీశాఖ అధికారిగా ఉండేవారు. అతను నిరంతరం గుర్రంపై ఈ ప్రాంతాలను తిరుగుతూ అజమాయిషీ చేసేవాడు. మైదాన ప్రాంతంలో ఏదైనా అంశంపై ప్రజల్లో ఎవరైన పొరపాటున నిలవేసినా వాళ్లపై అటవీసంపద నాశనం చేశారనే కేసులు నమోదు చేయబడేవి.

ఈ పరిస్థితులు దాదాపుగా 'స్వాతంత్ర్యా'నంతర కాలం వరకు కూడా కొనసాగాయి. బొబ్బిలి జమీందారీ దొంతరల వ్యవస్థ జమీందార్ -దివాన్ -శిరస్దార్ -ఠాణేదార్ -సమాజ్‌దార్ -గ్రామ రెవిన్యూ పెత్తందార్‌ను చూసినా హడలుగానే ఉండేది.

బొబ్బిలి సంస్థానాధీశుని నిరంకుశత్వానికి వ్యతిరేకంగా రైతాంగం ఆగ్రహం ఎప్పుడూ అణచిపెట్టబడి ఉండేది. 1992లో శిస్తులు పెంచడాన్కి బొబ్బిలి జమీందారు చేసిన నిర్ణయాలకు వ్యతిరేకంగా రాజాం దగ్గరలోని అడవరం - లక్ష్మీపురం గ్రామ రైతాంగం స్పాంటేనియస్ ఆందోళన చేశారు. బొబ్బిలి రాజు వాళ్లను ఖైదు చేయించాడు. 22 మంది రైతులు అరెస్ట్ చేయబడ్డారు. అందులో ఒకతను జైల్లో మరణించాడు. (ఆంధ్రప్రదేశ్‌లో రైతు ఉద్యమాలు : సం: వై.వి.కృష్ణారావు)

## పర్లాకిమిడి జమీందారీ :

పర్లాకిమిడి రాజు కూడా ఇతర జమీందారుల్లానే వ్యవహరించేవాడు. ప్రజల్లో అత్యధికశాతం నిరక్షరాస్యులు, వ్యవసాయకులాలుగా ఉన్న వారిలో ఈ ప్రాంతంలో కాపులు అధికం. రైతులకు స్వంత ఆస్తి అనేదిలేదు. జమీందార్ సిబ్బంది శిస్తుల వసూలుకు వచ్చేవారు. పాతపట్నం, పర్లాకిమిడి (నేటి అర్థంలో) తాలూకాలు మొత్తం ఫర్లాకిమిడి జమీందార్ ఆధీనంలో ఉండేవి. ఈ జమీలో నీటి వనరులుగా ఫర్లాకిమిడిలో సీతసాగరం, పాతపట్నంలో రామసాగరం అనే చెరువులే ఉండేవి. మెళియాపుట్టిలో ఒక చెరువు ఉండేది. ప్రాజెక్టులు లేవు. చెరువులు, చిన్న నీటి సరస్సులు మాత్రమే నీటి వనర్లు.

నీటి వనరులున్న ప్రాంతంలో వరి, మెట్ట ప్రాంతాలలో వేరుశెనగ ప్రధాన పంటలు. కొద్దిపాటి చెరకు. అరటి పంటలుండేవి. (ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు దారపు విశ్వనాథం ఇంటర్వ్యూ ఆధారంగా)

## విజయనగరం సంస్థానం :

జమీందారులందరికన్నా విజయనగరం జమీం దారులు ఉదార స్వభావులనే పేరు ఉంది. అయితే ఈతని క్రింద లెక్కకు మించిన ఇనాందార్లు, మొఖసాదార్లు ఉండేవారు. వాళ్లు చాలా దుర్మార్గంగా వ్యవహరించేవారు. విజయనగరం జమీందారు ఏనాడూ వీరిని కట్టడి చేసే ఆలోచన చేసేవాడు కాదు. సరికదా రైతాంగం హక్కుల గురించి వాకబుచేసి వాళ్లను తమ దుర్భర, దారిద్ర్యం నుంచి తప్పించిన దాఖలాలు కూడా లేవు. దీనికి ఉదా హరణగా అలమండలో 'కాకర్లపూడి' ఇంటిపేరుగల రాజులలో కొందరు చాలా దుర్మార్గంగా ప్రజలతో వ్యవహరించేవారు.

'అలమండ' చుట్టుపక్కల గ్రామాలలో ప్రజలు రోడ్డుమీద చెప్పులు కూడా వేసుకొని నడవడానికి వీలులేదు. ఒంటినిండా బట్టలు కట్టుకోడానికి లేదు. ఈ గ్రామాల్లో యువకులకు ఇతర గ్రామాలవాళ్లు పిల్లనిచ్చే దానికి సైతం ముందుకు వచ్చేవారు కాదు. ఈ గ్రామాలు ఎప్పుడూ రాజుల ఆధీనంలో, చెప్పుచేతల్లో ఉండాల్సి ఉండేది. రాజుల స్వంత పొలాలు సాగుచేసిన తర్వాత మాత్రమే రైతులు తాము సాగుచేస్తున్న భూములు సాగు చేయాల్సి ఉండేది. ఉన్న ఒకే ఒక నీటివనరు గ్రామంలో ఉన్న చెరువు మాత్రమే. చెరువుల దగ్గర భూములన్నీ మొఖాసాదార్లవే! రైతుల భూములకు నీటి గ్యారంటీ అనేది

లేదు. రైతుల పరిస్థితి ఇలా ఉంటే వీళ్లమీద ఆధారపడే వ్యవసాయకూలీల స్థితి చెప్పనలవికాదు' (అలమండ రైతు ఉద్యమ నాయకుడు లగుడు సింహాద్రితో ఇంటర్వ్యూ)

## మందస జమీందారి ప్రాంతం :

జమీందార్‌కి 'అంచనాల కమిటీ' అని ఉండేది. ఆ అంచనాల కమిటీ గ్రామాలను పర్యటించి అంచనావేసి తమ నివేదికలను జమీందార్‌కి ఇచ్చేవారు. ఈ అంచనాలను బట్టి శిస్తు నిర్ణయం అయ్యేది' (రైతు ఉద్యమ నాయకుడు మార్పు పద్మనాభం తనయుడు సీతారామయ్యతో ఇంటర్వ్యూ) శాశ్విత శిస్తు నిర్ణయ పద్ధతిలో నిర్ణయం అయిన శిస్తులకు, వాస్తవంలో రైతు దగ్గర వసూలు చేసే శిస్తులతో ఎటువంటి పోలికా ఉండేదికాదు. రైతాంగం తీవ్రమైన దారిద్ర్యంతో మగ్గేవారు.

పంట దిగుబడులు కూడా చాలా స్వల్పంగా ఉండేవి. పంటలో అధికభాగం శిస్తులకే పోయేది. శిస్తులు చెల్లించలేక రైతాంగం భూముల్ని వదిలేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. వీటి గురించి ఇంకా వివరంగా చర్చించాల్సి వుంది.

మొత్తంగా పరిస్థితి చూసినపుడు స్పష్టమైన వర్గవిభజన జరిగిపోయింది. కొద్దిసంఖ్యలో, అష్టైశ్వర్యాలతో, రైతాంగాన్ని పీల్చిపిప్పిచేస్తూ భోగాలను అనుభవించే జమీందారీ వర్గం, వాళ్లకు వస్తాసుగా నిలబడే బ్రిటీష్ సామ్రాజ్యవాదం ఒకవైపున, అశేష రైతాంగం, పీడిత ప్రజానీకం మరోవైపు ఎదురెదురుగా మోహరించి ఉన్నారు. అజ్ఞానం, నిరక్షరాస్యత, జమీందారీ పాలకులపై మూఢభక్తి, రెక్కలు తప్ప ఆస్తులు లేని రైతాంగం, వ్యవసాయకూలీలు మరోప్రక్క ఉన్నారు.

## రైతాంగ ఉద్యమ చైతన్యం :

1920-47 కాలం నాటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని ఉద్యమ, చైతన్య స్థాయిలను పరిశీలిస్తే, 1917లో విజయవంతమైన రష్యావిప్లవ ఫలితంగా ఒక నూతన తరహా సమాజం కోసం యువత కలలు కనడం ఆరంభమైంది. 'రంగూ, రూపులో భారతీయులుగానూ, ఆలోచనల్లో ఆంగ్ల మానసపుత్రులు గానూ' తయారు చేయాలనుకొన్న 'మెకాలే' సంకల్పం జాతీయ భావాలు గల యువత తయారుకావడాన్కి కూడా తోడ్పడింది. ఆంగ్లభాషను అధ్యయనం చేయడంతోపాటు ప్రపంచ చరిత్రను, రాజకీయాలను సైతం యువత అధ్యయనం చేయ సాగింది. ప్రధానంగా రష్యన్ విప్లవ విజయం యువతరాన్ని మంత్రముగ్ధుల్ని చేసింది. ఫలితంగా అస్పష్టంగానైనా కార్మిక, కర్షక రాజ్యం కోసం తపన మొదలైంది. తమ దేశంలో విదేశీ సామ్రాజ్యవాదుల జోక్యాన్ని, అజమాయిషీని, నియంత్రణలను ప్రశ్నించే ఉద్యమాలు మొదలైనాయి. మొదటో ఈ భావాలు మధ్య తరగతి చదువు కున్న బృందాలకు పరిమితమైనప్పటికీ వ్యవసాయక సమాజంగా ఉన్న భారతదేశం లాంటి దేశంలో అవి సామాన్య రైతు జనావళికి వ్యవసాయ కూలీల శ్రేణుల్లోకి వెళ్ళకుండా ఉద్యమాలు నిలదొక్కుకొనే అవకాశం ఉండదు. కాబట్టి ఉద్యమాలు మధ్య తరగతి శ్రేణుల్ని దాటి రైతు సంఘాలుగానూ, వ్యవసాయ కూలీ సంఘాలుగానూ పరివర్తన చెందడం ఆరంభించాయి. తద్వారా సామాజిక జీవితపు అట్టడుగు పొరల్లో చైతన్యం విస్తరించి, రైతు ఉద్యమాలకు జవాన్ని, జీవాన్ని అందించాయి.

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# విద్యార్థుల్లో నైతిక విలువలు

- కాపర్తి స్వరాజ్యం, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

మన సంస్కృతి ఆది నుండే మానవతా పరిమళాలను వెదజల్లుతూ మానవునిలో మార్పును తీసుకొచ్చి మంచిని పెంచుతూ ఆదర్శంగా ఆవిష్కృతమై అగ్రపూజనందు కుంటుంది. కావునే ప్రపంచంలో అసలైన మానవత్వం ఎక్కడుందంటే ఒక్క భారతదేశంలోనే చెప్పడంలో అతిశయోక్తి లేదు. "అహింసా పరమధర్మ" అన్నది మన వేదం, వాదం అదే దేశ నాదంగా నిల్చింది". ఆత్మవత్ సర్వ భూతాని....."అని నినదిస్తాయి మన గీతాది గ్రంథాలు అంటే పరోపకారమే పుణ్యం. పరుల పీడించడం పాపమని వ్యాసమహార్షి అష్టాదశ పురాణాల సారాంశ తత్త్వం తెలిపాడు. నిరుపేదలకు,నిర్బలులకు, రోగులకు ఇంకా అనేక మందికి ధైర్యము కోల్పోయిన భయనీతి పరులకు, ఆపదలో కొట్టుమిట్టాడే వారికి కాస్తంత ఉప్పు ధైర్యాన్ని ఆశను, ఆత్మ విశ్వాసాన్ని,వ్యక్తిత్వ పరిమళాలనందించేదే మానవత్వమని పెద్దల విషయం.

మనుషులు సూదిలా ఉండకూడదని దారంలా ఉండాలని, సూది పని రంధ్రాలు చేయడమే కాని దారం ఆ రంధ్రాలన్నింటినీ కప్పుకుని వెళ్తుందని వేమన వాణి. మానవునిలో మానసిక మార్పు తేవడం చాలా ముఖ్యమైన దనేది తెలుస్తుంది.

తల్లిదండ్రి లేని బిడ్డల్ని జూచి
కన్నీరు దానంబు చేయు నేత్రములు నావి
కఠిన చిత్తుల దురాగతముల ఖండించి
కనికరమొలకించు కలము నాది - జాషువా

ఆకలి దప్పిక లతో జంతువులైన బాధపడవద్దని నిష్కామ బుద్ధితో బాధితులకు సేవ చేయడమే ఉత్కృష్టమైన మానవ ధర్మం. (స్వామి వివేకానంద) పూజించే చేతుల కన్నా ప్రార్థించే పెదవులు మిన్న. (మథర్ థెరిస్సా) ఎంతో మంది మహానీయులు మానవత్వం గురించి ప్రస్తావించారు. వీటిని ఆచరణలో పెట్టకపోవడమే మన దురదృష్టం. నేడు జీవన విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. జీవన విధానంతో పాటు ఆలో చనల్లో, ఆర్థిక సంబంధాల్లో కూడా అనేక మార్పులు. మారుతున్న కాలంతో పాటు మనిషి తన ఆలోచనలు మార్చుకోవడమే కాదు,తనను తానుకోల్పోతున్నాడు. విలువలను నశింప చేయుచున్నాడు. ముఖ్యంగా తల్లి దండ్రులు ఆర్థిక పరమైన బాధ్యత లో మునిగి పోయి పిల్లలను పట్టించుకోకపోవడమే తాము చేసే పనులు పిల్లల మానసిక స్థితి పై ప్రభావాన్ని చూపుతున్నాయి.నేడు అనేక విద్యాసంస్థలు ర్యాంకుల కోసం పిల్లలపై ఒత్తిడి తెచ్చి వారిని టాపర్లను చేస్తున్నాయి కాని వారిలో విలువలు పెంచలేదు పోతున్నారు. నేడు పిల్ల వాడిని ఒక డాక్టర్, లాయర్, కలెక్టర్ ఇంకా ఏదైనా ఉన్నత వ్యక్తిగా తయారు చేయగలుగుతున్నారు కానీ ఉన్నత వ్యక్తిత్వం గల మనిషిగా మార్చలేకపోతూన్నాడు. కారణం విలువలు నేర్పు సమయం లేకపోవడం కాదు దాని గురించి ఆలోచించక పోవడం. ఎంతసేపు ర్యాంకుల కోసం ఆరాట పడడంతో నే సరిపోతుంది. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలు బాగా చదువుకోవాలని, బాగా సంపాదించాలని కోరుకుంటారే గానీ ఆ పిల్లల మానసిక స్థితి ఎలా ఉంది, వారు ఇతరులతో ఎలా నడుచుకుంటున్నారో ఆలోచించే సమయం కూడా లేకుండా పోయింది.స్కూల్ లో టీచర్ చెప్పేది వింటున్నాడో అవసరం లేదు, తమ పిల్లలు ఇతర విద్యార్థులతో ఎలా ఉంటున్నారో కూడా పట్టించుకోరు కానీ ఎవరైనా ఉపాధ్యాయుడు తమ పిల్లల్ని దండిస్తే మాత్రం ఆ స్కూల్ పై ఉపాధ్యాయునిపై గొడవకు దిగుతున్నారు. తల్లిదండ్రులు అతి ప్రేమతో తమ పిల్లల భవిష్యత్తును తామే పాడుచేసుకున్న వారవు తున్నారు. దీనివల్ల విద్యార్థులు విచక్షణ జ్ఞానాన్ని కోల్పో

తున్నారు పెద్దలను గౌరవించాలని, మర్యాదగా మాట్లాడాలని, గురువులకు ఎదురు చెప్పకుండా ఉండడం, తల్లిదండ్రులను సేవించటం, తోటి వారికి సహకరించడం అనే కనీస విలువలు కూడా లేకుండా మరచిపోతున్నాడు. కారణం వీటి గురించి తెలియక పోవడం కాదు ఆచరించాలని ఆసక్తి లేకపోవడం. నైతిక విలువలు వ్యక్తి యొక్క వ్యక్తిత్వం సానుకూల, ప్రతికూల చిత్రం. అతని ప్రవర్తన యొక్క పర్యవసానంగా సానుకూల, ప్రతికూల పరిస్థితులు ప్రదర్శించబడతాయి. న్యాయం మరియు స్వేచ్ఛ కోసం పోరాడే వ్యక్తి సానుకూలంగా భావించే విలువలు న్యాయమైన వ్యక్తి యొక్క ప్రతిబింబం. కానీ దీనికి విరుద్ధంగా ఈ విలువల పట్ల మానవుడు ఉదాసీనంగా ఉంటాడు మరియు అన్యాయాలకు కొంత మద్దతు ఇస్తాడు. కాబట్టి నైతిక విలువలు సామాజిక శ్రేయస్సు మరియు సమాజంలో సామరస్యపూర్వక మరియు శాంతియుత సహజీవనం సాధించేందుకు వ్యక్తి యొక్క ప్రవర్తనను నియంత్రించడానికి అనుమతిస్తాయి.

పూర్వం పాటలు పుత్రం పాలించే సుదర్శనుడు అనే రాజుకు కలిగిన నలుగురు కుమారులు బుద్ధిమాంద్యులు గలవారై ఉండడం చేత రాజు నిరంతరం దుఃఖిస్తూ ఉండేవాడు ఎంతోమంది చేయలేని పని విష్ణుశర్మ కేవలం నీతి కథల ద్వారా ఆరు నెలల్లో తీర్చిదిద్దాడు రాజ కుమారులను. నీతి కథల గొప్పదనం బుద్ధిమాంద్యులను కూడా ఉన్నతులను చేస్తుంది అనేది తెలుస్తుంది. నేడు పిల్లలకు నీతి అంటే తెలియకపోవడంతో నైతికత్వం లోపించింది. ఒక దేశం సమాజం చట్టపరమైన విలువలు డాక్యుమెంట్ చేయబడి, అమలు చేయబడినప్పటికీ రాష్ట్రాభివృద్ధికి సరిపోవు. పౌరుని నైతిక విలువలు పాటిస్తేనే ఉన్నతంగా ఏర్పడుతుంది మానవుల్లో ముఖ్యంగా విద్యార్థులు ఉండాల్సిన లక్షణాలను వివరిస్తూ

పెద్దలు విచ్చేసినచో
బద్ధకమునైన దుష్ట పద్ధతి నైనన్
హద్దెరిగి లేవకున్నన్
మొద్దువలె జూతురతని ముద్దు కుమారా

- కుమార శతకం

పెద్దలు వచ్చిన సోమరితనం వల్ల లేదా చెడు పద్ధతిన వారిని గౌరవించనట్లయితే వాని మనిషిలా లెక్కించరు అందుకే పెద్దలు వచ్చినప్పుడు మర్యాదగా గౌరవించాలని పై పద్యంలో నాదే చెప్పబడింది అలాగే పెద్దలను పూజించినట్లయితే వారికి కలిగే గతిని గురించి

వృద్ధజన సేవ చేసిన
బుద్ధి విశేషజ్ఞ భూత చరితు డున్
సద్ధర్మ శాలిని బుధు
అధర్మ బొణిడెదరు ప్రేమ యొసగ కుమార

పెద్దలను పూజించినట్లయితే వారికే లోకమునందు పరిశుద్ధ మనస్సు కలవాడని తెలివితేటలు కలవాడని ధర్మం తెలిసిన వాడని పెద్ద లంటారనడంలో పెద్దలు దైవంతో సమానం అని తెలుస్తుంది. ఇవన్నీ నేడు పిల్లల్లో లోపిస్తున్నాయి కారణమేదైనా కోల్పోయేది విలువలనే.

తల్లిదండ్రులు పిల్లలను వదిలి వేసి హాస్టల్‌లో ఉంచడం, పెద్దయ్యాక అదే సంస్కృతి పాటిస్తూ పిల్లలు తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలు వేయడం, ఆత్మహత్యలు చేసుకోవడం, అత్యాచారాలకు పాల్పడడం మొదలైన వాటన్నింటికీ కారణం నైతిక విలువలు లేకపోవడమే. తమ మీద తమకు నమ్మకం లేక ధైర్యం కోల్పోయిన విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. గురుబ్రహ్మ, గురువిష్ణు, గురుదేవో, మహేశ్వర అలాంటి గురువు నేడు గౌరవం లేకుండా పోయింది కారణం విద్య నేర్చుకునే వారిలో విలువలు నశించడమే. నైతిక విలువలు గురించి అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యార్థులు నైతిక విలువలు అభివృద్ధి చెందకపోవడానికి కారణం ఆ పుస్తకాల్లోని విషయాలను క్లుప్తంగా చదివి అర్థం చేసుకోకపోవడం ఇంకొక కారణం తెలియ చెప్పే వారు లేకపోవడం. తల్లి ఒడి నుండి బడిలో కి వచ్చిన పిల్లలు

విద్య నేర్చుకోవడమే కాకుండా విలువల్ని నేర్చుకోవాలి అంటే విలువలతో కూడిన విద్య నేర్చుకున్న వారిలో తమ మీద తమకు నమ్మకం, ధైర్యం, బ్రతుకు గమ్యం, సకల ప్రాణులపై దయ, జాలి కలిగి ఉంటాడు. పూర్వకాలం ఆశ్రమాల గురువుల దగ్గర రాజకుమారులు సైతం వినయంతో విద్య నేర్చుకునే వారు. రాముడు అంతటి వాడే విశ్వామిత్రుని అనుసరిస్తూ సేవలు చేయుచు విద్యనభ్యసించాడు కాబట్టి దేవుడయ్యాడు. ధర్మాన్ని పాటించి, విలువలను పెంచుకున్నాడు కాబట్టే మానవుడైన మాధవుడు అయ్యాడు.

వ్యక్తిలో నైతిక విలువలు అలవాటు చేసుకుంటే వచ్చేవి కావు చిన్నప్పటినుండి ఆచరించేవి. "మొక్కై వంగనిది మానై వంగునా" అన్నట్లు పిల్లల్లో చిన్ననాటి నుండి నైతిక విలువలు అలవాటు కాకపోతే పెద్దయ్యాక వారిని మార్చుకోవడం చాలా కష్టమవుతుంది. సమాజంలోని దురాగతాలను రూపుమాపాలి అంటే ముందుగా పిల్లల నుండి నైతిక విలువలు పెంపొందింప చేయాలి. దీనికి విద్యార్థి దశ అనువైనది అందుకే చిన్నప్పటినుండి పిల్లల్లో ఒత్తిడి, కోపం, పగ పెరగకుండా ప్రేమను దయను ధరించినట్లయితే పెరిగిన తర్వాత సమాజంలో ఘర్షణలు, విభేదాలు, హత్యలు, ఆత్మహత్యలు లాంటివి జరగకుండా ఉంటాయి. విలువలు అంటే డబ్బుతో కొనేది కాదు, వెలకట్టే వి కాదు మనిషిలోని ఉన్న సమాజంలో గౌరవం కలిగించి విలువలు. సమాజంలో అనేక కులాలు, మతాలు, వర్గాల వారు ఉన్నారు. ప్రతి వారికి కొంత వ్యక్తిత్వం ఉంటుంది ఆ వ్యక్తిత్వాన్ని పెంపొందింప చేసేవి విలువలు. డబ్బు ఉంటే విలువ వస్తుందని లేకుంటే రాదని కాదు కేవలం మనం చేసే పనులు మంచి నలుగురికి ఆదర్శం ఐతే విలువను పొందగలుగుతాము. ఈ నైతిక విలువలు మానవ జీవితంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. మానవత్వం మరియు నైతిక తత్వం కలిగినది మానవతావాదం. ఒక వ్యక్తి యొక్క హ్యూమానిటీ ద్వారా మాత్రమే ఈ నియమాలు మరియు నైతిక సూత్రాలు సాధించవచ్చు. నైతిక విలువలు సమాజం నుండి వ్యక్తులకు ప్రసారం చేయబడిన నిబంధనలు మరియు ఆచారాలు సమూహంతో కూడి ఉంటాయి. తద్వారా అవి గౌరవించ పడతాయి మరియు నెరవేరుతాయి. ఈ విలువల ప్రజల మంచి ప్రవర్తన యొక్క సమతుల్యత కొనసాగించడానికి ప్రయత్నిస్తాయి. తద్వారా అవి మంచి చెడుల మధ్య తేడాను అలాగే సరసమైన మరియు అన్యాయమైనవిగా గుర్తించవచ్చు. నైతిక విలువలు సమాజంలోని వ్యక్తుల ప్రవర్తన ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నా, నైతిక విలువలకు సంబంధించిన ప్రవర్తనకు మార్గదర్శకాలను రూపొందిస్తాయి. నైతిక విలువల్లో మనం గౌరవం, సమగ్రత, న్యాయం, ఈక్విటీ మొదలైనవి చెప్పవచ్చు. నైతిక విలువలు వారి దైనందిక జీవితంలో వర్గీకరించబడతాయి ఎందుకంటే ఒక నిర్దిష్ట వ్యక్తి ఏచర్యలను నిర్వహించాలో నిర్ణయిస్తాయి.

బాల్యానికి సంకెళ్లు పడుతున్నాయి కాదు కాదు. బాల్యమే వెతుక్కొని ఏరికోరి సంకెళ్లు బిగించుకుంటుంది. అంతేకాదు కన్నవారి గుండెలను తన్నుతూ, పుస్తకాలను ఇతరులు పక్కకు నెట్టి జువనైల్ హోమ్‌ల వైపు కదిలిపోతుంది. దొంగతనం, అత్యాచారం, హత్య ఏ విచ్చలవిడిగా నేరాలకు పాల్పడుతూ తనను తానే చిదుముకుని నాశనం చేసుకుం టుంది. ఆధునిక చదువుల్లో నైతిక విలువలను తిలోదకాలు మిగులుస్తున్నారు. చాలాచోట్ల చిన్నపిల్లలే దొంగతనాలు చేసినట్లు, అత్యాచారాలకు పాల్పడి నట్లు వార్తా పత్రికల్లో చూస్తుంటాం. దీనికి కారణం వారిలో నైతిక విలువలు లోపించడమే. కోమలమైన చేతుల కలం పట్టి రాయాలి కరుణ చెప్పాలి కానీ ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు కారణం నైతిక విలువలు లేకపోవడం. విద్య వల్ల నైతిక విలువలు పిల్లల వ్యక్తిత్వాలని సరిదిద్దేందుకు కేవలం ఒకే ఒక సాధనం విద్య. విద్య అంటే కేవలం పాఠాలు చెప్పడం కాదు నైతిక విలువలతో కూడిన విద్య నేటి పిల్లలకు అత్యవసరం కానీ నేడు అనేక

విద్యాసంస్థలు విద్యార్థులు గొప్ప స్థాయిలో తయారు చేస్తున్నాయి కానీ మనుషులుగా తయారు చేయలేక పోతున్నాయి. ఉమ్మడి కుటుంబాల్లో నానమ్మ తాత మొదలైన బంధాల మధ్య పెరిగిన పిల్లల్లో నైతిక విలువలు ఎక్కువగా ఉండేవి కారణం పెద్దవారు పిల్లలని ఒడిలో కూర్చుండబెట్టుకొని అనేక నీతి కథలను, జానపద కథలను చెబుతూ పెద్దయ్యాక వారు ఎలా ఉండాలో చెప్పే వారు.. ప్రస్తుత పరిస్థితుల్లో నీతి కథల కు దూరమై బాల్యానికి నైతిక విలువలు ఇవ్వాలని స్పృహ లేకుండా మార్కుల మత్తులో మునిగిపోతున్నారు తెలుగు భాషకు విలువ లేదు దాన్ని తెలిపే గురువు అంటే గౌరవం లేకుండా పోతుంది. మిగతా విజ్ఞానశాస్త్రాలు మనిషికి విజ్ఞానాన్ని, ఆధునికీకరణ తెలియజేస్తున్నాయి కానీ జ్ఞానాన్ని మాత్రం (విలువలను) ఇవ్వలేక పోతున్నాయి దారం తెగిన గాలిపటం అయింది బాల్యం. బాల్యంలో నేరం కమ్మే స్తుంది ప్రాచీన సాహిత్య గ్రంథాల్లో మానవతా విలువలతో కూడిన విలువైన అనేక అంశాలు దాగి ఉన్నాయి. ఆధునిక సాహిత్యంలోను నేటి సమాజానికి అవసరమైన ఆలోచన ధోరణి తో కూడిన అంశాలు అనేకం. వాటిలోఎంపిక చేసుకొని చదివినట్లయితే నైతిక విలువలు విద్యార్థుల్లో తొలిదశలోనే అలవడుతాయి. ఉదాహరణకు భారతంలో తమకు ఎన్నో అపకారాలు చేసిన దుర్యోధనుణ్ణి గంధర్వుడు తీసుకెళ్తే అతన్ని విడిపించడానికి ధర్మరాజు సోదరులను ఆదేశించడం వారు వెళ్లి దుర్యోధనుని విడిపించి తీసుకొని రావడం ధర్మజుని గొప్పతనం తెలుస్తుంది.

ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ వివరింపంగన్
అపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ

పద్యంలో మనకు ఉపకారం చేసిన వారికి తిరిగి ఉపకారం చేయడం గొప్ప విషయం కాదు ఎవరైతే తనకు అపకారం చేసిన శత్రువైన మనం వారికి ఉపకారం చేయగలిగినప్పుడే గొప్ప వాళ్ళమవుతాం. అలాంటి వారిలో నైతిక విలువలు అద్దం పడతాయి. ధర్మరాజు అందుకు ఆదర్శం అలాగే "రంతి దేవుని కథ"ఆకలితో అలమటించే వారిని ఆదుకొని పట్టెడు అన్నం పెట్టాలని ఆలోచన మేల్కొలుపుతుంది అంతేకాదు చదువుకోవాల్సిన సమయంలో మనసు పడితే ఏం జరుగుతుందో "గుణనిధి కథ"ద్వారా మనకి గుణపాఠం తెలుపుతుంది. ఇలాంటి కథలు పిల్లల చేయడం వల్ల వారిలో నైతిక విలువలు మేలుకొలుపబడతాయి.

కీచక వధ ఘట్టం, రామాయణం యుద్ధకాండ, వేమన జీవితం మొదలైనవి పిల్లల్లో కామం వల్ల కలిగే నష్టాలు తెలుస్తున్నాయి. అత్యాచారాలు అనార్థ హేతువులను తెలిస్తే వారు వాటికి దూరంగా ఉంటారు." శ్రవణ కుమారుని కథ"తల్లిదండ్రులపై గౌరవం ప్రేమ కలిగిన పుత్రుని గురించి తెలుపడమే కాదు నేటి పిల్లలు ఎలా ఉండాలో చక్కగా తెలుపుతుంది. అప్పుడు కన్నవారిని నిర్లక్ష్యం చేయకుండా ఉంటారు."గోవ్యాఘ్ర సంవాదం" సత్య మహిమను తెలిపింది నేడు ముఖ్యంగా అలవాటు చేసుకోవాల్సింది సత్యం అన్న విషయం గ్రహించాలి.

పంచతంత్ర కథలో మిత్రలాభం, మిత్రభేదం, లబ్ధ ప్రణాంశం, కాకోలూకీయం, అపరీక్షిత కారకము ఈ ఐదు ఇంటికి సంబంధించిన అనేక కథల్లో ప్రకృతితో మానవ సంబంధం, మనుషుల మధ్య బంధం, వ్యక్తిత్వం మొదలైన అనేక విషయాలు ఇవన్నీ చిన్నప్పటినుండి పిల్లల మెదడులో నిక్షిప్తం చేసినట్లు అయితే పెరిగిన తర్వాత వారిలో విలువలు పెంపొందించ బడి మంచి పౌరులుగా మారుతారు. మనిషిని మనిషి ప్రేమించడమే కాదు. సకల జీవులను ప్రేమించాలి అప్పుడే మనుషుల్లో మానవత్వం రూపుదిద్దుకుంటుంది. కాలాలు మారిన మనిషి ఎన్నో సాధించిన తనను తాను సాధించలేక (తెలుసుకోలేక) కోల్పోతున్నారు. తాను అనే పదానికి అర్థం తెలియకుండా మిగిలిపోయి ఒంటరి అనే భ్రమలో పడి నిర్జీవంగా

మారిపోతున్నాడు. దీనంతటికీ కారణం విద్య నేర్చుకున్న విద్యార్థి విలువలను నేర్చుకోకపోవడమే. విలువ అంటే ధర కట్టేది కాదు, వెలకట్టలేనిది. అవి కొంటే వచ్చేవి కాదు. అలవాటు చేసుకుంటే వచ్చేవి. కాబట్టి తల్లిదండ్రులు పిల్లలు పుట్టగానే వారిని ఏం చేయాలో, ఎలా చదవాలో, ఎలా సంపాదించాలి అని నిర్ణయించుకుని వారి అభిప్రాయాలను పిల్లలపై రుద్ది వారిని మానసికంగా బలహీనంగా చేయకుండా ఎలా పెంచితే భవిష్యత్తులో భావిపౌరులుగా తయారవుతారు, రేపటి సమాజానికి ఏవిధంగా ఉపయోగపడాలి దానికి అనుగుణంగా వారి ఆలోచనలు ప్రోత్సహిస్తూ చక్కని మార్గదర్శకత్వంలో పెంచినట్లయితే పిల్లల్లో నైతిక విలువలు అభివృద్ధి పరచవచ్చు.

నేడు ఉమ్మడి కుటుంబం నేపథ్యం లేకపోవడం కూడా నైతిక విలువలు లోపించేందుకు ఒక కారణమని భావించవచ్చు. ఎందుకంటే ఉమ్మడి కుటుంబాల్లో నానమ్మ, తాత మొదలైన పెద్దవారు ఉండేవారు నేడు వాళ్ళు లేరు తల్లిదండ్రులు ఎక్కువగా పిల్లలు పెద్ద వారితో కలిసి ఉండేవారు నాడు. నేటి ప్రపంచంలో ఎవరికీ వారు ఏకాకిలా జీవించడం కూడా ఒంటరితనంలో పిల్లలు తమను తాము దిగజార్చు కుంటున్నారు. పెద్దలు పాతతరం వారైనప్పటికీ వారిలో మంచి, చెడు, ధర్మం, అధర్మం అనేక అంశాలు తెలిసి ఉండడం వల్ల పిల్లలకు వాటి గురించిన అంశాలను కథల రూపంలో అందించే వారు. నేడు ఆ వ్యవస్థ లేకపోవడంతో పిల్లలకు చెప్పేవారు లేక మొబైల్, ల్యాప్టాప్లమొదలైన సాంకేతిక వస్తువులతో కాలక్షేపం చేస్తూ మంచిని వదిలేసి చెడును గ్రహించి విలువలను కోల్పోతున్నాడు. ఆచారాల్లో ఆయుర్వేద ముందని తెలుసుకోలేక మనశ్శాంతి వెతుకుతూ మరణం తెచ్చుకుంటున్నాడు.

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# తెలుగు సినిమా చరిత్ర సామాజిక దృక్పథం

- బి. క్యాథరీన, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, గవర్నమెంటు డిగ్రీ సిటీ కాలేజ్, హైదరాబాద్.

ఏ కాలంలోనైనా ఉత్తమవాఙ్మయలక్ష్యం హిత బోధనం. ఆ హితం బోధించే విధానాల్లో తేడా ఉంటుంది. వేదం ప్రభువులాశాసిస్తూ బోధిస్తుంది. పురాణం మిత్రుడిలా సలహారూపంలో చెబుతుంది. కావ్యం ప్రియురాలిలా లేక ఇల్లాలిలా మృదువుగా సూచిస్తుంది. అందుకే ప్రాచీనలాక్షణికులు వేదం ప్రభుసమ్మితమని, పురాణం మిత్రసమ్మితమని, కావ్యం కాంతాసమ్మితమని వర్గీకరించారు. పై మూడింటిధ్యేయం మంచిని బోధించడమే అనేది స్పష్టం.

మానవీయ దృక్పథాన్ని మరింత బలంగా ప్రకటించ డానికి సందర్భం బాగా కుదిరింది ఆ గీతంలో. ఆ దేవుళ్ళు సామాన్యులరూపంలో ఇలా పల్లవిని ప్రారంభిం చారు.

"మంచి మనసును మించినదైవం
మహిలో కలదా నరుడా - ఇది
మరువకురా పామరుడా".

మంచి మనసున్నవాడే ఉత్తమపురుషుడు. అతడే పురుషోత్తముడు. మంచి మనసుకు అందుకే అగ్రపీఠం వేశాను. అది తాత్త్వికగీతం కాబట్టి కొన్ని సార్వజనీన సత్యాలను చరణాల్లో ఉల్లేఖించాను. వేద వేదాంగాల్లో వెలిబుచ్చిన సూక్తిముక్తాఫలాలనే ఆ పాటకుసరిపోయే ఆధునికభాషలో ఇలా అందించాను.

"గోవుల వన్నెలు వేరైనా - అవి కురుసేపాలు ఒకటేరా
నదీనదమ్ములు ఎన్నైనా - అవి కలిసే సాగరమొకటేరా.
దేవుని నామములెన్నైనా - దీవించే దైవం ఒకటేరా"

ఇలా చెప్పడంలో నా గొప్పతనమేమీ లేదు. ఇక్కడ నేను ఇంతవరకు లేనిది చెబుతున్నాననీ అనుకోరాదు. శాస్త్రపురాణాల్లోవున్న విషయాలను సగటు సినీప్రేక్షకులకు బోధిస్తున్నాను. చివరి చరణంలో కూడా ఈ వరసలోనే మరో అడుగుముందుకేసి సమకాలీన సాంఘికవాస్తవాలను ఇలా వివరించాను.

తోటిమనిషినే అంటరాదనీ గీటుగీసుకుని ఉన్నావా.
కులమతాలనే కోటలుకట్టి కుమ్ములాడుకుంటున్నావా.
అందరు దేవుని సంతతియేనని అసలుసత్యమే పరిచేవా"

అస్పృశ్యతను గురించి, కులమత సంకుచిత దృక్పథం గురించి ఈ పాటలో ప్రస్తావించడమంటే సమకాలీనతను విస్మరించరాదని వేలెత్తి చూపడమే.

ఏ విషయమైనా అప్పటికప్పుడే 'పాత' బడిపోతున్న ఈ రోజుల్లో.. ఎప్పుడో అర్థ శతాబ్దం పూర్వం నిర్మించిన కొన్ని చిత్రాలు నేటికీ మనలో ఆసక్తిని ప్రేరింపించడం ఆశ్చర్యకరమే! మన మనసులలో ఓ మహాకావ్యమై నిలిచిన 'రైతుబిడ్డ' వెండితెరకెక్కి నేటికి 50 సంవత్సరాలు పూర్తి అయింది. అయినా, మనమీ చిత్రాన్ని నేటికీ ఎందుకు గుర్తుంచుకున్నాం.సామాజిక స్పృహగల మార్గ 'దర్శకుడు' గూడవల్లి రామబ్రహ్మం వందల చిత్రాలకు దర్శకత్వం వహించిన దర్శకుడు కాదు. కేవలం ఎనిమిది చిత్రాలకు మాత్రమే ఆయన దర్శకత్వం వహించారు. ఇంకా చెప్పాలంటే పల్నాటియుద్ధం (1946) చిత్రానికి ఆరు రీళ్ళ వరకు రామబ్రహ్మం దర్శకత్వం వహించారు. గూడవల్లి మరణించిన తర్వాత మిగిలిన చిత్రానికి ఎల్.వి.ప్రసాద్ నేతృత్వం వహించారు. సారథీ సంస్థ రామబ్రహ్మం మానస పుత్రిక, గూడవల్లి నిర్మించిన 'మాలపిల్ల' 'రైతుబిడ్డ' ఈ సంస్థ నుండే వెలుగును చూసాయి. సారథీ సంస్థ పేరు రామబ్రహ్మం 'పత్ని', 'పంతులమ్మ' 'మాయాలోకం' చిత్రాలకు దర్శకత్వం వహించారు. రామబ్రహ్మం 1949 అక్టోబర్ 1వ తేదీన స్వర్గస్తులైనారు.

ప్రపంచంలోని సినిమా నిర్మాతలంతా సమాజాన్ని

మార్చాలన్న ఉద్దేశ్యంతో సామాజిక ప్రయోజనంగల సినిమాలను తీసినా అది వృధా ప్రయాసే అవుతుంది. సినిమా అనేది సమాజాన్ని మార్చలేదు. దాదాపు అర్ధ శతాబ్దం క్రితమే 1950లోనే బిఎన్ రెడ్డి విధవా వివాహాల మీద ఒక సినిమాను తీశాడు. అయిదు దశాబ్దాల తర్వాత నేడు కూడా ఎక్కడన్నా విధవ స్త్రీ పెళ్లి చేసుకుటుందంటే సమాజం కన్నెర్ర చేయడం మానలేదు. అఅలాంటపుడు రచనల ద్వారానో, సినిమాల ద్వారానో సమాజాన్ని మార్చాలనుకోవడం వృధా ప్రయాస కాదా? మనం ఏమనుకున్నా గానీ ఆ రోజుల్లోనే అంటే అరశతాబ్దం క్రితమే విధవా వివాహం మీద సినిమా తీయడానికి పోటీ జరిగింది. బి.ఎన్.రెడ్డి 'సుమంగళి'ని తీస్తే అదే కధాంశం మీద మరొకరు 'మళ్లీ పెళ్లి' అనే చిత్రాన్ని నిర్మించారు. దీనిని బట్టి మనకొక అంశం విదితమవుతుంది. అదేమిటంటే ప్రారంభం నుంచి కూడా సినిమా నిర్మాతలు సినిమా ద్వారా సమాజాన్ని మార్చవచ్చుననుకొంటూ వచ్చారు.

1941 నాటి సంచికలో 'నాగయ్య ప్రథమశ్రేణికి చెందిన నటుడు, దేవత సినిమాలో ఆయన మానసికంగా బాధ పడే సన్నివేశంలో మామూలు ఫార్ములా పాటల్ని పాడడు. ఒక్కమాట కూడా మాట్లాడటం ఉండదు. ఆ బాధనంతా ఆయన తన హావభావాల ద్వారా ప్రదర్శించుతాడు' అని 'విమర్శిం'చింది!. వాహినీవారి 'వందేమాతరం', 'సుమంగళి', 'దేవత' మొదలైనవి తెలుగు సినిమాలైనా తమిళంలో కూడా అద్భుతంగా ఆదరించబడ్డాయి. వాటి పాటలు, కథాపుస్తకాలు తమిళంలో కూడా ముద్రించబడినాయి. 'సుమంగళి'లా కాకుండా దేవత బాక్సాఫీసు వద్ద చక్కటి విజయాన్ని సాధించింది. నాగయ్య తన నేరాన్ని వప్పుకునే సన్నివేశంలో రామనాథ్ కేమేరాని ఉపయోగించిన తీరు ప్రశంసనీయం. ఫ్రేము అంచులో నాగయ్య మొహం చీకటిలో కనిపిస్తుంటే అతని తల్లి ఫ్రేముని డామినేట్ చేస్తూ పూర్తి వెలుగులో కనిపిస్తుంటుంది. 'దేవత'కు సంగీతాన్ని నాగయ్యగారే నిర్వహించాడు. 'అదుగో అందియలరవళి', 'రావే ఎవరు మాకింక సాటి', 'రావే రావే బంగారు పాపా', 'లోకములో లోభులు', 'ఎన్నాళ్లుండిన ఇక సుఖములే' ఈ పాటలు బాగా పాపులర్ కావటమేకాక ఒక ఒరవడిని కూడా సృష్టించాయి.

పూర్వం తెలుగు సినిమా నిర్మాతలు సినిమాని మాంత్రికుల మాయాజాలానికి ప్రతీకగా భావించేవాళ్ళు. కార్డ్బోర్డ్ కిరీటాలను ధరించిన దేవతలూ దేవుళ్ళూ తెలుగు తెరన పాలిస్తూ వస్తున్న రోజుల్లో 1942లో జెమినీ వాళ్ళు 'మాయలమరాటీ' మాంత్రికుణ్ణి ప్రవేశపెట్టారు. ఎస్.ఎస్. వాసన్ నిర్మించి సి.పుల్లయ్య దర్శకత్వం వహించిన 'బాల నాగమ్మ' అనే ఈ సినిమాలో మాయల మరాటీగా గోవిందరాజుల సుబ్బారావు నటించాడా! జీవించాడు! అదే సంవత్సరం శాంత, వసుంధరలు 'శాంత బాల నాగమ్మ' పేరుతో అదే కథను యమ్వీయన్ రామారావు దర్శకత్వంలో నిర్మించి విడుదల చేశారు. దీనిలో కుమారి, మంజులూరి క్రిష్టారావు నటించారు. ఈ రోజు వెనక్కు తిరిగ చూసుకుని ఈ రెండు బాలనాగమ్మలలో ఏ బాల నాగమ్మ అందంగా ఉందా అన్న సంగతిని ఆలోచించితే నిస్సందేహంగా జెమినీ వారి బాలనాగమ్మగా నటించిన కాంచనమాల అందమే అందమని టపీమని చెప్పేయవచ్చు! స్టేజి నటి అయిన కాంచనమాల చూపుల్లోనూ రూపంలోనూ ఒక భావుకురాలిలా కనిపిస్తుంది.

మొదటి నుంచీ తెలుగు నిర్మాతలు జానపద గాథల వైపు మొగ్గు చూపినా 1942 నాటి బాలనాగమ్మ ప్రేక్షకులను ముగ్ధుల్ని చేసినంతగా మరే చిత్రమూ వాళ్ళను ఆకట్టుకోలేదనే చెప్పవచ్చు. ఆ రోజుల్లో ఆ చిత్రంలోని పాటలు కూడా మంచి పేరొందాయి. ఇంతవరకూ వచ్చిన బాలనాగమ్మలన్నింటిలోనూ జెమినీ వారి బాలనాగమ్మే సజీవమైనదని నేటికీ మనం అనుకుంటున్నామంటే అందుకు కారణం అందులో బాలనాగమ్మగా నటించిన కాంచన మాల అందచందాలు!! నలభైయవ దశకంలో వాహినీ వాళ్లు కె.వి.రెడ్డి దర్శకత్వంలో జీవిత చరిత్రలుగానీ జానపదాలు గానీ మూడు ముఖ్యమైన సినిమాలను తీశారు. అవి: 'భక్తపోతన', 'యోగివేమన', 'గుణసుందరి

కథ'. ఈ మూడింటిలోను పోతన మిగతా రెంటికంటే ఉత్తమంగా ఉంటుంది. ముక్తికి సోపాన మార్గం భక్తి ఒక్కటేనని నమ్మే ఒక మహానుభావుడి చిత్రాన్ని తన తీస్తున్నానని కె.వి.రెడ్డి గారికి బాగా తెలుసు. అంతేకాదు, ఆ మహానుభావుడు యోగి మాత్రమే కాక కవి కూడా నన్న సంగతిని ఆయన మర్చిపోలేదు.

నాగయ్యగారి సంగీతం, హృదయాన్ని కదిలించేదిగా మలచబడ్డది ఆ చిత్రంలో. అప్పటికి (1944) ప్లేబాక్ మొదలయ్యింది. సామ్రాజ్యం అనే నర్తకి పాడిన 'ఇది మంచి సమయము రారా' అన్న పాటను ఎవరూ మర్చిపోలేరు. సినిమాలో ఆ పాటను సామ్రాజ్యమే పాడినా గ్రామఫోను కంపెనీ కోసం నాగయ్యగారు అదే పాటను మరింత మెరుగు పరిచి బెజవాడ రాజరత్నం చేత పాడించారు. ఇది చాలా విచిత్రమైన విషయం. సినిమా కోసం పాడినా గాయని ఒకరైతే, గ్రామఫోను కోసం పాడిన గాయని వేరొకరు! ఇదే గమ్మత్తు నాగయ్యగారి స్వంత చిత్రం 'నా యిల్లు' విషయంలో కూడా జరిగింది. లింగమూర్తిగారు జానపద శైలిలో 'ఇంటి ముంగిట చక్కటి చెట్టు' అనే గేయాన్ని పాడారు పోతనలో. ఈ చిత్రం ద్వారా కె.వి.రెడ్డిగారు పౌరాణిక బ్రహ్మగా పేరొందారు. ఇలా ఈ చిత్రం ద్వారా ఒక ఒరవడి సృష్టించబడింది. ఒక తరం తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించింది.

'చెంచులక్ష్మి' ద్విభాషా చిత్రంగా నిర్మించబడి తెలుగు తమిళ భాషలలో ఒకేసారి విడుదలైంది. ఒకేసారి రెండు భాషలలో నిర్మించటమనేది ఈ చిత్రంతోనే ప్రారంభమైంది. హృదయాన్ని కదిలించే నాగయ్యగారి సంగీతం, కమలా కోట్నిస్ నృత్య సన్నివేశాలు ఆదిలక్ష్మిగా రుష్యేంద్ర, మణిహుందా నటన, ఇవన్నీ 'చెంచులక్ష్మి' చిత్రాన్ని మరపురాని చిత్రంగా తయారు చేసాయి. తర్వాత వచ్చిన మరో 'చెంచులక్ష్మి' చిత్రంలో చెంచు నరసింహంగా నాగేశ్వరరావునీ, చెంచులక్ష్మిగా అంజలీదేవిని చూసినప్పుడు ప్రేక్షకుల జ్ఞాపకాలు తప్పనిసరిగా నాగయ్య, నారాయణరావుల వేపు ప్రయాణిస్తాయి. సినిమాకు సంబంధించి చరిత్రలో అదొక మరపురాని స్వర్ణయుగం. ఇప్పటి 'నటులకు' భిన్నమైన వాళ్ళు అప్పటి 'ఆర్టిస్టులు'.

'త్యాగయ్య' చిత్రానికి నాగయ్యగారు నిర్మాణ బాధ్యతను స్వీకరించటమే కాక దర్శకత్వం వహించి, సంగీత కల్పన చేసి, త్యాగయ్యగా నటించారు కూడా నటుడుగా, దర్శకుడిగా నాగయ్యగారి సినీ జీవితంలో త్యాగయ్య ఒక మైలురాయిలా నిలిచిపోతుంది'. ప్రేక్షకులు, పాత్రికేయులూ 'త్యాగయ్య'కు నీరాజనాలు పట్టారు. మైసూరు మహారాజాగారు తన రాజభవనంలో 'త్యాగయ్య' చిత్రాన్ని ప్రత్యేక షో ఏర్పాటు చేయించుకుని నాగయ్యగారిని వెండి శాలువాతోనూ 101 బంగారు నాణాలతోనూ సత్కరించారు. శ్రీరామచంద్రుడి బొమ్మ ఉన్న ఒక బంగారు నెక్లెసును కూడా బహూకరించారు. తిరువాన్కూరు మహారాజావారు నాగయ్యగారిని తన దర్బారుకు ఆహ్వానించి పాదపూజ చేశాడు. 'అభినవ మమా త్యాగరాజు' అన్న బిరుదునిచ్చి సత్కరించాడు. 'ఆర్టిస్టుగా నాకు ఇంతకంటే కోరుకునేది ఏముంటుంది?' అన్నారు నాగయ్యగారు వాటిని స్మరించుకుంటూ. ఆ రోజుల్లో చక్రపాణిగారి సంపాదకత్వంలో వెలువడుతున్న 'ఆంధ్రజ్యోతి' పత్రిక త్యాగయ్య చిత్రం మీద ఒక ప్రత్యేక సంచికను వెలువరించింది. దాతృత్వానికి మారుపేరైన నాగయ్యగారు తిరువయ్యూరులోని సంగీతకళాశాలకు తన ఆస్తిలో చాలా భాగాన్ని దానం చేశారు! 1946 నాటి ఈ త్యాగయ్యలో నాగయ్యగారు కాక లింగమూర్తి, గుబ్బిజయమ్మ, హేమలత, లక్ష్మీరాజ్యం మొదలైన వాళ్లు నటించారు. ఈ సమయంలో చిత్తూరు నాగయ్య గారిపై బి.యన్.రెడ్డిగారి మాటల్ని స్మరించుకోవటం సమంజసంగా ఉంటుంది. 'నాగయ్యలో నేను త్యాగయ్య అవతారాన్ని చూశాను. త్యాగరాజు కీర్తనల్ని ఆయన గానం చేసి వినిపించిన ఆ రోజు నేను గుక్క తిప్పుకోలేకపోయిన పిల్ల వాడిలా ఎలా కన్నీళ్లు కార్చానో ఎన్నటికీ మరువలేను. నా జీవితంలోకెల్లా అవి మరపురాని మహోన్నత క్షణాలు'!. మహానటులు నాగయ్యగారి నటజీవితాన్ని ఒక మలుపు

తిప్పిన చిత్రం 'భక్తపోతన'. 'యోగి వేమన'లో మనకు నాగయ్యగారి రుషితత్వం స్పష్టంగా కనిపిస్తుంది. 'పోతన' భక్తి భావాన్ని ప్రబోధిస్తాడు. 'త్యాగయ్య' ఆ భక్తిని సంగీత ద్వారా అలౌకిక తీరాలకు తరలిస్తాడు. ఇకపోతే 'వేమన' ఒక మైలురాయి లాంటిది. 'వేమన' పాత్రలో నాగయ్య గారు లీనమైన తీరు, స్థాయి నేటి బాక్సాఫీస్ సినీ ప్రపంచంలో మచ్చుకైనా కనిపించదు!

అనుభూతుల్ని ప్రతిబింబింప చేయటం అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. ఇక ఈ చిత్రం తేలిక పాటి కులాసా పాటల్ని తీసుకున్నప్పుడు 'అందాలం...' అన్నపాటలో బాంబే టాకీస్ వాళ్ళ సంగీతాన్ని అరువు తెచ్చుకోవటం కనిపిస్తుంది. 'యోగివేమన'లో వేశ్య పార్వతీ బాయిగా యమ్వీ రాజమ్మ, అభిరాముడిగా ముదిగొండ లింగమూర్తి కనిపిస్తారు. మిగతా పాత్రలలో బేబి కృష్ణవేణి, దొరస్వామి, సీత, రామిరెడ్డి, కాంతామణి కనిపిస్తారు. కెమేరా - మార్కస్ బార్ట్లే. యమ్వీరాజమ్మ చేసిన నృత్యాలను వేదాంతం రాఘవయ్య సమకూర్చారు. ఇక సంగీత దర్శకత్వం నాగయ్యగారే, సహాయకుడు ఓగిరాల రామచంద్రరావు. నలభై దశకంలో వచ్చిన భక్తి చిత్రాలలో రెండింటిని (పోతన, వేమన) వాహినీ వాళ్ళు నిర్మిస్తే నాగయ్య స్వయంగా త్యాగయ్య చిత్రాన్ని నిర్మించారు. రాజకీయ విశ్లేషణగల కథలను అందించడంలో ఆ రోజుల్లో తమిళరంగాన సి.ఎన్.అన్నాదురై, ఎం.కరుణానిధి, ముందంజలో ఉన్నారు. వారి కథలు, తెలుగు సినిమా రచయితలను ఎంతగానో ప్రభావితం చేశాయి. కాల క్రమేణా ఆ ప్రభావం సన్నగిల్లి, తెలుగు సినిమా రచయితలంతా మామూలు కుటుంబగాథా చిత్రాలకు రచనలు చేయనారంభించారు. కథా విలువలు ఎలా దిగజారాయన్నది తర్వాత్తర్వాత అందరికీ తెలిసిందే! ఇక్కడ ఓ విషయాన్ని గుర్తుంచుకోవాలి! స్వాతంత్ర్యం సిద్ధించిన రెండేళ్ళ తర్వాత చిత్రనిర్మాణం గురించి మనం ముచ్చటించుకుంటున్నాం. దేశం తప్పుదోవలో ప్రయాణిస్తున్నదనే ఆలోచనను స్పష్టం చేసేందుకే ఆనాడు చిత్ర కథాంశాలు రూపుదిద్దుకున్నాయి. సుమారుగా అదే సమయంలో కృష్ణవేణి గారి 'మనదేశం' విడుదలయింది. ఈ చిత్ర కథాంశం కూడా దిగజారుతున్న మానవతా విలువలను గాంధేయవాదాన్ని ఆధారం చేసుకుని ఉన్నదే!

1940 దశకం ఆఖరులో తెలుగు చిత్రసీమను జానపద చిత్రాలు రాజ్యమేలాయని చెప్పవచ్చు. 1949లో రిలీజైన వాహినీవారి 'గుణసుందరి కథ' స్వస్తిక్ వారి 'ధర్మాంగద' భరణీవారి 'లైలామజ్ను' ఓరియంటల్ వారి 'రక్తరేఖ' ఇందుకు ఉదాహరణలు. సరిగ్గా ఈ రోజుల్లోనే మరో కాశీ మజిలీ కథ తెలుగు తెరమీద దర్శనమిచ్చింది. ఆ చిత్రం 'కీలుగుర్రం'. 1939లో అక్కినేని నాగేశ్వరరావు 'ధర్మపత్ని' చిత్రంలో ఓ చిన్న పాత్ర ద్వారా చిత్రరంగంలో ప్రవేశించిన తర్వాత అతను మరికొన్ని చిత్రాల్లో నటించినా గానీ 1948లో విడుదలైన 'బాలరాజు' ద్వారానే జానపద కథానాయకుడిగా గుర్తింపు పొందాడు. ప్రతిభావారి 'బాలరాజు'ను ఘంటసాల బలరామయ్య గారు డైరెక్టు చేస్తే ఎస్. వరలక్ష్మి కథానాయకిగా నటించింది. నిజానికి అక్కినేనిని చిత్రరంగానికి పరిచయం చేసింది ఘంటసాల బలరామయ్యగారే అనవచ్చు. ఎందుకంటే, 'ధర్మపత్ని'లో కనిపించిన అక్కినేని, ప్రతిభావారి 'సీతారామజననం'లోనే ప్రజల దృష్టికి రాగలిగాడు. ఆయన ఒకసారి గుడివాడ వెళ్లినపుడు అక్కడ నాటకంలో హీరోయిన్ వేషం వేస్తున్న అక్కినేనిని చూసి ముచ్చటపడి తన సినిమాలోకి తీసుకున్నాడు.

'బాలరాజు' కథ యక్ష యక్షిణి దేవతలకు సంబంధించిన కథ. ఎస్.వరలక్ష్మి మధుర స్వరం ఆ చిత్రానికి మరీ వన్నె తెచ్చిపెట్టింది. నిజానికా చిత్రం అక్కినేని ఇమేజిని పెంచిందనీ చెప్పవచ్చు. అయితే మరో సంవత్సరం తర్వాత, అంటే 1949లో వచ్చిన 'కీలుగుర్రం' ద్వారా మాత్రమే అతను హీరోగా నిలదొక్కుకున్నాడు. ఆ హీరో ఇమేజి దశాబ్దాల తర్వాత నేటికి కూడా ప్రేక్షకుల మనస్సులలో చెరిగిపోలేదంటే అతిశయోక్తి లేదు.

తెలుగుచిత్ర జగత్తులో బి.యన్.రెడ్డి గారి. స్థానం చిరస్మరణీయమైనది. సామాజిక స్పృహతో, కళాత్మక విలువలతో వ్యాపార చిత్రాల్ని తీయటంలో ఆయన కాయనే సాటి. సామాజిక సమస్యల్ని ప్రతిబింబిస్తూ ఆయన తీసిన 'సుమంగళి' మరియు 'స్వర్గ సీమ' చిత్రాలను ఆయన తీసిన అన్ని చిత్రాలలోనే ఉత్తమ మైనవిగా చెబుతారు సినిమా విమర్శకులు. కాని విచిత్ర మేమిటంటే ఆయన మాత్రం 1951లో తను తీసిన 'మల్లీశ్వరి' చిత్రం ఉత్తమమైనదిగా చెప్పుకుంటారు. ఆ చిత్రం పట్ల ఆయనకంత మక్కువ!

1951లో వేదాంతం రాఘవయ్యగారి దర్శకత్వంలో వినోదా వారి 'స్త్రీ సాహసం' విడుదలయింది. 1952లో 'శాంతి', 1953లో 'దేవదాసు' విడుదలయ్యాయి. 1953వ సంవత్సరాన్ని ఈ సందర్భంగా ప్రముఖంగా పేర్కొనాల్సి వుంది. ఎందుకంటే అదే సంవత్సరంలో రామకృష్ణ 'బ్రతుకు తెరువు', భానుమతి దర్శకత్వంలో 'చండీరాణి' నిర్మించడమయ్యాయి. ఆర్.ఎమ్. కృష్ణస్వామి నేతృత్వంలో 'గుమస్తా', కె.యస్.ప్రకాశ రావు దర్శకత్వంలో 'కన్నతల్లి', కాడూరు నాగభూషణం 'లక్ష్మి', వై.వి. రావు 'మంజరి', నాగయ్య 'నా ఇల్లు' ప్రసాద్ 'పరదేశి', 'పెంపుడు కొడుకు', టి.ప్రకాశరావు 'పిచ్చిపుల్లయ్య', పి.పుల్లయ్య 'పక్కింటి అమ్మాయి' చిత్రాలు కూడా ఆనాడే రూపుదిద్దుకున్నాయి. ఈ విషయాలను చెబుతున్నది ఎందుకంటే 'దేవదాసు' చిత్ర నిర్మాణ సమయంలో ఎందరెందరు దర్శక ప్రముఖులు చిత్రరంగాన కొలువుదీరి ఉన్న సంగతిని గుర్తు చేసేందుకు. రాజ్‌కపూర్, నర్గీస్, నటించిన 'అహ్' చిత్రం డబ్బింగయి తెలుగులో 'ప్రేమలేఖలు' పేరిట విడుదలయింది, బి.ఎస్. సరోజ, ప్రేమనజీర్ నటించిన 'తండ్రి', మాధురీదేవి, నటరాజన్ నటించిన 'రోహిణి' చిత్రాలు కూడా డబ్బింగయి తెలుగునాట ప్రచారానికి నోచుకున్నదీ ఈ రోజుల్లోనే!

ఈ నేపథ్యంలో 'దేవదాసు' ప్రారంభమయింది. చక్రపాణిగారు బెంగాలీ నవలలను అనువదించి, తెలుగువారికి అందించకుంటే, ప్రేక్షకులను 'దేవదాసు' చిత్రం అలరించేది గాదు. వేదాంతం రాఘవయ్యగారే ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'దేవదాసు'ను నిర్మించే టప్పుడు ఆయన చక్రపాణిగారి కథా కథనాన్ని బాగా ఆకళింపు చేసుకున్నారు. 'దేవదాసు' పాటలన్నింటిని కూడా మరువలేం! ఆ చిత్రంలో సావిత్రి నటన ఆమె భవిష్యత్తుకు పునాదిగా అమరిందంటే, అతిశయోక్తి కాదేమొ!

1950లో నిర్మించిన చిత్రాలన్నీ కథాపరంగా కుటుంబ సమస్యలనే ఎత్తి జూపాయి. వలస విధానాన్ని, నగర వాతావరణాన్ని చిత్రీకరించాయి. 1960 నాటికి కథల్లో పెనుమార్పులు సంభవించాయి. 'న్యూ సినిమా' ఆవిర్భ వించింది. సత్యజిత్ రేవంటివారు పల్లెవాసుల్నీ, వాసనలనీ చిత్రీకరించనారంభించారు. ప్రేక్షకులకు పైరగాలుల్ని అందించి, ఆనందింపజేశారు. ఈ కోవనే తెలుగులో రూపుదిద్దుకున్న తెలుగు చిత్రం 'దాసి'. తొలినాటి ప్రమాణా లకు ఈ చిత్రం దర్పణమయి ఉండవచ్చు. అందువలననే జాతీయ స్థాయిలో గుర్తింపును సాధించి, అయిదు అవార్డులను గెలుచుకుంది.

"పాకలో ఉన్నా అది పసిడి మేడగా
మండుటెండలో ఉన్నా మల్లెల నీడగా
ఉన్నంతలో చెప్పలేని
తీపిని అందించేది
గోరంతలో కొండంత
తృప్తిని కలిగించేది - కాపురం".

ఆ కాపురం ఎలాంటిదో వివరణ అది. వారు కట్టు కున్నది మామూలు పాక. అదే వాళ్లకు మహలులా కనిపించింది. వాళ్లు చెమటోడ్చి పనిచేస్తున్నది మండు టెండలలో. అదే వాళ్లకు మల్లెల నీడ అన్పించింది. అంతటి తీపి ఆ పాకలో ఆ ఎండలో వారికి ఎలా కలిగింది? వాళ్లు పండించుకున్న తృప్తి వల్లనే.

మరో చరణంలో కాపురంలోని రెండు పక్కలను స్పృశించి చూపాను. ప్రకృతిలో చీకటి వెలుగులు తప్పవు.

బతుకులో కష్టసుఖాలు అనివార్యం. అందరూ ఎరిగిన, చిరకాలంగా నలిగిన ఈ పటిక నిజాన్నే ఈ చరణంలలో ఇలా అందించాను.

చీకటిలో చిరువ్వులు వెలిగించుకుని
బాధలలో ఆనందం పంచుకుని
కలిమిలో పొంగక
లేమిలో కుంగక
వెలుగునీడలొక్కటిగా
కలబోసి చూసేదే - కాపురం".

చీకటి పడగానే దీపం వెలిగించుకుంటాం. అది సహజధర్మం. ఈ అనురాగమయులు చీకటిపడినప్పుడు పెదవి స్విచ్చి కదిపితే వెలిగేవి చిరునవ్వులు. ఇది చిన్నపాటి కవితాస్పర్శ. కలిమి వెలుగు లాంటిదైతే లేమి నీడలాంటిది. అంతటి సూర్యుడిని కూడా మబ్బు కమ్మేసినప్పుడు మనకు వెలుగు మాయమవుతుంది. ఆ కాసేపు నీడలో ఉండిపోతాం. ఏ జీవితంలోనైనా ఈ ద్వంద్వ పరిస్థితి తప్పదు. సుఖాన్నీ కష్టాన్నీ వెలుగునూ నీడనూ విడివిడిగా అనుభవించినప్పుడు కలిగేది అటు వేడుక. ఇటు వేదన. అలా కాకుండా ఐశ్వర్యం అబ్బినప్పుడు ఉబ్బితబ్బిబ్బు కాక, దారిద్ర్యం ఏర్పడినప్పుడు అధః పాతాళానికి కుంగిపోక సమన్వయ దృష్టిని అలవరచుకుంటేనే మనుగడ సుసాధ్యం. ఆ అంశాన్నే వెలుగు నీడలను సమచిత్తంతో కలబోసి చూడడంలో ప్రతిపాదించాను.

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ద్విపదకు కావ్య పురాణ గౌరవాన్ని కలిగించిన పాల్కురికి సోమన

– **ఆర్. రమాదేవి,** పరిశోధక విద్యార్థిని, ఓరియంటల్ విభాగం(తెలుగు), ఉస్మానియావిశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఆర్. రమాదేవికవి కూడా సమాజంలో ఒక వ్యక్తే. కనుక సమాజ ప్రభావం అతనిపై కొద్దో గొప్పో ఉండి తీరాలి. చరిత్ర తర్వాత సమాజ జీవితాన్ని తెలుసుకోవడానికి సాహిత్యమే ప్రధాన సాధనం ఈ మార్గంలో ప్రతి కవి కాలపు సమాజాన్ని వింగడిస్తే అణురూపంలోని ప్రాచీన సమాజం బ్రహ్మండ రూపం దాలుస్తుంది.

సమాజ పరిస్థితులకు చక్కగా ప్రతిస్పందించిన వారు శివకవులు. వారిలో పాల్కురికి సోమన నాటి సమాజాన్ని తన రచనల్లో వివరంగా ఇమిడ్చి ఉన్నాడు నన్నయ్య అవలంబించిన సంస్కృత సమాస భూయిష్ట రచన 'సర్వసామాన్యము' కాదని భావించి శైవమత ఆ ప్రచారం కోసం జన సామాన్యానికి చేరువగా, జన సామాన్యాన్ని ప్రతిబింబించే విధంగా వెలువడిన స్వతంత్ర గ్రంథాలకు ఆద్యుడు పాల్కురికి సోమన. అందుకోసం అతడు ద్విపద ఛందస్సులో దేశీయ భాషారీతులను అనుసరించాడు. అందుకే ఆరుద్ర పాల్కురికి సోమనను "తెలుగు తోటలో మొదటి కోకిల కంఠమెత్తి తెలుగు వాళ్ళకోసం, తెలుగు ఛందస్సులో పాటలు పాడింది, ఆ కోకిల పేరు పాల్కురికి సోమనాథుడు. అతడు పాడిన తెలుగు ఛందస్సు పేరు ద్విపద. తెలుగు జాతి అతనికిచ్చిన దివ్యాయుధం ద్విపద. తెలుగు జాతికి అతడిచ్చిన గొప్ప కానుక కూడా ద్విపదే. పాల్కురికి సోమనాథుడు పుట్టుకపోతే పాడుకొందుకు తెలుగు వాళ్ళకే ఛందస్సు ఇంతగా రాణించేది కాదేమో ! ప్రజల కోసం అతడు పుట్టాడు. ప్రజలే అతణ్ణి అమర కవిని చేశారు' అని పేర్కొన్నాడు.

**బసవపురాణం :**

బసవపురాణం బసవని విశుద్ధభక్తిమార్గాన్ని ప్రతి పాదించటానికి ఏర్పడిన ప్రప్రథమ వీరశైవపురాణం. దానిని భక్తులు పాడుకొనాలనీ, పామరులు పురాణ శ్రవణం చేయాలనీ, జనులహృదయాలు భక్తుల కథలకు ఆర్ధమైపోయి బసవని భక్తి బీజాలకు ఫలక్షేత్రాలు కావాలనీ రచించాడు. ఆ ప్రయోజనం సిద్ధించటంకోసం సర్వ సామాన్యమైన జానుదెనుగును నిర్మించాడు. ఉద్దేశించిన ప్రయోజనాన్ని అది కొద్దికాలంలోనే సాధించింది. ఆంధ్ర కర్ణాట ప్రాంతాలు ఆ పురాణాన్ని పూవుల్లో పెట్టి పూజించాయి; పుక్కిట బట్టి పులకించాయి. అంతటి పురాణాన్ని రచించిన భక్త సోమనాథుడు బసవకీర్తనంతో మాత్రమే తృప్తి పడలేదు.

ఇదియుఁ గోటికిఁ బడగెత్తిన వానిఁ
బదివేలకాఁపవై బ్రదుకు మన్నట్టు
లా పరంజ్యోతి స్స్వరూసంబునకును
దీపకంభంబు లెత్తించినయట్లు
భవనిర్మితములైన పత్రపుష్పములు
భవునకుఁ దగ సమర్పణ సేయునట్లు
గాక కీర్తింపఁగా నాకుఁ దరంబె
ప్రాకటంబుగ భక్త బండారి చరిత!

(ప్ర. 243-250) (బసవ. పు. 5)

అని బసవపురాణానాంతరం కూడా బసవగుణ మతకీర్తనాత్మకాలైన రచనలను రచించటం మానలేదు. పుంఖానుపుంఖంగా అతని కలం నుండి బహువిధ సాహిత్య ప్రక్రియలు లాస్యంచేస్తూ లోకంలోకి అవతరించాయి.

పాల్కురికి సోమన రాసిన బసవపురాణంలో బస వేశ్వరుని జీవిత చరిత్రతోపాటు శివభక్తుల కథలు ఉన్నాయి. శైవేతరమైన కథ గానీ ప్రస్తావనగానీ ఎక్కాడా కనిపించదు. శివభక్తులైన సామాన్యులకు కావ్యంలో స్థానం కల్పించాడు.

'గౌరీశుమీద దైనంబులేదని తలయిచ్చి వడ యుగును' అని వీరశైవ మతాభిమానాన్ని ప్రకటించాడు. అంతేకాదు -

బసవాయనగ విన్న బాసలొండేల ?
పసులకునైనను ప్రబలదే భక్తి ?
బసవాయనిన జాలు బాసలొందేల ?
వెనకాలు కార్చిచ్చు వెన్నెలగాదే ?

అని బసవుడిని ఈశ్వరుడిగా భావిస్తాడు. శివ మహిమను చాటి చెబుతాడు. శివమతాధిక్యతను చెబితే ఫర్వాలేదు. పరనుత నింద కూడా చేస్తాడు.

'హరుడు విషము ద్రాగి యమృతంబు పనుప హరి మగటిమి విడిచి యాడదిగాడె?

కొత్త అలంకారాలతో, వ్యాకరణ విరుద్ధమైన ప్రయోగాలతో, వాడుకభాషా పదాలతో కవిత్వం రాసిన పాల్కురికి సోమనను జానపద కవిగా కూడా కొందరు పేర్కొంటారు. బసవపురాణం ద్విపద రచన కాబట్టి గాన యోగ్యత కలిగింది. సోమన రచనాశైలిని శ్రీనాథుడు కొంత, పోతన కొంత అనుసరించారు. నన్నయది. మార్గ కవిత్వమైనా దానిని అనుసరించక దేశి కవిత్వాన్ని ఆదరించి తన కవిత్వాన్ని ప్రజాపరం చేసిన కవి పాల్కురికి సోమన.

తెలుగు సాహిత్యంలో దేశపద్ధతిలో తొలిసారి వెలువడిన స్వతంత్ర్యమైన వీరశైవ పురాణము, బసవ పురాణమునకు కథాశ్రోత గోబ్బూరి సంగనామాత్యుడు. ఇందలి కథలలో ముగ్ధ సంగయ్య, బెజ్జమహాదేవి, గొడుగూచి, ఉడువారి కన్నప్ప, మడివాలు మాచయ్య మొదలైనవి ఇందులో పాత్రలు.

**పండితారాధ్య చరిత్ర :**

పాల్కురికి సోమనాథుడి చివరి కావ్యము. ఇందులో కథ మల్లికారుని పండితారాధ్యుడి జీవితం గురించి వివరించాడు. ఈ గ్రంథము 'తెలుగుజాతి తొలి విజ్ఞాన సర్వస్వము'గా కీర్తికెక్కింది.

సోమనాథుని సాహిత్యజీవితానికి భరతవాక్యంగా పరిఢవిల్లింది పండితారాధ్యచరిత్రము. దీని రచనకు కూడా ప్రోత్సాహం ఇచ్చింది. శ్రీశైలభక్త కూటమే. సోమనాథుడు వీరశైవానికి పండితత్రయ సంప్రదాయంతో కల్పించిన ఔన్నత్యానికి వారి గుర్తింపే ఈ సత్కృతి.

"ఖ్యాతిగా సద్భక్త గణలాలనముగ । నూతనంబుగ జగన్నుతముగా మున్ను
'బసవపురాణ' మొప్పఁగ రచించితివి ।బసవపురాణ ప్రబంధంబునందుఁ
బ్రథితపురాతన భక్త గణాను । కథనంబు లితిహాసఘటనఁగూర్చితివి ;
వరవీరభక్తి సవైదికంబుగను । విరచించితివి 'చతుర్వేదసారము'న ;
బసవన్న మహిమ శుంభద్భక్తి యుక్తిఁ । బ్రసరించితివి గద్యపద్యాది కృతుల ;
నర్లవావృత ధాత్రియం దొప్పు బసవ । వర్ణనల్ సేసితి వరుసన వీను
లారంగ గురుమల్లికార్జున పండి । తారాధ్యుల చరిత్ర మర్థి వల్లింపు;
పరిశిష్ట పరిమిత ప్రాక్తన భక్త । చరితంబు లితిహాస సంగతి నొలయ
సంధింపు పండిత చరితంబునందు-"

(పండితారాధ్య చరిత్ర-అవతారిక)

అని భక్తుల ఆజ్ఞ. పూర్వం "రచియింపు బసవ పురాణంబు నీవు" అన్నవారు ఇప్పుడు సంధింపు పండిత చరితంబు" అన్నారు. జంగమలింగాకృతులుగా బసవ పండితులుగా శివాకృతులైనప్పటికీ ఒకరు బసవావతారులు, మరొకరు ప్రమథావతారులు. శివుడన్నా బసవడన్నా భేదం లేదని వీరశైవమత తాత్పర్యం. కాబట్టి పండితుణ్ణి పురాణపురుషుడైన బసవనిగా నిరూపించరాదు. కాబట్టి, అతని చరిత్ర ఒక ఇతిహాసం కావాలని వారి నిష్కర్ష. ఇతిహాసం సంస్కృతమహాభారతంలాగా 'శాస్త్ర రూప కావ్యచ్ఛాయాన్వయి'అయి ఉండటం ధ్వన్యాలోక దృక్పథం. అప్పుడది ఉపదేశోపరంజకత్వ సామర్థ్యాన్ని సంతరించుకుంటుంది. పండితారాధ్యచరిత్ర అటువంటి

పాకాన పడింది. వృద్ధ సోమనాథుని పండిన బుద్ధి దానిని సర్వతోముఖశేముషితో సమలంకృతం చేసింది.

పండితారాధ్యచరిత్రం దీక్షాపురాతన మహిమవాద పర్వత ప్రకరణాలుగా విభక్తమై ఉన్నది. వీరమాహేశ్వరా చారుని జీవితం పంచాచార పంచావరణ నిబద్ధమైనట్లే పండితారాధ్యచరిత్రం పంచప్రకరణాలలో నిర్మితమైంది. ఆ రచనలో పండితుని చరిత్రం ప్రధాన ప్రతిపాద్యవస్తువు అయినప్పటికీ బసవని యొక్క పరిశిష్ట భక్తుల చరిత్రలు కూడా కీర్తింపబడ్డాయి. పాండిత్యవీరానికి ఆలంబనమైన ఆరాధ్యుని జీవితంలో చతుర్వేదపారగుడైన సోమ నాథుడు సార్థకంగా మతశాస్త్ర సంపత్తిని నింపి పెట్టాడు. దీనికి శ్రోత పాల్కురికి సూరామాత్యుడు. సవైదికమైన వీరశైవ భక్తితత్త్వం ఇందులోని పరమతాత్పర్యం. అదే బసవని తత్త్వమని వ్యాఖ్యానించినవాడు పండితుడు. పండితుని చరిత్రం ద్వారా దానిని మిత్రసమ్మితంగా ఉపదేశించినవాడు సోమనాథుడు.

ఒక మతాన్ని ఒక సాహిత్యం ద్వారా ప్రచారం చేయా లంటే ఎన్ని ప్రక్రియలను చేసికొని, ఆయాప్రయోజనాలకు అనుగుణంగా వాటిని నిర్వచించవచ్చునో ప్రదర్శించి చూపిన ప్రథమకవి పాల్కురికి సోమనాథుడు. ప్రాచీన సాహిత్య యుగాలలో మతసాహిత్యనిర్మాణంలో అతనికి అతడే సాటి.

కవిత్రయం వారిది సాహిత్యదర్శనం, ధ్వని ప్రస్థానం. శివకవులది మతదర్శనం, భక్తి ప్రస్థానం. భక్తిరసమంటే వారికి భక్త్యావేశమే. భక్తికీ, ఉద్యమానికీ, తిరుగుబాటుకూ, విప్లవానికి ఆవేశం మూలాధారం. ఆయాప్రయోజనాలను సాధించే కవితకూ అవేశం ముఖ్యలక్షణమౌతుంది. ఆవేశప్రధానమైన కవితను మతోద్యమం కోసం వాడి చూపించిన కవి పాల్కురికి సోమనాథుడు. సమాజంలో మతం ప్రచారం కావాలంటే ఎన్నిరకాల సాహిత్య ప్రక్రియ లను సృష్టించాలో బాగా తెలిసినవా డాయన. ప్రజలను సామాన్యులనీ, మేధావులనీ రెండువర్గాలుగా భావించాడా యన. సామాన్యులలో వీరశైవం ప్రచారం కావటానికి బసవపురాణం వ్రాశాడు. పండితులలో మత విజ్ఞానం వ్యాపించటానికి పండితారాధ్యచరిత్రా, శతకాలూ, భాష్యాలూ, స్తుతులూ మొదలైనవి వెలయించాడు. ద్విపదకృతులు పాడి వినిపించేవి. భక్తి అంటే బసవనికి లాగే సోమనాథునికి కూడా ఒడలెల్ల కాళ్ళే. పరవళ్ళు తొక్కే ద్విపదలు ఆయన కృతులు. అందంగా చెప్పాలన్న స్పృహకంటె, అభివ్యక్తిని కళామయం చేయాలన్న శిల్పదృష్టి కంటె, చెప్పేది వినేవారి హృదయాల్లో ఆవేశం కలిగిం చాలన్నదే ఆయన లక్ష్యం. భక్తుల భక్తి భావాలను పుంఖానుపుంఖాంగా విస్తరించి అతడు ప్రదర్శిస్తాడు. ఒక్కొకసారి వెల్లువలా పొంగిస్తాడు. ఆవేశాన్ని పొంగించే పదబంధమే ఆయన కవితకు ఆయువు. సంస్కృత భూయిష్ట రచనను గౌరవించకపోయినా, సమాసరచన భక్తి భావోద్రేకానికి అవసరమైతే నిశ్సంశయంగా వాడుకొంటాడు. అవసరమైనచోట అలతి అలతి పదాల తోనే రచనను సాగిస్తాడు. ఒక్కక్క చోట పాదాంత్య ప్రాసలను పరుగులు తీయిస్తాడు. శబ్దార్థగుణాలైన శ్లేషలు ఆయన కవితలో లాస్యం చేస్తాయి. వాటివలన భక్తిభావం శక్తిమంత మౌతుంది. పాత్రల భావావస్థలను విస్తృతంగా వర్ణించటం ఆయన నైజం. దానివలన భావోల్లేఖం ఏర్పడి భక్త్యావేశం. కలిగిస్తుంది. శతకాలూ, ఉదాహరణలూ, రగడలూ, దండకాలూ, స్తుతులూ మొదలైనవి భక్తిలోని భావావస్థలను చిత్రించే లఘుకృతులు. సోమనాథుని ద్విపదలు భక్తుని తరంగమాలికలుగా ఉత్తేజితం చేస్తాయి. శివకవియుగ చైతన్యానికి ద్విపదలు అక్షరసంపదలు.

శివుణ్ణి మెప్పించాలన్నా, పూజించాలన్నా, లింగాన్ని ఆరాధించాలన్నా, అనునయించాలన్నా. భవులను దూషిం చాలన్నా, ద్వేషించాలన్నా, శివాపరాధులను దండించా లన్నా. ఖండించాలన్నా భక్తి ఆవేశంగా పతితలలో పర వళ్ళు తొక్కాలని గుర్తించిన కోవిదులు శివకవులు. భక్తి రసంగా కంటె మతంగా పరిణమించటమే వీరశైవుల అభిమతం. దానికి సాహిత్యం ఒక సాధనం, ఒక్కొకసారి ప్రచారసాధనం. మరొక్కసారి నినాదప్రసారసాధనం కూడా.

సాహిత్యానికి సహజశక్తు లెన్నైనా, ఎంతటి ఉదాత్తాలైన వైనా ఉండవచ్చు. అవి ఎంతటి గుమ్మడికాయలైనా శివకవుల మతప్రయోజనమనే కత్తికి వీరబలులే. సాహిత్యాన్ని మతప్రయోజనం కోసం వాడుకోవటం ఈ యుగం నేర్పింది. ప్రమాణాలకంటె ప్రచారం ముఖ్యమనే దృష్టిని సారించింది స్వీయమతాన్ని బోధించటమే కాకుండా పరమతాలను ద్వేషించటం, నిందించటం, ఖండించటం. అన్యమతాలతో పాటు ఆయామతాను యాయులను హించించటాన్ని కూడా ఆ సాహిత్యం బలపరిసింది. తీవ్రప్రవృత్తి మతాచరణంలో కూడా ఉపా దేయమని ఉపదేశించింది. ఈ ధోరణి మతవాదులకే కాదు. రాజకీయవాదులకు కూడా పనికివస్తుందని సూచించిన గౌరవం ఈయుగానికే దక్కుతుంది.

బసవపురాణం పాల్కురికి సోమనాథు డాశించినట్లు ప్రజాదరణం పొందింది. ప్రజలు దానిని పాడుకొన్నారు. కాకతీయ ప్రభువుల చెవులదాకా ఆ పాట వినిపించింది. బసవపురాణానికి వచ్చిన ప్రచారాన్ని చూచి తెలుగులో ఆర్షపురాణ రచనా సంప్రదాయం అంతరించిపోతున్నదనే కాబోలు తిక్కన సోమయాజి శిష్యుడైన మారన ఓరుగల్లు లోనే మళ్ళీ పురాణధ్వజం ఎత్తాడు. ఆ తరువాత పోతన భాగవతం రచించాడు. సోమనాథుని పుణ్యమా అని దేశీమార్గ సంప్రదాయాలలో 'పుట్టిన పురాణతరంగిణులకు ఓరుగల్లు సంగమతీర్థమై తారసిల్లింది.

బసవపురాణాన్ని ఈ విధంగా పురాణకల్పనంలోనూ, వస్తుసంవిధానంలోనూ, ఛందో నిర్వహణంలోనూ, భాషా ప్రయోగంలోనూ దేశీయ సంప్రదాయాలను, నవీణగుణా లను మేళవించి ప్రథమాంధ్రస్వతంత్ర దేశిపురాణంగా సోమనాధుడు నిర్మించాడు, ప్రజలనాల్కలపై పుట్టి పెరిగిన పాటలలోని ప్రాసయతులవంటి లక్షణాలు తీసికొని, మౌఖిక సంప్రదాయలక్షణాలను ప్రముఖంగా సంతరించుకొన్న ద్విపదను చేపట్టి, అటు పాడుకొనటానికీ, ఇటు చదువుకొనటానికి అనువైన ప్రక్రియలో పురాణాన్ని నిర్మించి సోమనాథుడు మౌఖిక సంప్రదాయానికి లిఖిత సంప్రదాయానికి వారధి గట్టిన మొదటి దేశికవిగా సాహిత్య చరిత్రలో ప్రసిద్ధికెక్కాడు. బసవగీతాలలో నుండి పుట్టిన బసవపురాణం ORAL EPIC స్థాయినుండి LITERARY EPIC స్థాయికి ఎక్కిన మతాచార్య చరిత్ర. ద్విపదకూడా సోమనాథుని చేతిలో మౌఖిక సంప్రదాయం నుండి లిఖిత సంప్రదాయానికి ఎదిగిందని విమర్శకులు భావించారు.

కవిత్వమంటే ఛందస్సొక్కటే కాదు. అందులో వాడే పదజాలమే కాదు. భావసౌందర్యాభివ్యక్తి ఛందస్సు మొదలైనవి కవితకు బాహిరమైన అంగాలు. కావ్యం పద్యంలో వ్రాసినా, చంపువులో వ్రాసినా అందులో పఠిత ఆస్వాదించదగిన రసశక్తి ఎంత ఉన్నదన్నదే అంతరంగ సాక్ష్యం. తెలుగులో గద్యపద్యాత్మకమైన కృతులలో ఇటు వంటి అంతరంగ, బహిరంగ లక్షణాలు పుష్కలంగా ఉంటాయని నన్నయాది రచనలవలన స్పష్టమై ప్రచార మొంది ఉన్నాయి. ద్విపదలో కావ్యరచనం చేస్తున్న పాల్కురి సోమనాథుడు ద్విపదకు పద్యాని కున్నంత శక్తి ఉన్నదనీ, ప్రసన్నతకు జానుతెనుగు బాగా పని వస్తుందని చెప్పి, కావ్య బహిరంగ శక్తుల ప్రాశస్త్యాన్ని పేర్కొన్నాడు. ముగ్ధభక్తుల పాత్రలను పోషించటంలో సోమనకు దీటైన కవిలేడు. ఆ పాత్రల ముద్దతనాన్ని కన్నులకు కట్టేటట్లు చిత్రించటంలో ఆ కవి వాడే జానుతెనుగుపదాలజాలు అపూర్వం. ఘట్టాలు చదివే పాఠకులు కూడ ఆ కవిత్వానికి ముగ్ధులైపోతారు. ఉదాహరణకు-బసవపురాణ తృతీయా శ్వాసంలోని రుద్రపశుపతి, బెజ్జమహాదేవి, గొడగూచి, ముగ్ధసంగయ్య, కన్నప్ప మున్నగు ముగ్ధభక్తుల కథలు.

ఇటువంటి పాల్కురికి సోమనాథుని బసవపురాణాన్ని మొదట క్రీ.శ.1896 లో ఏలూరు వాస్తవ్యులు శ్రీ కందు కూరి శ్రీశైలవీరభద్రవరప్రసాదరావుగారు వెలువరించారు. ఆ తరువాత 1926లో వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పరిష్క రించి పీఠిక వెలయించిన బసవపురాణాన్ని కాశీనాథుని నాగేశ్వరరావుగారు ప్రచురించారు. దాని ద్వితీయముద్రణ ప్రతిని నిడుదవోలు వెంకటరావుగా పరిష్కరించారు.

1952లో బండారు తమ్మయ్యగారు పరిష్కరించిన బసవపురాణాన్ని వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రులు ప్రకటించారు. 1969లో ఆంధ్రప్రదేశ్ అకాడమీ వారు బసవ పురాణానికి సంక్షిప్త ప్రతి తయారుచేయించి, నాచే (జి.వి.సుబ్రహ్మణ్యం) పీఠిక వ్రాయించి ప్రచురించారు. పొట్టి శ్రీరాము తెలుగు విశ్వవిద్యాలయం వారు ఇప్పుడు సమగ్ర బసవపురాణాన్ని (వావిళ్ళ ప్రతిని) ప్రచురిస్తున్నా భవిష్యత్తులో బసవపురాణానికి వ్యాఖ్యానం వ్రాయించి ప్రచురించాలని ప్రయత్నం చేస్తున్నారు. ఆ ప్రయత్నాలు ప్రశంసనీయాలు.

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# వడ్డేపల్లి సోదరుల జీవితం సాహిత్యం

– శనిగరంకిషన్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలంగాణలో ఇద్దరూ సాహితీవేత్తలు సోదరులుగా, జంట కవులుగా ప్రసిద్ధి పొందిన వారు ఉన్నారు. దాశరథి సోదరులు, కాలేజీ సోదరులు, ఒద్దిరాజు సోదరులు, వడ్డేపల్లి సోదరులు ఈ విధంగా ఎందరో తెలంగాణలో సాహితీరంగంలో నిర్విరామంగా కృషి చేశారు.వారు తొలి తరానికి చెందిన వారే తర్వాతి తరాల వారికి ఆదర్శం అయినారు.గత కాలంలో పరిస్థితులు భిన్నంగా ఉండడం వలన అటువంటి వారిలో ఎందరో విస్మృతికి గురైన వారు.అటువంటి వారిలో వడ్డేపల్లి సోదరులు పేర్కొన దగినవారు. వారు బహుముఖ ప్రజ్ఞాశీలురు.

బెల్లంకొండ నరసింహాచార్యులు, బెల్లంకొండ వెంకటా చార్యులు ఇద్దరు వడ్డేపల్లి సోదరులుగా ప్రసిద్ధులు. సురవరం ప్రతాపరెడ్డి గారు మారుమూల ప్రాంతమైన వడ్డేపల్లి నుంచి గొప్ప సాహితీ సేవలందిస్తూ దేశబంధు పత్రిక నడిపిస్తున్న అందున మా ఊరి పేరు గానే వడ్డేపల్లి సోదరులని వ్యవహరించారు.సభలలో సమావేశాలలో పత్రికలలో వడ్డేపల్లి సోదరులుగా పేర్కొన్నారు. అందు వలన వారికి వడ్డేపల్లి సోదరులు అని పేరు స్థిర పడింది. వారిరువురూ వెంకట నరసింహ కవులుగా రచనలు చేశారు. బెల్లంకొండ సోదరులని, దేశబంధు సోదరులని వ్యవహరింపబడే వారు. వారు అవధానాలు చేసేవారు. అవధానాలు చేయగా వచ్చిన తృణము ఫలము ఆర్థిక సహకారాన్ని దేశబంధు పత్రిక నడపటానికి ఉప యోగించారు. ఆర్థికంగా చాలా బీదరికాన్ని అనుభవిం చారు. సాహిత్యరంగంలో ఎంతో ప్రతిభను చూపారు. వారికి దేశ భక్తి పత్రిక నిర్వహణ మరియు సాహిత్య సేవ తప్ప మరొక వ్యాపకం లేదు. వడ్డేపల్లి సోదరుల జీవితము సాహిత్యము పత్రికారంగ కృషిని డాక్టర్ బెల్లంకొండ సంపత్ కుమార్ గారు వెలుగులోకి తెచ్చారు. (*తెలంగాణ వైతాళికులు : అక్షర మూర్తులుసంపాదకులు డాక్టర్ జి బాల శ్రీనివాసమూర్తి గారు గ్రంథ ఆధారంగా) దేశ బంధు పత్రికలో లబ్దప్రతిష్టులతో పాటు వర్ధమాన రచయితలను వారు ప్రోత్సహించారు. యజ్ఞ కృష్ణదాసు, గడ్డం రామదాసు వంటి వారిని ఎందరినో వారు కవులు రచయితలు తీర్చిదిద్దారు. ఆనాటి దేశబంధు పత్రికలో సురవరం ప్రతాపరెడ్డి గారు, మాడపాటి హనుమంతరావు గారు వంటి ప్రముఖులు రచనలు చేశారు.సంస్కృత భాషా బోధనను దేశబంధు పత్రిక ద్వారా నిర్వహించారు.పత్రికలో వ్యవసాయం, భాష, సమాజం, దేశవిదేశాలు వంటి అనేక అంశాలను నిర్వహించారు.

వడ్డేపల్లి సోదరులు సనాతన ధర్మ ప్రాధాన్యతను గుర్తెరిగినారు. వారు ఆంధ్ర మహాసభల తో ప్రభావితం పొందినారు. ఆనాడు అనివార్యంగాసమాజంలో విశేష కృషి చేసిన ఆర్య సమాజం భావనలను అంగీకరించి సంఘం ఐక్యతకు పాటుపడ్డారు. తెలంగాణ సమకాలీన పరిస్థితు లతొ కలిసి ఉన్నప్పటికీ ఉద్యమాలతో ఉన్నప్పటికీ వారు రహస్యంగానే పనిచేశారు. సమాజానికి అవసరపడే ఆధు నికతతో వారు ఉన్నారు. ప్రహ్లాద చరిత్రము, రావణోద్భ వము, నలదమయంతీయముమొదలైన కావ్యాలు రాశారు. వాటిలో కొన్నింటి గురించిన ప్రస్తావన గోలకొండ కవుల సంచికలో లభ్యమవుతుంది. చాలా వరకు వారి గ్రంధములు లభ్యం కాకుండా ఉన్నాయి. వడ్డేపల్లి సోదరు లకు సంబంధించిన పరిశోధనకు ఇద్దరి సాహితీవేత్తల వద్ద ముఖ్యమైన ఆధారాలు లభించాయి. వారిలో ఒకరు డాక్టర్ బెల్లంకొండ సంపత్ కుమార్ అయితే మరొకరు వి.గోపాలకృష్ణ గారు. వారు ఇది వారిలో వడ్డేపల్లి సోదరు లకు సంబంధించి చేసిన కృషి పరిశోధనకు ఆధారపడు తుంది.

వడ్డేపల్లి సోదరులు ఆంధ్ర మహాసభ ప్రభావంతో రాసిన అనేక రచనలలో సియాసీ సభలు, సంఘ సంస్కార

సభలు, వంటివి ఎన్నో కథలు చెప్పుకోదగినవి., (*చూడు మెతుకు కతలునందిని సిధారెడ్డి గారి ముందు మాట మరియు సంగిశెట్టి శ్రీనివాస్ గారి ముందు మాట ఆధారంగా) ప్రభుత్వంలో గస్తీ నిషాన్ తిరుపన్‌వంటి ఎన్నో కఠినమైన చట్టాలు అమలులో ఉండేవి. అటువంటి చట్టాన్ని జీవో నెంబర్ 53 అని పిలిచేవారు. ఈ చట్టం ప్రకారంగా సభలు సమావేశాలు జరుపుకోవడం నిషేధం. నలుగురు కలిసి పరిస్థితులను ముచ్చటించుకోవటం నిషేధం. మానవ హక్కులు గాని పత్రిక హక్కులు గాని ఆ రోజులలో లేవు. అటువంటి ఈ సమయంలో గ్రంథాల యోద్యమం, అణా గ్రంథమాల, సహకార సంఘాలు సమాజానికి. అండదండగా ఉండి చైతన్యాన్ని వ్యాప్తి చేశాయి. అటువంటి కాల పరిస్థితులను సియాసీ సభలు కథ ద్వారా వడ్డేపల్లి సోదరులు తమ సున్నితమైన నిరసనను తెలియజేశారు. వారు చైతన్యానికి ప్రాధాన్యత నిచ్చారు. అదేవిధంగా సంఘ సంస్కార సభా వంటి కథలు ఎంతో ఆదర్శనీయమైవి.

వారు సంస్కృత భాష నుండి కావ్యాలను కథలను అనువాదం చేశారు. వడ్డేపల్లి సోదరులకు బహుభాషా ప్రావీణ్యత ఉన్నది. తెలుగు హిందీ ఇంగ్లీషు సంస్కృతం ఉర్దూ పారసీగుజరాతి మరాఠీవంటి దేశ విదేశీ భాషలలో వారికి పాండిత్యం ఉన్నది. అందువలన వారు ఎన్నో అనువాదాలను చేశారు. అటువంటి అనువాదాలు గ్రంథ రూపంలో ఉన్నవి లభ్యం కావడం లేదు. పత్రికలలో వచ్చిన అనువాదాలు మాత్రం లభ్యమవుతున్నాయి. మరాఠీ భాష నుండి వారు లవంగి నవలను అనువాదం చేశారు. అదేవిధంగా కన్నడ భాష నుండి రుణ సంపాదనే నవలను అనువాదం చేశారు.ఇటువంటి అనువాదాలు ఇవాళ లభ్యం కావడం లేదు.

జగత్ ప్రవర్తన నాటకము, సౌందర్య నాటకం మొదలైనవి ఎన్నో నాటకాలను రచించారు. వారు రాసిన నాటకాలలో సామాజికమైన నాటకాలు పౌరాణిక నాటకాలు ఉన్నాయి. ఏకాంకి నాటకాలు రాశారు. ప్రాచీన లాక్షణికులు భావాలకు అనుగుణంగా వారి నాటక రచన కొనసాగింది. అదేవిధంగా మహాకవి కాళిదాసు, మాఘుడు, కవిత్రయం, వ్యాసుడు, వాల్మీకి మొదలైన ఎందరో మహాకవుల గ్రంథాలను విమర్శనాత్మక పరిశీలన చేశారు. సమకాలంలో వస్తున్న అనేక రచనలను విమర్శ నాత్మక పరిశీలన చేశారు. విమర్శతో పాటు వివిధ శాసనాలను పరిష్కరించారు. కొత్తగా శాసనాలను పరి శోధించి వాటి చారిత్రిక పరిశోధన చేశారు.శాతవాహన కాలం నుండి, కాకతీయుల పరిపాలన అటు తర్వాత మార్పులను చారిత్రిక వ్యాసాలు రాశారు.పాల్కురికి సోమనాథుడు బమ్మెర పోతనవంటి మహనీయుల గురించి రచనలు చేశారు. అట్టి రచనలలో కొంతభాగం దేశబంధు పత్రికలలో లభ్యమవుతుంది. అనేక చారిత్రిక స్థలాలను వారు దేశబంధు పత్రిక ద్వారా పరిచయం చేశారు.

వడ్డేపల్లి సోదరుల బహుముఖ ప్రజ్ఞవిశేషమైంది. తెలంగాణలో ఎందరో విస్మృతికి గురైన మహానుభావులు ఉన్నారు. అటువంటి వారిలోవడ్డేపల్లి సోదరులు ఒకరు. తెలంగాణలో ఈ విధంగా ఎందరో గొప్ప వారు ఉన్న ప్పటికీ, తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం మాత్రమే అట్టివారి గురించి వెలికి తీయడం సాధ్యమవుతుంది. తెలంగాణ ప్రాంతంలోని విమర్శకులు పరిశోధకులు అటువంటి కృషి చేయడం సంతోషదాయకం. ఈ కృషి తెలంగాణ సాహిత్య నిర్మాణంలో ఒక భాగంగా స్థిరమవుతుంది. విశ్వవిద్యాలయాలు అటువంటి మహ నీయుల గురించి వారి సాహిత్య విశేషాల గురించి ప్రోత్స హించటం సహాయ సహకారాలు అందించడం అన్నింటి కన్నా గొప్ప విషయం.

వడ్డేపల్లి సోదరులుబహుముఖ ప్రజ్ఞాశాలురు. ఆనాటి పరిస్థితులలో ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ పత్రిక నటించారు. గారు జాతీయ ఉద్యమాలతో, నిజాం రాష్ట్రాంధ్ర ఉద్యమాలతో ఉన్నారు. కొత్త తరాన్ని ప్రభావిత

పరిచారు. వారి కృషిని చైతన్య స్ఫూర్తిని భావితరాలకు ఆదర్శంగా ఇవ్వవలసిన బాధ్యత మనపై ఉన్నది. వడ్డేపల్లి సోదరుల పేరు మీద బహుముఖ సాహితీ వేత్తలకుఏటా సాహితీ పురస్కారాలు ఇవ్వడం, ప్రపంచ మహాసభలు వంటి విశేషమైన సాహిత్య కార్యక్రమాలకు వారి పేరుమీద ప్రాంగణాలు నిర్మించడం, పాఠ్యాంశాలలో వడ్డేపల్లి సోదరుల జీవితం, సాహిత్యం, పత్రికారంగ కృషిని ప్రవేశ పెట్టడం వంటి చర్యలు తీసుకోవడం వలన వారి స్ఫూర్తి మరియు సాహిత్య చైతన్యం విలువలుగా తర్వాతి తరాలకు అందుతాయి.

## ఉపయుక్త గ్రంథ సూచి :

1. దేశబంధు పత్రికలు : బెల్లంకొండ నరసింహాచార్యులు సంపాదకులు : సహ సంపాదకులు బెల్లంకొండ వెంకటాచార్యులు
2. గోలకొండ కవుల సంచిక :సురవరం ప్రతాపరెడ్డి గారు
3. తెలంగాణ వైతాళికులు :అక్షర మూర్తులు
4. మెతుకు కతలు(సం)వేముగంటి మురళీకృష్ణ బెల్లంకొండ సంపత్ కుమార్ గారు
5. పరామర్శ :నక్క హరికృష్ణ

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# జాషువా – దళిత కవి కోకిల నవయుగ కవి చక్రవర్తి

– సూరేపల్లి పద్మావతి, సూపరింటెండెంట్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

ఆధునిక తెలుగు సాహిత్యంలో విశిష్టమైన వ్యక్తిత్వం ఉన్న ప్రముఖ కవి చక్రవర్తి గుర్రం జాషువా. జాషువా 1895, సెప్టెంబర్ 28 న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించారు. తండ్రి గుర్రం వీరయ్య, తల్లి లింగమ్మ. తల్లిదండ్రులు వేరు వేరు కులాలకు చెందినవారు. తండ్రి క్రైస్తవ మతమును స్వీకరించిన యాదవుడు. తల్లి మాదిగ వారిది చాలా బీద కుటుంబము. తక్కువ కులంలో పుట్టడం వలన సమాజం నుంచి అవమానాలను, తిరస్కారాలను, ఛీత్కారాలను ఎదుర్కొన్నారు. చదువుకోడానికి బడిలో చేరిన తరువాత జాషువాకు కష్టాలు మొదలయ్యాయి. ఉపాధ్యాయులు, తోటి పిల్లల నుండి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడు. అయితే జాషువా ఊరుకొనే వాడు కాదు, ఎదురు తిరిగేవాడు. అగ్రవర్ణాల పిల్లలు కులం పేరుతో హేళన చేస్తే, తిరగబడేవాడు. జాషువా జీవితం బాల్యం నుంచి వేదనామయమే! సమాజం నుంచి ఆయన మనసుకు తగిలిన గాయాలు సామన్యమైనవి కావు. అయితే మనసుకు తగిలిన గాయాల గురించి బాధపడుతూ కూడ, వాటిని అధిగమించేందుకు, కుల వివక్ష లేని సమాజం కోసం పరితపిస్తూ కవితలు రాసేవారు. ఆయన కవిత్వం సున్నితమైన, సరళమైన పదాలతో ఉండేది. కానీ ఆవేశపూరితంగా ఉండేది కాదు. ఆ కవిత్వం సమసమాజం ఆలోచింపజేసే విధంగా ఉండేది. తక్కువ కులములో జన్మించినందువలన పడిన అనేక అవమానాలు ఎదుర్కొవడానికి, కవిత్వాన్నే ఆయుధంగా చేసుకొని మూఢాచారాలపై తిరగబడి, ఏ సమాజం నుండి అవమానాలను, తిరస్కారాలను, ఛీత్కారాలను అందుకున్నారో అదే సమాజం నుండి అంతకంతకు రెట్టింపు గౌరవ సత్కారాలు అందుకున్నారు. అది వారి గొప్పతనానికి ప్రజలు పట్టిన నీరాజనం. సమకాలీన కవిత్వ ఒరవడియైన భావకవిత్వ రీతినుండి ప్రక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశాడు.

1910వ సం॥లో మేరీని పెళ్ళి చేసుకున్నాడు. ఉన్నత పాఠశాల చదువు ముగించి ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేశారు. మిషనరీ పాఠశాలలో నెలకు మూడు రూపాయల జీతంపై ఉద్యోగం చేసేవాడు.ఆ ఉద్యోగం పోవడంతో రాజమండ్రి వెళ్ళి 1915-16 సం॥లో మూకీ చిత్రాల కథావాచకుడుగా పనిచేశారు. టూకీ సినిమాలకు లేని ఆ రోజుల్లో తెరపై జరుగుతున్న కథకు, సంభాషణలను చదువుతూ పోవడమే ఈ పని. కొంతకాలం సత్యవోలు గున్నేశ్వరరావుగారి 'చింతామణి' నాటక మండలి' లో నాటక కర్తగా పనిచేశారు. ఆ తరువాత 1919-1929 మధ్యకాలంలో గుంటూరులోని లూథరన్ చర్చివారు నడుపుతున్న ఉపాధ్యా శిక్షణాలయంలో అధ్యాపకుడిగా 10 సంవత్సరాల పాటు పనిచేశారు. 'ఉభయ భాషా ప్రవీణ' పట్టా పుచ్చుకొని జాషువా గారు 1928-1942 మధ్య గుంటూరు జిల్లా ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడుగా పనిచేశారు. 1942-1945 మధ్య కాలంలో బ్రిటీష్ ప్రభుత్వ యాజమాన్యంలో భారత ప్రభుత్వం నెలకొల్పిన జాతీయ యుద్ధ ప్రచారక సంఘంలో ప్రచారకుడిగా కూడా పనిచేశారు. 1957-59 మధ్య కాలంలో మద్రాసు రేడియో కేంద్రలో 'నిర్మాతగా' ఉద్యోగం నిర్వహించారు. 1964 సం॥లో ప్రభుత్వం జాషువా గారిని శాసనమండలికి నామినేట్ చేశారు. కానీ ఆయన ఏ ఉద్యోగం చేసినా జీవనం గడపడానికి మాత్రమే అని, ఆయన జన్మత: కవి, కానీ కవిగా బ్రతుకును సాగించడం కష్టమని 'బడిపంతులు'' అయ్యారు. ఒకసారి వినుకొండలో కొప్పరపు సుబ్బారావు గారి అవధానం విన్నాడు. ముగిసిన తర్వాత కవులు

కొందరు అవధానిని ప్రశంశిస్తూ పద్యాలు చదివారు. బాల జాషువా కూడా పద్యాలు రాసుకొని, చదవటానికి వేదిక ఎక్కాడు. 'అంటరానివాడు', 'కులం తక్కువవాడు' పద్యాలు రాయడం, చదవటమా అని కొందరు ఆయనను అవమానించారు. బాలజాషువా ఎంతగానో కృంగి పోయాడు. ఆయనకు జరిగిన అవమానాలలో ఇది ఒక మచ్చు తునక మాత్రమే. అంటరాని వాడని హిందువులు ఈసడించుకుంటే, క్రైస్తవుడై ఉండి, హిందూమత సంబంధ రచనలు చేస్తున్నాడని క్రైస్తవ సమాజం నుండి బహిస్కరించారు. క్రమంగా ఆయన నాస్తికత్వం వైపు మరలాడు.

జాషువాగారు అంకురిత దీక్షతో కావ్యరచనకు ఉప క్రమించారు. జాషువా గారికి చిన్నతనం నుండే సృజనాత్మక శక్తి ఉండేది. బొమ్మలు గీయటం, పాటలు పాడటం చేసేవాడు. బాల్య స్నేహితుడైన దీపాల పిచ్చయ్య శాస్త్రి సాహచర్యంలో ఆయనకు కవిత్వంపై ఆసక్తి కలిగింది. జూపూడి హనుమత్‌శాస్త్రి వద్ద మేఘసందేశం, రఘువంశం, కుమార సంభవం నేర్చుకున్నాడు. జాషువాగారు 36 గ్రంథాలు, ఇంకా ఎన్నో కవితా ఖండికలు రాశాడు. ఒక జాతికి, ఒక మతానికి చెందిన కవిత్వాలు మంచివి కావని, అసలు అవి కవిత్వాలే కావని, అలాంటి వాటిని వీలు నామా కవిత్వాలు అంటారని, జాషువా గారి భావం. ఇది సామాన్యులకు తెలియజేయడానికే ప్రయత్నించారు. 'గహన సంచారం లేని కవిత్వం నా లక్ష్యం' అని జాషువా గారు అన్నారు. ఆయన కవితకు మూలాధారాలు వస్తువులు, మానవత్వం హేతువాదాలు. దీనుల పట్ల సంఘం అణచివేసిన వారి పట్ల సానుభూతితో కలం కదిలించారు. సంఘ సంస్కరణ ఆయన కావ్య లక్ష్యం, ఆకలి శోకాలను నిర్మూలించాలన్నదే ఆయన ధ్యేయం. చిత్తశుద్ధిలేని పెత్తందార్లను, గుత్తస్వాములను నిలదీసి ప్రశ్నించారు. అంధవిశ్వాసాలను, మత విద్వేషాలను తీవ్రంగా నిరసించారు. జాషువాగారు అభ్యుదయ వాది. రేడియోలో వస్తున్న కవితలను విమర్శిస్తూ , అన్నార్తుల ఆక్రందనకు తన కవితలో వినిపించారు.

'రేయిబవలు భారతీయ సంస్కృతీ పేర
గండశిలలు చూపి కథలు చెప్పి
కటిక పేదవాని కడుపులోగల చిచ్చు
గడపగలవే నీవు గగనవాణి'

జాషువా గారు సంకుచిత తత్వాలను ఖండిస్తూ, 'నిఖిలలోకమెట్లు నిర్ణయించిన నాకు తిరుగులేదు. విశ్వనరుడ నేను' విశ్వజనీనమైన దృక్పదం గల ఆయన గబ్బిలం పట్ల జాలిని చూపుతూ.

'నరుని కష్టపెట్టి నారాయణుని గొల్వు
ధర్మశీలురున్న ధరణి మీద
కాలుమోపలేక గబ్బిలమొక్కటే
చరణ యుగళిదివికి సాచి నడుచు'

జాషువా గారి రచనలన్నీ ఖండకావ్యాలు, వాటిలో గబ్బిలము, పిరదౌశి, కాందిశీకుడు, స్వప్నకథ, ముంతాజ మహల్, నేతాజీ, క్రీస్తుచరిత్ర, కొత్తలోకము ప్రసిద్ధమైనవి ఆత్మకథను మూడు సంపుటాలుగా 'నా కథ' అను శీర్షికను రాశారు.

ఆయన రచనల్లో గబ్బిలం (1941) సర్వోత్వమమైన రచన. ఇది కాళిదాసు మేఘసందేశం తరహాలో సాగు తుంది. ఒక అంటరాని కులానికి చెందిన కథానాయకుడు తన గోడును కాశీ విశ్వనాధునికి చేరవేయమని గబ్బిలంతో సందేశం పంపడమే దీని సారాంశం. ఎందుకంటే దళితు లకు గుడిలోకి ప్రవేశం లేదు. కానీ గబ్బిలానికి అడ్డు ఉండదు. కథనాయకుడి వేదనను వర్ణించిన తీరు హృదయాలను కలచివేస్తుంది. 20వ శతాబ్దంలో వచ్చిన ఆధునిక తెలుగు కావ్యాల్లో విశిష్టమైన రచన గబ్బిలం. ఖండకావ్య రచనలో సుమారు 22 సంవత్సరాలు, కలం సృష్టించిన అద్భుతమైన కళాఖండం ఈ గబ్బిలం. ఖండ కావ్య ప్రక్రియకు, ఊపిరి ఊది జనం జీవంతో తొణికిస లాడేలా చేసి ఆధునికాంధ్ర సాహిత్యంలో ప్రతిష్టాత్మకమైన

స్థానం సంపాదించి పెట్టిన మహాకవి జాషువా సామాజిక అసమానతపై, సంస్కరణల ఫలాలు చేతికి అందే సమయంలో, వర్ణాశ్రమ ధర్మాల పరిరక్షణను సమర్థించే లక్షణాలు ముందుకొస్తున్న విధానం జాషువాను కలవరపరిచాయి. హక్కులకొరకు ఉద్యమించే సమయం వచ్చిందని భావించి, హరిజనులుగా పిలువబడే వారిలో ధైర్యం నింపి, చైతన్యం రగిల్చి ఉద్యమించేలా చేసి దళితుల ఆత్మగౌరవ సాధనకై తపించాలని ఊహించాడు. పీడక వర్గాలను ఎదిరించి, హక్కుల సాధన దిశగా సాగిన మహాప్రస్థానం, జాషువా రాసిన రచనే గబ్బిలం. ఆగామి యుగంలో దళిత సూర్యుడి శిరస్సున ఉంచిన అగ్ని కిరీటమే ఈ గబ్బిలం. ఆయన మనోభావాన్ని దళిత యువకుడి ద్వారా యెంత చక్కగా చెప్పారో!

వాని నుద్ధరించు భగవంతుడే లేదు
మనుజెడెట్లు వాని గనికరించు
వాడు జేసికొన్న పాపకారణ మేమో
యింతవరకు వాని కెరుకలేదు
"ఆ అభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయు!
గసరి బుసకొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు"
"కులము లేని నేను కొడుకుల బుట్టించి
ఈ యఖాతమందే తరోయవలేనే
భార్యయేల బుట్టబానిస కని వాడు
జరుపసాగే బ్రహ్మచర్య దీక్ష"

1932వ సం॥లో వచ్చిన పిరదౌసి మరొక ప్రధాన రచన పర్షియన్ చక్రవర్తి ఘజనీ మొహమ్మద్ ఆస్థానంలో ఉన్న కవి పిరదౌసి. అతనికి రాజుగారు ఒక మాట ఇచ్చారు. మాటకు ఒక బంగారు నాణెం ఇస్తానని, ఆ కవి పది సంవత్సరాలు శ్రమించి మహాకావ్యాన్ని వ్రాశాడు. కానీ అసూయపరుల మాటలు విని రాజు తన మాట తప్పాడు. ఆవేదనతో ఆత్మహత్య చేసుకొన్న ఆ కవి హృదయాన్ని జాషువా అద్భుతంగా వర్ణించాడు. సుల్తాను మాటతప్పినప్పుడు

అల్లాతోడని పల్కి నాపసిడి కా
వ్య ద్రవ్యము న్వెండితో
జెల్లింప దొరకొన్న టక్కరివి: నీ
చే బూజితుండైనచో
నల్లా కున్సుఖమే? మహమ్మదు నృపా
లా! సత్య వాక్యం బెవం
డుల్లంఘింపదో వాడెపో నరుడు, ధ
న్యుం డిద్దరామండలిన్

వంటి పద్యాలు పిరదౌసి మనో భావాలను పాఠకుల మనోఫలకం మీద నిలచిపోయేలా చేస్తాయి. చివరగా పిరదౌసి మసీదు గోడలపై రాసిన పద్యం జాషువా పదాలలో

ముత్యముల కిక్కయైన సముద్రమున
బెక్కుమారులు మునకలు వేసినాడు
భాగ్యహీనుడ ముత్యమ్ము వడయనైతి
వనధి: నను మ్రింగ నోరు వచ్చినది తుదకు.

పిరదౌసి ఒక పారశీక కవి. పిరదౌసి యొక్క యదార్థ జీవిత కథయే ఈ పిరదౌసి కావ్యం. విధి వంచితుడైన కవి జీవిత చివరి ఘట్టాన్ని ఎంతో హృద్యంగా వర్ణించాడు. జాషువా కవి. జాషువా, పిరదౌసిలోకి పరకాయ ప్రవేశం చేసి రాసిన రచన. పిరదౌసిలానే జాషువా కూడా తన జీవితంలో ఎన్నో కష్టాలు, అవమానాలు, తిరస్కారాలు, ఛీత్కారాలు పడ్డాడు. కానీ తన కృషికి తగ్గ గుర్తింపు, ప్రశంసలు, సన్మానాలు, బిరుదులు పొందాడు. కానీ కావ్యంలోని పిరదౌసి యివ్వేమీ పొందకుండానే కను మూసిన విధివంచిత కవి.

1948వ సం॥లో మహాత్మాగాంధీ మరణవార్త విని ఆవేదనతో జాషువా సృష్టించిన స్మృత్యంజలి 'బాపూజీ' భారత జాతిపిత మహాత్మాగాంధీని ఒక దుండగుడు హత్య చేసినపుడు భారతావని అంతా శోకసముద్రంలో మునిగి

పోయింది. ఈ సందర్భంలో గాంధీజీ ఔన్నత్యాన్ని, పవిత్రతను తలచుకొని ఎన్నో విధాలుగా కొనియాడారు జాషువా కవి. మిక్కిలిగా పరితపించి, బాపూజీ లేని దేశాన్ని తలచుకొని దు:ఖించారు. భారతదేశములోని వజ్రాల సంపద అంతటినీ తూకం వేసినా కూడా గాంధీజీయే ఎక్కువ బరువు తూగుతాడు, లోకానికంతటికీ సామ రస్యమును ప్రసాదించిన విజ్ఞాన ప్రధాత గాంధీజీ అని జాషువా పేర్కొన్నాడు

భరత వర్షంబీను వజ్రాల ధనరాశి
తూకంబునకు పెచ్చు దూగునాడు
మూడు మూర్తుల దయాభూతి ప్రత్యంగాన
తాండవించెడు పవిత్ర స్వరూపి
పదివేవ యేండ్ల లోపల ధరాదేవత
కనియెఱుంగని జగన్ముని వరుండు
అనుగుదమ్ములు కోరుకొని స్వరాజ్యార్థమై
పస్తుండి శుష్కించు పండుముసలి
గోచిపాత గట్టుకొని జాతిమానంబు
నిలిపినట్టి ఖదరు నేతగాడు
విశ్వసామరస్య విజ్ఞాన సంధాత
కామిత ప్రదాత గాంధీ తాత.

గాన గంధర్వుడు అయిన ఘంటసాల గారిని స్మరించుకుంటూ ఒక చిన్న సంఘటనను గుర్తుచేశారు జాషువాగారు. 'సత్యహరిశ్చంద్ర' నాటకం, వారి 'స్మశాన వాటిక'అనే పేరుతో తన ఖండకావ్యంలోని పద్యాలు లేకుండా ఊహించుకోలేము. వీరు రాసిన శిశువు( పాపాయి) అనే ఖండికను ఘంటసాల గారు అద్భుతంగా గానం చేశారు. ఈ పాట ఘంటసాల గారు పాడి, రికార్డింగ్ జరిగే సమయంలో జాషువాగారు వారి ఇంటికి వెళ్ళి, ఘంటసాల గారి ఇంటి బయట ఉన్న అరుగు మీద కూర్చున్నారట. ఘంటసాల గారు బయటకు వచ్చి 'ఏమిటండీ'! బయటనే కూర్చున్నారు'అని అడిగితే, అందుకు జాషువాగారు "నేను అంటరాని కులమునకు చెందినవాడను, మీరు బ్రాహ్మణులు, మీ అనుమతి లేకుండా మీ ఇంట్లోకి ఎలా రాగలను? అని అన్నారట. అప్పుడు ఘంటసాల గారు "నాకు ఎలాంటి పట్టింపులు లేవు, మీరు మా ఇంటిలోపలికి స్వేచ్ఛగా రావచ్చు. "మీరు సరస్వతీ పుత్రులు, మీరు అంటరాని వారైతే సరస్వతీ దేవి కూడా అంటరానిదనే కదా అర్థం!" అని చెప్పి ఇంట్లోకి తీసుకొని వెళ్ళి, తన సహృదయాన్ని చాటుకొన్న ధన్యజీవి ఘంటసాల గారికి హృదయ పూర్వక బాష్పాంజలి చెప్పారు. ఈ ఘటన గుర్తొచ్చినప్పుడల్లా నాకు తెలియకుండానే నా కళ్లు చెమర్చుతాయని జాషువాగారు అనేవారు.

ఆకాశంబును కారుమబ్బుగము లాహరించె, దయ్యాలతో
ఘూకంబుల్ చెరలాడసాగినవి, వ్యాఘోషించె. . . నల్దిక్కులన్
గాకోలంబులు, గుండెఝల్లుమనుచున్నంగాని యిక్కాంటియం
దా కల్లాడిన జాడలే, దిచ్చట సౌఖ్యంబెంత క్రీడించునో!

మహాకవి గుర్రం జాషువాగారు దిగువ కులంలో పుట్టడం వల్ల నానారకాల అవమానాలను అనుభవిస్తూనే, అరుదైన, అద్భుతమైన సాహిత్యాన్ని అందించిన మహా వీరుడు. హరిజనుడు అవ్వడం వలన అగ్రకులస్థులు ఆయనను దూరంగానే ఉంచేవారు. సాహిత్య సమా వేశాలలో కూడ ఆయనకు విడిగానే బోజనం వడ్డించే వారట. అబ్బూరి వరదరాజేశ్వరరావుగారు రాసిన 'కవన కుతూహలం' అనే పుస్తకంలో తాను ఇలాంటి సంఘ టనకు ప్రత్యక్షసాక్షిగా ఉన్నట్లు రచయిత చెబుతారు. తన జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా జాషువాలోని హాస్య చతురతలో ఎలాంటి మార్పూ రాలేదు. జాషువా గారిలో హాస్య ప్రవృత్తి చాలా ఎక్కువ.

'నవ్వవు జంతువుల్, నరుడు నవ్వును
నవ్వులు చిత్తవృత్తికిన్ దివ్వెలు"

కొన్ని నవ్వులెటు తేలవు కొన్ని విష ప్రయుక్తముల్
పువ్వుల వోలె ప్రేమ రసమున్ వెలిగ్రక్కు విశుద్ధమైన లే
నవ్వులు సర్వదు:ఖదమనంబుల వ్యాధులకున్
మహౌషదుల్!

అని అంటారు జాషువాగారు. నవ్వు మనిషికి మాత్రమే ఉన్న ప్రత్యేకమైన వరం. స్వచ్ఛమైన, ప్రశాంతమైన అంతరంగానికి చిహ్నమే నవ్వు. నవ్వులలో చాలా రకాలు ఉండవచ్చు. కానీ అభిమానంతో కూడిన నవ్వులు సమస్త దు:ఖాలను నశింపజేస్తాయి. ఎటువంటి వ్యాధికైనా మందులా పనిచేస్తాయి, అని పై పద్యంలోని భావం. అంతటి భావం మనసున కలిగి ఉన్నాడు కాబట్టే ఎంతటి బడబాగ్నినైనా చిరునవ్వుతో జయించగలిగాడు జాషువా గారు.

'కులమతాలు గీచుకున్న గీతలు జొచ్చి
పంజరాన గట్టు వడను నేను
నిఖిలలోక మెట్లు నిర్ణయించిన
నాకు తరుగు లేదు విశ్వనరుడ నేను"

ఆధునిక తెలుగు కవులలో ప్రముఖ స్థానం పొందిన కవి గుర్రం జాషువా. పుట్టుకతోనే దళితుడైన జాషువా గారు తక్కువ కులంలో జన్మించి, ఆ కారణంగా అనేక అవమానాలు పొంది కూడా, పట్టుదలతో కవిశేఖరుడై, నవయుగ కవి చక్రవర్తి తెలుగు సాహితీలోకంలో విలసిల్లిన ప్రజ్వరిల్లిన తేజోమూర్తి జాషువాగారు. కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని, ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందిన మహాకవి జాషువాగారు.

'ఒక్కొక్క పద్దియమునకు నొక్కొక్క నెత్తురుబొట్టు మేనిలో తక్కువగా" రచించిన ఈ కవి చక్రవర్తి శారదాదేవి వరప్రసాది. 24 జులై 1971న గుంటూరులో ఆ శారదాదేవి ఒడిలోనే శాశ్వత విశ్రాంతి తీసుకున్నారు. జాషువాగారు తన జీవిత కాలంలో ఎన్నో బిరుదులు, పురస్కారాలు అందుకున్నాడు. తిరుపతి వేంకటకవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి జాషువా కాలికి గండపెండేరం తొడిగి ఈ కవీశ్వరుని పాదం తాకి నా జన్మ ధన్యం చేసుకున్నాను అని అన్నారు. అది తనకు లభించిన అత్యున్నత పురస్కారంగా జాషువాగారు భావించాడు. కవితా విశారద, కవికోకిల కవిదిగ్గజ - నవయుగ కవిచక్రవర్తి, మధుర శ్రీనాధ, విశ్వకవి సామ్రాట్‌గా ప్రసిద్ధుడయ్యాడు. క్రీస్తు చరిత్రకు 1964 సం॥లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1970 సం॥లో భారత ప్రభుత్వము పద్మభూషణ పురస్కారం అందజేసినది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు కూడా అందుకున్నారు.

జాషువా స్మారకార్థం కూతురైన హేమలతా లవణం గారు నెలకొల్పిన జాషువా ఫౌండేషన్ ద్వారా మానవ విలువలతో కూడిన రచనలు చేసిన సాహిత్యకారులకు జాషువా సాహిత్య పురస్కారం అందజేయబడుతున్నది.

"వడగాల్పు- నా జీవితమైతే, వెన్నెల - నా కవిత్వం" అని జాషువాగారు అన్నది అక్షర సత్యం.

"రాజు మరణించెనొక తార రాలిపోయే
కవియు మరణించే నొక తార గగన మెక్కె
రాజు జీవించె రాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజల నాల్కల యందు"

"జాషువా విశిష్ట సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ కవి అచార్య ఎండ్లూరి సుధాకర్‌కి బహుకరించారు. దాశరథి రంగాచార్యకు జాషువా జీవిత సాఫల్య పురస్కారం మరియు కొలకలూరి స్వరూపరాణికి జాషువా విశిష్ట మహిళా పురస్కారము బహుకరించారు. దళిత సాహిత్యంలో విశేష కృషిచేసినందులకుగాను కాలువ మల్లయ్యకు జాషువా సాహిత్య విశిష్ట పురస్కారం బహూకరించారు.

## ఉపయుక్త గ్రంథాలు :

1. జాషువా రచనలు-రెండవ సంపుటం

2. శ్మశానవాటిక ఖండకావ్యం-జాషువా విశ్లేషణ
3. సత్యహరిశ్చంద్ర-శ్మశానవాటిక -చీమలమర్రి-బృందావనరావు
4. కవనకుతూహలం-అబ్బూరి వరదరాజేశ్వరరావు
5. మహాకవి జాషువా జీవితం - సాహిత్యం-డా॥ చెంగల్వ రామలక్ష్మి
6. జాషువా సాహిత్యం దృక్పథం-పరిణామం-ఆచార్య ఎండ్లూరి సుధాకర్
7. నవయుగ కవిచక్రవర్తి, కవికోకిల-శ్రీగుర్రం జాషువా-టీ.వీ.యస్. రావు
8. సుప్రసిద్ధుల జీవిత విశేషాలు, జాషువా -జానమద్ది హనుచ్ఛాస్త్రీ

BHAVAVEENA
Vol. 18, Issue. 5, May 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# కాళోజీ కవితాత్మ

- డా॥. పి. విశ్వ ప్రసాదు, అసిస్టెంట్ ప్రొఫెసర్, శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కరీంనగర్.

కాళోజీ కవిత్వాన్ని ఎప్పుడూ కాంతాసమ్మితంగా, దాన్ని ప్రయోజనాన్ని ఆనందంగా వాడలే. కాళోజీ కవిత్వంలో 'సర్జికల్ స్ట్రైకర్' - ఎక్కడ వ్రణం ఉందో అక్కడిదాక వెళ్తాడు. మనుష్యుల అంతరాలను, అంతరంగాలను, అవలక్షణాలను 'మైక్రోస్కోపు'తో పరీక్షిస్తాడు. మాత్రతో గాక శస్త్ర చికిత్స చేసే దాకా వదలడు. మానవుని స్వభావాన్ని ఆవేశంగా ఎండగడతాడు. ఇదే కాళోజీ కవితాత్మ. నిల దీసేంత నేర్పుగా ప్రత్యామ్నాయాలపై 'ఓపిక' చూపలేక పోతాడు. ఇది కాళోజీ జీవలక్షణం. 'దేబె మొగాల' పై కాళోజీకి 'సానుభూతి' కంటే 'కంపరమే' ఎక్కువ. 'నా గొడవ'లో మనుషుల ముసుగులు తీసేసే ప్రయత్నమే జరిగింది.

కాళోజీకి మనిషి ప్రమాణం - బ్రతుకు ప్రమాణం జీవనం సాఫీగా, క్రమశిక్షణతో నడవాలి. అస్తవ్యస్త నిర్మాణంలో ఉన్న సమాజం - వ్యక్తుల జీవితాలను తీవ్రంగా కల్లోలితం చేస్తుంది. మనిషిలో 'దిగజారుడుతనం' పెరుగుతుంది. ఇదంతా కాళోజీ కలానికి బలి. ద్వంద్వ ప్రమాణాలు, గొర్రెదాటు వైఖరుల పైనే కాళోజీ పంజా. 'శాసనాలు' కాళోజీకి సరిపోవు. సంఘం, పెద్దరికం మాటలే పడవు. "సంఘాలు - నియమాలు - సంప్రదాయాలు / మనిషిలోని కుళ్ళుకు మారు రూపాలు" (మారు రూపాలు). వ్యక్తి తనే ఒక శక్తిగా మారాలి. వ్యక్తి నిర్మాణం బలంగా ఉండాలనే కోరిక అనేక కవితల్లో అంతర్గతంగా కనిపిస్తుంది. ధిక్కారం ద్వారా అధికారం గొప్ప లక్ష్యంగా భావించాడు.

జీవితం గురించి "నా ఇచ్ఛయే నా ఈశ్వరుడని ఖచ్చితముగా నమ్ముతాను. ఇచ్ఛ వచ్చినట్లు నేను ఆచరించి తీరుతాను" అంటాడు. ఊహల్లో బతుకక వాస్తవంలో జీవిస్తానంటాడు. ప్రాణం పోయినా పరపీడన మంచిది కాదనే ఉన్నత భావాలలోంచి కాళోజీ కవిత్వం పురుడు పోసుకుంది.

పాశ్చాత్య రచయిత "ఇల్యా ఎహ్రాన్ బర్గ్" అన్నట్లు "రచయిత వినోదం కోసం పేరు ప్రతిష్టల కోసం రాయడు. ప్రజలను బాగు చేయాలని, జీవితాన్ని మరింత ఉన్నత పథాలకు నడపాలని రచయిత భావిస్తాడు"(రచయిత శిల్పమూ. పు. 20). ఈ కోణంలో కాళోజీ కవిత్వాన్ని పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

సమాజంలోని పీడితులూ, వంచితులూ వాళ్ళ కన్నీళ్ళూ, కష్టాలు ఇవన్నీ హృదయమున్న వాళ్ళని కదిలిస్తాయి. సహానుభూతిని చిందిస్తాయి. తీవ్రంగా స్పందించినా, ఆ తీవ్రతను సమస్య పరిష్కారమయ్యేంత వరకు కొనసాగించలేకపోతారు. ఎందుకంటే వారి హృదయంలోనే లెక్కలేనంత 'వేదన' ఉంటుంది. తమ అసహాయతను ప్రకటించి, దహించుకుపోతారే తప్ప 'శాంతి' వైపు గానీ, 'యుద్ధం' వైపు గాని పూర్తిగా నిలబడలేక పోతారు. కాళోజీ కవిత్వంలో మనుషుల స్వభావాల్ని అంచనా వేయడంలో, సమాజంలోని డొల్లను 'కెలకడం'లో ఈ లక్షణమే కనిపిస్తుంది. "అవనిపై జరిగేటి అవకతవకలు జూచి / ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు? / పరుల కష్టము జూచి కరిగి పోవును గుండె? మాయ మోసము జూచి మండిపోవును ఒళ్ళు" (ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు) లో తన 'అసహాయత'ను వ్యక్తీకరిస్తాడు. తన ఆవేశాన్ని, ఆక్రోశంగా మారుస్తాడే కానీ, దాన్ని తిరుగు బాటుగా, యుద్ధంగా మలచలేకపోతాడు.

అయితే అతనికి 'మనిషి' స్వభావం మీద కూడ తీవ్ర అసహనం. మనిషి స్వభావాన్ని అత్యంత సహజంగా, సరళంగా, సూటిగా "మనిషి ఎంత మంచివాడు / చనిపోయిన వాని చెడును / వెనువెంటనే మారుస్తాడు /

కాని మంచిని తలుస్తాడు / మనిషి ఎంత చెడ్డవాడు / బ్రతికి ఉన్నవారి మంచి గుర్తించడు". కాని వాని చెడును కెలుకుతాడు అని మనిషి ముసుగును ఒక్కసారిగా లాగేస్తాడు. సాటి మనిషి యొక్క మంచితనాన్ని గుర్తించక 'లోపాలు' వెతికే 'కుటిలమతులు' ఈ లోకంలో అధికం. 'తప్పు లెన్నువారు...' అంటూ వీరు లేనిదే లోకమే లేదని తేల్చి పారేస్తాడు.

ఈ లోకంలో చెప్పేదొకటి, చేసేదొకటిగా మనిషి జీవితం సాగుతుంది. ఒక్క ప్రమాణానికి కట్టుబడక వ్యక్తి పూర్తిగా విశ్వాసాన్ని కోల్పోతాడు అని "మనసులో గల మాట యొకటి / పైకి నుడివెడి పలుకు ఒకటి / చేయ దలచిన చేష్ట యొకటి" (లోకం) అని త్రికరణశుద్ధిగా మనిషి దిగజారుతున్నాడని, మనిషిలోని 'పలుచదనాన్ని' వెక్కిరిస్తాడు.

మనిషిలోని 'చీకటి కోణాల'ను అనేక కవితల్లో కాళోజీ చెండాడుతాడు. మనిషి ఎన్నో ధర్మ పన్నాలు చెబుతాడు. తన అపక్రమ నైజాన్ని నిర్లజ్జగా ఎత్తిపారబోసుకుంటాడు. అందితే జుట్టు, లేకుంటే కాళ్ళు అన్నచందంగా, ఎదుటివారి బలాన్ని, బలహీనతల్ని కొలిచి ముహూర్తం నిర్ణయిస్తాడు కానీ, తన 'నిజాయితీ' లోతుల్లోనే తొంగి చూసే సాహసం చేయడు. "మంది తప్పులు ఏరి మనసు ఖాతా నింపి / వడ్డీ వడ్డీ కట్టి వల్లించుకుంటాను / నా తప్పులను దాచ నానారకాలైన / ధర్మ సూత్రాలతో దడి కట్టుతాను" (నేను) అంటూ తన 'అసహ్యాన్ని' కప్పు కునేందుకు మనిషి చేసే విపరీత ప్రయత్నాన్ని ఎండగడ తాడు.

స్వాతంత్ర్యం పేరుతో జరుగుతున్న విచ్చలవిడి దురా గతాలు, వ్యక్తికి గానీ, సమాజానికి గానీ ఏ మాత్రం ఆమోదం కాదు. తన హక్కులను నెరవేర్చుకునే క్రమంలో ఇతరుల స్వేచ్ఛకు ఆటంకం కలిగించడం హర్షణీయం కాదు, చట్టవిరుద్ధం కూడ. మిడిమిడి జ్ఞానంతో, తనకున్న బలంతో, బలగంతో స్వైరవిహారం చేయడం పద్ధతి కాదు. ఇలాంటి స్వైరులకు స్వాతంత్ర్యం అచ్చిరాదు. "బాధ్యత లెరుగని స్వేచ్ఛ బానిసత్వ లక్షణము" (స్వాతంత్ర్యము) అంటూ కాళోజీ కచ్చితంగా చెప్పాడు. అదే బాధ్యతతో కూడిన స్వేచ్ఛ స్వాతంత్ర్యాన్ని రక్షిస్తుందని అంటాడు. విచ్చలవిడి ప్రవర్తన, విపరీత మనస్తత్వం, దేశ సంపదని గౌరవించని మనుషులు" విత్తనాల గింజలతో / విందులతో గెంతువారు / విత్తి, పెంచి పండించెడి చిత్తవృత్తి మెచ్చలేరు" (స్వాతంత్ర్యము) అంటూ శ్రమ విలువను, శ్రమ సౌందర్యాన్ని, గౌరవాన్ని గుర్తించని స్వైరుల జీవితము "సంఘ జీవితమునకెపుడు / సంక్షోభము సంహారము" (స్వాతంత్ర్యము) అంటూ తారల తండ్రుల ఆస్తిపై ఆధారపడే పరాన్నభుక్కుల జీవితాన్ని చీదరించుకున్నాడు.

ఒకర్నొకరు మోసగించుకుంటూ బతికే రోజుల్లో 'సుద్దులు' చెప్పితే 'చెవుటి వాని ముందు శంఖం ఊదినట్లే'. 'మంచి చేసే వ్యక్తుల్లో కూడా చెడు'ను వెలికితీసే కాలంలో ఉన్నాం. అందరిపైనా అవిశ్వాసమే. అందరి గురించి అపనమ్మకమే. తమ తెలివిని ఎదుటి వారిని 'మోసగించి' బతికేందుకే సాధ్యమైనంతగా ప్రయత్ని స్తాడు మనిషి. ఇలాంటి సందర్భంలో "ఎవరి మాట ఎవరూ నమ్మని కాలంలో / సత్యము చెప్పటమే ఎదుటి వారిని మోసగించడం" అన్నడం సత్యకాలం నుండి కలి కాలం వచ్చేసరికి 'సత్యము' అర్థ విపరిణామం చెందినట్లు కనిపిస్తుంది. అంతే కాకుండా ఇక్కడి మనుషుల "మాత్సర్యం గాంధారి కొడుకుది /మాటచ్చం గాంధీ మాదిరిదే" అంటూ తేనె పూసిన కత్తుల స్వభావాన్ని, పైకి ముసిముసి నవ్వులు, లోన విషం చిమ్మే నైజాన్ని బయట పెట్టాడు. అంత తొందరగా లోక స్వభావాన్ని అంచనా వేయలేం. రెప్పపాటులో కంటికి కనిపించిందంతా, దృష్టికి వచ్చినా మనస్సు అందనట్టే.. ఎందుకంటే వ్యక్తుల్ని గుర్తించినట్లుగా - నీడల్ని పట్టలేం. నీడలు పాకినంత వేగంగా, మనుషులు నడవలేరు. కాబట్టి మనిషిని అంచనా వేసేటప్పుడు చాలా సంయమనం అవసరం.

అలాగే మనిషిలోని 'కాంతి కిరణాల' గురించి కూడ

కాళోజీ కవితల్లో గమనించవచ్చు. మనిషికి తన వ్యక్తిత్వమే గీటురాయి. తను ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా, ఎలాంటి పనులు చేస్తున్నా తనకు తానే జవాబుదారీ. స్వీయ అస్తిత్వం వ్యక్తిని నిలబెట్టుతుంది. ఆ అస్తిత్వ నిర్మాణం వ్యక్తి పరిణామ దశల్లో కీలకంగా మారుతుంది. మనిషి తన పొరపాటును, గ్రహపాటుగా భావించక 'నిజాయితీ'తో తనలో జరిగే 'అంతర్లయ'ను స్పష్టంగా గుర్తిస్తే చాలు "దేశాలు తిరిగితేనేమి / వేషాలు వేసితేనేమి / రాగాలు మారితేనేమి / వేగాలు పెంచితేనేమి".. "పీతాంబరం వీడి / పేగు చుడితేనేమి / కొంపగోడు వదిలి / కొండెక్కితే నేమి " (మంచి చెడ్డల అండ) అంటూ మనిషి తన స్వభావాన్ని కలిమిలో- లేమిలో, సంసారంలో - సన్యాసంలో ఎక్కడైనా సరే 'వంగిపోకుండా' చూసు కోవాలని సూచిస్తాడు.

మనల్ని ప్రేమించే వారున్నట్లే, ద్వేషించే వారూ ఉం టారు. ఏ వ్యక్తే అందరిచేత 'శభాష' నిపించుకోలేదు. ప్రతిచర్యకు రెండు వైపులూ ఉంటాయి. "స్తుతి మంగళ హారతులు ఆకాశానికి ఎత్తును / అపనిందలు నెత్తికెక్కి పాతాళానికి తొక్కును" అంటూ (మనం మనమే) శ్రీశ్రీ "నిప్పులు చిమ్ముకుంటూ.." అనే కవితను జ్ఞప్తికి తెస్తాడు కాళోజీ. కాల ప్రభావానికి లోనుకాని వ్యక్తి ఎవ్వరూ ఉండరు. పొగడ్తకూ, తెగడ్తకూ ' జాగీయకుండా' మన 'ఇచ్ఛ'లో మనం బతకాలని కవి భావన.

'దేబె మొగాల' గురించి 'నా గొడవ'లో చాలా చోట్ల కనిపిస్తుంది. రెండుగా విభజింపబడ్డ ఈ జగత్తులో 'కుటిల మతులు దేబె మొగాలు" ఉన్నాయంటాడు. లోకంలో తుంటరితనం, లౌక్యం, టెంపరితనం, జబర్దస్తీ లాంటి ప్రయత్నాలు లేకుంటే 'దేబె మొగాలు' అణగదొక్క బడతారు. (అతి) తెలివి లేనిదే ఈ లోకంలో రాణించరు. 'దేబె' ఆలోచనలోకి వెళ్ళకముందే 'చతురుడు' నిర్ణయాలు తీసుకుంటాడు. అప్పుడు 'దెబె'కు అనుసరణ మాత్రమే మిగులుతుంది. 'చతురునిదే అన్నింటా పైచేయి / అతడన్న పగలు కూడా రేయి" అంటూ దబాయింపు ఏ రేంజ్ లో ఉంటుందో వివరిస్తాడు.

ఇంకొందరు తామూ పవిత్రులమనీ, జ్ఞానులమనీ డంబాలకు పోతుంటారు. సాధారణంగా అల్పజ్ఞుడే ఈ సాహసం చేస్తాడు. ఇతరుల అభిప్రాయాల్ని సూచనల్ని 'బుల్ డోజ్' చేస్తుంటారు. తన పద్ధతీ, తీరూ సహజమనీ, మీదంతా 'వెనుకబాటు' తనమనీ కించపరుస్తాడు. ఒకవేళ తనకసాధ్యమైన దానిని ఇతరులు సాధిస్తే, తన భాగం కూడ అందులో ఉందని 'ఆక్రమించే' దూకుడు వీని స్వభావం. "నాకందినది నాది / నాకందనిది మనది" (నా ఇజం) అని ప్రపంచమంతా తన చూపుడు వేలు చూపిన వైపుగా, తన చిటికెన వేలు పట్టుకొని నడవాలని గగ్గోలు పెట్టే వారి 'వెకిలితనం' ఇక్కడ కనిపిస్తుంది.

"పుణ్యాత్ముల చరితలు విన్నాం / పుణ్యానికి బతుకు తున్నాం / బకముల గురువులుగా కన్నాం / దిగమింగుట నేర్చుకున్నాం (రఘుపతి రాఘవ..) చేపల చెరువుకు / కొంగ గురువైతే - చేపల పరిస్థితి ఎలా ఉంటుందో, ప్రజా స్వామ్యంలో ఓటరు (దేబె) పరిస్థితి కూడ అంతే. నిస్సహాయంగా 'దిగమింగుడు' మినహా దారి లేదు. చేసిన తప్పులను సరిదిద్దుకునే ఓపిక, ప్రయత్నం సగటు మానవునికి లేకపోవడం విచారకరం. బలహీనతలు, అలసత్వాల కారణంగానే 'దేబె మొగాలు' అణిచి వేయబడుతున్నాయి. నిజాయితి, నిర్భీతి, పరిస్థితులను అంచనా వేసే శక్తి సామాన్య పౌరుడు పెంచుకున్నప్పుడు, కనీసం తాను వంచింపబడుతున్నాననే 'విషయం' ముందుగానే పసిగట్ట గలిగే నేర్పు కలిగి వుండడం ప్రస్తుతం చాలా అవసరం. అలా నేర్పరితనాన్ని, దీర్ఘ దృష్టినీ అలవరచుకోవడం కనీస బాధ్యత.

అన్ని తేరగా, ఉచితంగా, అనాయాసంగా వస్తుంటే ఎవరైనా ఎందుకు శ్రమ తీసుకుంటారు. ఇలా అందర్నీ చేతగాని దద్దమ్మలుగా మార్చే ప్రయత్నం జరుగు తున్నప్పుడు, చైతన్యవంతుడైన కవి, నిద్రపోతున్న సమాజాన్ని తట్టి (న్ని) లేపుతాడు. "జడ భరతా / విను /

మాదా కబళం జాతికి / మాగాణుల సాగెందుకు / పరాభవం కురుస్తుంటే / వానెందుకు వరదెందుకు / అరువు అన్నం వండుతుంటె / అరకెందుకు ఎద్దేందుకు / సీటు సంత సరుకైతే / ఓటు బూతు మరుగెందుకు " (పరాభవ వర్షం) అన్నీ 'ఎలాగొలాగ వస్తున్నాయని సామాన్యుడు పడకేస్తే, అన్నిటిని 'ఎలాగోలా' సంపాదించవచ్చని నాయకుడు చూస్తుంటాడు. అసలు నీవు ఓడుతున్నావో, గెలుస్తున్నావో తెలియకుండా ఉంటే, ఇంకా స్పష్టంగా అసలు నీవు 'ఆటలో' ఉన్నావో, లేదో తెలుసుకోలేకపోతే, నిన్ను గట్టెక్కించడం చాలా కష్టం. దేబె మొగాలు ఇలా ఉండబట్టే - ప్రజాస్వామ్యం ఇలా ఉన్నది. నీవు లేచి ఒక్క అడుగు' ముందుకేస్తే నిన్ను పదడుగులు నడిపించే శక్తులు'న్నాయని - లేవాల్సింది 'నీవే'నని 'దేబె'లను వెక్కిరింపుగా అన్నాడు. సమయం మించిపోయాక 'మెలకువ'కు అర్థం లేదు.

రాజ్య స్వభావాన్ని వర్ణిస్తూ, ప్రజాస్వామ్యం ఎలా అపహాస్యమౌతుందో, ప్రజలు ఏ విధంగా వంచింపబడుతున్నారనేది "దగా గడ్డి కరుస్తోంది గొర్రె! నగల గాలి పీలుస్తోంది గొర్రె.. మందలబడి మురుస్తోంది గొర్రె / తెగ బలుస్తోంది గొర్రె"(గొర్రె దాటు) అంటూ ప్రజలు గొర్రెల మాదిరిగా, రాజకీయాల్ని గుడ్డిగా ఎంతలా నమ్ముతుంటారో నాయకులు చేసే ప్రతిపని తమ అభ్యున్నతి కోసమేనని ఈ 'ప్రజాస్వామ్య' విశ్వాసంగా కనిపిస్తుంది. కానీ, నిజంగా గొర్రెల కాపరి, గొర్రెను ఎంతలా మేపినా, చివరికి అమ్మకానికే... ఈ విషయం తెలియని (తెలుసుకోలేని) గొర్రె 'తెగ బలుస్తోంది' అంటూ ఛలోక్తి విసిరాడు కవి.

'నా గొడవ'లో స్నేహం గురించిన చర్చ కూడా కనిపిస్తుంది. దేవతలూ, దివ్యులూ తెలుసుకోలేని దివ్యానుభవం 'స్నేహం'. ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా, నిన్ను నిన్నుగా గుర్తించే - చేయి సాచే ఒక అమృత హృదయం ఎప్పటికీ అవసరమే. అక్కరలూ, యాచనలు, అపచారాలు, అనుమానాలు, చింతలూ.. ఇవేవీ ఆ మందిరంలో కనిపించవు. ఆ స్నేహ మందిరం కాలం, గుణం, అందం, వయసు, వరుస, పండితులూ, పామరులూ బేధాలను లెక్క చేయదు. అసలు స్నేహం అంటేనే "నీ-నా" అనే 'వేర్పాటు' ఉండదు. "వంచింప పని బూని పొంచియుండుట లేదు / తీయ తీయగ బల్కి మాయ జేయుట లేదు / తడిగుడ్డ పదనుతో మెడలు గోయుట లేదు /మొసలి కన్నుల నీటి మోసమించుక లేదు'' (దేవతలెరుగని దివ్యానుభవము) అంటూ స్నేహానికి చక్కని నిర్వచనమిచ్చారు.

ధన సంపాదనలో జీవితాన్ని కోల్పోయేవారి గురించి కూడ 'నా గొడవ'లో "ప్రమిదను ముంచెత్తు తైలము / ప్రజ్వలింపలేదొత్తిని" (జీవితము) అని రాత్రింబగళ్ళూ అదే శ్వాసగా, ధ్యాసగా అదేపనిగా డబ్బు సంపాదించిన వారు కోల్పోతున్న జీవితాన్ని గురించి చింతించరు. జీవితాన్ని ముంచేసే డబ్బు, దాని "అనుభవం"లోనికి రానీయదు. ఈ విధమైన సంపాదన చివరికి తమ సంతానాన్ని "దద్దమ్మ"లనుగా చేయుటకు మాత్రం అక్కరకొస్తుందని ఘాటుగా విమర్శిస్తాడు.

ప్రస్తుతం వేగవంతమైన ప్రపంచంలో, ప్రతీ ఒక్కరికి గెలుపుపై ధ్యాసే. జీవితాన్ని ఆనందంగా గడుపు కోవాలను కోవడం మంచి పరిణామమే. అయితే ఈ గెలుపు పోటీలు అన్ని చోట్లా విస్తరించాయి. పోటీకి అనర్హమైనది, లేదిక్కడ. ఎవరి స్థాయిలో వారు, ఎక్కడికక్కడే పోటీల్లో మునిగి తేలుతున్నారు. రణరంగం కానిచోటు భూస్థలమంతా వెతికిన దొరకదు అన్నట్లు 'కాదేదీ పోటీ కనర్హం'గా మారిపోయిందీ ప్రపంచం. ఎందులోనైనా నెగ్గడం ప్రధానం! ప్రతీచోట ఒత్తిడే - ప్రతిచోటా చిత్తడే. అణువు నుండి బ్రహ్మాండం వరకు ఎక్కడైనా, బికారి నుండి చక్రవర్తి దాకా ఎవరైనా పోటీలో ఉండాల్సిందే! "చాప చింపు - సామ్రాజ్యం / కోడిగుడ్డు - కోహినూరు. "సానికొంప - సాధుమఠం / మూత్రశాల - యాత్రాస్థలి" (పోటీ పడు కాటులాడ) ఇలా ప్రతీచోటా పోటీ, ఘర్షణ. దీన్ని తట్టుకొని నిలిచేందుకే మనిషి ప్రయత్నం. అయితే ఇక్కడ

గుర్తించాల్సింది - ఎవరికి వారై నెగ్గాలను కుంటున్నారు. కానీ, తమ వారినే గెలిపించే ప్రయత్నం కనపడదు. ఈ గెలుపు స్వార్థంతో కూడిందే తప్ప పరమార్థంతో కాదు. ఇలాంటి పోటీల్లో దేనికోసం గెలుపు? ఎందుకోసం గెలుపు? అనే అవగాహన పెంచుకోవడం శ్రేయస్కరం.

అంతశ్శత్రువులను దూరం చేసుకోవడంలోనే అసలైన విజయం, గెలుపు దాగుందని "ఎవరి దేవి పోతున్నది?/ ఎవరిదేమి వస్తున్నది/ పగబూనిన షడ్వర్గం / పరిపాలన చేస్తున్నది" (ఎవరిదేమి పోతున్నది) లోపలి శత్రువును జయించలేక ఉలిక్కి పడుతున్నాడు.

వ్యక్తిలో గల ద్వంద్వ విధానాలే అతని ఓటమికి ప్రధాన కారణాలనీ, "సంపదలన్ని యొకచోట / గంపెడు బలగంబొకచోట ... తనువులు ఉండేదొకచోట / తలపులు ఉండేదొక చోట" (వ్యత్యాసాలు) - సమాజంలో "సమతూకం" వచ్చినప్పుడే సమసమాజం ఏర్పడుతుంది. పంపిణీలు సరిగ్గా జరక్కపోవడం వల్ల వ్యక్తి ఆలోచనలు క్రమ రీతిలో ప్రతిఫలనం కావు. సమసమాజం ఊహల పల్లకీనే ఊరేగుతుంటది. ఇలాంటి సమయంలో దార్శనికుల మార్గదర్శనంలో 'అధికారం' ఉంటే 'నూత్న (నవ) సమాజం' పురుడు పోసుకుంటుంది, కానీ అను భవం అధికారం వైరిపక్షాల్లో చేరడం వల్ల ఇన్ని 'వ్యత్యా సాలు' కనిపిస్తాయి.

